www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం 13-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 119 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షఋతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి ఉ. 9.31 తదుపరి నవమి; నక్షత్రం: విశాఖ ఉ. 10.44 తదుపరి అనూరాధ; వర్జ్యం: మ. 2.58-4.40; దుర్ముహూర్తం: ఉ. 8.32-9.23, రా. 10.21-11.05; అమృతఘడియలు: రా. 1.10-2.52; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.01; సూర్యాస్తమయం: 6.38 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

స్టాప్‌లాక్ సిద్ధం!



కొట్టుకుపోయిన తుంగభద్ర గేటు స్థానంలో తాత్కాలికంగా బిగింపునకు ఏర్పాట్లు.. 4 రోజులు పట్టే చాన్స్

20 అడుగుల వెడల్పు, 60 అడుగుల ఎత్తులో అమర్చడం కష్టం

అందుకే ఐదు బ్లాక్‌లుగా విడివిడి భాగాలుగా తయారీ

స్పిల్‌వే లెవెల్ వరకు నీటిని విడుదల చేస్తున్న అధికారులు

ఆందోళనలో రాయలసీమ కరువు రైతులు

స్టాప్‌లాక్ బిగించాక మళ్లీ వరదొస్తేనే సాగు, తాగునీరు

కర్నూలు, అనంతల్లో ప్రశ్నార్థకంగా మారిన ఖరీఫ్ సాగు

12

జయహో బీసీ

వెనుకబడిన వర్గాల ఉన్నతికి ప్రత్యేక ప్రణాళిక

నైపుణ్య శిక్షణ, రుణాలు, యూనిట్ల ఏర్పాటు

గరిష్ఠ స్థాయిలో కేంద్ర పథకాల వినియోగం

పీఎం విశ్వకర్మ యోజన వంటి పథకాలు..

ఎన్‌సీడీసీఎల్ వంటి సంస్థల నిధులపై దృష్టి

రాష్ట్ర ప్రభుత్వం నుంచీ నిధుల కేటాయింపు

ఏటా 5 లక్షల మందికి శిక్షణ, ఉపాధి లక్ష్యం

ప్రణాళికలు రూపొందించాలని సీఎం ఆదేశం



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

బీసీలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేలా... సొంత కాళ్లపై నిలబడేలా ప్రణాళికలు రచించాలని కూటమి సర్కారు నిర్ణయించింది. దీనికోసం... కేంద్ర ప్రభుత్వ పథకాలను గరిష్ఠ స్థాయిలో ఉపయోగించుకోవాలని యోచిస్తోంది. బీసీల అభివృద్ధికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలకు ఉపకరించేలా కేంద్రం పలు పథకాలు అమలు చేస్తుండటంతో... వాటిని పూర్తిస్థాయిలో ఉపయోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన పీఎం విశ్వకర్మ యోజన, జాతీయ నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్, ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు తదితర పథకాలను ఉపయోగించుకుని... రాష్ట్ర ప్రభుత్వం కొంత ఆర్థిక సహకారం అందిస్తే ఏటా 5 లక్షల మంది బీసీలకు స్వయం ఉపాధి కల్పించవచ్చు. తెలుగుదేశం ప్రభుత్వం గతంలో 'ఆదరణ' వంటి పథకాలతో బీసీలకు అండగా నిలిచింది. బీసీలనే వెన్నెముకగా భావిస్తూ వారి స్వయంసమృద్ధికి ప్రాధాన్యమిచ్చింది. బీసీలకు వివిధ పథకాల కింద

మిగతా 11వ పేజీలో...

ఏపీని ఆర్థికంగా ఆదుకోండి

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు పయ్యావుల, లావు వినతి 12



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమైన మంత్రి పయ్యావుల, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన ప్రపంచబ్యాంకు ప్రతినిధుల బృందం

అమరావతికి అండగా ప్రపంచ బ్యాంకు

మళ్లీ తెరపైకి రుణ ప్రణాళిక

చంద్రబాబును కలిసిన బృందం

ప్రస్తుత పరిస్థితిని వివరించిన అధికారులు

రాజధానిలో 2050 నాటికి 35 లక్షల జనాభా

20 శాతం పచ్చదనం.. పార్కులు

తగిన సదుపాయాల కల్పనకు భారీ వ్యయం

మరోసారి రాష్ట్రానికి రానున్న బృందం

ఆ తర్వాత రుణ మంజూరుపై స్పష్టత

గతంలో వైసీపీ తప్పుడు ఫిర్యాదులతో గండి

అమరావతి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రాజధాని అమరావతి నిర్మాణానికి అండగా నిలిచేందుకు ప్రపంచ బ్యాంకు ముందుకొచ్చింది. వైసీపీ నేతల పితూరీల కారణంగా ఆగిపోయిన రుణ ప్రణాళిక మళ్లీ తెరమీదకు వస్తోంది. శనివారం నుంచి అమరావతి ప్రాంతంలో పర్యటిస్తున్న నలుగురు సభ్యులతో కూడిన ప్రపంచ బ్యాంకు బృందం సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసింది. అమరావతి నిర్మాణానికి అందించాల్సిన

మిగతా 11వ పేజీలో...

బ్రాండ్ ఏపీ

ఈ లక్ష్యం దిశగానే కొత్త పారిశ్రామిక విధానం: బాబు

టాప్-5 రాష్ట్రాలతో పోటీ పడాలి.. 15% సమగ్ర వృద్ధే లక్ష్యం

నీతి ఆయోగ్ ఆలోచనలు పరిగణనలోకి తీసుకోవాలి

ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా మనకు 10 ఓడరేవులు, 10 విమానాశ్రయాలు

పశ్చిమ కంటే తూర్పు తీర ప్రాంతం రోడ్డు, రైలు, విమానయానంతో అనుసంధానం

ఇవన్నీ పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలం

100 రోజుల్లోగా ముఖ్య పాలసీలు: సీఎం

16న పారిశ్రామికవేత్తలతో భేటీ

అమరావతి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక రంగంలో ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ ఇమేజ్‌ను తిరిగి తీసుకురావడానికి దోహదపడేలా నూతన పారిశ్రామిక విధానం ఉండాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పారిశ్రామిక ప్రగతిలో దేశంలోని టాప్-5 రాష్ట్రాలతో పోటీ పడేలా రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. 15 శాతానికి పైగా సమగ్రాభివృద్ధి రేటు సాధించడమే లక్ష్యంగా తీర్చిదిద్దాలని.. ఇదే సమయంలో నీతి ఆయోగ్ ఆలోచనలనూ పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించారు. త్వరలో అమల్లోకి తీసుకురానున్న నూతన పారిశ్రామిక విధానం (2024-29) రూపకల్పనపై

మిగతా 11వ పేజీలో...

ఆస్పత్రులను భ్రష్టు పట్టించారు

ప్రజల్లో నమ్మకం పూర్తిగా సన్నగిల్లింది: సీఎం

ఆరోగ్యశాఖలో 2014-19 నాటి ఉత్తమ విధానాలు మళ్లీ ప్రవేశపెట్టండి

మండలాలవారీగా కిడ్నీ బాధితుల వివరాలు.. నీటి వసతిపై అధ్యయనం

అన్ని జిల్లా ఆస్పత్రుల్లో సీటీ స్కాన్.. టీబీ రోగులకు నిరంతరం ఔషధాలు

తల్లులకు మళ్లీ ఎన్టీఆర్ బేబీ కిట్లు.. డోలీ మోతలు లేకపోతే సహించను

ఆస్పత్రుల్లో శిశువుల మిస్సింగ్ కేసులొస్తే అధికారులపై చర్యలు తప్పవు

ప్రతి నియోజకవర్గంలో పీపీపీ విధానంలో ఆస్పత్రి ఏర్పాటు

మన హాస్పిటల్స్ పనితీరు దేశంలోనే బెస్ట్‌గా ఉండాలి 11

ఆరోగ్యశాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టీకరణ



11

విశాఖ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు

టీడీపీ దూరం

అత్యధిక స్థానిక ప్రజాప్రతినిధులు వైసీపీ వైపు ఉన్నందునే

వైసీపీ తరఫున బొత్స నామినేషన్



2

కాంగ్రెస్ బలోపేతంపై

అధిష్ఠానం దృష్టి

సంస్థాగతంగా బలపడేందుకు వ్యూహ రచన

నేడు అన్ని రాష్ట్రాల అధ్యక్షులతో సమావేశం

హాజరుకానున్న పీసీసీ చీఫ్ షర్మిల

లావణ్య-రాజ్‌తరుణ్ కేసులో



మస్తాన్ సాయి

12

కదిలిన డ్రగ్స్ డొంక

గుంటూరులో టెకీ మస్తాన్‌సాయి అరెస్టు

లావణ్య, రాజ్‌తరుణ్‌కు డ్రగ్స్ ఇచ్చింది మస్తానే

ఢిల్లీ నుంచి తెచ్చి గుంటూరు, విజయవాడ, హైదరాబాద్‌లో కొన్ని హోటళ్ల ద్వారా దందా

మస్తాన్‌ను విజయవాడలో విచారిస్తున్న సెబ్

డ్రగ్స్ వ్యవహారంలో ఇప్పటికే నలుగురి అరెస్ట్

తిరుమల ఘాట్‌రోడ్డులో ద్విచక్ర వాహనాల రాకపోకలపై ఆంక్షలు

3

ఉదయం 6 నుంచి రాత్రి 9 వరకే అనుమతి

ఆర్టీసీ జోనల్ వ్యవస్థ దండగ!



పదోన్నతులకు తప్ప ఎందుకూ పనికిరాదు

రాష్ట్రవ్యాప్తంగా రూ.50 కోట్ల ఆర్థిక భారం

వర్క్‌షాపు పర్యవేక్షణకే ఈడీలు పరిమితం

ఇప్పటికే జిల్లా స్థాయిలో రీజియన్లు బలోపేతం

ప్రధాన పాలనా వ్యవహారాలన్నీ వాటి పరిధిలోనే

జోనల్ వర్క్‌షాపు, ఈడీ పేషీలో భారీగా అధికారులు

రద్దుచేస్తే ఆర్థిక భారం సగానికి సగం తగ్గే చాన్సు

'మహిళలకు ఉచిత బస్సు' నేపథ్యంలో సంస్కరణలు చేపట్టడం తప్పనిసరి!

ఆర్టీసీలో జోనల్ వ్యవస్థపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విజయవాడ జోనల్‌తో పాటు మిగిలిన జోనల్ వ్యవస్థలను కూడా రద్దు చేస్తే దుబారా ఖర్చుకు బ్రేక్‌పడే అవకాశం ఉంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రవేశపెట్టేందుకు కసరత్తు చేస్తున్న నేపథ్యంలో.. ఖర్చులను కట్టడి చేసుకోవాల్సి ఉంది. జోనల్ వ్యవస్థను ఎత్తివేస్తే ఈ పథకం ఆర్థిక భారం నుంచి సగానికి సగం బయట పడే అవకాశం ఉంటుంది.

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

ఆర్టీసీ పునర్విభజనలో ఏ జిల్లాకు ఆ జిల్లా స్థాయిలోనే రీజియన్ స్థాయి పరిపాలనా వ్యవస్థలు పనిచేస్తున్నాయి. ఇలాంటి పలు రీజియన్లను కలిపి ఒక జోన్ కిందకు తీసుకొచ్చి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) అజమాయిషీలో జోనల్ పాలనా వ్యవస్థను ఏర్పాటుచేశారు. అయితే

మిగతా 2వ పేజీలో...

ఐఐటీ మద్రాస్ ఆరోసారీ బెస్ట్



ఈ సంస్థకే తొలి ర్యాంకు.. బోధన, సిబ్బంది, సౌకర్యాల్లో టాప్

ఉత్తమ సంస్థగా ఐఐఎస్‌సీ బెంగళూరు.. విద్యాసంస్థలకు ర్యాంకులు

స్టేట్ పబ్లిక్ వర్సిటీ విభాగంలో ఆంధ్రా వర్సిటీకి ఏడో ర్యాంక్

న్యూఢిల్లీ, ఆగస్టు 12: దేశంలోని ఉత్తమ విద్యాసంస్థలకు కేంద్రప్రభుత్వం సోమవారం ర్యాంకులు ప్రకటించింది. వరుసగా ఆరో ఏడాది కూడా ఐఐటీ మద్రాస్ అత్యుత్తమ విద్యాసంస్థగా టాప్‌లో నిలిచింది. బోధన, సిబ్బంది, సౌకర్యాలు.. ఇలా అన్ని అంశాల్లోనూ ముందు వరుసగా నిలిచింది. ఉత్తమ విద్యాసంస్థల జాబితాలో ఐఐఎస్‌సీ బెంగళూరుకు మొదటి ర్యాంకు లభించింది. ఈ ఏడాది కొత్తగా స్టేట్ పబ్లిక్ వర్సిటీల విభాగాన్ని చేర్చారు. ఈ జాబితాలో ఆంధ్రా విశ్వవిద్యాలయానికి ఏడో ర్యాంకు లభించింది. న్యాయ

మిగతా 2వ పేజీలో...

మన వర్సిటీలు ఢమాల్

ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో వెనుకబాటు

ఐదేళ్ల క్రితంతో పోల్చితే అత్తెసరు ర్యాంకులు

2019లో ఏయూ-29, ఎస్వీయూ-72

2024లో ఏయూ-41, ఎస్వీయూ-97

టాప్-100 నుంచి ఎస్వీయూ అవుట్

ఐదేళ్లలో భ్రష్టు పట్టించిన జగన్ ప్రభుత్వం



ఉమ్మడి పశ్చిమ రైతులకు రూ.472 కోట్ల ధాన్యం బకాయిలు విడుదల కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి మనోహర్

ఖరీఫ్ నుంచి ధాన్యం సొమ్ము

48 గంటల్లోనే

రైతులకు ఉచితంగానే పంటల బీమా

రైతులను సంక్షోభంలోకి నెట్టిన వైసీపీ సర్కారు

సివిల్ సప్లయిస్ పేరిట రూ.40,500 కోట్ల రుణాలు

జగన్ సర్కార్ ఆర్థిక అరాచకాలకు బ్యాంకుల బెంబేలు

గత ప్రభుత్వ బకాయిలు రూ.1674 కోట్లు మేం చెల్లిస్తున్నాం: మంత్రి నాదెండ్ల మనోహర్

పౌరసరఫరాల రుణాల్లో వచ్చే ఏడాది రూ.10 వేల కోట్లు చెల్లిస్తామని ప్రకటన

ఏలూరు సిటీ, ఆగస్టు 12: వచ్చే ఖరీఫ్ నుంచి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి 48 గంటల్లోనే రైతుల ఖాతాలకు నగదు జమ చేస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. అలాగే ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి రైతులకు పంటల బీమా ఉచితంగా అందిస్తామని

మిగతా 11వ పేజీలో...

సెబీ చైర్మన్ అక్రమ పెట్టుబడులపై..

కాంగ్రెస్, బీజేపీ ఢీ



జేపీసీతో విచారణకు మోదీకి భయమెందుకు?

మాధవి బుచ్ రాజీనామా చేయరేం?: రాహుల్

20 వేల కోట్లకు పైగా బినామీ లావాదేవీలు: జైరాం

జేపీసీ వేయకుంటే ఆందోళనలు: కేసీ వేణుగోపాల్

మాధవి వైదొలగాలి: ఇండియా ఎంపీలు, నేతలు

ఆమెకు అండగా.. సెబీ, బీజేపీ, అదానీ గ్రూప్

సోరోస్ ఏజెంట్‌గా రాహుల్ వ్యవహరిస్తున్నారు

ఆర్థిక అరాచక వ్యాప్తికి కాంగ్రెస్ కుట్ర: రవిశంకర్

రాహుల్ సంపద 59% పెరిగింది: మాలవీయ

న్యూఢిల్లీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లోని అదానీ గ్రూప్‌లో సెబీ చైర్మన్ మాధవి బుచ్ అక్రమ పెట్టుబడులు పెట్టారంటూ హిండెన్‌బర్గ్ సంస్థ చేసిన ఆరోపణ.. బీజేపీ, కాంగ్రెస్ మధ్య తీవ్ర వాగ్యుద్ధానికి కారణమైంది! ప్రతిపక్షాలన్నీ ఈ విషయంలో ప్రభుత్వాన్ని తీవ్ర స్థాయిలో విమర్శిస్తున్నాయి. అదానీ వ్యవహారంపై సెబీ దర్యాప్తుచేస్తుండగానే ఈ వివరాలు బయటపడ్డాయని.. దీన్ని బట్టి భారీ కుంభకోణం జరిగిందని భావించవచ్చునని

మిగతా 2వ పేజీలో...

టీచర్ల సర్దుబాటు షెడ్యూల్ పొడిగింపు

17 నుంచి చేయాలని నిర్ణయం 12

పంచాయతీ, గ్రామీణాభివృద్ధిలో

బదిలీలకు కసరత్తు

వివరాలు సిద్ధం చేయాలని ఆదేశాలు

ఐదేళ్లు ఒకేచోట ఉన్న వారికి చాన్స్!

తెగుళ్లా.. ఇక ఆందోళన వద్దు

తట్టుకోగల కొత్త వంగడాలొచ్చాయ్

పెసర, శనగ, వేరుశనగలో ఒక్కోరకం

రంగా వర్సిటీ శాస్త్రవేత్తల రూపకల్పన

దేశవ్యాప్తంగా 109 రకాల కొత్త వంగడాలు

ఢిల్లీలో ప్రధాని మోదీ విడుదల

ఏపీకి సంబంధించినవి 3 నూతన వంగడాలు



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

అపరాల సాగులో తెగుళ్లతో తిప్పలు రైతన్నలకు సర్వసాధారణమైపోయింది!. ఆరుగాలం శ్రమతోపాటు.. పెట్టుబడులు కూడా తిరిగి రాని పరిస్థితుల్లో వారి వేదన అంతులేనిది! అయితే.. మారుతున్న వాతావరణ పరిస్థితులను తట్టుకుంటూ, కూలీల కొరతను అధిగమించి, అధిక దిగుబడినిచ్చేలాంటి వంగడాలు వస్తే..! ఇక అంతకంటే ఏంకావాలి!.. అవును.. ఇప్పుడు ఇలా వాతావరణ పరిస్థితులను తట్టుకుంటూ, కూలీల కొరతను అధిగమించి, అధిక దిగుబడినిచ్చేలా పెసర, శనగ, వేరుశనగ

మిగతా 3వ పేజీలో...

జపోరిజియా న్యూక్లియర్ ప్లాంటులో మంటలు



న్యూఢిల్లీ, ఆగస్టు 12: ఐరోపా ఖండంలోనే అతిపెద్ద న్యూక్లియర్ విద్యుత్తు కేంద్రమైన జపోరిజియాలో ఆదివారం భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. ఉక్రెయిన్ జరిపిన క్షిపణి దాడుల వల్లే ప్లాంట్‌లో మంటలు చెలరేగాయని రష్యా ఆరోపించగా.. ప్లాంట్‌లో కూలింగ్ టవర్స్‌లో మంటలకు రష్యానే కారణమని ఉక్రెయిన్ పేర్కొంది. అయితే, ప్లాంటు నుంచి న్యూక్లియర్ రేడియేషన్ బయటకు రావడం లేదని రెండు దేశాలూ తెలిపాయి. మంటలను సోమవారానికల్లా ఆర్పివేసినట్లు రష్యా ప్రకటించింది. జపోరిజియా న్యూక్లియర్ ప్లాంటు ఉక్రెయిన్‌లో ఉంది. యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యా ఈ ప్లాంటును 2022లోనే తన అధీనంలోకి తీసుకుంది. అప్పటి నుంచి అక్కడ విద్యుదుత్పత్తిని నిలిపివేశారు. అణు రియాక్టర్లను కోల్డ్ షట్‌డౌన్‌లో పెట్టారు. కాగా, జపోరిజియా ప్లాంటులో మంటలకు ముందు అక్కడ కొన్ని పేలుళ్లు సంభవించాయని అక్కడే విధుల్లో ఉన్న ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ(ఐఏఈఏ) ప్రతినిధులు తెలిపారు.

గ్రీస్‌లో కార్చిచ్చు బీభత్సం



కార్చిచ్చులో కాలిపోతున్న ఇల్లు

ఏథెన్స్, ఆగస్టు 12: గ్రీస్‌ను కార్చిచ్చు కమ్మేసింది. మంటలు రాజధాని ఏథెన్స్‌ను వేగంగా సమీపిస్తున్నాయి. దీంతో అక్కడి ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. అగ్నికీలలను అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. మంటలను ఆర్పేందుకు దాదాపు 700 అగ్నిమాపక సిబ్బంది కష్టపడుతున్నారు. 17 వాటర్ డ్రాపింగ్ విమానాలు, 16 హెలికాప్టర్లను మోహరించారు. అయినా అగ్నికీలలు అదుపులోకి రావడంలేదని సోమవారం అధికారులు తెలిపారు. ఈ క్రమంలో ఇద్దరు అగ్నిమాపక సిబ్బంది, ముగ్గురు పౌరులు గాయపడ్డారని చెప్పారు. "ఆదివారం మధ్యాహ్నం వరకు మంటలు ఏథెన్స్ నగరానికి 35 కిమీ దూరంలో ఉన్నాయి. బలమైన గాలులు వీస్తుండడంతో మంటలు వేగంగా వ్యాపిస్తున్నాయి. గాలుల కారణంగా మంటలను అడ్డుకోవడం కష్టంగా మారింది. కొన్ని ప్రాంతాల్లో అగ్ని కీలలు 25 మీటర్ల ఎత్తు వరకు ఎగసిపడుతున్నాయి. దట్టమైన పొగ కారణంగా స్థానికులు అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రికి తరలిస్తున్నాం. దేశంలో సగం ప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ చేశాం" అని అధికారులు తెలిపారు. కాగా, గత సంవత్సరం కూడా కార్చిచ్చు కారణంగా 20 మంది వరకు మరణించారు.

లోకం తీరు



విపత్తు దృశ్యాలపై తేదీ, సమయం ఉండాలి!

- ప్రైవేటు టీవీ న్యూస్ చానళ్లకు కేంద్రం ఆదేశం

న్యూఢిల్లీ, ఆగస్టు 12: ప్రకృతి విపత్తులు, భారీ ప్రమాదాల దృశ్యాలను ప్రసారం చేసేటప్పుడు వాటిపై తేదీ, సమయానికి సంబంధించిన స్టాంపు ప్రసారమయ్యేలా చూడాలని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు టీవీ న్యూస్ చానళ్లను ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర సమాచార ప్రసార శాఖ సోమవారం ఒక సూచన జారీ చేసింది. ప్రకృతి విపత్తులు, భారీ ప్రమాదాలు సంభవించినప్పుడు టీవీ చానళ్లు రోజుల తరబడి నిరంతర కవరేజీ ఇస్తుంటాయని, అయితే, తొలిరోజు దృశ్యాలను ఫుటేజ్‌లో చూపిస్తూనే ఉండటం వల్ల వీక్షకులకు అనవసర గందరగోళం, భయాందోళనలు కలిగే అవకాశం ఉందని తెలిపింది. 'అందువల్ల వీక్షకులను అనవసరపు అపార్థాలకు గురిచేయకుండా నివారించేందుకు అలాంటి దృశ్యాలను ప్రసారం చేసేటప్పుడు ఫుటేజీ పైభాగంలో తేదీ, సమయం స్టాంపును ప్రముఖంగా ప్రదర్శించాలని అన్ని ప్రైవేటు శాటిలైట్ టీవీ చానళ్లకు సూచిస్తున్నాం' అని స్పష్టం చేసింది. ఈ సూచన పాటించడం వల్ల వాస్తవంగా ఏరోజు దృశ్యాలను ప్రసారం చేస్తున్నారో వీక్షకులకు స్పష్టమైన అవగాహన ఏర్పడుతుందని తెలిపింది. కేరళ, హిమాచల్‌ప్రదేశ్‌లలో ఇటీవల కొండచరియలు విరిగిపడి అనేక మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనలను టీవీ చానళ్లు విస్తృతంగా ప్రసారం చేసిన నేపథ్యంలో కేంద్రం నుంచి తాజా సూచన వెలువడింది.

విశాఖ కేజీహెచ్‌లో ఆడ శిశువు విక్రయం..!

విశాఖపట్నం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): విశాఖ నగరంలో ఆడ శిశువు విక్రయం వ్యవహారం కలకలం రేపింది. ఈ కేసులో త్రీ టౌన్ పోలీసులు 9 మందిని అరెస్టు చేసినట్లు తెలిసింది. శిశువును వైద్య చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు, నిందితులను రిమాండ్‌పై కేంద్ర కారాగారానికి తరలించారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. కంచరపాలెం సమీపంలోని కప్పరాడ ప్రాంతవాసి ఐదు నెలల కిందట ప్రసవం కోసం కేజీహెచ్‌లో చేరింది. స్కానింగ్ కోసం వైద్యులు ఆస్పత్రి ఆవరణలోని మెడాల్ డయాగ్నొస్టిక్స్‌కు పంపించారు. అక్కడ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న వ్యక్తి ఆమెతో మాటలు కలిపాడు. దంపతులు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నట్టు గుర్తించాడు. పుట్టబోయే బిడ్డను విక్రయిస్తే రూ.10 లక్షలు వస్తాయని ఆశ చూపించాడు. ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న తన స్నేహితుడితో కలసి అప్పటికే తమను సంప్రతించిన రాంబిల్లి ప్రాంతానికి చెందిన దంపతులకు సమాచారం ఇచ్చారు. వారిద్దరూ పెళ్లి చేసుకోకుండా గత పదేళ్లుగా సహజీవనం చేస్తున్నారు. బిడ్డలు లేకపోవడంతో కొనుగోలుకు సిద్ధపడ్డారు. ఆస్పత్రిలో ఉండగా శిశువును విక్రయిస్తే ఇబ్బందులు పడాల్సి వస్తుంది కాబట్టి కొన్నాళ్ల తర్వాత తీసుకువెళ్లేలా మధ్యవర్తులుగా ఉన్నవారు చెప్పారు. శిశువుకు ఐదు నెలలు రావడంతో టెక్నీషియన్లు ఇరువురూ ఆడ శిశువు తల్లిదండ్రులను సంప్రతించారు. శిశువును విక్రయించేందుకు తల్లి తటపటాయించడంతో ఆమె ఆడపడుచుతోపాటు మరికొందరు కుటుంబసభ్యుల ద్వారా ఒప్పించారు. శనివారం రాత్రి బిడ్డను అప్పగించి, డబ్బులు తీసుకునేందుకు ఐదు నెలల శిశువును తీసుకుని దంపతులు, ఆడపడుచు, ఇద్దరు మధ్యవర్తులు, మరో ఐదుగురు కుటుంబ సభ్యులు సిరిపురం సమీపంలోని హార్బర్ పార్క్ వద్దకు చేరుకున్నారు. రూ.7.5 లక్షల చెక్ ఇచ్చేందుకు కొనుగోలుదారులు సిద్ధమయ్యారు. ఆ సమయంలో సీపీ హెల్ప్‌లైన్ నంబర్‌కు గుర్తుతెలియని వ్యక్తులు సమాచారం ఇచ్చారు. దాని ఆధారంగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు డెకాయి ఆపరేషన్ నిర్వహించారు. శిశువుతోపాటు తల్లిని మరో 9మందిని అదుపులోకి తీసుకుని త్రీటౌన్ పోలీసులకు అప్పగించారు.

ఆర్టీసీ జోనల్ వ్యవస్థ దండగ!

(మొదటి పేజీ తరువాయి)

రీజియన్ వ్యవస్థ బలోపేతమైన తర్వాత జోన్ అవసరం లేకుండాపోయింది. ఒక్క విజయవాడ జోన్ వల్లే ఏటా ఆర్టీసీకి రూ.10 కోట్లు ఖర్చవుతోంది. మిగిలిన జోన్లను కూడా పరిశీలిస్తే మొత్తంగా రూ.50 కోట్ల మేర నిర్వహణ భారం పడుతోంది. రీజియన్ స్థాయిలో రీజనల్ మేనేజర్, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ (డీసీటీఎం), డిప్యూటీ చీఫ్ మెకానికల్ మేనేజర్ (డీసీఎంఈ), పర్సనల్ మేనేజర్లు, డిపో మేనేజర్లు, మెకానికల్ ఫోర్‌మెన్లు.. ఇలా అనేక మంది అధికారులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఆధునిక సాంకేతిక వ్యవస్థ వచ్చిన నేపథ్యంలో రీజియన్ స్థాయిలోనే లావాదేవీలు నడుస్తున్నాయి. దీంతో జోనల్ జోక్యం చాలా తక్కువగా ఉంటోంది. జోనల్ స్థాయిలో ఈడీలు తీసుకునే నిర్ణయాలు కూడా ఏం ఉండవు. హెడ్డాఫీసులో మొత్తం నలుగురు ఈడీలు ఉంటారు. ఆపరేషన్స్, అడ్మినిస్ట్రేషన్, ఇంజనీరింగ్, చీఫ్ ఫైనాన్షియల్ మేనేజర్ వంటి బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. వీరే కీలక నిర్ణయాలు తీసుకుంటుండగా.. జోనల్ స్థాయి ఈడీలు చేయడానికి ఏమీ లేదు. అందుచేత జోనల్ వ్యవస్థ ఆర్టీసీకి ఆర్థిక భారమే తప్ప మరొకటి కాదన్న అభిప్రాయం గట్టిగా వినిపిస్తోంది. ఇది ఉన్నతాధికారులకు పదోన్నతులు కల్పించి కూర్చోపెట్టడానికి తప్ప పెద్దగా ఉపయోగపడడం లేదు. విజయవాడ జోన్‌నే తీసుకుంటే రీజియన్ల స్థాయిలోనే పాలన నడచిపోతోంది. ఈడీకి జోనల్ వర్క్‌షాపును పర్యవేక్షించడం తప్ప ఇంకే పనీ లేదు. గతంలో విజయవాడ జోనల్ స్థాయిలో అతి పెద్ద వర్క్‌షాప్, స్టోర్స్, టైర్స్ వంటివి ఉండేవి. వర్క్‌షాప్‌లో ఒకప్పుడు వెయ్యి మంది కార్మికులు పనిచేసేవారు. బస్సులకు బాడీబిల్డింగ్ ఇక్కడే జరిగేది. రానురానూ బస్సులను రీజియన్ పరిధిలో ఉండే డిపో గ్యారేజీల్లోనే మరమ్మతులు చేస్తున్నారు. హెడ్డాఫీసు నిర్ణయాల కారణంగా జోనల్ వర్క్‌షాప్ నిర్వీర్యమైపోయింది. అక్కడ ప్రస్తుతం 130 మందిలోపే ఉన్నారు. కానీ అధికారుల సంఖ్య మాత్రం తగ్గలేదు. వర్క్‌షాపులో డీసీటీఎం ర్యాంకు కలిగిన ఇద్దరు అధికారులు వర్క్సు మేనేజర్లుగా.. అసిస్టెంట్ వర్క్సు మేనేజర్లు-2, సూపర్‌వైజర్లు.. ఇలా చాలామంది పనిచేస్తున్నారు. రీజియన్ల స్థాయిలో 500 మంది పనిచేసే డిపోకు ఒక్క మేనేజర్ మాత్రమే పనిచేస్తుండగా.. 130లోపు సిబ్బంది పనిచేసే జోనల్ వర్క్‌షాప్‌లో ఇంతమంది అధికారులు అనవసరం. అలాగే, ఈడీ పేషీలో 10-15 మంది అధికారులు, సిబ్బంది పనిచేస్తుంటారు. డీసీటీఎం, డీఎం, క్లరికల్ సిబ్బంది ఉంటారు. జోనల్ ఈడీలు సొంత నిర్ణయంతో కనీసం మెటీరియల్ కూడా కొనే అవకాశం లేదు. హెడ్డాఫీసు ఈడీలే టెండర్లు పిలుస్తున్నారు. ఈ నేపథ్యంలో జోనల్ వ్యవస్థ రద్దు దిశగా సంస్కరణలు తీసుకురావాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

కావాలంటే ఉరి తీసుకోండి!

ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడ్డ నిందితుడి వ్యాఖ్యలు

- ఆ ఘోరానికి పాల్పడడానికి ముందు 2సార్లు రెడ్‌లైట్ ఏరియాకు
- హత్యాచారం తర్వాత ఇంటికి వెళ్లి.. నిద్ర



కోల్‌కతా, న్యూఢిల్లీ, ఆగస్టు 12: విధి నిర్వహణలో ఉన్న వైద్యురాలిపై దారుణంగా అత్యాచారం చేసి.. ఆమె ప్రాణాన్ని బలిగొన్నానన్న దోష భావన లేదు! దొరికిపోతే శిక్ష పడుతుందన్న భయం లేదు!! పోలీసులు తనను పట్టుకున్నప్పుడు కూడా అతడి కళ్లల్లో ఎలాంటి పశ్చాత్తాపమూ లేదు! వారు తనను ప్రశ్నిస్తున్నప్పుడు నిర్వికారంగా సమాధానాలు చెప్పాడు. ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడడానికి ముందు రెండుసార్లు రెడ్‌లైట్ ఏరియాలకు (కాళీఘాట్, సోనాబజార్) వెళ్లినట్టు చెప్పాడు. తాను చేసిన నేరాన్ని ఒప్పుకొని.. "అమీ ఫాసీ దీయే దీ (కావాలంటే నన్ను ఉరి తీసుకోండి)" అని చెప్పాడు!! కోల్‌కతాలోని ఆర్జీ కర్ వైద్య కళాశాల ఆస్పత్రిలో పీజీ ట్రైనీ డాక్టర్(31)పై హత్యాచారం జరిపిన నిందితుడు సంజయ్ రాయ్ తీరు ఇది! అతడి మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు దాన్ని పరిశీలించగా.. దాన్నిండా అశ్లీల చిత్రాలే కనిపించాయి. ఆమెపై హత్యాచారం జరిపిన తర్వాత నింపాదిగా ఇంటికి వెళ్లిన సంజయ్‌రాయ్.. హాయిగా నిద్రపోయి, ఉదయం 9 గంటలకు లేచి.. రక్తపుమరకలున్న తన దుస్తులను తీరిగ్గా ఉతుక్కున్నాడని కోల్‌కతా నగర పోలీసు కమిషనర్ వినీత్ గోయల్ తెలిపారు. అయితే, అతడి బూట్లపై రక్తపు మరకలను తాము గుర్తించామని ఆయన వెల్లడించారు. సంజయ్‌రాయ్ ఆమెను తొలుత హత్య చేసి.. అనంతరం మృతదేహంపై లైంగికదాడికి పాల్పడ్డాడనడానికి కొన్ని ఆధారాలున్నట్టు మరో పోలీసు అధికారి చెప్పడం గమనార్హం. అతడి చేతిలో హత్యాచారానికి గురైన ఆ జూనియర్ వైద్యురాలు.. ఆరోజు రాత్రి 12 గంటల సమయంలో తన తోటి ట్రైనీ డాక్టర్లు మరో ముగ్గురితో కలిసి ఒలింపిక్స్‌లో నీరజ్‌చోప్రా రజత పతక ప్రదర్శనను కూడా చూసింది. రాత్రి భోజనం పూర్తయ్యాక వారు ముగ్గురూ తమ విధులు నిర్వర్తించడానికి వెళ్లగా.. ఆమె చదువుకోవడానికి సెమినార్‌హాల్లోనే ఒంటరిగా ఉండిపోయింది. అదే సంజయ్ రాయ్‌కి అవకాశంగా మారింది.



సంజయ్ రాయ్

సివిల్ వాలంటీర్..

సంజయ్ రాయ్ అసలు ఆర్జీ కర్ ఆస్పత్రి ఉద్యోగి కాదు. కోల్‌కతా పోలీసు విభాగంలో సివిక్ వాలంటీర్‌గా పనిచేసేవాడు. సివిక్ వాలంటీర్ అంటే.. కాంట్రాక్ట్ సిబ్బంది. ట్రాఫిక్ నిర్వహణ, విపత్తు స్పందన విభాగాల్లో రూ.12 వేల జీతానికి వీరిని నియమిస్తారు. సంజయ్‌రాయ్ అలా తొలుత విపత్తు స్పందన విభాగంలో వాలంటీర్‌గా 2019లో చేరాడు. తర్వాత అతణ్ని పోలీస్ సంక్షేమ విభాగానికి మార్చారు. తర్వాత.. ఆర్జీ కర్ వైద్య కళాశాల ఆస్పత్రిలోని పోలీస్ ఔట్‌పోస్టులో డ్యూటీ వేశారు. అక్కడ అతను.. రోగుల నుంచి డబ్బులు తీసుకుని బెడ్ ఇప్పించడం వంటి దందాలు చేసేవాడు. ఈ క్రమంలోనే ట్రైనీ డాక్టర్‌పై కన్నేశాడు. కాగా, ఈ కేసును వీలైనంత త్వరగా ఛేదించాలని పోలీసులను బెంగాల్ సీఎం మమత ఆదేశించారు. మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించిన ఆమె.. "వచ్చే ఆదివారం కల్లా కేసును ఛేదించలేకపోతే.. దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తాం. సీబీఐకి ఇవ్వడానికి మాకేమీ అభ్యంతరం లేదుగానీ.. ఆ సంస్థ విజయాల శాతం చాలా తక్కువ" అని ఆమె వ్యాఖ్యానించారు. ఇంత ఘోరానికి పాల్పడినవారికి మరణ శిక్ష పడేలా చేస్తానన్నారు. ఈ కేసు విచారణ ఫాస్ట్ ట్రాక్ కోర్టులో జరగాలని పేర్కొన్నారు. ఇక.. ఈ కేసును సీబీఐకి అప్పగించాలని కోరుతూ కలకత్తా హైకోర్టులో మూడు ప్రజాహిత వ్యాజ్యాలు దాఖలయ్యాయి. మంగళవారం అవి విచారణకు రానున్నాయి. కాగా.. జాతీయ మహిళా కమిషన్‌కు చెందిన ఇద్దరు సభ్యుల బృందం సోమవారం మధ్యాహ్నం కోల్‌కతాకు చేరుకుని నగర పోలీసు కమిషనర్‌తో మాట్లాడారు. మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించారు.

గాంధీలో నిరసన

ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారానికి నిరసనగా హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్లు కొవ్వత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ఢిల్లీలోని ఎయిమ్స్, ఆర్ఎంఎల్ సహా పలు ఆస్పత్రుల్లోని రెసిడెంట్ డాక్టర్లు నిరవధిక నిరాహార దీక్షకు దిగారు. ఈ దీక్ష జరిగినన్నాళ్లూ ఓపీ విభాగాలు, ఆపరేషన్ థియేటర్లు, వార్డు డ్యూటీలను నిలిపివేస్తామని 'ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్' వెల్లడించింది. అత్యవసర వైద్యసేవలను మాత్రం అందిస్తామని తెలిపింది. ఆర్జీ కర్ కాలేజీ ప్రిన్సిపాల్‌ను తక్షణం తొలగించాలని, దీనిపై సీబీఐ దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేసింది. అయితే.. తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ సందీప్ ఘోష్ ప్రకటించారు.

రాక్షసి పీడ వదిలింది

- హసీనాపై మహమ్మద్ యూనుస్

న్యూఢిల్లీ, ఆగస్టు 12: బంగ్లాదేశ్‌కు పట్టిన రాక్షసి పీడా వదిలిందని కొన్ని రోజుల క్రితం దేశం వదిలి పారిపోయిన గత ప్రభుత్వాధినేత హసీనాను అభివర్ణిస్తూ ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వ సారధి మహమ్మద్ యూనుస్ అన్నారు. బంగ్లాదేశ్‌లో విద్యార్థులు చేసిన ఉద్యమాన్ని తాను గౌరవిస్తున్నానని, వారు చెప్పినందువల్లే తాను ప్రభుత్వ తాత్కాలిక సారధిగా బాధ్యతలు స్వీకరించానని చెప్పారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోకుండా తాను సారథ్యం వహిస్తున్న తాత్కాలిక ప్రభుత్వం పనిచేస్తుందని యూనుస్ ధీమా వ్యక్తం చేశారు. కాగా, బంగ్లాదేశ్ ప్రభుత్వ తాత్కాలిక సారధిగా బాధ్యతలు చేపట్టిన మహమ్మద్ యూనుస్‌కు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. అక్కడ నివసిస్తున్న హిందువులు, ఇతర మైనారిటీల భద్రతకు ఢోకా లేకుండా చూడాలని కోరారు. బంగ్లాదేశ్ అభివృద్ధికి భారత్ అన్ని రకాలుగా సహకరిస్తుందని మోదీ హామీ ఇచ్చారు.

విగ్రహాల ధ్వంసం విచారకరం: థరూర్

న్యూఢిల్లీ, ఆగస్టు 12: బంగ్లాదేశ్‌లో శాంతిభద్రతలను పునరుద్ధరించేందుకు కొత్తగా ఏర్పాటైన తాత్కాలిక ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ సోమవారం కోరారు. బంగ్లాదేశ్‌లో భారతీయ సాంస్కృతిక కేంద్రం, మందిరాలు, హిందువుల ఇళ్లపై దాడులు అవమానకరమన్నారు. బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై దాడులు చేయడాన్ని బట్టి చూస్తే కొందరు ఆందోళనకారుల అజెండా స్పష్టంగా కనిపిస్తోందన్నారు. బంగ్లాదేశ్ విమోచనానికి సంబంధించిన దృశ్యాలతో ముజిబ్‌నగర్‌లోని 1971 షాహిద్ మెమోరియల్ కాంప్లెక్స్‌లో ఏర్పాటుచేసిన విగ్రహాలను ధ్వంసం చేయడాన్ని ఆయన ఖండించారు. ఇలాంటి పరిణామాలు విచారకరమన్నారు. హసీనాకు ఆశ్రయం కల్పించి కేంద్రం సరైన నిర్ణయమే తీసుకుందని శశిథరూర్ అన్నారు.

చైనా.. చంద్రమా..

చైనాలో 13 ఏళ్ల బాలిక భరతనాట్య ప్రదర్శన!



చైనాకు చెందిన బాలిక లీ ముజీ(13) చరిత్ర సృష్టించింది. ఆదివారం రంగస్థల వేదిక మీద భరత నాట్య ప్రదర్శన చేసింది. "భరత నాట్యంలో పూర్తి స్థాయి శిక్షణ పొందిన ఓ విద్యార్థిని చైనాలో చేసిన తొలి 'అరంగేట్రం' ఇది" అని అక్కడి భారత రాయబార కార్యాలయం తెలిపింది.

మోదీ.. పదకొండోస్సారి!

- 15న ఎర్రకోటపై జాతీయ జెండా ఎగురవేయనున్న ప్రధాని



న్యూఢిల్లీ, ఆగస్టు 11: దేశ రాజధానిలో ఎర్రకోటపై వరుసగా 11వ సారి జాతీయ జెండా ఎగురవేసిన తొలి కాంగ్రెసేతర ప్రధానిగా మోదీ రికార్డు సృష్టించనున్నారు. ఇంతకుముందు కాంగ్రెస్ నుంచి జవహర్‌లాల్ నెహ్రూకు మాత్రమే ఈ ఘనత సాధించారు. వచ్చే సంవత్సరం మళ్లీ జెండా ఎగురవేస్తానని గతేడాది ఆగస్టు 15న ప్రకటించిన మోదీ జోస్యం ఇప్పుడు నిజం కానుంది.

సెబీ చైర్మన్ అక్రమ పెట్టుబడులపై..

కాంగ్రెస్, బీజేపీ ఢీ

(మొదటి పేజీ తరువాయి)



కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ సోమవారం విలేకరుల సమావేశంలో ఆరోపించారు. అదానీ గ్రూపులో రూ.20 వేల కోట్లకు పైగా బినామీ లావాదేవీలు జరిగాయని, విద్యుత్, బొగ్గు పరికరాల్లో అధిక ధరల్లో ఇన్వాయిస్‌లు జారీ చేశారని... భారీ ఎత్తున నగదు అక్రమ చలామణీ జరిగిందని ఆయన మండిపడ్డారు. దేశంలోని కీలక మౌలిక రంగాలను అదానీకి అప్పగించారని.. శ్రీలంక, బంగ్లాదేశ్ తదితర దేశాల్లో అదానీ వ్యాపార ప్రయోజనాలకు అనుగుణంగా విదేశాంగ వ్యవహారాలను నిర్వహించారని ఆయన ఆరోపణలు చేశారు. ఈ మొత్తం వ్యవహారంపై సీబీఐ, జేపీసీ ద్వారా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అంతేకాక.. సెబీ చైర్ పర్సన్‌గా కొనసాగుతూనే ఆమె కన్సల్టెంట్ సంస్థలను నిర్వహించారని, అలా నిర్వహిస్తూనే అదానీ గ్రూప్ సంస్థలపై దర్యాప్తు చేశారని ఆ సంస్థ వెల్లడించింది. కాగా.. ఈ వ్యవహారంపై జేపీసీ విచారణ జరిపించకపోతే దేశవ్యాప్త ఆందోళనలు చేపడతామని ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ హెచ్చరించారు. మరోవైపు.. మాధవి బుచ్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, సమాజ్ వాది పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా, శివసేన నేత ఉద్ధవ్ ఠాక్రే, ఆప్ నేత, ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాతో పాటు విపక్షాలకు చెందిన పలువురు నేతలు డిమాండ్ చేశారు. "సెబీ చైర్మన్ ఎందుకు రాజీనామా చేయరు? జేపీసీ విచారణకు ప్రధాని ఎందుకు భయపడుతున్నారు?" అని రాహుల్ ప్రశ్నించారు. ఏ నిధులపై విచారణ జరిపించాలో ఆ నిధులనే సెబీ చైర్మన్ పెట్టుబడులుగా పెట్టారని మహువా మొయిత్రా ఆరోపించారు.

ఇది వ్యక్తిత్వ హననమే

హిండన్‌బర్గ్ నివేదిక, ప్రతిపక్షాల ఆగ్రహం నేపథ్యంలో.. సెబీ చైర్మన్ మాధవికి సెబీ, బీజేపీ, అదానీ గ్రూప్ రక్షణగా నిలిచాయి. ప్రతిపక్షాలు తమ వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నాయని మాధవి బుచ్, ఆమె భర్త ఖండించారు. అదానీ గ్రూప్ పై వచ్చిన అన్ని ఆరోపణలపై తాము విచారణ జరిపించామని.. తన పెట్టుబడుల వివరాలను ఆమె ఎప్పుడూ దాచిపెట్టలేదని, వాటిపై విచారణ జరిగిన సందర్భాల్లో ఆమె విచారణ నుంచి తప్పుకొన్నారని సెబీ వివరణ ఇచ్చింది. మాధవి బుచ్, ఆమె భర్త నిబంధనల ప్రకారమే పెట్టుబడులు పెట్టారని.. అదానీ గ్రూప్ పెట్టుబడుల నిర్ణయాల్లో ఆమె హస్తం లేదని.. మొత్తం తమ పెట్టుబడుల్లో వారి పెట్టుబడులు 1.5 శాతం మాత్రమేనని అదానీ గ్రూప్ తెలిపింది. దేశంలో పెట్టుబడులను నిలిపివేసేందుకు కాంగ్రెస్ కుట్రకు పాల్పడుతోందని మాజీ కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ ఆరోపించారు. దేశంలో ఆర్థిక అరాచకత్వాన్ని వ్యాపింపజేసేందుకు రాహుల్ ఆధ్వర్యంలో కుట్ర జరుగుతోందన్నారు. హిండెన్ బర్గ్ సంస్థలో ప్రధాన వాటాదారుడైన జార్జ్ సోరోస్ ఏజెంట్‌గా రాహుల్ వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. ఇక.. రాహుల్‌గాంధీ సంపదలో 43% సంపద భారత స్టాక్ మార్కెట్‌లో ఉందని, 2019లో రాహుల్ చరాస్తుల విలువ 59% మేర పెరిగిందని బీజేపీ నేత అమిత్ మాలవీయ అన్నారు.



చైనాలో అతిపెద్ద రవాణా డ్రోన్ పరీక్ష విజయవంతం

బీజింగ్, ఆగస్టు 12: చైనా అతిపెద్ద మానవరహిత రవాణా డ్రోన్‌ను విజయవంతంగా పరీక్షించింది. ఆదివారం సిచువాన్ ప్రావిన్స్‌లో జరిగిన ఈ ప్రయోగం సందర్భంగా దాదాపు ఇరవై నిమిషాల పాటు ఈ డ్రోన్ ప్రయాణించింది. పూర్తిగా ప్రభుత్వ నిధులతో సిచువాన్ టెంగ్డెన్ సైన్స్ టెక్ ఇన్నోవేషన్ సంస్థ తయారు చేసిన ఈ డ్రోన్ రెక్కల పొడవు 16 మీటర్లు ఉండగా ఎత్తు 15 అడుగులు ఉంది. ఇది రెండు ఇంజిన్లతో పనిచేస్తుంది. దాదాపు 2 టన్నుల పేలోడ్‌ను మోసుకెళ్లే సామర్థ్యం దీనికి ఉంది. చైనా ప్రభుత్వం ఇటీవలి కాలంలో తక్కువ ఎత్తులో ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించే ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని నిర్ణయించింది. తక్కువ ఎత్తులో ఎగిరే డ్రోన్‌లు, చిన్న విమానాల ద్వారా ప్రయాణికులను, సరుకులను రవాణా చేయనున్నట్లు పేర్కొంది.

కాంగ్రెస్ బలోపేతంపై

అధిష్ఠానం దృష్టి

- నేడు అన్ని రాష్ట్రాల అధ్యక్షులు, ఇన్‌చార్జులతో సమావేశం
- ఏపీ నుంచి అధ్యక్షురాలు షర్మిల హాజరు

న్యూఢిల్లీ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బలపడేందుకు వ్యూహ రచన చేస్తోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి సీట్లు తగ్గడం, కాంగ్రెస్ వంద మార్కును దాటడంతో పార్టీలో ఉత్సాహం రెట్టింపు అయ్యింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రతిపక్ష నేతగా అధికార పక్షాన్ని సమర్థవంతంగా ఎదుర్కొన్నారనే భావన ఆ పార్టీలో కలిగింది. ఈ నేపథ్యంలో సంస్థాగతంగా పార్టీని మరింత బలంగా తీర్చిదిద్దాలని అధినాయకత్వం భావిస్తున్నది. అందులో భాగంగానే కాంగ్రెస్ జనరల్ సెక్రటరీలు, అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు, రాష్ట్రాల ఇంచార్జీలతో సమావేశం నిర్వహిస్తున్నది. మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఢిల్లీలో మల్లిఖార్జున ఖర్గే అధ్యక్షతన సమావేశం జరగనుంది. ఆంధ్ర నుంచి ఆ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సమావేశానికి హాజరుకానున్నారు. సమావేశం అనంతరం కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేను ప్రత్యేకంగా షర్మిల కలిసే అవకాశం ఉన్నది. ఆంధ్రప్రదేశ్‌లో గత ఎన్నికల తర్వాత పార్టీకి సంబంధించిన అన్ని విభాగాలను రద్దు చేశారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగానే కమిటీల రద్దు నిర్ణయం తీసుకున్నామని, త్వరలో కొత్త కమిటీల నియామకం ఉంటుందని అప్పట్లో పార్టీ ప్రకటించింది. వారితో ఆ కొత్త కమిటీల నియామకం, రాష్ట్రంలో ప్రభుత్వ మార్పు, ప్రస్తుత పరిస్థితులు, పార్టీ బలోపేతంపై అధిష్ఠానంతో చర్చించే అవకాశం ఉంది.

వర్సిటీలు ఢమాల్

- ఐదేళ్లలో భ్రష్టు పట్టించిన జగన్ ప్రభుత్వం
- 2019లో ఏయూ-29, ఎస్వీయూ-72
- 2024లో ఏయూ-41, ఏఎన్‌యూ-97
- టాప్-100 నుంచి ఎస్వీయూ అవుట్
- ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో వెనుకబాటు

(అమరావతి, ఆంధ్రజ్యోతి)

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాల్సిన విశ్వవిద్యాలయాలను జగన్ ప్రభుత్వం భ్రష్టు పట్టించింది. యూనివర్సిటీలను రాజకీయ వేదికలుగా మార్చి అప్రతిష్ఠపాలు చేసింది. ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలోని యూనివర్సిటీల స్థాయిని పెంచే అవకాశం ఉండగా, అది చేయలేకపోగా వాటిని ఇంకా వెనక్కి తీసుకెళ్లింది. సోమవారం విడుదలైన ఎన్ఐఆర్ఎఫ్ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్) ర్యాంకులు ఇదే విషయం స్పష్టంచేస్తున్నాయి. శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీని మొత్తానికే టాప్-100లో లేకుండా చేసిన ఘనత జగన్ ప్రభుత్వానికి దక్కింది. అటు ఓవరాల్ కేటగిరీలో, ఇటు యూనివర్సిటీల కేటగిరీ..రెండింటిలోనూ జగన్ ప్రభుత్వంలో యూనివర్సిటీల ర్యాంకులు పతనమయ్యాయి. గతేడాదితో పోల్చి చూస్తే ఆంధ్రా యూనివర్సిటీ ర్యాంకు మెరుగుపడింది. ఓవరాల్ కేటగిరీలో గతేడాది 76 స్థానంలో ఉండగా, ఇప్పుడు 41వ స్థానానికి చేరింది. కొత్తగా చేర్చిన స్టేట్ పబ్లిక్ యూనవర్సిటీ కేటగిరీలో ఏడో ర్యాంకును పొందింది. ఈ ఏడాది నాగార్జున యూనివర్సిటీ 97వ ర్యాంకుతో టాప్-100లోకి వచ్చింది. ఇలా గతేడాదితో పోల్చుకుంటే బాగానే కనిపిస్తున్నా ఐదేళ్లకాలాన్ని దృష్టిలో పెట్టుకుని చూస్తే మాత్రం ర్యాంకుల పతనం స్పష్టంగా కనిపిస్తోంది. 2019లో ఏయూ 29 ర్యాంకుతో మెరుగైన స్థానంలో ఉంది. ఎస్వీయూ 72వ స్థానంలో ఉంది. కాగా ఇప్పుడు ఆంధ్రా 41వ స్థానంలో ఉంటే, ఎస్వీయూ టాప్-100లోనే లేకుండా పోయింది. 150 ర్యాంకుల కేటగిరీలో ఉంది.

యూనివర్సిటీ కేటగిరీలోనూ...

యూనివర్సిటీ కేటగిరీలో రాష్ట్రంలోని యూనివర్సిటీలు వెనకబడిపోయాయి. 2019లో ఆంధ్రా యూనివర్సిటీ 16వ స్థానంలో మెరుగ్గా ఉంటే, ఇప్పుడు 25వ స్థానానికి పడిపోయింది. అప్పట్లో ఎస్వీయూ 48వ స్థానంలో ఉండగా, ఇప్పుడు ఏకంగా 87వ స్థానానికి చేరింది. కాగా నాగార్జున యూనివర్సిటీ 59వ ర్యాంకుతో టాప్-100లోకి వచ్చింది. ఏఎన్‌యూ టాప్‌లోకి వచ్చిందన్న ఉపశమనం మినహా మిగిలిన రెండు యూనివర్సిటీల ర్యాంకులు ఆందోళనకరంగానే ఉన్నాయి.

ఐఐటీ మద్రాస్ ఆరోసారీ బెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

విద్యాలయాల జాబితాలో హైదరాబాద్‌లోని నల్సార్‌కు మూడో ర్యాంకు లభించింది. 'నేషనల్ ఇనిస్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్- 2024' కింద కేంద్ర విద్యాశాఖ ఈ ర్యాంకులను ప్రకటించింది.

అన్నింటా బెస్ట్ : ఎనిమిది ఐఐటీలు, ఎయిమ్స్ ఢిల్లీ, జేఎన్‌యూలు చోటు దక్కించుకున్నాయి. వరుసగా ఐఐటీ మద్రాస్, ఐఐఎస్‌సీ బెంగళూరు, ఐఐటీ బెంగళూరు టాప్‌లో నిలిచాయి.

ఇంజనీరింగ్ కాలేజీలు : తొమ్మిది ఐఐటీలను ఎంపిక చేశారు. ఐఐటీ మద్రాస్ (వరుసగా ఇది తొమ్మిదోసారి), ఐఐటీ ఢిల్లీ, ఐఐటీ బాంబే వరుసగా మూడు ర్యాంకులు దక్కించుకున్నాయి. ఐఐటీయేతర సంస్థల్లో నిట్, తిరుచిరాపల్లి విద్యాసంస్థలు టాప్ టెన్‌లో నిలిచాయి.

మేనేజ్‌మెంట్ కాలేజీలు : ఐఐఎమ్ అహ్మదాబాద్, ఐఐటీ బెంగళూరు, ఐఐటీ కోజికోడ్‌లు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. మేనేజ్‌మెంటు కోర్సుల విభాగంలో ఐఐటీ బాంబే, ఐఐటీ ఢిల్లీ మొదటి రెండు ర్యాంకులు కైవసం చేసుకున్నాయి.

కాలేజీల కేటగిరీ : ఢిల్లీ యూనివర్సిటీ అనుబంధ హిందూ కాలేజీ, మిరిండా హౌస్ తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. సెయింట్ స్టీఫెన్ కాలేజీకు మూడో ర్యాంకు దక్కింది.

న్యాయ విద్యాలయాలు : నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ-బెంగళూరు, నేషనల్ లా యూనివర్సిటీ-ఢిల్లీ, నల్సార్- హైదరాబాద్‌కు వరుసగా మూడు ర్యాంకులు లభించాయి. ఆర్కిటెక్చర్ ప్లానింగ్‌లో ఐఐటీ రూర్కీ, ఐఐటీ ఖరగ్‌పూర్, నిట్ కాలికట్ వరుసగా మూడు ర్యాంకులు సాధించాయి.

మెడికల్ కాలేజీలు : ఎయిమ్స్-ఢిల్లీకి తొలి ర్యాంకు లభించింది. పీజీఐఎమ్ఈ-చండీగఢ్, సీఎమ్‌సీ- వెల్లూరు మిగతా రెండు స్థానాల్లో నిలిచాయి.

జల వనరుల శాఖకు.. మానవ వనరుల ముప్పు!

- వచ్చే నెలాఖరు నాటికి భారీగా సిబ్బంది పదవీవిరమణ
- లష్కర్ నుంచి ఇంజనీర్ల దాకా రిటైర్మెంట్
- సగానికిపైగా రెగ్యులర్ అధికారులు లేరు
- చాలా పోస్టుల్లో ఇన్‌చార్జులే
- చివరకు ఈఎన్‌సీ పదవులకూ అదే పరిస్థితి
- ఎస్ఈలు, ఈఈలు, డీఈఈలు కూడా
- గత ఐదేళ్లలో కాగితాలకే పరిమితమైన లష్కర్లు
- ఆ ఉద్యోగాల్లో వైసీపీ కార్యకర్తల నియామకం
- విధులకు రాకున్నా నెలనెలా వేతనాలు
- ప్రాజెక్టుల నిర్వహణకు పైసా ఇవ్వలేదు
- ప్రక్షాళన చేయకుంటే ప్రాజెక్టుల నిర్వహణ కష్టం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జల వనరుల శాఖ మానవ వనరుల ముప్పు ఎదుర్కొంటోంది. వచ్చే నెలాఖరునాటికి లష్కర్ నుంచి ఇంజనీరింగ్ అధికారుల దాకా భారీగా పదవీ విరమణ చేయబోతున్నారు. పదోన్నతులు లేకుండా అడహాక్ ప్రమోషన్లతో సరిపుచ్చుకుంటున్న అధికారుల్లో చాలా మంది ఇంటి ముఖం పట్టనున్నారు. అన్ని ప్రభుత్వ శాఖల తరహాలోనే జల వనరుల శాఖలోనూ ఉద్యోగుల పదవీ విరమణ తర్వాత అడహాక్ పదోన్నతులు కల్పించి ఇన్‌చార్జులను కొనసాగించడమే తప్ప.. సీనియారిటీని బట్టి ప్రమోషన్లు కల్పించాలన్న స్పృహ గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వానికి లేకపోయింది. ప్రాజెక్టులు కట్టాక వాటి యాజమాన్య నిర్వహణ అత్యంత ప్రధానమైనది. ఇందుకోసం నిరంతరం ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ అవసరం. కొత్త ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు పూర్తయిన ప్రాజెక్టుల యాజమాన్య నిర్వహణకూ నిధులు అవసరం. జగన్ సీఎం ఉండగా చిల్లిగవ్వయినా ఇవ్వలేదు. ఫలితంగా ప్రాజెక్టు గేట్లకు గ్రీజు పూసేందుకూ పైసల్లేని దుస్థితి ఏర్పడింది. దీని మూలంగా పులిచింతల గేట్లు తెగాయి. అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయింది. 2009 సెప్టెంబరు మొదటివారంలో కురిసిన భారీ వానలు.. ఎగువ కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భారీ వరదకు శ్రీశైలం డ్యాం గేట్ల పైనుంచి వరద ప్రవహించింది. ఈ ఉధృతికి డ్యాం కొట్టుకుపోతుందేమోనన్న ఆందోళన వ్యక్తమైంది. భారీ వరదకు శ్రీశైలం స్పిల్‌వే వద్ద భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఈ గుంతలను పూడ్చకపోతే .. సమీప భవిష్యత్‌లో జలాశయానికి పెనుముప్పు వాటిల్లుతుందని కేంద్రం హెచ్చరికలు చేస్తున్నా.. మరమ్మతులు చేపట్టడం లేదు. నిధులివ్వకపోయినా.. కనీసం నియామకాలను చేపట్టినా సాగునీటి ప్రాజెక్టులకు భద్రత ఏర్పడేది. కానీ ఓవైపు ఉద్యోగులు రిటైరవుతుంటే.. ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయకుండా జగన్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపింది. ఏటా జాబ్ కేలెండర్ హామీని అటకెక్కించింది. ఫలితంగా ఆ శాఖలో భారీగా ఖాళీలు ఏర్పడనున్నాయి. ఈ శాఖలో అత్యున్నత స్థాయిలో మూడు ఇంజనీర్-ఇన్-చీఫ్ (ఈఎన్‌సీ) పోస్టులు ఉన్నాయి. వీటికి రెగ్యులర్ ఈఎన్‌సీలు లేరు. ఇన్‌చార్జులే కొనసాగుతున్నారు. చివరకు జల వనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావును ఇటీవల ఇన్‌చార్జి ఈఎన్‌సీగా నియమించుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. ప్రధానమైన చీఫ్ ఇంజనీర్ల పోస్టులు 19 ఉన్నాయి. వీటిలో ముగ్గురు మాత్రమే రెగ్యులర్ చీఫ్ ఇంజనీర్లుగా ఉంటే.. మరో 16 మంది అడహాక్ ప్రమోషన్ల పేరిట ఇన్‌చార్జులుగా కొనసాగుతున్నారు. అలాగే 51 మంది సూపరింటెండింగ్ ఇంజనీర్లు (ఎస్ఈలు) ఉండాలి. 18 మంది మాత్రమే రెగ్యులర్ ఎస్ఈలు ఉన్నారు. మిగతా 33 మంది ఇన్‌చార్జులే. 267 మంది ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల (ఈఈలు)కు గాను సరిగ్గా వంద మంది రెగ్యులర్‌గా ఉండగా.. 167 మంది ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తున్నారు. 943 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈఈ) పోస్టులకుగాను 593 మంది రెగ్యులర్‌గా, 350 మంది ఇన్‌చార్జులుగా కొనసాగుతున్నారు. ఇక ప్రాజెక్టుల యాజమాన్య నిర్వహణలో అత్యంత క్రియాశీలంగా వ్యవహరించాల్సిన లష్కర్ పోస్టుల విషయంలో.. జగన్ సర్కారు భారీ నిర్లక్ష్యం వహించింది. లష్కర్ ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. గేట్లతో పాటు ప్రాజెక్టుకే ముప్పు వాటిల్లుతుందనేందుకు.. పులిచింతల, అన్నమయ్య ప్రాజెక్టులే ప్రత్యక్ష ఉదాహరణ. గడచిన ఐదేళ్లలో లష్కర్లను నియమించినట్లుగా కాగితాల్లో మాత్రమే చూపించారు. వీరంతా వైసీపీ కార్యకర్తలే. ఒకరిద్దరు తప్ప మిగిలిన వారెవరూ కనిపించరు. విధులు నిర్వహించరు. అయినా నెలనెలా గౌరవ వేతనం మాత్రం దక్కుతోంది. ఈ నేపథ్యంలో ఒకవైపు ప్రక్షాళన.. మరోవైపు ఉద్యోగాల శాశ్వత భర్తీపై ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉందని నిపుణులు సూచిస్తున్నారు. లేదంటే భవిష్యత్‌లో ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు.. ప్రస్తుత ప్రాజెక్టుల యాజమాన్య నిర్వహణకూ సిబ్బంది అందుబాటులో లేకుండా పోతారని హెచ్చరిస్తున్నారు.

డ్రైవింగ్ లైసెన్స్ ఫిజికల్‌గా జారీ చేయరా?

- వివరణ ఇవ్వండి.. రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

అమరావతి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను ఫిజికల్‌గా ఇవ్వకుండా కేవలం డిజిటల్ రూపంలో జారీ చేయడంపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. వాటిని ఫిజికల్‌గా జారీ చేసే విషయంలో చట్టంలో ఎలాంటి నిషేధమూ లేదని గుర్తు చేసింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, కేంద్ర రవాణాశాఖ కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ ఎస్.జయసూర్యతో కూడిన ధర్మాసనం ఇటీవల ఉత్తర్వులు ఇచ్చింది. డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ పత్రాలను ఫిజికల్ రూపంలో జారీ చేసేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ పంజాబ్‌కు చెందిన రాహత్ ద సేఫ్ కమ్యూనిటీ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ కమల్ ఏపీ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ పిల్ ఇటీవల సీజే ధర్మాసనం ముందు విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ల జారీ కోసం వాహనదారులు ప్రభుత్వానికి నిర్దేశిత సొమ్మును చెల్లిస్తున్నారన్నారు. అయినప్పటికీ వాటిని ఫిజికల్ రూపంలో జారీ చేయడం లేదని, కేవలం డిజిటల్ రూపంలోనే అందజేస్తున్నారని వివరించారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం దీనిపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

'అమరావతి'కి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి నెల జీతం విరాళం



అమరావతి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అమరావతి నిర్మాణానికి తన మొదటి నెల జీతం రూ.3,01,116ను రవాణా, యువజన క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి విరాళంగా ప్రకటించారు. ఈమేరకు సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి చెక్కు అందజేశారు.

రెవెన్యూ సమస్యలపై 16 నుంచి సదస్సులు

- అన్యాయం జరిగితే ఎవరైనా అర్జీలు ఇవ్వచ్చు: రెవెన్యూ మంత్రి అనగాని



శ్రీవారి ఆలయం వద్ద మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్

తిరుమల, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత ఎక్కువగా రెవెన్యూ సమస్యలు వినిపిస్తున్నాయని, గత ప్రభుత్వంలో చాలా భూములు అన్యాక్రాంతమయ్యాయని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. ఈ క్రమంలో ప్రజల భూముల సమస్యలను పరిష్కరించేందుకు ఈనెల 16వ తేదీన రెవెన్యూ సదస్సులు ప్రారంభించి 45 రోజుల పాటు కొనసాగిస్తామన్నారు. ఎక్కడైనా, ఎవరికైనా అన్యాయం జరిగితే ఈ సదస్సు ద్వారా ఆర్జీలు ఇవ్వొచ్చని సూచించారు. అక్కడున్న అధికారులు వాటిని తీసుకుని 45 రోజులలోపు సమస్యలను పరిష్కరిస్తారన్నారు. విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో కలిసి సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మంత్రి అనగాని సత్యప్రసాద్.. ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. సదస్సులు ఏర్పాటు చేస్తున్నప్పటికీ చాలామంది భయంతో ఫోన్లు చేసి తమకు జరిగిన అన్యాయాన్ని చెప్పుకుంటున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రత్యేక కాల్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేశామన్నారు. తిరుపతిలో హథీరాంజీ మఠం భూములను బడా నాయకులు, మాజీ మంత్రులు ఆక్రమించారన్నారు. పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి అర్హత ఉన్నవారికి భూములు చెందేలా చూస్తామని చెప్పారు. విద్యుత్ శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో రైతులకు, ప్రజలకు, పరిశ్రమలకు 24 గంటలు విద్యుత్ ఇచ్చే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. విద్యుత్ చార్జీలు ఎలా తగ్గించాలనే అంశంపై కూడా దృష్టి పెడతామన్నారు.

అచ్చెన్న 'స్కిల్ కేసు'లో మధ్యంతర ఉత్తర్వులు పొడిగింపు

అమరావతి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిధులు మళ్లించారనే ఆరోపణలతో వైసీపీ ప్రభుత్వం హయాంలో సీఐడీ 2021 డిసెంబరులో నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ టీడీపీ సీనియర్ నేత, వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దాఖలు చేసిన పిటిషన్ సోమవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ వ్యవహారంపై వాదనలు వినిపించేందుకు సమయం ఇవ్వాలని సీఐడీ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ అభ్యర్థించారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ విచారణను నాలుగు వారాలకు వాయిదా వేశారు. పిటిషనర్ విషయంలో అరెస్టుతో పాటు ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని ఆదేశిస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించారు.

ఏ న్యాయమూర్తి విచారించాలో నిర్ణయిస్తాం

- మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి బెయిల్ పిటిషన్లపై హైకోర్టు

మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వేర్వేరుగా దాఖలు చేసిన రెండు పిటిషన్లు సోమవారం హైకోర్టులో విచారణకు వచ్చాయి. ఎన్నికల సందర్భంగా ఈవీఎం, వీవీ ప్యాట్ ధ్వంసం, అడ్డుకోబోయిన టీడీపీ ఏజెంట్ శేషగిరిరావుపై దాడి, నాగ శిరోమణి అనే మహిళను బూతులు తిట్టిన వ్యవహారం, పోలింగ్ మరుసటి రోజు కారంపూడి సీఐ నారాయణ స్వామిపై దాడి చేసి గాయపరిచిన ఘటనలపై పిన్నెల్లిపై కేసులు నమోదయ్యాయి. ఆ కేసుల్లో అరెస్టయిన మాజీ ఎమ్మెల్యే నెల్లూరు కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. రెండు కేసుల్లో బెయిల్ కోరుతూ హైకోర్టులో రెండు వేర్వేరు పిటిషన్లు వేసిన విషయం తెలిసిందే. ఆ పిటిషన్లు సోమవారం విచారణకు రాగా... పోలీసుల తరఫున ప్రత్యేక న్యాయవాది ఎస్.అశ్వనీకుమార్ వాదనలు వినిపిస్తూ... 'ప్రస్తుత పిటిషనర్ ముందస్తు బెయిల్ పిటిషన్‌లను న్యాయమూర్తి జస్టిస్ మల్లిఖార్జునరావు గతంలో విచారించి, వాటిని కొట్టేశారు. ముందస్తు బెయిల్/బెయిల్ పిటిషన్లను మొదటిసారి ఎవరైతే విచారిస్తారో, ఆ తరువాత దాఖలయ్యే వ్యాజ్యాలను కూడా అదే న్యాయమూర్తి విచారించాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. ఆ ఉత్తర్వులను అనుసరించి ఇదే ఎఫ్ఐఆర్‌లోని మరో నిందితుడి బెయిల్ పిటిషన్‌ను న్యాయమూర్తి జస్టిస్ మల్లిఖార్జునరావు వద్దకు పంపించారు' అని వివరించారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఓ మనోహర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ... 'సుప్రీం తీర్పు ప్రస్తుత పిటిషనర్‌కు వర్తించదు. పిటిషనర్ మాజీ ఎమ్మెల్యే. రోస్టర్ ప్రకారం మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీల కేసులు ప్రస్తుత బెంచ్ మాత్రమే విచారించాలి' అని వివరించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను పరిశీలించి, బెయిల్ పిటిషన్లపై ఏ న్యాయమూర్తి విచారణ జరపాలనే విషయంపై నిర్ణయాన్ని వెల్లడిస్తామని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ ప్రకటించారు. విచారణను 14కి వాయిదా వేశారు.

అరకు ఎంపీ తనూజారాణి ఎన్నికను రద్దు చేయండి

- హైకోర్టులో బీజేపీ అభ్యర్థి కొత్తపల్లి గీత పిటీషన్

అరకు పార్లమెంట్ సభ్యురాలిగా గుమ్మా తనూజారాణి ఎన్నికను సవాల్ చేస్తూ బీజేపీ అభ్యర్థి, మాజీ ఎంపీ కొత్తపల్లి గీత దాఖలు చేసిన వ్యాజ్యం సోమవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. విచారణ జరిపిన న్యాయస్థానం ప్రతివాదులుగా ఉన్న లోక్‌సభ సెక్రెటరీ జనరల్, అరకు పార్లమెంటరీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారితో పాటు వ్యక్తిగత హోదాలో ప్రతివాదిగా ఉన్న తనూజారాణి, ఎంపీ స్థానానికి పోటీలో ఉన్న ఇతర అభ్యర్థులకు నోటీసులు జారీ చేసింది. విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఊటుకూరి శ్రీనివాస్ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. అరకు ఎంపీగా గుమ్మా తనూజారాణి ఎన్నికను సవాల్ చేస్తూ బీజేపీ అభ్యర్థి, మాజీ ఎంపీ కొత్తపల్లి గీత హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికల అఫిడవిట్‌లో తనూజారాణి వాస్తవాలు చెప్పలేదని, ఓట్ల లెక్కింపు విషయంలో తాను లేవనెత్తిన అభ్యంతరాలను రిటర్నింగ్ అధికారి పట్టించుకోలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఎంపీగా తనూజారాణి ఎన్నికను రద్దు చేసి, రెండో స్థానంలో ఉన్న తనను ఎంపీగా ప్రకటించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. న్యాయమూర్తి స్పందిస్తూ... తనూజారాణి ఇప్పటికే ప్రమాణం చేశారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఆమె ప్రమాణం చేయకుండా నిరోధించాలంటూ వేసిన అనుబంధ పిటిషన్ నిరర్థకం అవుతుందన్నారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది చంద్రమౌళి వాదనలు వినిపించారు.

తెగుళ్లా.. ఇక ఆందోళన వద్దు

(మొదటి పేజీ తరువాయి)

పంటల్లో ఒక్కొక్క రకం చొప్పున నూతన వంగడాలను ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు రూపొందించారు. అపరాలు, నూనె గింజల పంటల్లో స్వయం సమృద్ధి సాధించే దిశగా, ఎల్‌జీజీ-610 పెసర, ఎన్‌బీఈజీ-1267 శనగ, టీసీజీఎస్-1707 రకాలకు రూపకల్పన చేశారు. దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల వ్యవసాయ శాస్త్రవేత్తలు రూపొందించిన 109 రకాల కొత్త వంగడాలను ఆదివారం ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ విడుదల చేశారు. అందులో రాష్ట్రానికి సంబంధించిన మూడు నూతన వంగడాల గుణగణాలను రంగా వర్సిటీ వీసీ శారదా జయలక్ష్మి సోమవారం మీడియాకు వివరించారు.

లాం పెసర

ఎల్‌జీజీ-610 రకం లాం పెసర రబీ సీజన్‌కు అనువైంది. పంట కాల పరిమితి 74రోజులు. ఎల్లో మొజాయిక్ వైరస్‌ను నిరోధించ గల శక్తి ఈ రకానికి ఉందని శాస్త్రవేత్తలు గుర్తించారు. లాం పెసర హెక్టార్‌కు 11.17 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా. ఏపీ, తెలంగాణ తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఒడిశా రాష్ట్రాల్లో రబీలో వరి మాగాణి, మెట్ట ప్రాంతాలకు ఈ రకం అనువైంది. యంత్రంతో కోతకు అనుకూలమైన ఈ పెసరలో 23.16% ప్రోటీన్ కలిగి ఉంటుంది.

నంద్యాల శనగ

నంద్యాల గ్రామ్(ఎన్‌బీఈజీ-1267)గా పిలిచే దేశీయ శనగ రకం రబీలో వర్షాధారంగా అనుకూలమైంది. పంట కాలపరిమితి 90-95 రోజులు. ఎండు తెగులును తట్టుకోగల ఈ వంగడంతో రబీలో హెక్టార్‌కు 20.95 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా. ఏపీ, తెలంగాణ కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు శాస్త్రవేత్తలు సిఫారసు చేస్తున్నారు. యంత్రాలతో కోతకు అనుకూలమైన ఈ దేశీయ శనగను 1-2రక్షిత నీటి తడులతో కూడా పండించవచ్చు. 15.96% సీడ్ ప్రోటీన్‌ను కలిగి ఉంటుంది.

తిరుపతి వేరుశనగ

కోణార్క్‌లోని ఐసీఏఆర్ సహకారంతో తిరుపతి వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు తయారు చేసిన టీసీజీఎస్-1707 రకం వేరుశనగ ఖరీఫ్ సీజన్‌కు అనుకూలమైంది. జీపీబీడీ4+ఐసీజీ(ఎఫ్‌డీఆర్ఎస్)79తో సంకరం చేయబడిన ఈ వంగడం 110-115 రోజుల కాలపరిమితితో హెక్టార్‌కు 24.76క్వింటాళ్ల దిగుబడి రానున్నది. రసం పీల్చే పురుగులను తట్టుకుంది. ఆకు మచ్చ తెగులు, వేరు కుళ్లు, కాండం కుళ్లు, వేరు ఎండు తెగుళ్లను మధ్యస్తంగా తట్టుకుంటుందని చెప్తున్నారు. ఒడిశా, పశ్చిమ బెంగాల్‌కు సిఫారసు చేయబడిన ఈ వేరుశనగ కాయ నుంచి పప్పు దిగుబడి 70-75%, నూనె శాతం 49% ఉంటుంది. 100 గింజల బరువు 40-45 గ్రాములు ఉంటుంది. అధికనీటి వినియోగ సామర్థ్యం కలిగింది. గింజలు లేత గులాబీ రంగులో ఉంటాయి. కాయలన్నీ ఒకే సారి పక్వానికి వస్తాయి. సకాలంలో విత్తితే వర్షాధారం/ నీటి పారుదలకు అనుకూలం. ఈ రకంలో ప్రోటీన్స్ 29% ఉంటుంది.

ఎన్ఐఆర్ఎఫ్‌లో విజ్ఞాన్ వర్సిటీకి 72వ ర్యాంకు




ఆచార్య నాగభూషణ్

గుంటూరు(విద్య), ఆగస్టు 12 : కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ (ఎంహెచ్ఆర్‌డీ) సోమవారం విడుదల చేసిన ఉన్నత విద్యాసంస్థల ర్యాంకింగ్‌లో విజ్ఞాన్ వర్సిటీకి జాతీయ స్థాయిలో 72వ ర్యాంకు వచ్చినట్లు వీసీ ఆచార్య పీ. నాగభూషణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీచింగ్, లెర్నింగ్, రీసెర్చ్ అండ్ ప్రొఫెషనల్ ప్రాక్టీస్, గ్రాడ్యుయేషన్ ఓట్‌కమ్ తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని ర్యాంకులు కేటాయిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా సంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ ఛైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయ హర్షం వ్యక్తం చేశారు.

శ్రీవారి ఆలయంలో 18న కల్యాణోత్సవం రద్దు

తిరుమల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 18వ తేదీన కల్యాణోత్సవాన్ని రద్దు చేస్తున్నట్టు టీటీడీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు నిర్వహించనున్న క్రమంలో టీటీడీ ఈనిర్ణయం తీసుకుంది.



తిరుమల ఘాట్‌రోడ్డులో ద్విచక్రవాహనాల రాకపోకలపై ఆంక్షలు

తిరుమల, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): భక్తుల భద్రత దృష్ట్యా తిరుమల ఘాట్‌రోడ్లలో ద్విచక్రవాహనాల అనుమతిపై టీటీడీ ఆంక్షలు విధించింది. సోమవారం నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు మాత్రమే రెండు ఘాట్‌రోడ్లలో ద్విచక్రవాహనాల రాకపోకలను అనుమతించాలని నిర్ణయం తీసుకుంది. తిరుమల మొదటిఘాట్‌రోడ్డులోని 56వ మలుపు వద్ద ఆదివారం రాత్రి ఓ చిరుతపులి రోడ్డు దాటుతూ ద్విచక్రవాహనదారుల కంటపడిన విషయం తెలిసిందే. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వన్యప్రాణుల్లో సంతానోత్పత్తి ఎక్కువగా ఉంటుందని, దీంతో క్రూర మృగాలు మొదటి ఘాట్‌రోడ్డులో తరచూ రోడ్డు దాటుతున్నాయని టీటీడీ ఫారెస్ట్ డిప్యూటీ కన్జర్వేటర్ తెలిపారు. ఈనేపథ్యంలో ఈ ఆంక్షలు విధించినట్టు తెలిపారు.

స్కూల్ వ్యాను బోల్తా....చిన్నారి మృతి

- 15మంది విద్యార్థులకు స్వల్పగాయాలు




బోల్తా పడ్డ స్కూల్ వ్యాన్, భవిష్యరెడ్డి

ఓబులవారిపల్లె, ఆగస్టు 12: స్కూలు వ్యాను బోల్తాపడడంతో ఏడేళ్ల విద్యార్థిని అక్కడికక్కడే మృతిచెందింది. అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె మండలంలో సోమవారం ఉదయం ఈ సంఘటన జరిగింది. ఓబులవారిపల్లె గ్రామానికి చెందిన వీరంరెడ్డి మధుసూదన్‌రెడ్డి, అరుణ దంపతులకు ఏడాది కుమారుడు, ఏడేళ్ల కుమార్తె భవిష్యరెడ్డి ఉన్నారు. బాలిక ఇదే మండలంలోని చిన్నఓరంపాడు పంచాయతీ అయ్యలరాజుపల్లె గ్రామానికి దగ్గరగా ఉన్న శ్రీవాణి విద్యానికేతన్‌లో రెండో తరగతి చదువుతోంది. సోమవారం ఉదయం 8గంటలకు స్కూలు వ్యాన్ ఓబులవారిపల్లెలో విద్యార్థులను ఎక్కించుకుని పాఠశాలకు బయలుదేరింది. మార్గమధ్యలో ఉన్న పాము లేరు బ్రిడ్జిని దాటగానే వాహనం అదుపు తప్పి ఎడమవైపు రక్షణగా ఉన్న సిమెంట్ దిమ్మెలను ఢీకొంటూ వెళ్లి సుమారు 10 అడుగుల లోతులో బోల్తాపడింది. ఘటనలో భవిష్యరెడ్డి అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు స్కూల్‌వ్యాను అద్దాలు పగులగొట్టి విద్యార్థులను బయటకు తీశారు. వ్యాన్‌లో ఉన్న 15 మంది విద్యార్థులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

వైసీపీ నేతలది హడావుడే

- అంబేడ్కర్ పేరిట జగన్ దోపిడీ: మంత్రి డోలా

అమరావతి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు చేస్తున్న హడావుడి దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి విమర్శించారు. సోమవారం టీడీపీ ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అమరావతి నడిబొడ్డున అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి చంద్రబాబు ఏర్పాట్లు చేస్తే.. జగన్ హడావుడిగా విజయవాడలో ఏర్పాటు చేయాలని చెప్పి.. 177 కోట్ల బడ్జెట్‌ను రూ.404 కోట్లకు పెంచి రూ.250 కోట్లకు పైగా కొట్టేశారన్నారు. దళితులకు మేలు చేస్తానని చెప్పి మోసం చేసింది నిజం కాదా? అని ప్రశ్నించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద జగన్ పేరును వైసీపీ నేతలే తొలగించినట్లు జనం చర్చించుకుంటున్నారని తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

భళా పారిస్!

ఫ్యాషన్ నగరి పారిస్ ఆతిథ్యమిచ్చిన ఒలింపిక్ క్రీడలు పరిసమాప్తమయ్యాయి, విజయవంతమైనాయి. వ్యయనియంత్రణ, భద్రత, మౌలిక సదుపాయాలవంటి అంశాల్లో తాజా క్రీడలు కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టాయి. రాబోయే రోజుల్లో ఒలింపిక్స్ నిర్వహించబోయే దేశాలకు ఇవి దిశానిర్దేశం చేస్తాయి. కొత్త స్టేడియాలు నిర్మించడం, ఆర్భాటపు ఖర్చులు చేయడం వంటి విషయాల్లో పారిస్ జాగరూకతతో వ్యవహరించింది. ఒలింపిక్స్ నిర్వహించిన దేశాలు ఆ తరువాత అప్పులకుప్పల్లా మారడం గతంలో చూశాం. ఈ తరహా అనుభవాలతో పారిస్ ముందు చూపు ప్రదర్శించింది.

ఇక పతకాల పట్టికలో అగ్రస్థానం కోసం అమెరికాతో చైనా హోరాహోరీగా తలపడింది. ఈ పోరాటం నువ్వానేనా అన్నట్టుగా చివరిదాకా సాగింది. ఆఖరి ఈవెంట్‌గా జరిగిన మహిళల బాస్కెట్‌బాల్ మ్యాచ్‌లో పసిడి పతకాన్ని గెలవడం ద్వారా అమెరికా ఊపిరిపీల్చుకుంది. ఇరు దేశాల స్వర్ణ పతకాలు 40–40తో సమమైనా రజతాలు, మొత్తం మెడల్స్‌లో అమెరికాదే పైచేయి. 126 పతకాలతో అది అగ్రస్థానంలో ఉంటే, చైనా 91 మెడల్స్‌తో రెండో స్థానానికి పరిమితమైంది. జపాన్, ఆస్ట్రేలియా తర్వాతి స్థానాల్లో కొలువుదీరాయి. ఆతిథ్య ఫ్రాన్స్ అద్భుత ఆటతీరుతో ఐదో స్థానం దక్కించుకుంది. ఇక తాజా క్రీడల్లో పలువురు ఆటగాళ్లు అమేయమైన ఆటతీరుతో అందరిదృష్టినీ ఆకర్షించారు. అమెరికా స్టార్లు నోవా లైల్స్, సిమోన్ బైల్స్, కేటీ లెడెకీ, స్వీడన్‌కు చెందిన డుప్లాంటిస్, కెన్యా రన్నర్ కిప్యెగొ, ఫ్రాన్స్‌కు చెందిన లియాన్ మర్చండ్ తదితరులు పారిస్‌ను ఉర్రూతలూగించారు.

పతకాల పట్టికలో భారత జట్టు ఏకంగా 71వ స్థానంలో నిలవడం అభిమానుల్ని తీవ్రంగా నిరాశపరచింది. 117 మంది సభ్యుల భారీ బృందం కనీసం రెండంకెల్లో పతకాలు తేకపోదా అని ఆశించినవారిని టీమిండియా ఉసూరుమనిపించింది. ఖాయంగా పతకం కొట్టేస్తారని భావించిన ఆటగాళ్లు రిక్తహస్తాలతో వెనుదిరగడం క్రీడాభిమానికి మింగుడుపడని విషయం. నిస్సందేహంగా పతకాలు సాధిస్తారనుకున్న బాక్సర్లు నిఖత్ జరీన్, లవ్లీనా బోర్గొహైన్, బ్యాడ్మింటన్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ జోడీ, వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను తీవ్రంగా నిరాశపరిచారు. గత క్రీడల చాంపియన్ నీరజ్ చోప్రాకు మళ్లీ పసిడి పతకం ఖాయమని భావించారంతా. అయితే పాకిస్థాన్ త్రోయర్ అర్షద్ నదీమ్ నమ్మశక్యంకాని త్రో వేయడం నీరజ్ ఆశల్ని వమ్ముచేసింది. ఇక రెజ్లర్ వినేష్ ఫొగట్ సంగతి సరేసరి. 100 గ్రాముల అదనపు బరువు ఒక పతకాన్ని దూరం చేసింది. ఆ బౌట్‌లో ఆమె తలపడి నెగ్గివుంటే భారత్‌కు స్వర్ణం వచ్చిపడేది. ఇలా అనూహ్య పరాజయాలతో పతకాలు చేజార్చుకున్న వారి సంగతి అది. నాణేనికి మరోవైపు–స్వప్నిల్ కుశాలే వంటి ఆటగాళ్లు పతకాలతో అబ్బురపరచారు. మనుభాకర్ వ్యక్తిగతంగా ఒకటి, సరబ్‌జ్యోత్‌తో కలిసి మరో కాంస్యం సాధించగా, కుస్తీలో అమన్ సెహ్రావత్, పురుషుల హాకీ జట్టు కూడా పోడియంపై సగర్వంగా నిలిచారు. ఇక ఈసారి తెలుగు అథ్లెట్లు అంచనాలను అందుకోలేకపోయారు.

ఈ ఒలింపిక్స్ సన్నాహాల కోసం భారత ప్రభుత్వం సుమారు 470 కోట్ల రూపాయలు ఖర్చుచేసింది. అయినా ఫలితాలు ఆశించిన స్థాయిలో రాకపోవడం బాధాకరం. మొత్తం 92 జట్లలో మనం 71వ స్థానంలో ఉన్నాం. 2008 నుంచి జరిగిన ఐదు ఒలింపిక్స్‌లోనూ మన జట్టు ఇంతగా దిగజారింది లేదు. 2008లో 50, 2012లో 55, 2016లో 67, 2020లో 48వ స్థానంతో భారత్ పర్వాలేదనిపించింది. మన ఆటగాళ్ల ప్రదర్శన ఎంతోబాగున్నా పతకాలు రాకపోవడం బాధాకరమన్న వాదన ఒకటి వినిపిస్తోంది. ఒలింపిక్ పోటీల అంతిమలక్ష్యం పతకాల సాధన తప్ప మరోటికాదు. అలాంటప్పుడు ఎంత అద్భుతంగా ఆడినా పతకం రాకపోతే ఏం ప్రయోజనం? మనవాళ్ల శ్రమను తక్కువ చేయడం కాదు కానీ, అద్భుత ఆటకు–పతక సాధనకు మధ్య ఉన్న సన్నటిగీతను దాటగలిగితే కనీసం మరో అరడజను పతకాలు మనకు దఖలుపడేవి. ఏదేమైనా పారిస్ క్రీడల్లో భారత ఆటగాళ్ల ప్రదర్శన మాత్రం నిరుత్సాహకరమే. మిగతా ప్రపంచంతో పోలిస్తే మన క్రీడారంగం ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉందన్న వాస్తవం పారిస్ క్రీడల ద్వారా అవగతమవుతోంది. మరో నాలుగేళ్ల తర్వాత జరిగే లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లోనైనా భారత్ రెండంకెల స్కోరు సాధిస్తుందని ఆశిద్దాం.

వర్గీకరణ తీర్పు: భయాలు, నిజాలు!

షెడ్యూల్డు కులాల రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పుతో తలెత్తిన కొన్ని భయాలు, సంకోచాలను తొలగించడానికి బదులుగా అప్రధాన అంశాలపై చర్చలు జరుగుతున్నాయి. సామాజిక న్యాయ సిద్ధాంతాన్ని సమర్థించే పలువురు సైతం సుప్రీంకోర్టు తీర్పు ప్రస్తుతం అమలులో ఉన్న రిజర్వేషన్ల విధానాన్ని నీరుగార్చేట్టు ఉందని భావిస్తున్నారు. ఇది పూర్తిగా తప్పు. భారత ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్ స్వయంగా రాసిన మెజారిటీ తీర్పు, జస్టిస్ గవాయ్ రాసిన తీర్పును స్థూలంగా పరిశీలించినా అవి సామాజిక న్యాయంపై ప్రగతిశీల న్యాయశాస్త్ర ఆలోచనల స్ఫూర్తితో ఉండి, కుల అంతరాలను అంతమొందించాలనే లక్ష్య నిర్దేశిత 'అఫర్‌మేటివ్ యాక్షన్'ను సమర్థిస్తున్నాయి. నిచ్చెన మెట్ల కుల వ్యవస్థలో అట్టడుగున ఉన్న సామాజిక సమూహాల ఆందోళనలకు ప్రాధాన్యమిస్తూ సామాజిక న్యాయ అన్వేషణను సుప్రీంకోర్టు తీర్పు మరింత ప్రగాఢంచేసింది. సిజెఐ చంద్రచూడ్ 'సమగ్ర న్యాయం' సూత్రాన్ని విపులీకరిస్తూ ఎన్‌ఎమ్ థామస్ తీర్పు వారసత్వాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లారు. భవిష్యత్తులో 'ప్రతిభ' (మెరిట్) పేరిట 'అఫర్‌మేటివ్ యాక్షన్'ను కూల్చివేసేందుకు జరిగే ఎటువంటి ప్రయత్నాన్ని అయినా అడ్డకునే ఒక రక్షణ కుడ్యంగా సుప్రీంకోర్టు తీర్పు ఉపయోగపడుతుంది.

సుప్రీంకోర్టు తీర్పుపై వెల్లువెత్తిన పలు అనుచిత విమర్శల్లో కొన్నిటిని నిశితంగా చూద్దాం. మొదటిది న్యాయ– రాజ్యాంగపరమైన అభ్యంతరం. సుప్రీంకోర్టు తీర్పు పార్లమెంటు అధికార పరిధిని ఆక్రమించిందని పలువురు విమర్శించారు. ఇ.వి. చిన్నయ్య కేసు తీర్పులోని న్యాయ పరాయణత్వాన్ని ఈ విమర్శ పునరుద్ఘాటించింది. సుప్రీంకోర్టు ఎస్సీ రిజర్వేషన్లను ఉపవర్గీకరించడం లేదా అందుకు ఆదేశించడం గాని చేయలేదు. ఉప వర్గీకరణను ఎలా చేయాలి అన్న విషయంపై నిర్ణయాన్ని చట్ట సభలకు వదిలివేసింది. చట్ట సభల నిర్ణయాలను అమలుపరిచే బాధ్యతను ప్రభుత్వాలపై పెట్టింది. రిజర్వేషన్ల వర్గీకరణను రాజ్యాంగ అధికరణ 341 అనుమతిస్తుంది అన్న న్యాయ పరమైన స్పష్టీకరణ మాత్రమే చేసింది.

ప్రామాణికమైన ఆధారాలు లేకుండా సుప్రీంకోర్టు ఉప కోటా ఆదేశాన్ని జారీ చేయడం సరికాదనేది రెండో విమర్శ. జనాభాగణన ప్రక్రియ ప్రతి రాష్ట్రంలోను షెడ్యూల్డు కులాల, తెగల వ్యక్తులను లెక్కించడమే కాకుండా వారి వృత్తి వివరాలు, కుటుంబ అస్తుల వివరాలు, విద్యార్హతలను కూడా నమోదు చేస్తుంది. ప్రతి ఎస్సీకులంలోను ప్రతి 10,000 మందిలో గ్రాడ్యుయేట్లు, అంతకు మించిన విద్యార్హతలు ఉన్నవారు ఎంతమంది ఉన్నారో 2011 జనగణన సమాచారం అందుబాటులో ఉన్నది. వాస్తవాలు స్పష్టంగానే ఉన్నాయి. విద్యార్హతల పరంగా చూస్తే దళిత కులాలు ఒకే సమూహం (హోమోజీనస్)గా లేరు. ప్రస్తుత తీర్పుకు దారితీసిన వ్యాజ్యానికి కారణమైన పంజాబ్‌లో మఝాబి సిక్కులలో గ్రాడ్యుయేట్ల సంఖ్య హిందూ వాల్మీకి కులస్తుల కంటే తక్కువ. వాల్మీకి కులస్తులలో గ్రాడ్యుయేట్ల సంఖ్య రవిదాసీల్లో కంటే తక్కువ. బిహార్‌లోని భూయియా, ముసాహర్ కులాలలో పట్టభద్రులు సింగిల్ డిజిట్‌లో



ప్రస్తుత రిజర్వేషన్ల విధానాన్ని సుప్రీంకోర్టు తీర్పు నీరుగార్చేట్టు ఉందన్న వాదన పూర్తిగా తప్పు. ఈ తీర్పుపై విమర్శలు, డొంకతిరుగుడు నిందలు మండల్ ఉద్యమంలో అగ్రకులాల వారి రిజర్వేషన్ వ్యతిరేక వాదనలను గుర్తుచేస్తున్నాయి. ఉపకోటాను వ్యతిరేకించడం కాకుండా తీర్పులోని దీర్ఘకాలిక అంశాలకు ప్రాధాన్యమివ్వాలి. ఈ తీర్పును ప్రస్తుతానికి ఎస్టీలకు వర్తింపచేయకపోవడం మంచిది.

ఉన్నారు. తమిళనాడు మాదరి కులస్తులలో ఆ సంఖ్య 137, చక్కిలం కులస్తులలో 137, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ జంగం సామాజికులలో 106, యూపీలోని వాల్మీకి కులస్తులలో 115, పాసీలలో 145 మాత్రమే. కర్ణాటకలో 209మంది మాదిగ, మహారాష్ట్రలో 217 మంది మాంగ్ గ్రాడ్యుయేట్లు మాత్రమే ఉన్నారు. ఈ అంకెలను సదరు రాష్ట్రాలలోని ఇతర ఎస్సీ కులాలలోని ఉన్నత విద్యావంతుల సంఖ్యతో పోల్చితే ఈ అట్టడుగు స్థాయికులాల వారు తమకంటే పైస్థాయిలో ఉన్న తోటి కులస్తులతో ఎందుకు పోటీ పడలేరో మీకు అర్థమవుతుంది. ఆ అన్యాయాలను రూపుమాపవలసిన అవసరమున్నది.

ఉపవర్గీకరణ దళితులలో విభేదాలు, చీలికలకు దారితీస్తుందనేది మరో విమర్శ. నిజం చెప్పాలంటే విభిన్న ఎస్సీ కులాల సాంఘిక జీవితం, రాజకీయ ప్రాధాన్యాలలో ఇప్పటికే ఏకత్వమనేది లేనేలేదు. వారిలో సంఘీభావం ఎప్పుడో సమసిపోయింది.. వారి ప్రస్థానాలు విడివిడిగా సాగుతున్నాయి. వృత్తి సంబంధిత కార్యకలాపాల స్థాయిలో సర్దుబాట్లు, కలివిడి సంబంధాలను సృష్టించడమే వారిలో అంతర్గత ఐక్యత, సుహృద్భావం పునరుద్ధరణకు మార్గం. ఇదెలా రూపుదాల్చుతుంది? దళితులలో సాపేక్షంగా తక్కువ ప్రతికూలతల నెదుర్కొంటున్న కులాలు ఎక్కువ ప్రతికూలతలతో కునారిల్లుతున్న కులాల అభ్యున్నతికి ఉద్దేశించిన న్యాయ విహిత చర్యలను అంగీకరించడం ద్వారా సాధ్యమవుతుంది. దురదృష్టవశాత్తు ఉపకోటాపై పరోక్ష విమర్శలు ఆ సామరస్య సాధనను మృగ్యం చేసేవిగా ఉన్నాయి. అంతేకాదు, ఆ డొంకతిరుగుడు నిందలు మండల్ ఉద్యమ సందర్భంలో అగ్రకులాల వారి రిజర్వేషన్ వ్యతిరేక వాదనలను ప్రతిధ్వనిస్తున్నాయి.

ఈ అపార్థాలు, తప్పుడు అభిప్రాయాలను పక్కన పెడితేనే ఉపకోటా విషయమై తలెత్తిన కొన్ని భయాలు, ప్రతిబంధకాలను సవ్యంగా ఎదుర్కోగలుగుతాం. ఎస్సీ రిజర్వేషన్ల ఉపవర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన అనుమతిని అధికారపక్షం రాజకీయ లబ్ధికి ఉపయోగించుకునే అవకాశం ఉంది. ఓబీసీ రిజర్వేషన్ల వర్గీకరణను బీజేపీ ఇప్పటికే కొన్ని రాష్ట్రాలలో ఇలా దుర్వినియోగపరిచింది. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ విషయంలో అటువంటి సంభవనీయతను నివారించేందుకు సుప్రీంకోర్టు కొన్ని రక్షణలను కల్పించింది. వాస్తవమైన, లెక్కించదగిన సమాచారం ఆధారంగా మాత్రమే ఉప వర్గీకరణ జరగాలన్న కోర్టు నిర్దేశమే ఒక ప్రధాన రక్షణ. ఆ వాస్తవిక నిదర్శనాలు ఎలా ఉండాలో కూడా నిర్దుష్టంగా నిర్ణయించవలసిన అవసరమున్నది. జనగణన, ఆర్థికగణన సమాచారం ఇప్పటికే అందుబాటులో ఉన్నది. దేశవ్యాప్తంగా సంఘటిత రంగంలోని ఉద్యోగాలు, ఉన్నత విద్యా రంగ సంస్థలలో వివిధ సామాజిక వర్గాల వారు ముఖ్యంగా ఎస్సీల గణన కూడా చేపట్టవలసివున్నది.

ఈ ఉపవర్గీకరణను ఉన్నతోద్యోగాలకు అర్హులయిన అభ్యర్థుల సంఖ్యను తగ్గించేందుకు ఒక కారణంగా ఉపయోగించుకునే అవకాశం ఎంతైనా ఉన్నది. సరైన అభ్యర్థి లభించలేదన్న మిషతో తొలుత సదరు ఉద్యోగాల భర్తీని నిలిపివేసి, ఆ తరువాత వాటిని 'అన్ రిజర్వ్‌డ్'కు బదలాయించేందుకు ఆస్కారమున్నది. ఈ బదలాయింపును నివారించాలంటే, ఎస్సీ/ఎస్టీ ఉపశ్రేణుల కోటాలో భర్తీ చేయని ఉద్యోగాలను 'అన్ రిజర్వ్‌డ్' శ్రేణికి కాకుండా ఎస్సీ లేదా ఎస్టీలలోని మరో ఉపశ్రేణికి బదలాయించాలన్న నిబంధనను విధించాలి. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు



■ యోగేంద్ర యాదవ్

హఠాత్తుగా 'క్రీమీలేయర్' (సంపన్న శ్రేణి) నిబంధన వర్తింపచేయడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయి. దళితులలో సంపన్న శ్రేణిగా పరిగణింపదగిన వ్యక్తులు, కుటుంబాలు చాలా చాలా అరుదు. ఎస్సీ సమూహాలలో ఇప్పటికే 'క్రీమీలేయర్' ఏర్పడినట్టు నిర్ధారించేందుకు సామాజిక నిదర్శనాలు ఏవీ లేవు. ఒక తరం అనుభవించిన ప్రత్యేక హక్కులు, సదుపాయాలు, రక్షణలు, మరీ ముఖ్యంగా సామాజిక హోదా అనేవి తరువాయి తరానికి సంక్రమించాయా లేదా అన్న ప్రాతిపదికన క్రీమీలేయర్‌ను ధ్రువీకరించవలసివున్నది. సంపన్నశ్రేణిని దూరంపెట్టడం వల్ల అర్హులైన అభ్యర్థుల సంఖ్య బాగా తగ్గిపోయి, సంబంధిత ఉద్యోగ ఖాళీలను అన్‌రిజర్వ్‌డ్‌కి బదలాయించేందుకు దారి సుగమమవుతుంది. ఏడుగురు సభ్యుల ధర్మాసనం తీర్పులో ఆచరణాత్మకమైన అంశంగా, ఆదేశంగా 'క్రీమీలేయర్' అమలు లేదు. అయితే 'క్రీమీలేయర్' ప్రమాణాన్ని ఉపేక్షించిన సబ్ కోటా విధానాన్ని సవాల్ చేసేందుకు నలుగురు న్యాయమూర్తుల వ్యాఖ్యలను ఉపయోగించుకునే అవకాశం భవిష్యత్తులో ఎంతైనా ఉన్నది. అందువల్ల, సదరు నిబంధనపై అయోమయాన్ని తొలగించేందుకు పార్లమెంటు జోక్యం చేసుకోవల్సి రావడం అనివార్యం.

షెడ్యూలు కులాల రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పు షెడ్యూల్డు తరగతుల రిజర్వేషన్లపై చూపే ప్రభావాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవల్సి ఉంది. ఆ ప్రభావం ఒక విధంగా అనివార్యం. అధికరణలు 341, 342లపై భిన్న భాష్యాలు సరికాదు. అయితే ఎస్టీల విషయంలో అంతర్గత వ్యత్యాసాలు, రిజర్వేషన్ల తర్కం ఎస్సీల వ్యవహారాలలో కంటే గణనీయంగా భిన్నమైనవి. ఎస్సీ రిజర్వేషన్ల విషయంలో వెలువరించిన తీర్పును ఎస్టీ రిజర్వేషన్లకు వర్తింపచేయకుండా ఉండడమే ఉత్తమం. ఎస్టీ రిజర్వేషన్ల విషయంలో నిర్దిష్ట అంశాలపై దేశ సర్వోన్నత న్యాయస్థానం విచారణ జరిపే అవసరం, అవకాశం వచ్చేంతవరకు ఈ తీర్పును ఎస్టీ రిజర్వేషన్లకు వర్తింపచేయకుండా నిలిపివేయడమే వివేకవంతమవుతుంది.

ఉపకోటా భావనను వ్యతిరేకించడం కాకుండా సుప్రీంకోర్టు ఏడుగురు సభ్యుల ధర్మాసనం తీర్పులోని దీర్ఘకాలిక అంశాలకు సామాజిక న్యాయరాజకీయాలు, విధానాలు ప్రాధాన్యమివ్వాలి: దళితుల, గిరిజనుల ప్రస్తుత జనాభాకు అనుగుణంగా ఎస్సీ/ ఎస్టీ రిజర్వేషన్లను అధికం చేయాలి; రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని ఎత్తివేయాలి; సామాజిక న్యాయ సాధన మార్గాలను ప్రభుత్వ రంగం ఆవల కూడా వృద్ధిచేసి విస్తృతపరచాలి.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

(న్యాయవాది ప్రణవ్ ధావన్, జెఎన్‌యు పరిశోధక విద్యార్థి శివమ్ మోఘా సహకారంతో)

'రాజ్యాంగం పూతల' మీద 'దాడి' అవసరమే!

"అందరూ రాజ్యాంగ రక్షకులే! కానీ..." అనే నా వ్యాసం (జూలై 7) మీద, 'బడుగు భాస్కర్ జోగేష్' రాసిన 'రాజ్యాంగంపై 'కుడి ఎడమల' దాడి!'కి (జూలై 26) నా జవాబు ఇది.

(1) నేను "శ్రామిక ప్రజల ప్రయోజనాల వంకన" ఆ వ్యాసం రాసినట్టు జోగేష్ తేల్చారు. 'వంక' పెట్టుకుని రాసినా, 'ముసుగు' తగిలించుకుని రాసినా, రాజ్యాంగంలో వున్న సూత్రాలలోనే వున్న వర్గ వైరుధ్యాల్ని అవతలి వ్యక్తి ఎత్తి చూపినప్పుడు, ఆ విమర్శని అంగీకరించనివారు, ఆ సూత్రాలు ఎలా సరైనవో చెప్పాలి. అంతేగానీ, అవతలి వ్యక్తి 'కుట్రలు' చేసినట్టు ఆరోపించడం జవాబు అవ్వదు.

(2) నేను నా వ్యాసంలో ఎక్కడా 'అంబేడ్కర్' అన్న పేరే ప్రస్తావించలేదు. 'రాజ్యాంగ రచయితలు' అని బహువచనంతోనే అన్నాను. జోగేషేమో, అంబేడ్కర్ పేరుని నాలుగుసార్లు రాసి, "బాపూజీ కేవలం రాజ్యాంగ రచయితపైనే దోషమంతా నెట్టే పనికి పూనుకున్నారు" అని అంటున్నారు! అంబేడ్కర్ పేరుని నేను ఒక్కసారి కూడా ఎత్తనప్పుడు, రాజ్యాంగ రచనలో, తన పాత్ర గురించి, అంబేడ్కర్ స్వయంగా చెప్పిన విషయాల సారాంశాన్ని ఇక్కడ ప్రస్తావించడం అవసరం. (అంబేడ్కర్ రచనలు, 13, 15 సంపుటాల నించీ.)

అంబేడ్కర్ : "రాజ్యాంగం డ్రాఫ్టుని ఎంతో కష్టపడి తయారుచేసిన" బి.ఎన్.రావుకీ, ఎస్.ఎన్. ముఖర్జీకీ, వారి ఆఫీసు సిబ్బందికీ కృతజ్ఞతలు. అలా తయారైన డ్రాఫ్టుని, ఏడుగురు సభ్యుల కమిటీ పరిశీలించింది. కమిటీ చేసిన పని ఏమిటంటే, "అసెంబ్లీ కార్యాలయం తయారు చేసిన రాజ్యాంగం డ్రాఫ్టుని పరిశీలించడమూ, అవసరమైన మార్పులు సూచించడమూనూ" (అంబేడ్కర్ రచనలు, సంపుటి–13, పేజీ–29). "నన్ను అందరూ రాజ్యాంగాన్ని తయారు చేసినవాడిగా (మేకర్ ఆఫ్ ది కాన్‌స్టిట్యూషన్) అంటారు. నా జవాబు ఏమిటంటే, నేను ఒక కిరాయి మనిషిగా (హాక్) ఉండినాను. నన్ను ఏమి చెయ్యమంటే అది చేశాను. నా ఇష్టానికి వ్యతిరేకంగా చాలా చేశాను." (సంపుటి–15, పేజీ–860).



నేను చేసింది కుట్ర కాదు. శ్రామికవర్గ ప్రజల (ప్రత్యేకించి ఖైర్లాంజీ దళిత బాధితుల) ప్రయోజనాలకి వ్యతిరేకమైన 75 ఏళ్ళ వయసున్న రాజ్యాంగం మీద, 75 ఏళ్ళ వయసున్న పౌరుడిగా నేను చేసిన విమర్శే 'దాడి' అయితే, 'రాజ్యాంగం పూతల' మీద ఆ దాడి అత్యవసరమే!

(3) 'భూమినీ, ఇతర కీలక పరిశ్రమలనీ జాతీయం చేయాలని' అంబేడ్కర్ కోరుకున్నారని జోగేష్ వాదన. అంబేడ్కర్ వ్యక్తిగత అభిప్రాయాలను నేను ప్రస్తావించనే లేదు. అలాంటప్పుడు, నేనేదో అన్యాయంగా అంబేడ్కర్‌ని విమర్శించినట్టు జోగేష్ రాయడం అసందర్భం. దానికి నా జవాబు ఏమిటంటే, అంబేడ్కర్ గారి కోరిక అదే అయితే, "మొత్తం ప్రైవేటు ఆస్తిని నష్టపరిహారాలు లేకుండానే జాతీయం చెయ్యడానికి ఈ రాజ్యాంగం వీలు నివ్వదనీ" అందుకే 'సోషలిస్టులు, ఈ రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తున్నారు' అనీ, అంబేడ్కర్, సోషలిస్టుల్ని ఎందుకు విమర్శించారు? (సంపుటి –13, పేజీ–1210).

(4) ఆస్తి హక్కుకి సంబంధించిన "ఆర్టికల్ 31 పరమ వికృతమైన అంశం. దాని వంక చూడడమే నాకు పరమ అసహ్యం" అని అంబేడ్కర్ తన ఆవేదనని 1955 మార్చి 19న ప్రసంగంలో వ్యక్తం చేశారని జోగేష్ వివరణ. మరి, ఆ ఆర్టికల్‌ని చేర్చినది 1949లో గదా? అప్పుడు నెహ్రూ మంత్రివర్గంలో అంబేడ్కర్ న్యాయశాఖా మంత్రిగా ఉన్నారు గదా? ఆయనకి ఆ ఆర్టికల్ మీద అంత 'పరమ అసహ్యం' ఉంటే, మంత్రి పదవికి రాజీనామా చేసి బయటికి రావాలి గదా? రాజీనామా చేయడానికి 1951 సెప్టెంబరు 27 దాకా ఆగడమా?

(5) నా వ్యాసంలో, రాజ్యాంగ రచనలో అంబేడ్కర్ పాత్ర గురించి ఒక్క మాటంటే ఒక్క మాట రాయకపోయినా, నేను కుట్రపూరితంగా ఆ వ్యాసం రాశానని ఆరోపిస్తున్నారు జోగేష్ ఇలా: "రాజ్యాంగ రచనలో అంబేడ్కర్ పాత్రనూ, రాజ్యాంగ విశ్వసనీయతనూ ఏకకాలంలో దెబ్బతీయటం... బాపూజీ ఏకైక లక్ష్యంగా కనిపిస్తున్నది!" అని నా విమర్శని కుట్రలాగా చిత్రించారు జోగేష్! నా విమర్శకు ప్రేరణ, ఆంధ్రజ్యోతిలో, గుంటూరు ఏసుపాదం అనే కవి రాసిన 'ఖైర్లాంజీ' అనే దీర్ఘ కవిత. ఖైర్లాంజీ అనే గ్రామంలో, ఆ గ్రామంలోని కొందరు ఓబీసీలు, ఒక దళిత కుటుంబంలోని తల్లీ కూతుళ్ళను అతి దారుణంగా అత్యాచారానికి గురిచేసి, కొడుకుల్ని హింసించి, అందరినీ అతి క్రూరంగా హత్య చేసిన సందర్భంలో రాసిన కవిత అది. ఆ కవితలో, ఆ కవి ఇలా అంటాడు: "రాజ్యాంగం పూతలకు, రాకాసి పుండ్లు మానవని తెలుసు/ పునాదిలేని పునరుత్థానాలు పచ్చి అబద్ధాలని తెలుసు/ తెలిసి తెలిసీ, మనుధర్మాన్ని ప్రశ్నిస్తూ/ మనువాదులతో మంతనాలు!... రిజర్వేషన్ల పేర, వనరులన్నీ నరాధములకే వదిలి/ జోలె మాత్రం మా మెడలకు తొడిగి/ నిత్య పరాధీనత్వంలో/ మమల్నిలా పాతరేసి పోవడాలు/ సారీ అంబేడ్కర్/ యూ ఆర్ ఎ ఫెయిల్యూర్!" – ఇదీ దళిత సామాజిక నేపథ్యం నించీ వచ్చిన ఆ కవి రాసినది!

(6) "ఈ కుట్రలను గ్రహించలేని దశను భారతీయ దళిత, పౌరసమాజం ఎప్పుడో దాటిపోయిందని వ్యాస రచయిత గ్రహించాలి!" అని జోగేష్ నాకు హెచ్చరిక చేశారు. దళిత సమాజానికంతా తానే ప్రతినిధిగా చెప్పుకుంటున్నారు జోగేష్! కానీ దళిత మేధావులలో, నాయకులలో అనేకులు ఈ నాడు, పాలకవర్గ పార్టీల అనుచరులుగానే మసులుతున్నారు. అలా లేని వారు చాలా అరుదు. అలాంటి వారి గురించి, ఏసుపాదం కవితలో ఇలా ఉంది: "ఎటు చూసినా/ దళిత దళారీ/ దళిత బూర్జువా/ పీడిత జన విమోచనకు వీళ్ళా సారథులు/ వారసులు?!"

ఇంతకీ నేను చేసింది కుట్ర కాదు. శ్రామికవర్గ ప్రజల (ప్రత్యేకించి ఖైర్లాంజీ దళిత బాధితుల) ప్రయోజనాలకి వ్యతిరేకమైన 75 ఏళ్ళ వయసున్న రాజ్యాంగం మీద, 75 ఏళ్ళ వయసున్న పౌరుడిగా నేను చేసిన విమర్శే 'దాడి' అయితే, 'రాజ్యాంగం పూతల' మీద ఆ దాడి అత్యవసరమే!

○ బి.ఆర్. బాపూజీ

పరిశ్రమల్లో భద్రతలేని కార్మికులు

పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాలు, వాటిలో మృతిచెందిన కుటుంబాలకు చెల్లించే పరిహారంలో ప్రభుత్వం సమన్యాయం పాటించడం లేదు. కొద్ది రోజుల క్రితం ఎన్టీఆర్ జిల్లాలో ప్రమాదం జరిగినా, గత నెలలో అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో ఒకరు మరణించినా, 2023 జూన్‌లో జరిగిన ప్రమాదంలో ఆరుగురు చనిపోయినా, 2022 జూన్ మూడున, ఆగస్టు 2న సీడ్స్ వస్త్ర పరిశ్రమలో విష వాయువులు లీకై 539 మంది అస్వస్థతకు గురై ఆస్పత్రిపాలైనా, వీటన్నిటికీ భద్రతా వైఫల్యమే కారణం.

విషాదకర విషయమేమంటే, ప్రమాదాలు జరిగిన ఏ పరిశ్రమ యజమానిపైనా కఠిన చర్యలు లేకపోవడం. చనిపోయిన తరువాత డిమాండ్‌ను బట్టి మృతుని కుటుంబానికి పరిహారం చెల్లిస్తున్నారు తప్ప, మనిషి ప్రాణం పోకుండా భద్రతా ప్రమాణాలు పాటించడానికి, కార్మికులకు పని ప్రదేశాల్లో రక్షణ పరికరాలు ఇవ్వడానికి యాజమాన్యాలు ఇష్టపడడం లేదు. ప్రభుత్వ విధానాల్లోని లోపాలు, అలుసుతనం యాజమానులకు వరంగా మారాయి. ప్రమాదాలు జరగకుండా, జరిగినా ప్రాణ, ఆస్తి నష్టం భారీగా జరగకుండా అధునాతన సాంకేతిక ఆటోమేటిక్ వ్యవస్థలను బలోపేతం చేయడానికి యాజమాన్యాలు ముందుకు రావడం లేదు.

పరిశ్రమాధిపతుల కోసం 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' పేర కార్మిక శాఖ, కాలుష్య నియంత్రణ మండలి, పరిశ్రమల శాఖ తనిఖీ విభాగ అధికారుల కాళ్లు, చేతులు ప్రభుత్వం కట్టేస్తోంది. ఇప్పటికే పరిశ్రమలను ప్రోత్సహించే పేరుతో కార్మిక ప్రయోజనాలను పూర్తిగా విస్మరించి యాజమానులకు దండిగా లాభాలు పోగుచేసుకొనే వెసులుబాటు కల్పిస్తోంది. ఈ క్రమంలో యజమాన్యం ఏ తప్పు చేసినా వెనుకేసుకురావడం, సమర్థించడం తప్ప లోపాలను సరిచేసే ప్రయత్నం గానీ, ప్రమాదాలు జరగకుండా తనిఖీలు పెంచి, నియంత్రించే చర్యలు గానీ చేపట్టడం లేదు. ఫలితంగా ప్రభుత్వ అండ చూసుకొని రక్షణను యాజమాన్యాలు పట్టించుకోవడం మానేస్తున్నాయి. చనిపోయిన కార్మికుడికి కుటుంబం ఉంటుంది. వారిపై ఆధారపడి బతికే తల్లిదండ్రులు, భార్యాబిడ్డలుంటారన్న మానవీయత ప్రదర్శించడంలేదు. ప్రమాద స్థలం నుంచి తప్పించుకొనే మార్గాలు లేకపోవడం, ఫార్మా పరిశ్రమల్లోనూ, ఇతర పరిశ్రమల్లోనూ ప్రమాద నియంత్రణ వ్యవస్థలు ఏర్పాటుచేయకపోవడం, నిర్వహణ సరిగా చూడకపోవడం, పని ప్రదేశాల్లో అర్హత, నైపుణ్యం కల్గిన వ్యక్తులను నియమించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. తమ ప్రాంతాల్లో పని లేకపోవడం, వ్యవసాయం, ఇతర అనేక సమస్యలతో ఉపాధి కోసం వలసలు వెళ్తున్న కార్మికులకు అంతరాష్ట్ర వలస కార్మికుల చట్టం–1979 ప్రకారం చట్ట పరమైన రక్షణ, సదుపాయాలు ప్రభుత్వాలు కల్పించాలి. కార్మికులకు కనీస వసతులు, సరైన పని పరిస్థితులు, మంచినీరు, క్యాంటీన్, మరుగుదొడ్లు, విశ్రాంతి గదులు ఏర్పాటుచేయాలి. వలస కార్మికుల నియామకం, రవాణా, నివాసం, కనీస వేతనం వంటి సమాచారాన్ని క్రమం తప్పకుండా నమోదు చేయాలని చట్టం చెబుతోంది. ఈ చట్ట ప్రయోజనాలేవీ వలస కార్మికులు పొందడంలేదు. చీకటి గదిలో పది మంది, కొన్నిచోట్ల అంతకంటే ఎక్కువ మంది కార్మికులు ఉంటున్నారు. ఎంత మంది ఎక్కడ నుంచి వచ్చారన్న గణాంకాలు కార్మికశాఖ సేకరించడం లేదు. కానీ అతిథి కార్మికుల పేరుతో వలస కార్మికులకు వసతి సౌకర్యాలన్నీ కేరళలో వామపక్ష ప్రభుత్వం వర్తింపజేస్తోంది.

ప్రతీ పరిశ్రమలో విధిగా సేఫ్టీ ఆడిట్ జరగాలి. ప్రభుత్వ శాఖలు నిర్వహించే తనిఖీల్లో రాజకీయ నాయకుల జోక్యం లేకుండా ఉండాలి. సేఫ్టీ ఆడిట్ లోపాలను తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో నోటీసు బోర్డులో ప్రదర్శించాలి. ప్రమాద నియంత్రిత, హెచ్చరిక వ్యవస్థలు ఏర్పాటుచేయాలి. ఆ వ్యవస్థల నిర్వహణ, పనితీరు సామర్థ్యంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి. కార్మికుల భద్రత, రక్షణ, వేతనాలు, పర్యావరణ అంశాల్లో అంతర్జాతీయ ప్రమాణాలను పాటించని పరిశ్రమలకు ఇచ్చే రాయితీలు రద్దుచేసి అంతకుముందు పొందిన రాయితీలను రాబట్టాలి. అర్హత కల్గిన వారిని పని ప్రదేశాల్లో నియమించాలి. ప్రమాదాల నివారణ, ప్రాణాపాయం నుంచి బయటపడే మార్గాలపై కార్మికులకు శిక్షణ ఇవ్వాలి. పరిశ్రమలకు అందుబాటులో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మించి తక్షణమే మెరుగైన వైద్య సౌకర్యం లభించే చర్యలు తీసుకోవాలి.

– రొంగలి రాము, సిఐటియు నాయకులు

లేని హక్కుల కోసం జగన్ ఆరాటం!

'నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు' అనే నానుడి వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డికి అక్షరాల వర్తిస్తుంది. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి 2024 మేలో జరిగిన ఎన్నికలలో కేవలం 11 సీట్లు మాత్రమే గెలుచుకొన్న తనకు అసెంబ్లీలో ప్రధానప్రతిపక్ష నాయకుడి హోదా కట్టబెట్టాలంటూ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుకు జగన్ ఓ లేఖ సంధించారు. ఆ లేఖలో తన రాజకీయ అజ్ఞానాన్ని ప్రదర్శిస్తూ గడుసుగా "ప్రధాన ప్రతిపక్షనాయకుడి హోదా ఇవ్వాలంటే సంఖ్యాపరంగా ప్రధాన ప్రతిపక్షానికి మొత్తం సీట్లలో 10 శాతం సీట్లు పొందాలన్న నిబంధన ఎక్కడా లేదు గదా?" అంటూ స్పీకర్‌ను ప్రశ్నించారు. అయితే 10 శాతం సీట్లు పొందకపోయినా ఫలానా సందర్భంలో, ఫలానా రాష్ట్ర అసెంబ్లీలో, ఫలానా పార్టీ అధినేతకు ప్రధాన ప్రతిపక్ష నేతగా స్పీకర్ అవకాశం కల్పించారు అనే ఉదాహరణను మాత్రం ఏ ఒక్కటీ చూపలేకపోయారు. కారణం– అటువంటి సంప్రదాయాన్ని ఏ స్పీకరూ ఏ రాష్ట్రంలోనూ పాటించిన దాఖలాలు లేకపోవడమే. ఎప్పుడైతే తన లేఖకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు నుంచి తక్షణ స్పందన లభించలేదో, వెంటనే జగన్ తనకు లేని హక్కుల్ని సాధించుకోవాలనే మొండి వైఖరితో.. తనకు అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడి హోదా కల్పించాలని స్పీకర్‌ను ఆదేశించాల్సిందిగా హైకోర్టులో ఓ కేసు వేశారు.

అసెంబ్లీలో ప్రధానప్రతిపక్ష నాయకుడి హోదా లేకపోయినా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో 1994–99 మధ్య కాలంలో పి. జనార్దన్‌రెడ్డి కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నేతగా ఎంతో సమర్థవంతంగా తన బాధ్యతను నిర్వర్తించారని చరిత్ర తెలిసినవారు చెప్పినా, జగన్ వాటిని తలకెక్కించుకోవడం లేదు. ప్రజలిచ్చిన తీర్పును శిరసావహించి.. వారు అప్పజెప్పిన పాత్రను పోషించడం ఉత్తమం అని సొంత పార్టీలో హితవు చెప్పేవారు ఉన్నట్టు లేదు.

అసెంబ్లీకి రాకుండా తప్పించుకోవడానికి జగన్ ఆడుతున్న డ్రామాలు ప్రజలకు అర్థమవుతూనే ఉన్నాయి. చంద్రబాబునాయుడుతో ప్రమాణస్వీకారం చేయించిన తర్వాత ప్రొటెం స్పీకర్ తనను పిలిచి ప్రమాణం చేయించలేదంటూ తొలి రోజే ఓ అభియోగం మోపారు. నిజానికి, జగన్ అప్పటికింకా వైసీపీకి నాయకుడిగా ఎన్నికే కాలేదు. అయినా, ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నాడనే గౌరవంతో నాటి ప్రొటెం స్పీకర్ బుచ్చయ్య చౌదరి మంత్రులతో ప్రమాణ స్వీకారం చేయించిన వెంటనే జగన్‌కు అవకాశం కల్పించారు. పైగా, అసెంబ్లీ ప్రధాన ద్వారం నుంచి లోపలికి రావడానికి సంప్రదాయం లేకున్నా, జగన్ కారును అనుమతించారు. అందుకుగాను జగన్ ఈ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలపాలి. కానీ, జగన్‌కు అంతటి సహృదయత ఎక్కడుంది?

జూలై 22న శాసనసభ, మండలిని ఉద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగిస్తున్న సమయంలో జగన్, ఆయన పార్టీ సహచర సభ్యులు సభలో కాసేపు నినాదాలు ఇచ్చి నిష్క్రమించారు. గవర్నర్ ప్రసంగాన్ని బహిష్కరించడానికి వారు చూపిన కారణం ఎన్డీఏ కూటమి ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన 30 రోజుల్లో 36 మంది వైసీపీ కార్యకర్తలు హత్యలకు గురయ్యారని, 200 మందికి పైగా తీవ్రంగా గాయాలపాలయ్యారని, 300 పైబడి దాడి సంఘటనలు జరిగాయని.. కనుక, ఆంధ్రప్రదేశ్‌లో శాంతి భద్రతల్ని కాపాడడానికి తక్షణం రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం హింసకు పాల్పడిన ఘటనలను జాతీయ స్థాయిలో రాజకీయ పార్టీల నేతలకు, మీడియాకు తెలియబరచడానికి ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఓ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపతిముర్ము, ప్రధాని నరేంద్రమోదీలను కలిసి విజ్ఞాపన పత్రాలు అందించి రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలన్న డిమాండ్ చేస్తామని తెలియజేశారు. అయితే, వారి ఢిల్లీ పర్యటన కాస్తా సెల్ఫ్‌గోల్ వేసుకున్నట్లయింది.

జగన్మోహన్ రెడ్డి 2012లో సొంత పార్టీని ఏర్పాటు చేసుకున్నారు. 2009లో కాంగ్రెస్ పార్టీ నుంచి లోక్‌సభ సభ్యునిగా గెలిచారు. ఈ 15 ఏళ్లల్లో రెండు పర్యాయాలు లోక్‌సభ సభ్యునిగా, ఎమ్మెల్యేగా గెలిచి ఐదేళ్లపాటు ప్రధాన ప్రతిపక్ష నేతగా, ఇంకో ఐదేళ్లు రాష్ట్ర ముఖ్యమంత్రిగా, ఓ ప్రాంతీయ పార్టీకి అధ్యక్షునిగా ఉన్నారు. ఇంత అనుభవం కలిగి, ఇన్ని పదవులు నిర్వహించినా... ఎదుటి పక్షంపై తీవ్రమైన ఆరోపణలు చేసినపుడు అందుకు తగిన సాక్ష్యాధారాలు సమర్పించాలన్న కనీస స్పృహ ఆయనలో లోపించడం ఆశ్చర్యం. ఏపీలో చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చాక.. కొన్ని సమస్యాత్మక నియోజకవర్గాలలో చెదురుమదురు సంఘటనలు, ఒకట్రెండు చోట్ల దాడులు జరిగిన మాట నిజమే. అయితే, 36 హత్యలు జరిగాయన్నది గాలిపోగేసి చెప్పిన మాటే తప్ప, అందులో వాస్తవం లేదు. నిజానికి తమ కార్యకర్తలు ఎంత మంది హత్యకు గురయ్యారో ఆ పార్టీ నేతలకే లెక్క తెలియదు. ఒకరు 31 హత్యలని, మరొకరు 36 అనీ అన్నారు. స్వయంగా జగన్ ఢిల్లీ మీడియాతో మాట్లాడుతూ "మోర్‌దేన్ 30 మర్డర్స్" అంటూ ఓ అస్పష్టమైన ఫిగర్ చెప్పారు. హత్యలకు గురయిన వారి వివరాలు, సమాచారం ఏదీ వారివద్ద లేదు. జాతీయ స్థాయిలో ఇంతటి తీవ్రమైన ఆరోపణ చేసి.. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి రెండు నెలలు కూడా పూర్తి చేసుకోని ప్రభుత్వాన్ని రద్దు చేసి, రాష్ట్రపతి పాలన విధించాలన్న డిమాండ్ చేసేటప్పుడు అందుకు తగిన సమాచారాన్ని కనీసం మీడియాకైనా ఇవ్వాలని, స్వయంగా మీడియాను నడుపుతున్న వారికి తట్టకపోవడం వారి అజ్ఞానానికి పరాకాష్ఠ. ఎప్పుడైతే, వైసీపీ డొల్లతనాన్ని అధికార తెలుగుదేశం పార్టీ, కొందరు విశ్లేషకులు ఎత్తిచూపారో, ఆ దెబ్బకు రెండు రోజులపాటు ఢిల్లీలో ధర్నా చేయాలనుకొన్నవారు... గోడకు కొట్టిన బంతిలా అదే రోజు ధర్నా చాపచుట్టేసి వెనక్కొచ్చేశారు. రాష్ట్రపతి, ప్రధాన మంత్రులను కలవడానికి మొహాలు చెల్లుబాటు కావు కనుక.. మౌనంగా ఉండిపోయారు. నిజానికి, రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం వచ్చాక జరిగిన ఐదారు హత్యలలో తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులే ముగ్గురు ఉన్నారు.

జగన్ అసెంబ్లీలో మొహం చూపించడానికి భయపడుతున్నారు. అందుకు ప్రధాన కారణం– పాలక ఎన్డీయే, ప్రత్యేకించి తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబును ఎదుర్కొనే ధైర్యం ఆయనలో లోపించడమే. గత ఐదేళ్లల్లో జగన్ ప్రభుత్వం చేసిన పాపాల్ని రాష్ట్ర ప్రభుత్వం ఏడు శ్వేత పత్రాల రూపంలో ప్రజల ముందుంచింది. నిజానికి, తాము ఎటువంటి పొరపాట్లు చేయలేదని జగన్ నమ్ముతుంటే, ఆ అంశాల్నే సభ ముందుంచి తన వాదనను గట్టిగా వినిపించవచ్చు. అందుకు ప్రతిపక్ష నాయకుడి హోదానే ఆయనకు ఉండనక్కర్లేదు. వైసీపీ ఫ్లోర్ లీడర్‌గా సభలో జగన్‌కు ఖచ్చితంగా అనేక అవకాశాలు లభిస్తాయి. వివిధ అంశాలపై చర్చించడానికి పలు మార్గాలు ఉంటాయి. పైగా, ఫ్లోర్ లీడర్‌కు శాసన సభలో ముందు వరుసలోనే సీట్లు కేటాయించే సంప్రదాయం ఉంది. ఈ అంశాలన్నీ పరిగణనలోకి తీసుకుంటే.. తనను సభలో ఏదో ఒక మూలన కూర్చోమంటారని ఆయన ఊహించుకోవడంలో వాస్తవం లేదు.



జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని ఐదేళ్లు పాలించినా, ఆయనకు ప్రజాస్వామ్యం అంటే ఏమిటో తెలియదు. రాజ్యాంగం మీద అవగాహన లేదు. సంప్రదాయాలను గౌరవించాలనే స్పృహలేదు. ఇప్పటికీ ఓటమిని అంగీకరించలేని నైజం ఆయన మాటల్లో, హావభావాల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ప్రజాతీర్పును, ప్రజల విజ్ఞతను ఆయన తక్కువగా అంచనా వేస్తున్నారు.

జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని ఐదేళ్లు పాలించినా, ఆయనకు ప్రజాస్వామ్యం అంటే ఏమిటో తెలియదు. రాజ్యాంగం మీద అవగాహన లేదు. సంప్రదాయాలను గౌరవించాలనే స్పృహలేదు. ఇప్పటికీ ఓటమిని అంగీకరించలేని నైజం ఆయన మాటల్లో, హావభావాల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ప్రజాతీర్పును, ప్రజల విజ్ఞతను ఆయన తక్కువగా అంచనా వేస్తున్నారు. ప్రజలు ఛీత్కరించే స్థాయిలో తనను ఓడించారని గ్రహించలేకపోతున్నారు. ఓటమి తర్వాత ఒకట్రెండుసార్లు మీడియా సమావేశాలలో పాల్గొన్న జగన్, తనకు ఎదురైన ఓటమికి గల కారణాలను విశ్లేషించుకొంటామని, తప్పుల్ని సరిదిద్దుకొంటామని చెప్పలేకపోయారు. ఇది జగన్ మార్కు రాజకీయం. ఇటువంటి వైఖరి గలిగిన ఆయన భవిష్యత్తులో నిర్మాణాత్మకంగా వ్యవహరిస్తారని భావించలేం. అసత్యాలు, గోబెల్స్ తరహా దుష్ప్రచారాలతో రానున్న రోజుల్లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి తలనొప్పులు తెచ్చిపెడతారనడంలో అతిశయోక్తి లేదు. ఈ నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేస్తూ వారికి ఎప్పటికప్పుడు వాస్తవాలను తెలియజేయడమే చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వానికి ఉన్న ఏకైక మార్గం.

● సి. రామచంద్రయ్య
శాసనమండలి సభ్యులు



పవిత్ర సంగమం మళ్లీ నాటి పవిత్రతను సంతరించుకోనుంది. కృష్ణా-గోదావరి నదీ సంగమంలో నవ హారతికి పూర్వవైభవం రానుంది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక బ్రేక్ పడిన ఈ పవిత్ర కార్యక్రమాన్ని పునఃప్రారంభించేందుకు టీడీపీ కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. నవ హారతులను ప్రారంభించడంతో పాటు నూతన ఆలయ నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

నిత్యనూతనంగా..

నవ హారతి

ఫెర్రి వద్ద కృష్ణా-గోదావరి హారతి త్వరలో పునఃప్రారంభం



పవిత్ర సంగమం వద్ద నవ హారతులు (ఫైల్)

మొత్తం ఆరు పంట్లు సిద్ధం చేస్తున్న అధికారులు



నవ హారతిపై మంత్రులు, కలెక్టర్ సమీక్ష

- పవిత్ర సంగమం వద్ద ఆలయం నిర్మాణానికి ప్రతిపాదన
- 2016 కృష్ణా పుష్కరాల్లోనే నవ హారతికి శ్రీకారం
- వైసీపీ వచ్చాక హారతుల కార్యక్రమం రద్దు
- కళావిహీనంగా మారిన సంగమ ప్రాంతం

ఇన్నాళ్లకు మళ్లీ పునర్వైభవం దిశగా..

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : ఇబ్రహీంపట్నంలోని ఫెర్రి వద్ద గోదావరి-కృష్ణా పవిత్ర సంగమానికి మళ్లీ పూర్వవైభవం రానుంది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో 2016-అక్టోబరులో కృష్ణా పుష్కరాల సందర్భంగా పవిత్ర సంగమం వద్ద కృష్ణా నిత్య హారతుల కార్యక్రమాన్ని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. రాజమహేంద్రవరం వద్ద గోదావరి హారతిని స్ఫూర్తిగా తీసుకుని ఇక్కడ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా పవిత్ర సంగమం ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేశారు. దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిత్యం నవ హారతులు ఇచ్చేవారు. నంది, ఓంకార, నాగ, కుంభ, సింహ, సూర్య, చంద్ర, పంచ, నక్షత్ర హారతులు ఇచ్చేవారు. 2019 వరకు ఈ కార్యక్రమం నిర్విరామంగా కొనసాగింది. నిత్యం వేలాది మంది భక్తులు ఇక్కడికి వచ్చి కృష్ణా హారతిని వీక్షించేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ కార్యక్రమానికి బ్రేక్ పడింది.

కళావిహీనంగా సంగమం

ఫెర్రి వద్ద కృష్ణా-గోదావరి నదులు కలిసే సంగమాన్ని పవిత్రంగా భావిస్తారు. అలాంటి సంగమం నుంచే దుర్గమ్మకు హారతులు అందజేస్తే మంచి జరుగుతుందన్న ఉద్దేశంతో ఇక్కడ నిత్య కృష్ణా హారతిని ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక పవిత్ర సంగమం వద్ద హారతి కార్యక్రమాన్ని నిలిపివేయడంతో ఇక్కడకు వచ్చే పర్యాటకుల తాకిడి తగ్గింది. నిర్వహణ లేక పవిత్ర సంగమం కళ తప్పింది. నదిలోకి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన మెట్లు ధ్వంసమయ్యాయి. అతిథిగృహాలు నిరుపయోగంగా మారిపోయాయి. ఈ ప్రాంతం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది.

పూర్వవైభవం దిశగా అడుగులు

పవిత్ర సంగమం వద్ద నెల రోజుల్లో 'కృష్ణమ్మ హారతి' కార్యక్రమాన్ని పునఃప్రారంభించనున్నట్లు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి తెలిపారు. దీంతో ఈ ప్రాంతం పూర్వవైభవం సంతరించుకోనుంది. ఇప్పటికే ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం పవిత్ర సంగమంలో జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభించింది. పర్యాటకంగా కూడా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు సమాయత్తమవుతోంది. ఇక్కడ తిరుమల తిరుపతి దేవస్థానం లేదా దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఓ ఆలయాన్ని నిర్మించాలన్న యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. ఈ ప్రాంతాన్ని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కృష్ణా హారతి కోసం ఆరు పంట్లను ఏర్పాటు చేయనున్నారు. 10 సెట్ల హారతులు అవసరం ఉందని అధికారులు గుర్తించారు. 13 మంది అర్చకులు, వారికి సహాయకులుగా 20 మంది సిబ్బందిని దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం అధికారులు సిద్ధం చేస్తున్నారు. వీలైనంత త్వరగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని, త్వరలోనే జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తిచేసి మిగిలిన పనులు చేపట్టనున్నట్లు కలెక్టర్ సృజన తెలిపారు.

నగరంలో చియాన్



తంగలాన్ చిత్ర ప్రమోషన్‌లో భాగంగా నటుడు చియాన్ విక్రమ్ సోమవారం నగరంలో సందడి చేశారు. ఓ హోటల్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 15న చిత్రం ఐదు భాషల్లో విడుదలవుతుందని, శివపుత్రుడు, అపరిచితుడు, ఐ, నాన్న చిత్రాలను తెలుగు ప్రేక్షకులు ఎంతో ఆదరించారని, తంగలాన్ చిత్రాన్ని కూడా ఆదరించాలని కోరారు. ఇదొక ఎమోషనల్ సినిమా అని, కుటుంబ సమేతంగా చూడొచ్చన్నారు. హీరోయిన్ మాళవిక మోహనన్ మాట్లాడుతూ విక్రమ్‌తో నటించడం చాలా సంతోషంగా ఉందన్నారు. తెలుగులో తాను నటించిన మరో చిత్రం ఈ ఏడాది చివర్లో విడుదలవుతుందన్నారు. నటుడు డేనియల్ మాట్లాడుతూ తంగలాన్ చిత్రంలో తాను మెయిన్ విలన్‌గా కనిపిస్తానన్నారు. తొలుత గాంధీనగర్‌లోని బాబాయ్ హోటల్‌లో చిత్ర యూనిట్ అల్పాహారం ఆరగించింది. చిత్ర యూనిట్‌తో సెల్ఫీలు దిగేందుకు అభిమానులు చుట్టుముట్టారు. - విజయవాడ కల్చరల్

మినరల్ మాయ

మినరల్ వాటర్ ప్లాంట్లలో కొనుగోలు చేసే మంచినీళ్లు సురక్షితమేనా? నిజంగానే ప్యూరిఫైర్ చేసిన వాటర్‌ను విక్రయిస్తున్నారా? అసలు వీటిలో నాణ్యతా ప్రమాణాల మాటేంటి? ఈ మధ్యకాలంలో ఇబ్బడిముబ్బడిగా పుట్టుకొస్తున్న ప్లాంట్లకు నిజంగానే అనుమతులున్నాయా? వ్యాపారమే పరమావధిగా వెలుస్తున్న ఈ మినరల్ వాటర్ ప్లాంట్లపై అధికారుల పర్యవేక్షణ ఎంతవరకు ఉంది? ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు సమాధానం వెతికినా దొరకదు. విజయవాడ సహా జగ్గయ్యపేట వంటి ప్రాంతాల్లో డయేరియా ప్రబలడానికి మినరల్ వాటర్ తాగడమే ప్రధాన కారణమని చెబుతున్న అధికారులు సదరు ప్లాంట్ల కట్టడికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ప్రజారోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టడమేనని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



మినరల్ వాటర్ ప్లాంట్లలో నీరు సురక్షితమేనా?

- ప్రజారోగ్యాన్ని పణంగా పెట్టేలా ప్లాంట్ల నిర్వహణ
- పట్టించుకోని అధికాలు
- మినరల్ ప్లాంట్ల మ్యాపింగ్‌కు ఆదేశాలిచ్చినా చర్యలు శూన్యం
- గ్రామాలకూ పాకుతున్న మినరల్ వాటర్ ప్లాంట్లు
- ట్రస్టుల పేరుతో భారీగా ఏర్పాటు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఇటీవల విజయవాడ నగరంతో పాటు జగ్గయ్యపేట తదితర ప్రాంతాల్లో డయేరియా ప్రబలటానికి కారణం మినరల్ వాటరేనని అధికార యంత్రాంగం స్పష్టం చేస్తోంది. మినరల్ వాటర్ తాగిన వారికి అస్వస్థత కలిగింది. దీనిని బట్టి మినరల్ వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు ప్రజారోగ్యం కంటే కూడా తమ వ్యాపారానికే ఎక్కువ ప్రాధాన్యమి ఎస్తున్నారని తెలుస్తోంది.



వాటర్ క్యాన్లను చేత్తోనే శుభ్రం చేస్తూ..

అనుమతుల్లో అవినీతి

మినరల్ వాటర్ ప్లాంట్లకు అనుమతులనేవి పట్టణాల్లో అయితే కార్పొరేషన్‌లోని ప్రజారోగ్యశాఖ పరిధిలోనూ, గ్రామీణ ప్రాంతాల్లో అయితే పంచాయతీల పరిధిలోనూ ఇస్తారు. అయితే, ముడుపులు అందుకుంటున్న చాలామంది అధికారులు ఇబ్బడిముబ్బడిగా అనుమతులిచ్చేస్తున్నారు. ఆ తర్వాత.. మినరల్ వాటర్ ప్లాంట్లు ప్రమాణాలతోనే పనిచేస్తున్నాయా? నీటి పరీక్షలు జరుగుతున్నాయా? మినరల్ వాటర్ ఆరోగ్యకరమైనదేనా? బాటిళ్ల ప్యాకింగ్‌లో మినరల్ వాటర్ తయారీకి అవసరమైన పద్ధతులు పాటిస్తున్నారా? లేదా? అనే పరిస్థితి లేకుండా పోతోంది. నగరాలు, పట్టణాల్లో కార్పొరేషన్, మున్సిపాలిటీ ప్రజారోగ్య శాఖలు కానీ, గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ సిబ్బంది కానీ తనిఖీలు చేస్తున్న ఉదంతాలే లేవు. విజయవాడ, మచిలీపట్నం నగరాలతో పాటు పట్టణాల్లో 200కుపైగా మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటుచేసినట్టు సమాచారం. వీటిలో చాలావరకు అనధికారికమే. కృష్ణానదీ పరివాహక ప్రాంతంలో పెనమలూరు వరకు అనధికారికంగా ప్లాంట్లు నడుస్తున్నాయి.

ట్రస్టుల పేరుతో..

గ్రామీణ ప్రాంతాల్లోనూ మినరల్ వాటర్ ప్లాంట్ల ఏర్పాటు పెద్ద ఎత్తున జరుగుతోంది. వీటిలో చాలావరకు ట్రస్టుల పేరుతో ఏర్పాటుచేసినవే. ట్రస్టుల పేరు చెబితే త్వరగా అనుమతులు రావటంతో పాటు కొన్నిరకాల ప్రయోజనాలు కలుగుతాయి. ఏడెనిమిదేళ్లలో ఇలాంటివి భారీ సంఖ్యలో ఏర్పాటయ్యాయి.

పారిశుధ్యం అధ్వానం

మినరల్ వాటర్ ప్లాంట్ల నిర్వహణ ఘోరంగా ఉంటోంది. పారిశుధ్యం మచ్చుకు కూడా కనిపించట్లేదు. మినరల్ వాటర్ బాటిల్స్ శుభ్రత సక్రమంగా జరగట్లేదు. సాధారణంగా మినరల్ వాటర్ బాటిళ్లను ఒకసారి ఉపయోగించిన తర్వాత వేడినీటితో శుభ్రం చేయాలి. కానీ, అలా జరగటం లేదు. కొన్నిచోట్ల అయితే నాలుగైదు రోజులకోసారి బాటిళ్లు శుభ్రం చేస్తున్నారు. నీటిని క్యాన్‌లో నింపిన తర్వాత సీల్ వేయాలి. అలాకాకుండా మార్కెట్‌లో లభించే సాధారణ సీల్స్‌ను వాడేస్తున్నారు. పదేపదే వాటినే రీ సైకిల్ చేస్తున్నారు.

మినరల్ కాంపోనెంట్స్ విషయంలో అశ్రద్ధ

మినరల్ వాటర్ తయారీకి ఉపయోగించే కాంపోనెంట్స్ మిశ్రమం విషయంలో నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇలాంటి వాటివల్ల రక్షిత మంచినీరు విషతుల్యమవుతోంది. కాంపోనెంట్స్‌ను నిర్దీత ప్రమాణంలో కాకుండా ఎక్కువ కలుపుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

లెక్కాపత్రమేదీ..?

ఉమ్మడి జిల్లాలో ఎన్ని మినరల్ వాటర్ ప్లాంట్లు ఉన్నాయన్న లెక్క కూడా అధికారుల వద్ద లేదు. రాష్ట్ర విభజనకు ముందు ఉన్న రికార్డులు తప్ప.. ఆ తర్వాత సవరించింది లేదు. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లాలో మినరల్ వాటర్ ప్లాంట్లకు సంబంధించి యంత్రాంగం ఓ అడుగు ముందుకేసింది. ప్లాంట్లను మ్యాపింగ్ చేయాలని ఆదేశించింది. దీనివల్ల మినరల్ వాటర్ ప్లాంట్ల లెక్క తెలియటంతో పాటు వీటిపై నిత్యం నిఘా వేసే అవకాశం ఉంటుంది. తనిఖీలు నిర్వహించే అవకాశం కలుగుతుంది. ప్రజలకు రక్షిత మంచినీటిని అందించే వీలు కలుగుతుంది. అయితే, క్షేత్రస్థాయిలో మ్యాపింగ్ లోపభూయిష్టంగా జరుగుతోంది. ఇకనైనా రెండు జిల్లా యంత్రాంగాలు మినరల్ వాటర్ ప్లాంట్లపై సీరియస్‌గా దృష్టి సారించకపోతే ప్రజారోగ్యం పడకేసే ప్రమాదం ఉంది.

రూ. కోట్లు ఆశచూపి కొట్లాట..!


రూ.2 కోట్ల విలువైన నాణెం ఉందని మాయమాటలు

- కడప నుంచి విజయవాడ రప్పించి ఘర్షణ
- ముగ్గురిని లాడ్జిలో నిర్బంధించి చిత్రహింసలు
- 14 మందిని అరెస్టు చేసిన పోలీసులు

వన్‌టౌన్, ఆగస్టు 12 : కోట్ల విలువైన రామలక్ష్మణ్ నాణెం పేరిట మోసం చేయడమే కాకుండా, ముగ్గురిని కడప నుంచి రప్పించి, నిర్బంధించి, బెదిరించిన ఘటన నగరంలో సోమవారం వెలుగుచూసింది. ఈ కేసులో గవర్నర్‌పేట పోలీసులు 14 మందిని అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. కడపలోని నాగరాజు పేటకు చెందిన రాజేంద్ర మొబైల్స్ వ్యాపారం చేస్తున్నాడు. అతనికి రెండు నెలల క్రితం తిరుపతిలోని ఒక రెస్టారెంట్‌లో అన్నమయ్య జిల్లాకు చెందిన నరసింహ పరిచయమయ్యాడు. తన వద్ద రామలక్ష్మణ్ కెమికల్ నాణెం ఉందని, అది రూ.2 కోట్ల విలువ చేస్తుందని చెప్పాడు. దానికి నగిషీ చేయటానికి రూ.3 లక్షలు అవుతుందని రాజేంద్రను కోరాడు. ఆ తర్వాత వారిద్దరూ మదనపల్లిలో కలిశారు. అనుమానం వచ్చిన రాజేంద్ర.. తనకు నాణెం చూపించాలని నరసింహను కోరాడు. ఆ సమయంలో ఇద్దరి మధ్య చిన్న గొడవ జరిగింది. ఆ తరువాత ఎవరి దారిన వారు వెళ్లిపోయారు. అనంతరం వాట్సాప్ ద్వారా నాణెం వీడియోను పంపించిన నరసింహ.. అది కావాలంటే విజయవాడ రావాలని చెప్పాడు. ఇది నమ్మిన రాజేంద్ర మరో ఇద్దరితో కలిసి సోమవారం ఉదయం కడప నుంచి విజయవాడ వచ్చాడు. నరసింహకు ఫోన్ చేయగా, తాను రాయనపాడు చెరువు దగ్గర ఉన్నానని, అక్కడకు రమ్మన్నాడు. గతంలో గొడవ పడినప్పుడు తన ఫోన్ తీసుకున్నావని, దానిని ఇవ్వమని నరసింహ.. రాజేంద్రను కోరాడు. దీంతో ఇద్దరి మధ్య మళ్లీ గొడవ జరిగింది. ఈ క్రమంలో నరసింహ మరో 14 మందితో కలిసి రాజేంద్రను, అతనితో వచ్చిన ఇద్దరిని కొట్టారు. ముగ్గురిని బలవంతంగా కారులో ఎక్కించుకుని ఓ లాడ్జిలో బంధించి, మళ్లీ కొట్టారు. రాజేంద్ర భార్యకు ఫోన్‌చేసి రూ.30 లక్షలు ఇస్తే వదిలిపెడతామని, లేకపోతే చంపేస్తామని బెదిరించారు. ఈ విషయాన్ని రాజేంద్ర తన బావకు మెసేజ్ చేయగా, ఆయన 112 కాల్ ద్వారా పోలీసులకు విషయం తెలియజేశారు. వెంటనే స్పందించిన పోలీసులు లాడ్జికి వెళ్లి రాజేంద్రను, అతని స్నేహితులను కాపాడారు. రాజేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరసింహ (26), భవానీపురానికి చెందిన ప్రవీణ్ అలియాస్ సన్నీ (25), దినేష్ (24), విద్యాధరపురానికి చెందిన బూరి రాజేశ్ (25), రాయనపాడుకు చెందిన ధీరజ్ (24), విద్యాధరపురానికి చెందిన సొహైల్ అర్షద్ (23), రాయనపాడుకు చెందిన స్వాగత్ (23), గోనాడ, సీతారామ్, పాండు, నాని, సందీప్, సాంబ, సాయి, సత్య తదితరులను అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో పలువురిపై కేసులు ఉన్నాయి.

తగ్గిన ప్రవాహం

- దాదాపు ఐదడుగుల మేర తగ్గిన వరద నీటిమట్టం



విజయవాడ, ఆంధ్రజ్యోతి : కృష్ణానదికి వరద ప్రవాహం తగ్గుతూ వస్తోంది. ఎగువనున్న నాగార్జున సాగర్ ప్రాజెక్టు నుంచి నీటి విడుదల నిలిచిపోవడంతో పులిచింతల ప్రాజెక్టు గేట్లను కిందికి దించేశారు. ఇన్‌ఫ్లో లేకపోవడంతో సోమవారం ఉదయం ప్రాజెక్టు గేట్లను కిందికి దింపేశారు. ప్రస్తుతం పులిచింతల ప్రాజెక్టులో 35.23 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రకాశం బ్యారేజీకి ఉదయం 6 గంటలకు 95,625 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. మధ్యాహ్నానికి 92,452 క్యూసెక్కులకు తగ్గింది. బ్యారేజీ గేట్లలో 40 గేట్లను రెండడుగులు, 30 గేట్లను అడుగు మేరకు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు 71,650, 3 గంటలకు 47,450, 6 గంటలకు 43,800, రాత్రి 9 గంటలకు 78,500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కాల్వలకు 13,952 క్యూసెక్కుల నీటిని ఇస్తున్నారు. కేఈబీకి 1601, బందరు 801, ఏలూరు 1404, రైవస్ 4619, కేఈమెయిన్ 8425, కేడబ్ల్యూకి 5527 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా, శనివారం సాయంత్రం పులిగడ్డ వద్ద ఆక్విడెక్ట్‌ను, నాగాయలంక శ్రీరామపాదక్షేత్రం వద్ద కృష్ణవేణి మాత విగ్రహాన్ని తాకుతూ వరద ప్రవహించింది. దాదాపు 3 లక్షల క్యూసెక్కుల వరదనీరు ఆదివారం దిగువకు ప్రవహించగా, సోమవారం శ్రీరామపాదక్షేత్రంలో సాధారణ స్థితికి చేరుకుంది. మరో రెండు రోజులపాటు ప్రకాశం బ్యారేజీ నుంచి కనీసం 50 వేల క్యూసెక్కుల మేర వరద రావొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

రంగస్థల రారాజు ఆచంట

» తెలుగు భాషకు పద్య నాటకాలే ప్రాణం : వెంకయ్య నాయుడు » తుమ్మలపల్లిలో ఆచంట వెంకటరత్నం కాంస్య విగ్రహావిష్కరణ

విజయవాడ కల్చరల్, ఆగస్టు 12 : తెలుగు సినీరంగంలో ఎన్టీఆర్ రారాజు అయితే.. తెలుగు రంగ స్థలంలో ఆచంట వెంకటరత్నం నాయుడు రారాజు అని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు అభివర్ణించారు. తుమ్మలపల్లి కళాక్షేత్రం ఆవరణలో సోమవారం ప్రముఖ రంగస్థలనటుడు కళారత్న, ఆచంట వెంకటరత్నం నాయుడు కాంస్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆచంట వెంకటరత్నంనాయుడు వందకు పైగా వివిధ రకాల పాత్రలు పోషించి అద్భుతంగా నాడు రాణించారని కొనియాడారు. ఆచంట విగ్రహావిష్కరణకు మారుమూల ప్రాంతాల నుంచి తరలివచ్చిన పద్యనాటక ప్రియులను చూస్తే తెలుగు పద్య నాటకానికి మరింత భవిష్యత్తు వుందనే విషయం తెలుస్తుందన్నారు. తెలుగు భాష బ్రతకాలంటే ప్రత్యేకంగా ఏమీ చేయాల్సిన అవసరం లేదని, ఇంట్లో తల్లిదండ్రులు పిల్లల చేత తెలుగు మాట్లాడిస్తే సరిపోతుందన్నారు. పిల్లల్ని ఇంగ్లీషు మీడియంలో చేర్పించి ఇంట్లో ఇంగ్లీషులోనే మాట్లాడాలని షరతు పెట్టినప్పుడు భావితరాలు తెలుగు భాషకు దూరమవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు మదర్ టంగ్ అని, తమిళం, మళయాళం ఇలాంటి భారతీయ భాషలు బ్రదర్ టంగ్ అని, ఇంగ్లీష్ అదర్ టంగ్ అని చలోక్తి విసిరారు. తనకు పౌరాణిక తెలుగు పద్యాలు అంటే ఎంతో ప్రీతికరమని, రంగస్థలం నటుడు పద్మశ్రీ ఎడ్ల గోపాలరావును వేదికపైకి ఆహ్వానించి తనకి ఇష్టమైన సత్య హరిశ్చంద్ర పౌరాణిక నాటకంలోని పద్యాలని అడిగి మరీ పాడించుకొని సంతోషభరితులయ్యారు. కందుల దుర్గేష్ సాంస్కృతికశాఖ మంత్రిగా పరిపూర్ణ న్యాయం చేయగలరనే నమ్మకం తనకు వుందన్నారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, కవులు, కళాకారులు, రచయితల సమస్యలు, వారి సంక్షేమానికి.. సాంస్కృతిక శాఖ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. రాజమండ్రి దేవీచౌక్‌లో ఒక విజయదశమి నాడు పౌరాణిక పద్య నాటకాలు ఏర్పాటు చేయగా వేలాది మంది ప్రేక్షకులు తరలివచ్చారని, వేదికపై రాజకీయ ప్రసంగాలు చేయబోయిన నాయకులను 'పద్యనాటకాలు చూడటానికి వచ్చామని, మీ ప్రసంగాలు కోసం కాదని' ప్రేక్షకులు అడ్డుకున్నారని గుర్తుచేశారు. నాటి నుంచి ప్రతిభ కల నాటకాలు ప్రదర్శిస్తే ప్రజలు ప్రోత్సహిస్తారనే నమ్మకం కలిగిందన్నారు. వాటిని ఆచరణలో పెట్టడానికి నాకు అవకాశం వచ్చిందన్నారు. సభాధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, తెలుగు కవులు, రచయితలు, కళాకారులకు గత ప్రభుత్వంలో ఏ విధమైన ఆదరణ లభించలేదని, వాళ్లందరూ అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి చొరవ తీసుకొని రావాల్సిన రూ.4 కోట్ల పాత బకాయిలను చెల్లించేలా కృషి చేయాలని కోరారు. అదేవిధంగా తెలుగు దేశం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏడు అకాడమీలకు తిరిగి పునరుజ్జీవం చేసే బాధ్యత మంత్రి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతి సమితి అధ్యక్షులు గోళ్ల నారాయణరావు, అంబటి మధు మోహనకృష్ణ, వేముల హజరత్తయ్య గుప్తా, సిల్వెస్టర్, చివుకుల హరగోపాల్, రావి వెంకట్, చింతా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. బి.రూపశ్రీ, జీఎన్‌డీ కృష్ణసాయిలు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన అలరించింది. ప్రముఖ రంగస్థల నటుడు పీవీఎస్ కృష్ణ ప్రదర్శించిన మయసభలోని దుర్యోధన ఏకపాత్రాభినయం రక్తికట్టించింది.



తుమ్మలపల్లి కళాక్షేత్రం ఆవరణలో అచంట వెంకటరత్నం నాయుడు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన వెంకయ్యనాయుడు, చిత్రంలో మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తదితరులు



కళాకారిణి నృత్య ప్రదర్శన



దుర్గగుడిలో హుండీల నగదు లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈవో రామారావు

దుర్గమ్మకు హుండీ కానుకల ఆదాయం రూ.2,97,47,668

వన్‌టౌన్, ఆగస్టు 12 : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానంలో భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలను ఆలయంలోని మహామండపం 6వ అంతస్తులో సోమవారం లెక్కించారు. 18 రోజులకుగాను అమ్మవారికి కానుకల రూపేణా రూ.2,97,47,668 నగదు సమకూరింది. రోజుకు సగటున రూ.16,62,648 చొప్పున కానుకలు వచ్చినట్టుగా ఆలయ అధికారులు ప్రకటించారు. బంగారం 410 గ్రాములు, వెండి 5 కిలోల 280 గ్రాములు భక్తులు హుండీలలో సమర్పించారు. కాగా హుండీలలో విదేశీ కరెన్సీ 681 యుఎస్ఎ డాలర్లు, 875 ఆస్ట్రేలియా డాలర్లు, 20 ఇంగ్లండ్ పౌండ్లు, 3.5 ఓమన్ రియాల్స్, 9 ఖైంసాలు, 35 కెనడా డాలర్లు, 765 అరబ్ దిర్హమ్‌లు, 30 యూరోలు, 62 మలేషియా రింగ్గిట్స్, 107 సౌదీ రియాల్స్, 50 సౌతాఫ్రికా ర్యాండ్స్, 280 థాయిలాండ్ భట్స్, 17 కతార్ రియాల్స్ కానుకల రూపంలో వచ్చాయి. ఈవో కేఎస్ రామారావు, డిప్యూటీ ఈవో లీలాకుమార్, దేవదాయ శాఖ అధికారులు, ఏఈవోలు, ఆలయ సిబ్బంది, ఎస్‌పీఎఫ్ సిబ్బంది, వన్‌టౌన్ పోలీస్ సిబ్బంది పర్యవేక్షణ చేశారు. ఆలయ సిబ్బంది అమ్మవారి సేవాదారుల బృందం లెక్కింపులో పాల్గొన్నారు. కాగా ఆన్‌లైన్ ఈ.హుండీ ద్వారా మరో రూ.56,320 కానుకలు వచ్చాయి.



పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ సృజన, తదితరులు

అవగాహనతో హెచ్ఐవీ నివారణ

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన



మొగల్రాజపురం, ఆగస్టు 12 : హెచ్ఐవీ పట్ల ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని, క్రమశిక్షణతో కూడిన జీవన విధానంతోనే ఆ మహమ్మారిని అరికట్టడం సాధ్యమవుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన చెప్పారు. జాతీయ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సంస్థ, వైద్య ఆరోగ్య శాఖల సంయుక్త అధ్వర్యంలో పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో హెచ్ఐవీ అండ్ ఎస్టీఐ అవగాహనలో భాగంగా 'మీకు తెలుసా' పేరుతో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ, గత 30 సంవత్సలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన చర్యల వల్ల సమాజంలో హెచ్ఐవీ వ్యాప్తిని 86కు తగ్గించడం జరిగిందన్నారు. అప్పట్లో 'పులిరాజుకు ఎయిడ్స్ వస్తుందా' అన్న ఒక్క నినాదం ప్రజల్లోకి విస్తృతంగా చొచ్చుకెళ్లిందన్నారు. ప్రస్తుతం 'మీకు తెలుసా' కార్యక్రమం ద్వారా ఎయిడ్స్ ఎలా సంక్రమిస్తుంది, ఎలా వ్యాపిస్తుంది, నివారణ మార్గాలు, వ్యాధి పరీక్షలు నిర్వహించుకోవడం, వైద్యసేవలు పొందడం, కండోమ్ వాడకం, వ్యాధి నివారణపై చర్చా గోష్ఠి నిర్వహించడం, టోల్ ఫ్రీ నెంబరు 1097 ద్వారా సహకారం పొందడం, వైరల్ లోడ్ తగ్గించడం, మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక ప్రచార పద్ధతుల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడం వంటి చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కామేశ్వరప్రసాద్ మాట్లాడుతూ, 'మీకు తెలుసా' కార్యక్రమం ద్వారా ప్రతివారం ఒక థీమ్‌ను తీసుకుని 8 వారాల పాటు ప్రచారం చేసి ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం పోస్టర్‌లను కలెక్టర్ విడుదల చేసి సభలో ప్రతిజ్ఞ చేయించారు. నృత్యరూపకాలు, ఫ్లాష్ మాబ్ ప్రదర్శించారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు పలు స్వచ్ఛంద సేవల సంస్థల నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

17 నుంచి ఐఆర్‌సీటీసీ యాత్ర

రైల్వేస్టేషన్, ఆగస్టు 12 : ఐఆర్‌సీటీసీ భారత్ గౌరవ ఎక్స్‌ప్రెస్‌లో ఈనెల 17 నుంచి సప్త జ్యోతిర్లింగ దర్శన యాత్రను నిర్వహిస్తోంది. ఈమేరకు ఐఆర్‌సీటీసీ సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, సోమనాథ్, భీమశంకర్, త్రయంబకేశ్వర్, ఘృష్ణేశ్వర్, నాగేశ్వర్, ద్వారకా దేవాలయాలను ఈ యాత్ర కవర్ చేస్తుంది. విజయవాడలో ఈనెల 17న రైలు బయలుదేరనుంది. 28వ తేదీ వరకు 11 రాత్రులు, 12 పగళ్ల వ్యవధిలో యాత్ర సాగుతుంది. సికింద్రాబాద్, కాజీపేట, వరంగల్, ఖమ్మం, మధిర, డోర్నకల్ జంక్షన్, మహబూబాబాద్, కామారెడ్డి, భోంగీర్, నిజామాబాద్, ధర్మాబాద్, ముద్‌కేడ్, నాందేడ్, పూర్ణ స్టేషన్లలో హాల్ట్ ఉంటుంది. ఈ యాత్రకు సంబంధించిన మరిన్ని వివరాలను ఐఆర్‌సీటీసీ, టూరిజం వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు. 9281030714, 92811495848 ద్వారా కూడా సంప్రదించవచ్చు. యాత్రలో పాల్గొనేవారు ఎకానమీ కేటగిరి స్లీపర్‌కు జీఎస్టీ సహా రూ.20,590, థర్డ్ ఏసీ రూ.33,015, కంఫర్ట్ కేటగిరి సెకండ్ ఏసీ కోసం రూ.43,355 చెల్లించవలసి ఉంటుంది.





ధ్వంసమైన శిలాఫలకాన్ని పరిశీలిస్తున్న టీడీపీ, వైసీపీ నాయకులు

శిలాఫలకం ధ్వంసంపై ఫిర్యాదు

అవనిగడ్డ, ఆగస్టు 12 : అవనిగడ్డ-కోడూరు రహదారి నిర్మాణం కోసం వైసీపీ ప్రభుత్వ హయాంలో వేసిన శిలాఫలకం అనుమానాస్పదస్థితిలో ధ్వంసం కావటంపై నియోజకవర్గ నేతలు అధికారులకు ఫిర్యాదు చేశారు. అవనిగడ్డ-కోడూరు ఆర్ అండ్ బీ ప్రధాన రహదారి నిర్మాణం కోసం నాటి ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌బాబు శంకుస్థాపన చేయగా, సోమవారం ఉదయం శిలాఫలకం పడిపోయి కనిపించింది. దీనిని కావాలనే పడవేసి ఉంటారని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి శిలాఫలకాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని వైసీపీ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, కో-ఆప్షన్ సభ్యులు తదితరులు కోరారు.

పడగొట్టే సంస్కృతి మాది కాదు : టీడీపీ నేతలు

శిలాఫలకాలు పడగొట్టే సంస్కృతి తమది కాదని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, జిల్లా నేత బండే రాఘవ అన్నారు. శంకుస్థాపన శిలాఫలకం 20 రోజుల క్రితం పడిపోయి దానిచుట్టూ పిచ్చిమొక్కలు మొలిచాయని, శిలాఫలకాన్ని ఎవరో కావాలని పడవేశారని విమర్శలు చేయటం వైసీపీ దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. ప్రతీ విషయాన్ని రాజకీయం చేయటం మానుకోవాలని బచ్చు రఘునాథ్, యలవర్తి ఆది, కొల్లూరి ఇమ్మానియేలు తదితరులు హితవు పలికారు.

ఉయ్యూరులో అన్న క్యాంటీన్ పరిశీలన

» 15న ప్రారంభించనున్న ముఖ్యమంత్రి



ఉయ్యూరు : ఉయ్యూరులో అన్నక్యాంటీన్‌ను ఈనెల 15 సాయంత్రం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్న నేపథ్యంలో స్థానిక శివాలయం రోడ్డులో పరిసరాలను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు పెనమలూరు, ఎమ్మెల్యే బోడె ప్రసాద్, అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఏర్పాట్లపై సూచనలు చేశారు.

మీకోసం అర్జీలు పరిష్కరించండి

» కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కార వేదిక(మీకోసం) కార్యక్రమంలో అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. 'మీకోసం' కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశపుహాలులో అధికారులతో కలిసి ప్రజలనుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వివిధ శాఖల్లో కోర్టు ధిక్కరణ కేసులు ఎనిమిది ఉన్నాయని, వాటికి ప్రాథమికదశలోనే కౌంటర్లు దాఖలు చేయాలన్నారు. ఈనెల 20వతేదీన జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంపై అవగాహన కల్పించే పోస్టర్‌లను కలెక్టర్ ఆవిష్కరించారు. నులిపురుగుల నివారణ మాత్రలను పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థులకు పంపిణీని విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. మీకోసం కార్యక్రమంలో 94అర్జీలను ప్రజలు సమర్పించారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్వో శ్రీదేవి, ఆర్డీవో ఎం.వాణి, జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో ఆనందకుమార్, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, డీఎస్‌వో పార్వతి, డీపీవో నాగేశ్వరనాయక్, డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయి, సీపీవో గణేష్ వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రజలనుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బాలాజీ

రెవెన్యూ సదస్సులు నిర్వహించండి

జిల్లాలో ఈనెల 15వతేదీనుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లుచేయాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సోమవారం జూమ్‌కాన్ఫరెన్స్ నిర్వహించారు. రీసర్వే జరగని, భూమిసమస్యలు అంతగాలేని గ్రామాల్లో తొలివిడతగా రెవెన్యూ సదస్సులు నిర్వహించాలన్నారు. భూమి విభజన, సబ్‌డివిజన్ చేయడం తదితర అంశాలపై అర్జీలు వస్తాయని, వీటిపై ప్రధానంగా దృష్టిసారించాలన్నారు. ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఈ సమావేశంలో పాల్గొన్నారు.

సహజ వనరులను కాపాడుకుందాం

» నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ ట్రస్టు సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 12 : రాష్ట్రంలోని ఐదేళ్ల వైసీపీ పాలనలో దోచుకున్న వనరుల పరిరక్షణపై దృష్టి సారిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఢిల్లీలో నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ ట్రస్టు సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. కేంద్ర గనులు, బొగ్గు శాఖామంత్రి కిషన్‌రెడ్డి, అణుశాఖ సహాయ మంత్రి జితేంద్రసింగ్, కేంద్ర మైనింగ్ శాఖ సహాయ మంత్రి సతీష్ చంద్రదూబేల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో రవీంద్ర మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లోని పరిస్థితిని వివరించారు. రాష్ట్రంలో అపారమైన సహజ, విభిన్నమైన ఖనిజ వనరులు ఉన్నాయని, వాటిని సరైన మార్గంలో వినియోగించుకుంటే రాష్ట్రాభివృద్ధి చెందుతుందన్నారు. మినరల్స్ తవ్వకాలకు 2 శాతం సినరేజి ఫీజు నిర్ణయించారన్నారు. ఆ సొమ్మునే రాష్ట్ర ఖనిజ అన్వేషణకు వినియోగిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని మైనింగ్ కార్యకలాపాలపై సమగ్ర నిఘా కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి సాయం కావాలని కేంద్ర గనులుశాఖ కార్యదర్శి కాంతారావును కోరారు. ఆంధ్రప్రదేశ్‌కు 972 కి.మీ తీర ప్రాంతం ఉందని, తీరప్రాంతంలో వనరుల అన్వేషణకు కేంద్రం సహకరించాలన్నారు. పాలీమెటాలిక్ నోడ్యూల్స్, పాలీమెటాలిక్ సల్ఫైడ్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆఫ్‌షోర్ మైనింగ్ యాక్టు 2002కు సవరణలు వచ్చాయన్నారు. ఆఫ్‌షోర్ ఖనిజాలు ఉన్న ప్రాంతాలను వేలం వేయడానికి కేంద్ర ప్రభుత్వం వీలు కల్పించడంపై చర్చించారు. ఆఫ్‌షోర్ మైనింగ్ వేలంలో పాల్గొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇందుకుగాను సిబెడ్ మైనింగ్ కార్పొరేషన్ ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలన్నారు. ఈ సందర్భంగా అస్సాం మైన్స్ అండ్ మినరల్ డెవలప్‌మెంట్ శాఖా మంత్రి జోగల్ మోహన్, చత్తీస్‌ఘడ్ ఆరోగ్య శాఖా మంత్రి శ్యామ్‌బీహారీ జైస్వాల్, గుజరాత్ పరిశ్రమల శాఖా మంత్రి బల్వంత్‌సింగ్ రాజ్‌పుత్‌లతో మంత్రి రవీంద్ర చర్చలు జరిపారు.



మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

లక్ష్యాల సాధనపై దృష్టి సారించండి

» ఉపాధి హామీ, రెవెన్యూ సదస్సులు, ఈ-పంట నమోదుపై దృష్టి పెట్టండి

» సమన్వయంతో గ్రీవెన్స్‌ను పరిష్కరించండి

» బడిఈడు పిల్లలను గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన వీడియో కాన్ఫరెన్స్

కృష్ణలంక, ఆగస్టు 12 : ఉపాధి హామీ పనుల లక్ష్యాల సాధన, రెవెన్యూ సదస్సుల నిర్వహణ ఇ పంట నమోదులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, శాఖల సమన్వయంతో ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, బడిమానిన పిల్లలను గుర్తించి బడిలో చేర్పించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అధికారులకు సూచించారు. ఉపాధి హామీ, రెవెన్యూ సదస్సులు, గ్రీవెన్స్ పరిష్కారం, డ్రాప్ అవుట్ పిల్లల గుర్తింపు, ఇ-పంట, హౌసింగ్, విలేజ్ డెవలప్‌మెంట్ ప్లాన్ తదితర అంశాలపై సోమవారం జిల్లా కలెక్టర్ జి.సృజన నగరంలోని విడిది కార్యాలయం నుంచి జిల్లా అధికారులతో కలిసి డివిజన్ మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉపాధి హామీ పనుల నిర్వహణలో నిర్దేశించిన లక్ష్యాల సాధనపై క్షేత్రస్థాయిలో అధికారులు దృష్టి సారించాలన్నారు. ఈనెల 16వ తేదీ నుంచి జిల్లావ్యాప్తంగా రెవెన్యూ సదస్సులను నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించాలన్నారు. అంతర్‌శాఖలు, క్షేత్రస్థాయి అధికారులు సమన్వయంతో ప్రజాసమస్యలను నిర్దిష్టమైన స్పష్టతతో పరిష్కరించాలన్నారు. వీడియో కాన్ఫరెన్సులో జిల్లా జాయింట్‌కలెక్టర్ నిధిమీనా, అసిస్టెంట్ కలెక్టర్ శుభం కుమార్, డిప్యూటీ కలెక్టర్ ఇ.కిరణ్మయి, డీఆర్వో వి.శ్రీనివాసరావు, డ్వామా పీడీ జె.సునీత, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డీఈఓ యు.వి.సుబ్బారావు, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, పంచాయతీరాజ్ ఎస్ఈ ఎ.వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ డీవీ రమణ, హౌసింగ్ పీడీ రజని కుమారి, డీఎస్‌వో మోహన్‌బాబు, జిల్లా వ్యవసాయ అధికారిణి ఎస్.నాగమణెమ్మ, డీపీవో శివప్రసాద్ యాదవ్, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ఉషారాణి, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ జె.సుమన్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన, జేసీ నిధి మీనా



అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వండి : జేసీ

కృష్ణలంక, ఆగస్టు 12 : ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను పారదర్శకంగా నిర్దిష్టమైన స్పష్టతతో అర్జీదారుడు సంతృప్తి చెందేవిధంగా శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ నిధి మీనా అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా జేసీ, అసిస్టెంట్ కలెక్టర్ శుభం కుమార్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, జిల్లా పౌరసరఫరాలశాఖ డీఎం జి.వెంకటేశ్వర్లు, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఇ.కిరణ్మయి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిధి మీనా మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలపై అలసత్వం ప్రదర్శించకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. అర్జీదారుడు ఎదుర్కొంటున్న సమస్యలను బాధ్యతతో పరిష్కరించాల్సిన అవసరం వుందన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

100 టన్నుల ఇసుక స్వాధీనం

జగ్గయ్యపేట రూరల్, ఆగస్టు 12 : ఆటోనగర్, ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏరియాల్లో అక్రమంగా నిల్వ చేసిన 100 టన్నుల ఇసుకను సోమవారం రెవెన్యూ, పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన స్థానికంగా సంచలనం కలిగించింది. సేకరించిన సమాచారం మేరకు.. మండలంలోని అనుమంచిపల్లి ఇసుక యార్డు నుంచి ట్రాక్టర్‌ల ద్వారా అక్రమంగా ఆటోనగర్, ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో నిరుపయోగంగా ఉన్న రహదారుల్లో డంప్ చేస్తున్నారు. ఆ ఇసుకను రాత్రి వేళల్లో ఎస్కవేటర్‌లతో లారీలకు లోడ్ చేసి సరిహద్దులు దాటిస్తున్నట్టు సమాచారం. పట్టుబడిన ఇసుకను తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్టు ఆర్ఐ ఆనంద్ తెలిపారు.

అర్ధరాత్రి తెలంగాణాకు రవాణా..

వైసీపీ హయాంలో ఏర్పాటు చేసిన ఇసుక స్టాకు యార్డుల నుంచి ఆధార్ కార్డు చూపి తీసుకెళ్లే నిబంధన అక్రమార్కులకు వరంగా మారింది. అనుమంచిపల్లి యార్డు నుంచి ట్రాక్టర్ల ద్వారా జాతీయ రహదారికి అందుబాటులో ఉండే స్థలాలను గుర్తించి రాత్రి సమయాలలో తెలంగాణాకు తరలిస్తున్నారు. ఇసుక జాతీయ రహదారి పక్కనున్న ఆటోనగర్, ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతాలలో అక్రమార్కులు డంప్ చేసేందుకు అనువుగా ఉంది. వైసీపీ హయాంలో నియమించబడిన పోలీస్, రెవెన్యూ అధికారులు ఈ ప్రాంతంలోనే విధులు నిర్వహిస్తుండటం కూడా అక్రమార్కులకు కలిసొచ్చింది. సరిహద్దులోని చెక్‌పోస్టు తెలంగాణా నుంచి రాష్ట్రంలోకి వచ్చే వాహనాలను తనిఖీ చేస్తుంది తప్ప తెలంగాణా వైపు వెళ్లే వాహనాలను తనిఖీ చేయకపోవటం కూడా వరంగా మారింది.



ఆటోనగర్, ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతాల్లో డంప్ చేసిన ఇసుక

లబ్ధిదారులకే అందించాలి..

ఉచిత ఇసుక రవాణాలో క్షేత్రస్థాయిలో విధి విధానాలు అక్రమార్కులకు లాభం కలిగిస్తుందనే ఆరోపణలు నెలకొన్నాయి. గత ప్రభుత్వంలో కోట్లు సంపాదించిన అక్రమార్కులు తిరిగి అదే పంథా కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలన్నారు.

లైంగిక దాడి బాధితురాలికి అండగా ఉంటాం

» ఐసీడీఎస్ సీడీపీవో సంధ్యారాణి

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

రంపచోడవరం, ఆగస్టు 12: విజయవాడలో లైంగిక దాడికి గురైన అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలం గెద్దాడకు చెందిన గిరిజన యువతికి అండగా నిలిచి అవసరమైన రక్షణ కల్పిస్తామని రంపచోడవరం ఐసీడీఎస్ సీడీపీవో సంధ్యారాణి తెలిపారు. ఘటనపై 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో సోమవారం వచ్చిన వార్తకు మహిళా, శిశు సంక్షేమ శాఖ స్పందించింది. ఆ యువతికి రక్షణ కల్పించేందుకు తగు చర్యలు తీసుకోవాలంటూ రంపచోడవరం ఐసీడీఎస్ సీడీపీవో సంధ్యారాణికి ఉన్నతాధికారుల నుంచి సూచనలు అందాయి. దీనిపై ఆమె విచారణ జరిపారు. వార్తలోని అంశాలను ధ్రువీకరిస్తూ, విజయవాడ మాచవరం పోలీసులు కేసు నమోదు చేసినట్టు వెల్లడించారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మంగినపూడి రైతులు

ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వండి

» కలెక్టరేట్ వద్ద మంగినపూడి రైతుల ధర్నా

» అనర్హులకు ఇచ్చారని ఫిర్యాదు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 12 : పంటనష్టపోయి అధికారుల చుట్టూ తిరుగుతున్నా పరిహారం కింద చెల్లించాల్సి ఉన్న ఇన్‌పుట్ సబ్సిడీ అందలేదని మంగినపూడి, కొత్తపూడి రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. రైతులు కసలింక నాగరాజు, తాతా శ్రీనివాసరావు, తాతా నగేష్, కసరిక శ్రీనివాసరావు తదితరులు మాట్లాడుతూ, మంగినపూడి, కొత్తపూడి గ్రామాల్లో నష్టపోయిన అర్హులైన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందలేదని, అయితే అనర్హులకు, పొలం లేనివారికి, వ్యవసాయం చేయని కొందరి రైతులకు అక్రమంగా లక్షలాది రూపాయలు ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చారన్నారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరిపితే అక్రమాలు వెలుగులోకి వస్తాయన్నారు. రైతులకు పునఃపరిశీలించి నష్టపరిహారం చెల్లించాలన్నారు.



నియమాక పత్రం అందుకుంటున్న శ్రీనివాసరావు

మానవహక్కుల సంఘం జోనల్ సభ్యుడిగా శ్రీనివాసరావు

జగ్గయ్యపేట, ఆగస్టు 12 : ప్రపంచ మానవహక్కుల అవగాహన సంఘం కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, ఏలూరు జిల్లాల జోనల్ మెంబర్‌గా తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన ఇనుపనూర్తి శ్రీనివాసరావు నియమితులయ్యారు. విజయవాడలో జరిగిన జాతీయ సదస్సులో ఈ నియామకం జరిగింది. మానవ హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు భంగం కలిగినప్పుడు అండగా నిలిచి న్యాయం జరి గేలా చూస్తామని ఈ సందర్భంగా ఆయన చెప్పారు.

పార్టీ కోసం కష్టపడ్డాం.. గుర్తించండి

» లోకేశ్‌ను కలిసిన సునీతా, సతీష్ దంపతులు



జగ్గయ్యపేట : రెండున్నర దశాబ్దాలుగా పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న తమను గుర్తించి, సముచిత స్థానం కల్పించాలని రాష్ట్ర తెలుగునాడు అంగన్వాడీ, డ్వాక్రా సాధికార సంస్థ అధ్యక్షురాలు ఆచంట సునీత, సతీష్‌లు రాష్ట్ర మానవ వనరులు, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీ శాఖల మంత్రి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను కలిసి కోరారు. ఎంతోకాలంగా పార్టీని నమ్ముకుని, అంకితభావంతో పనిచేశామని, వైసీపీ రాక్షసపాలనకు వ్యతిరేకంగా నిరసన, ఆందోళనల్లో పాల్గొన్న విషయాన్ని గుర్తుచేశారు. త్వరలో నామినేటెడ్ పోస్టుల భర్తీ సందర్భంగా తమకు ప్రాధాన్యత ఇవ్వాలని వారు కోరారు.

విజయవాడ
● తూర్పు ● సెంట్రల్ ● పశ్చిమ

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	92, 101, 112
చికెన్ విత్ స్కిన్	178
చికెన్ స్కిన్‌లెస్	188

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.80

ఓటమి..వైఫల్యం కాదు
మోటివేషన్ స్పీకర్ చంద్రశేఖర్

లబ్బీపేట, ఆగస్టు 12: ఓటమి భవిష్యత్తులో గెలవడానికి, ఎదగడానికి, మెరుగుపడడానికి ఒక అవకాశం అని మోటివేషన్ స్పీకర్ బి.చంద్రశేఖర్ అన్నారు. నలంద డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యార్థులకు ఇంగ్లీషు అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఓటమిని అధిగమించడం ఎలా అనే అంశంపై సెమినార్ జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కమ్యూనికేషన్ స్కిల్స్ లో నైపుణ్యాలు ఇంట్లో అమ్మ నుంచే నేర్చుకోవడం మొదలుపెడతామని, ఎందరో ప్రముఖులు ఓటమి, వైఫల్యం కాదని నిరూపించారని అన్నారు. చేసే ప్రయత్నంలో ఎటువంటి లోపం లేకుండా చూసుకుంటే వైఫల్యాలు ఎప్పటికి దరిచేరవని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, బి.రజనీప్రదీప, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.


శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్‌ను సత్కరిస్తున్న ఎంఎస్ బేగ్

మాజీ ఎమ్మెల్సీ షరీఫ్‌కు సత్కారం

వన్‌టౌన్, ఆగస్టు 12: టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్ కార్యాలయానికి సోమవారం శాసనమండలి మాజీ చైర్మన్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఎం.ఎ. షరీఫ్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనకు బేగ్, తదితరులు సాదర స్వాగతం పలికారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందచేసి సత్కరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

విద్యాధరపురం, ఆగస్టు 12: భవానీపురం పరిధిలోని 11కేవీ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఈఈ బీవీ సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబజీ 1 బ్లాక్, స్వాతి థియేటర్ రోడ్డు, మానవ మందిర్ రోడ్డు, అమృతా అపార్టుమెంట్ రోడ్డు, పోహూరివారి వీధి, హనుమాయ వీధి, గుడివాడ రామారావు వీధి, ప్రసాద్ హోటల్ రోడ్డు, లతా హాస్పటల్ రోడ్డు, ఎం.పి.దాసు వీధి, ఆకుల రాజేశ్వరరావు మిల్ రోడ్డు, చెట్ల బజార్ వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.



దివ్యాంగ చిన్నారికి ట్రై సైకిల్ అందజేత

వన్‌టౌన్, ఆగస్టు 12: పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనా చౌదరి ఓ దివ్యాంగ చిన్నారికి ట్రై సైకిల్‌ను బహూకరించారు. చిన్నారి విషయం తెలుసుకున్న ఆయన సుజనా ఫౌండేషన్ ద్వారా రూ.10 వేల ఆర్థిక సహాయం చేసి, ట్రై సైకిల్‌ను కొనుగోలు చేశారు. ఈ ట్రై సైకిల్‌ను కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సోమవారం కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, ఫౌండేషన్ కో ఆర్డినేటర్ వీరమాచినేని కిరణ్‌లు ఆ పాపకు అందచేశారు.


వీరాచారిని అభినందిస్తున్న సుంకర దుర్గాప్రసాద్

పెయింటర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడికి అభినందనలు

ఆటోనగర్, ఆగస్టు 12: జవహర్ ఆటోనగర్‌లో సోమవారం జరిగిన విజయవాడ మోటారు పెయింటర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన వేల్పు కొండ వీరాచారిని ఐలా చైర్మన్ దుర్గాప్రసాద్ అభినందించారు. 103 ఓట్ల మెజారిటీతో ఘనవిజయం సాధించడం ఆనందకరమన్నారు. కార్యక్రమంలో క్లస్టరు సీఎండీ అన్నే శివనాగేశ్వరరావు, కత్తిక శివనాగేశ్వరరావు, ఆటో ఎలక్ట్రికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ అబ్దుల్ కలాం, సుంకాని వెంకటత్రినాథ్, బాహుబలేంద్ర కోటేశ్వరరావు, దండమూడి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదభరితం ఐరన్ విద్యుత్ స్తంభం

- కేదారేశ్వరపేట గంట ప్రాంతంలో ఐరన్ స్తంభంపై వాలిన చెట్టుకొమ్మలు
- వాలిపోతున్న స్తంభానికి సపోర్టుగా ఐరన్ రాడ్ ఏర్పాటు
- స్తంభానికి, ఐరన్ రాడ్‌కు రక్షణగా ఫ్లెక్సీ చుట్టిన వైనం
- పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు, నాయకులు


కరెంటు స్తంభంపై ఒరిగిన చెట్టు కొమ్మలు


కరెంటు స్తంభానికి స్థానికులు ఏర్పాటు చేసిన ఐరన్ రాడ్, స్తంభానికి చుట్టిన ఫ్లెక్సీలు

పాతరాజరాజేశ్వరి పేట, ఆగస్టు 12 : కేదారేశ్వరపేటలోని ఐరన్ విద్యుత్ స్తంభం ప్రమాద భరితంగా ఉంది. ఈ స్తంభంపై చెట్టు కొమ్మలు వాలుతున్నాయని, వర్షం వస్తే ఇనుప స్తంభం తడిసి ప్రమాదం జరిగే అవకాశం ఉందని పలుమార్లు అధికారులకు, నాయకులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాధుడే కరువయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక కేదారేశ్వరపేట 8వలైన్ గుంట ప్రాంతంలో ఐరన్ విద్యుత్ స్తంభం వద్ద ఏర్పడిన సమస్య సంవత్సరం దాటుతుంది. ఎర్రకట్ట రోడ్డుకు సమీపంలో ఉండే ఈ ప్రాంతంలోని ఐరన్ విద్యుత్ స్తంభంపై ఏడాది కిందట చెట్టుకొమ్మలు వాలాయి. చెట్టుకొమ్మలు వాలి ప్రమాదకరంగా మారిందని స్థానికులు అధికారులు, నాయకులకు పలుమార్లు విన్నవించుకున్నారు. కానీ సమస్యను పరిష్కరించే నాధుడు లేకపోవడంతో స్థానికులే రక్షణ చర్యలు చేపట్టారు. చెట్టుకొమ్మల తాకిడికి ఐరన్ విద్యుత్ స్తంభం ఎక్కడ నేలకూలుతుందోనని, దానికి సపోర్టుగా ఐరన్ రాడ్‌ను ఏర్పాటు చేశారు. విద్యుత్, మున్సిపల్ డిపార్ట్‌మెంట్ ఆ సమస్య తమది కాదని ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ నెలలు గడిపేశారు. ఇటీవల కాలంలో వర్షాలు పడటంతో ఐరన్ స్తంభం వల్ల ఏం ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు భయందోళనకు చెందారు. ఈ పరిస్థితిని కూడా రెండు నెలల క్రితం అధికారులు, నాయకులు దృష్టికి తీసుకువెళ్లినా ఉపయోగం లేకపోవడంతో స్థానికులు ఐరన్ స్తంభానికి, ఐరన్ రాడ్‌కు ఫ్లెక్సీని చుట్టారు. తమ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారులు, నాయకుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం

ఈ ప్రాంతంలో చిన్నపిల్లలు ఎక్కువగా తిరుగుతున్నారని, ప్రమాదం జరిగే పరిస్థితులు ఎక్కువగా ఉన్నాయని పలుమార్లు ఫిర్యాదులు చేసినా అధికా రులు, నాయకులు పట్టించుకోకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంత నిర్లక్ష్యంగా ఉండటం సరికాదని, జరగరానిది జరిగితే ఎవరిది బాధ్యత అని మండిపడుతున్నారు. ఏదైనా జరిగితేనే రెండు, మూడు రోజులు హడావుడి చేసి వెళ్లిపోవడం అధికారులు, నాయకులకు అలవాటుగా మారిందని, ఆ పరిస్థితులు నెలకొంటే ఊరుకునేది లేదని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించండి

● కమిషనర్ ధ్యానచంద్ర


సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ ధ్యానచంద్ర

చిట్టినగర్, ఆగస్టు 12: ప్రజల నుంచి వచ్చే సమస్యల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం నగర పాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. నగరంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను అర్జీలుగా కమిషనర్‌కు అందజేశారు. మొత్తం 16 అర్జీలు వచ్చాయి. అదనపు కమిషనర్ (జనరల్) డాక్టర్ ఏ. మహేష్, (పాజెక్ట్) కే.సత్యవతి, చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకరరావు, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ.రత్నావళి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టండి

కృష్ణలంక : కృష్ణలంకలోని 20, 21 డివిజన్ల పరిధిలో వున్న రణదీవెనగర్ ప్రాంతాలు డ్రెయినేజీ నీటితో ముంపునకు గురికాకుండా అవుట్ ఫాల్ డ్రైనేజీ నిర్మాణం తక్షణమే చేపట్టాలని సీపీఎం నాయకుడు దోనేపూడి కాశీనాథ్ మున్సిపల్ కార్యాలయంలో సోమ వారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అదనపు కమిషనర్ మహేష్‌కు స్థానికులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాశీనాథ్ మాట్లాడుతూ రిటైనింగ్ వాల్ పక్కన అవుట్‌ఫాల్ డ్రెయినేజీ నిర్మాణాన్ని భూపేష్ గుప్తానగర్ సంపు వరకు కట్టి డ్రెయిన్‌ను సంపులో కలిపితే తప్ప సమస్యకు శాశ్వత పరిష్కారం ఏర్పడదని కమిషన ర్‌కు విన్నవించారు. సీపీఎం నాయకులు పుప్పాల కృష్ణ, కోరాడ రమణ, రాజాన అప్పలనాయుడు, పెంటి కోటి, కసర లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులూ..మత్తుమందు జోలికి వెళ్లొద్దు

● పొట్టిశ్రీరాములు ఇంజనీరింగ్ కాలేజీ సెక్రటరీ అమర్ సుధీర్


ప్రసంగిస్తున్న చిట్టా అమర్ సుధీర్

వన్‌టౌన్, ఆగస్టు 12: విద్యార్థులు రుగ్మతలకు లోనుకావద్దని పొట్టిశ్రీరా ములు చలువాది మల్లిఖార్జునరావు ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ చిట్టా అమర్ సుధీర్ అన్నారు. కళాశాలలో సోమవారం అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా నషాముక్త్ భారత్ పై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎటువంటి దురలవాట్లకు పాల్పడవద్దని, మత్తుమందు జోలికి వెళ్లవద్దని సూచించారు. కళాశాల జాయింట్ సెక్రటరీ గ్రంథి పవన్ కుమార్ మాట్లాడుతూ వివిధ దేశాలలో యువత ఏ విధంగా చెడు అలవాట్లకు పాల్పడుతుంది అనే అంశంపై వివరించారు. ట్రెజరర్ కాజ రాఘవయ్య మాదకద్రవ్యాల బారిన పడితే యువత ఏవిధంగా చెడిపోతుంది అనే అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ డ్రగ్ రహిత దేశంగా మార్చటానికి తమ వంతు బాధ్యతగా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కళాశాలలోని హ్యాబీస్ క్లబ్, రోటరాక్ట్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. డాక్టర్ ఎ. రమాదేవి, డాక్టర్ వి.నరేష్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. పతంజలి శాస్త్రి, పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై సదస్సు

● గీతా రాజపుత్



వన్‌టౌన్, ఆగస్టు 12: విద్యార్థులు తమ నైపుణ్యాలకు పదును పెడితే మంచి ఉపాధి అవకాశాలు పొందుతారని హిందూజ గ్లోబల్ సొల్యూషన్స్ ఆపరేషన్స్ ఇండియా జనరల్ మేనేజర్ గీతా రాజపుత్ అన్నారు. కేబీఎన్ కళాశాల కంప్యూటర్స్ విభాగం ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ నాస్కాం సౌజన్యంతో కెరియర్ గైడెన్స్‌పై సదస్సు నిర్వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ కంప్యూటర్లు, అనుబంధ అంశాల్లో మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. నాస్కాం పలు కోర్సులను అందిస్తుందన్నారు. నాస్కాం ఏపీ, టీఎస్ రాష్ట్రాల రీజనల్ హెడ్ డి. ప్రవీణ్ కుమార్ నైపుణ్యాన్ని పెంపొందించేందుకు కొన్ని కోర్సులను అభ్యసించాలన్నారు. కాలేజీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వి. నారాయణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి. కృష్ణవేణి, విభాగాధిపతి టి. రవీంద్ర, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లయోలాలో జాతీయ గ్రంథ పాలకుల దినోత్సవం

భారతీనగర్, ఆగస్టు 12: ఆంధ్రా లయోలా ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం కళాశాల సెమినార్ హాల్‌లో జాతీయ గ్రంథపాలకుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ ఫాదర్ బాలస్వామి మాట్లాడుతూ ప్రతిరోజు గ్రంథాలయానికి వెళ్లి పుస్తకాలను, వార్తాపత్రికలను చదవడం ద్వారా విద్యార్థుల్లో విజ్ఞానం, విలువలు, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని అన్నారు. అనంతరం పుస్తక పఠనంలో గ్రంథాలయ పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విజేతలకు ఫాదర్ బాలస్వామి బహుమతులను అందజేశారు. కళాశాల డైరెక్టర్ ఫాదర్ డాక్టర్ బి.జోజిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఒ.మహేష్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ సిస్టర్ క్యాండీ డి కూనా, గ్రంథపాలకురాలు స్వాతికిరణ్, ఉపగ్రంథపాలకులు చైతన్యదాస్, అధ్యాపకులు, విద్యార్థులు, పాల్గొన్నారు. ● లయోలా డిగ్రీ కళాశాల గోల్డెన్ లైబ్రరీ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఎల్‌సీ రీసెర్చ్ డైరెక్టర్ ఫాదర్ వై.టి.ప్రభు మాట్లాడుతూ గాడిచర్ల హరిసర్వోత్తమరావు స్వాతంత్ర్య సమరంలో మొట్టమొదటి రాజకీయ ఖైదీ అని, ఆంధ్రప్రదేశ్‌లో గ్రంథాలయాల అభివృద్ధికి ముఖ్య పాత్ర పోషించారని తెలిపారు. కళాశాల కరెస్పాండెంట్ ఫాదర్ డాక్టర్ వై.సగయరాజ్, ప్రిన్సిపాల్ ఫాదర్ పి.కిషోర్, లైబ్రేరియన్ జి.ఎ.ప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం శక్తివంతమైంది

● ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

వన్‌టౌన్, ఆగస్టు 12: ఎస్సీఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం చాలా శక్తివంతమైందని ఎస్సీ కమిషన్ చైర్మన్ మారంపూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ ప్రాంగణంలో ఎస్సీ కమిషన్ కార్యాలయంలో సోమవారం రాష్ట్ర సిటిజన్స్ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ, దళిత బహుజన శ్రామిక యూనియన్ ఆధ్వర్యంలో అట్రాసిటి చట్టం అమలు స్థితిపై సిటిజన్స్ ఆడిట్ వార్షిక రిపోర్ట్‌ను విక్టర్ ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని సక్రమంగా, సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉందన్నారు. హైకోర్టు న్యాయవాది ఉదయకుమార్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సుబ్బారావు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ

మొగల్రాజపురం, ఆగస్టు 12: సామాజిక మాధ్యమాల్లో మహిళలు, పిల్లలపై దాడులను నివారించాలనే అంశంపై అవగాహన కల్పించడానికి మొగల్రాజపురం కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల మహిళా సాధికారిత కమిటీ, తరుణీ తరంగాలు సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఒక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సోషల్ మీడియాలో చిన్నపిల్లలు, మహిళల మీద అనుచిత వ్యాఖ్యలు చేస్తూ అసభ్యకంటెంట్‌ను పెట్టకుండా చూడటం, అటువంటి వారి మీద చర్యలు తీసుకోవడం తదితర విషయాలపై సంతకాల సేకరణ చేశారు. ఐద్వా కార్యదర్శి డి.రమాదేవి, కళాశాల ప్రిన్సిపాల్ సునీత, తులసి, పద్మశ్రీ, పి, అరుణ, డాక్టర్ ఎం. విజయలక్ష్మి , విద్యార్థులు పాల్గొన్నారు.

5వేల మందికి అన్నప్రసాద వితరణ


అన్నదానం చేస్తున్న గద్దె క్రాంతి కుమార్, పెద్ది అన్నారావు తదితరులు

కృష్ణలంక, ఆగస్టు 12 : కృష్ణలంక 22వ డివిజన్‌లోని శ్రీ బాల అన్నమ్మ సీతమ్మ బాలపార్వతమ్మ పేరంటాల దేవస్థానం ప్రతిష్ఠించి 27 ఏళ్లు పూర్తిచేసుకొన్న సందర్భంగా సోమవారం జరిగిన అన్నదాన కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్నదాన కార్యక్రమం నిమిత్తం రూ.15 వేలు ఆర్థిక సాయాన్ని గద్దె క్రాంతికుమార్ ఆలయ కమిటీకి అందచేశారు. తొలుత అన్నమ్మ తల్లి దేవాలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో దాదాపు 5 వేల మంది అన్నప్రసాదాలు స్వీకరించారు. గద్దె హేమాన్స్, విజ్జి సన్యాసిరావు, పెద్ది అన్నారావు, తాతా సాంబయ్య, ఏళ్ల వెంకట దుర్గారావు, తోట శ్రీనివాసరావు, బాలబొమ్మ అనిల్, బత్తుల రమణ, నడికొప్పుల శివ, పెద్ది వెంకటేష్ పాల్గొన్నారు.

సమైక్యతకు పాటుపడదాం

● కార్పొరేటర్ బోయి సత్యబాబు




జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

చిట్టినగర్, ఆగస్టు 12: స్వాతంత్ర్య అమరవీరులను స్మరించుకుంటూ , దేశ సమైక్యతకు పాటుపడదామని 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు అన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ యంగ్ ఇండియా-సెక్యులర్ అండ్ డెమొక్రటిక్ ఫోరం ఆధ్వర్యంలో సోమవారం గొల్లపాలెంగట్టు ప్రాంతంలో దేశ సమైక్యత ర్యాలీ నిర్వహించారు. గొల్లపాలెంగట్టు ఆర్‌సీఎం స్కూల్ నుంచి అరుణ క్వానెంట్ వరకు ర్యాలీ కొనసాగింది. ర్యాలీని ఫోరం సభ్యుడు ఈ. హేమచంద్ ప్రారంభించారు. ముఖ్య అతిథిగా సత్యబాబు హాజరయ్యారు. ర్యాలీలో ఐద్వా నాయకులు జీ ఆదిలక్ష్మి, వరలక్ష్మి, ఆర్‌సీఎం స్కూల్ ఉపాధ్యాయులు వేణు, అరుణ హై స్కూల్ ఉపాధ్యాయులు పృథ్వీ, కేబీఎన్ టాలెంట్ స్కూల్ ఉపాధ్యాయులు బాష, ఎస్ఆర్బీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, స్థానిక నాయకులు పి.రాజు, జి. నాగరాజు, సీహెచ్ దుర్గారావు, మహేష్, నిర్వాహకులు రవి, జీవన్, దివ్య, ప్రశాంత్, ఆకాష్, పలు స్కూల్‌కు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్యలను పరిష్కరించండి

● ఎమ్మెల్యే గద్దె


సిల్టుపై పలుగు దించి చూపుతున్న గద్దె

పటమట, ఆగస్టు 12 : నగరంలోని భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థ స్తంభించిపోయి రోడ్లపై పొంగటానికి ప్రధాన కారణం డ్రెయినేజీల్లో పెద్ద ఎత్తున సిల్టు పేరుకుపోవడమేనని, పూడికలను తీయించి డ్రెయినేజీ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన 12వ డివిజన్ అయ్యప్పనగర్‌లో వీరసావర్కర్ రోడ్డు మసీదు తదితర ప్రాంతాల్లో పర్యటించిన స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రెయినేజీలో పేరుకుపోయిన సిల్టులను పలుగుతో పరిశీలించి ఎంత మేరకు పూడుకుపోయిందో మున్సిపల్ సిబ్బందికి చూపించారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ డ్రెయినేజీ సమస్య పరిష్కరించడానికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. ఈ సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతానని, సమస్య పరిష్కారానికి మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడతానని వివరించారు. కార్పొరేటర్ పొట్లూరి సాయిబాబు, శాయన సత్యనారాయణ, ముమ్మనేని ప్రసాద్, అబ్దుల్ ఖలీల్, మహ్మద్ ఇబ్రహీం, చిన్నతల్లి, కె. లక్ష్మిప్రసాద్, జె సుబ్బారావు, బాలు, హయాత్‌ఖాన్‌లు పాల్గొన్నారు.



పేదలకు అన్నదానం

అజిత్‌సింగ్‌నగర్: కళ్లే లలిత జ్ఞాపకార్థం ప్రతి నెల 12న పేదలకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు కళ్లే లలిత ట్రస్ట్ డైరెక్టర్లు కళ్లే సీతామహాలక్ష్మి, కళ్లే జయదుర్గ, మేఘవాణిలు తెలిపారు. సింగ్‌నగర్‌లోని కళ్లే లలిత వీధిలో సోమవారం పేదలకు అన్నదానం చేసి పండ్లు పంపిణీ చేశారు. ముప్పూరి హరీష్, ఎం.జశ్విన్, జి.ధ్రువన్, స్థానికులు ఆమెకు నివాళులు అర్పించారు.



దిక్సూచి DIKSUCHI

ఏపీ గిరిజన వర్సిటీలో డిగ్రీ

విజయనగరంలోని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం (ఏపీ సీటీయూ)- డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. బీఎస్సీ, బీబీఏ, బీకాం ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహించిన సీయూఈటీ(యూజీ) 2024లో సాధించిన ర్యాంక్, కౌన్సెలింగ్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఇవి ఆనర్స్/ఆనర్స్ విత్ రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు.

ప్రోగ్రామ్‌లు: బీఎస్సీ(కెమిస్ట్రీ), బీఎస్సీ(బోటనీ), బీఎస్సీ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్), బీఎస్సీ(జియాలజీ), బీబీఏ(టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్), బీకామ్(ఒకేషనల్).

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. సీయూఈటీ(యూజీ) 2024 అర్హత తప్పనిసరి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 16
- **తరతులు ప్రారంభం:** సెప్టెంబరు 9
- **వెబ్‌సైట్:** www.ctuap.ac.in



ఏఐసీటీఈ సాక్షమ్ స్కాలర్‌షిప్ స్కీమ్



ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ)- 'సాక్షమ్ స్కాలర్‌షిప్ స్కీమ్'ను ప్రకటించింది. టెక్నికల్ ఎడ్యుకేషన్‌పై దివ్యాంగులకు ఆసక్తిని కలిగించి, వారిని ఉన్నత విద్యలో ప్రోత్సహించేందుకు ఈ స్కీమ్‌ను ఉద్దేశించారు. దీని ద్వారా కనీసం 40 శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులకు డిప్లొమా, డిగ్రీ కేటగిరీల్లో స్కాలర్‌షిప్‌లు ఇస్తారు. అభ్యర్థులు పదోతరగతి/ఇంటర్ పూర్తిచేసిన రెండేళ్లలోపు ఏఐసీటీఈ గుర్తింపు పొందిన సంస్థలో డిప్లొమా/డిగ్రీ ప్రవేశం పొంది ఉండాలి. కుటుంబ వార్షికాదాయం రూ.8 లక్షలకు మించకూడదు. అకడమిక్ మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

అర్హత: డిప్లొమా కేటగిరీకి అప్లయ్ చేసుకోవాలంటే గుర్తింపు పొందిన పాఠశాల నుంచి పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఈ విద్యా సంవత్సరానికి మూడేళ్ల వ్యవధి గల టెక్నికల్ డిప్లొమా లెవెల్ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. ఐటీఐ కోర్సు పూర్తిచేసి లేటరల్ ఎంట్రీ ద్వారా డిప్లొమా ద్వితీయ సంవత్సరంలో చేరినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

- డిగ్రీ కేటగిరీకి దరఖాస్తు చేసుకోవాలంటే గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. నాలుగేళ్ల వ్యవధి గల టెక్నికల్ డిగ్రీ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. డిప్లొమా పూర్తిచేసి లేటరల్ ఎంట్రీ ద్వారా డిగ్రీ రెండో సంవత్సరంలో ప్రవేశం పొందినవారు కూడా అర్హులే.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఇతర మెరిట్ స్కాలర్‌షిప్స్ పొందుతున్నవారు, పీఎంఎస్ఎస్ఎస్ స్కీం కింద చదువుకుంటున్నవారు, నాన్ టెక్నికల్ కోర్సుల్లో చేరినవారు, డ్యూయెల్ డిగ్రీ/పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందినవారు, ఇతరత్రా స్టయిపెండ్/ఆదాయం పొందుతున్నవారు దరఖాస్తుకు అనర్హులు.

స్కాలర్‌షిప్: ఎంపికైన అభ్యర్థులకు ఏడాదికి రూ.50,000 చెల్లిస్తారు. డిప్లొమా అభ్యర్థులకు మూడేళ్లు, డిగ్రీ అభ్యర్థులకు నాలుగేళ్లు స్కాలర్‌షిప్ ఇస్తారు. లేటరల్ ఎంట్రీకైతే డిప్లొమా అభ్యర్థులకు రెండేళ్లు, డిగ్రీ అభ్యర్థులకు మూడేళ్లు స్కాలర్‌షిప్ అందిస్తారు. స్కాలర్‌షిప్ మొత్తాన్ని ఏటా అభ్యర్థుల బ్యాంక్ ఖాతాలో జమచేస్తారు. ఇందుకోసం బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డ్ తప్పనిసరి. ఫీజు, వసతి, పుస్తకాలు, కంప్యూటర్ తదితర ఖర్చుల కోసం ఈ స్కాలర్‌షిప్ మొత్తాన్ని వినియోగించుకోవచ్చు. ఏటా చదువులో చూపిన ప్రతిభ ఆధారంగా తరవాతి సంవత్సరాలకు వీటిని కొనసాగిస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 31
- **వెబ్‌సైట్:** scholarships.gov.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/to0Hw17లో చదవండి.

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూహెచ్)కి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ ఇన్నోవేటివ్ లెర్నింగ్ అండ్ టీచింగ్(డీఐఎల్‌టీ)- ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. ఒక్కో కోర్సు వ్యవధి ఆర్నెల్లు. ప్రతి కోర్సులో మూడు థియరీ సబ్జెక్టులు ఉంటాయి. ఒక్కో సబ్జెక్టుకు రెండు నెలల సమయం, 24 తరగతులు, మూడు క్రెడిట్‌లు నిర్దేశించారు. సాయంత్రం ఆరున్నర నుంచి ఎనిమిదిన్నర వరకు ఆన్‌లైన్ సెషన్స్ ఉంటాయి. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. అదనంగా ఒక నెల ప్రాజెక్ట్ వర్క్ చేయాల్సి ఉంటుంది. దీనికి ఆరు క్రెడిట్‌లు ఉంటాయి. కోర్సులో భాగంగా అసైన్‌మెంట్‌లు, ఎండ్ ఎగ్జామినేషన్ ఉంటాయి. అసైన్‌మెంట్‌లకు 40 శాతం, ఎండ్ ఎగ్జామినేషన్‌కు 60 శాతం వెయిటేజీ ఇస్తారు. ఫ్యాకల్టీ మెంబర్లు, ఉద్యోగస్తులు, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో అడ్మిషన్స్ ఇస్తారు. యూనివర్సిటీకి చెందిన టీచింగ్& నాన్ టీచింగ్ సిబ్బంది, అకడమిక్ స్టూడెంట్స్‌కు కోర్సు ఫీజులో 40 శాతం రాయితీ లభిస్తుంది.

జేఎన్‌టీయూహెచ్‌లో ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు

క్లౌడ్ అండ్ డెవోప్స్ కోర్సు: ఇందులో క్లౌడ్ టెక్నాలజీ ఏడబ్ల్యూఎస్ & మైక్రోసాఫ్ట్ అజ్యూర్, కంటిన్యూయస్ ఇంటిగ్రేషన్/కంటిన్యూయస్ డిప్లాయ్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొవిజనింగ్ సబ్జెక్టులు ఉంటాయి.

డేటా సైన్స్ అండ్ జనరేటివ్ ఏఐఎల్ఎల్ఎమ్ కోర్సు: ఇందులో పైథాన్ ప్రోగ్రామింగ్, మెషిన్ లెర్నింగ్-డీప్ లెర్నింగ్, జనరేటివ్ ఏఐ అండ్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ సబ్జెక్టులు ఉంటాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి డిప్లొమా/యూజీ/పీజీ పూర్తిచేసిన/చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. కంప్యూటర్స్‌కు సంబంధించి ప్రాథమిక పరిజ్ఞానం, ఏదేని ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌పై అవగాహన తప్పనిసరి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** www.jntuh.ac.in

సీసీఎంబీలో పీహెచ్‌డీ

హైదరాబాద్-హబ్సిగూడలోని సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ(సీసీఎంబీ)- పీహెచ్‌డీ 2025 జనవరి సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్‌లో భాగంగా మోడరన్ బయాలజీకి సంబంధించిన అంశాల్లో పరిశోధనలు చేయాల్సి ఉంటుంది. కంప్యూటర్ బేస్డ్ రిటెన్ టెస్ట్ లేదా రిమోట్ ప్రొక్టోర్డ్ ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

అర్హతలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని సైన్స్ విభాగంలో కనీసం 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థులకు సీఎస్ఐఆర్/యూజీసీ/డీబీటీ/డీఎస్‌టీ నుంచి వ్యాలిడ్ జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్ లేదా డీబీటీ-బీఈటీ/ఇన్‌స్పైర్/ఆర్‌జీఎన్ఎఫ్ నుంచి ఫెలోషిప్ అర్హత పొంది ఉండాలి.

- **చివరి తేదీ:** సెప్టెంబరు 16
- **వెబ్‌సైట్:** www.ccmb.res.in

నవ్య | చిత్రజ్యోతి

అది నా దురదృష్టం



మహేశ్‌బాబు, సోనాలి బింద్రే జంటగా కృష్ణవంశీ తెరకెక్కించిన బ్లాక్‌బస్టర్ సినిమా 'మురారి'. ఇటీవలే ఆ సినిమా రీ రిలీజై క్రేజీ కలెక్షన్లు సాధిస్తున్న తరుణంలో దర్శకుడు సోషల్ మీడియాలో అభిమానులతో ముచ్చటించారు. వారితో ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. "పవన్‌కల్యాణ్‌తో సినిమా చేయాలనుకున్నాను. ఆయనకు కథ కూడా చెప్పాను. కానీ అది కార్యరూపం దాల్చలేదు. ఒకవేళ ఆయనతో సినిమా చేసి ఉంటే.. అది పెద్ద హిట్టయ్యేది. ఈ విషయంలో నాది దురదృష్టం అనుకోవాలి" అని పేర్కొన్నారు. అలాగే, మహేశ్‌బాబు తనయుడు గౌతమ్ హీరోగా 'మురారి' సీక్వెల్ ఉంటుందా అని అభిమానులు ఆయన్ని అడిగారు. "ఆ సీక్వెల్ విషయం గౌతమ్ తల్లిదండ్రుల నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది" అని కృష్ణవంశీ బదులిచ్చారు.

లేటెస్ట్ అప్‌డేట్



నందమూరి బాలకృష్ణ నటిస్తున్న తాజా చిత్రం ఎన్‌బీకే 109కి సంబంధించి లేటెస్ట్ అప్‌డేట్ వచ్చేసింది. బాబీ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం రాజస్థాన్‌లో ఈ సినిమా కోసం తీస్తున్న కీలక సన్నివేశాల చిత్రీకరణ పూర్తయిందనీ సోమవారం సోషల్ మీడియా ద్వారా దర్శకుడు బాబీ వెల్లడించారు. 'బాలకృష్ణ ఎనర్జీనీ, అద్భుతమైన అభినయాన్ని ఈ సినిమాలో చూస్తారు. థియేటర్లలో ఆ అనుభూతి కోసం సిద్ధంగా ఉండండి' అని ఆయన పేర్కొన్నారు. ఈ సినిమా టైటిల్ గురించి రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అందుకే టైటిల్ ఎప్పుడు ప్రకటిస్తారా అని అభిమానులు ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. ఈ విషయం మీద క్లారిటీ ఇచ్చారు దర్శకుడు బాబీ. త్వరలోనే టైటిల్, టీజర్ విడుదలవుతాయని వెల్లడించారు. బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ విలన్ నటిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీత దర్శకుడు.

ఏడ్చుకుంటూ ఇంటికి...



వరుస చిత్రాలతో దూసుకుపోతున్నారు స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న. ఇటీవల జరిగిన ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ తొలినాళ్లను ఆమె గుర్తుచేసుకున్నారు. "నటిగా నాకు మొదట్లో అవకాశాలు అంత సులువుగా వచ్చేవి కావు. ఆడిషన్లకు హాజరు కావడం.. అందులో సెలక్ట్ కాలేదని తెలిసి ఇంటికి ఏడ్చుకుంటూ వెళ్లిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఆ ప్రయత్నాల్లో ఉండగా.. ఓ సినిమాలో నటిగా అవకాశం రావడంతో ఎగిరి గంతేశా. కానీ ఆ ప్రాజెక్ట్ కొన్నాళ్లకే ఆగిపోయింది. ఆ తర్వాత కూడా నాకు అవకాశాలు వెంట వెంటనే ఏమీ రాలేదు. దాదాపు పాతిక ఆడిషన్లలో తిరస్కరణకు గురయ్యాను. అలా ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నా, ఆత్మస్థైర్యంతో ముందడుగు వేసేదాన్ని" అని చెప్పారు.

జాతి కోసం సాహస పోరాటం



తమిళ హీరో సూర్య నటిస్తున్న భారీ ప్రతిష్ఠాత్మక చిత్రం 'కంగువ' అక్టోబర్ 10న విడుదల కానుంది. దిశా పటానీ, బాబీ డియోల్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ పీరియాడికల్ యాక్షన్ ఫిల్మ్‌ను దర్శకుడు శివ రూపొందిస్తున్నారు. కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మాతలు. మెస్మరైజింగ్ మేకింగ్‌తో రూపుదిద్దుకుంటున్న 'కంగువ' ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు. యుద్ధాలు, ఆక్రమణలు చేస్తూ ఎదురొచ్చిన వారిని క్రూరంగా చంపే భయంకరమైన విలన్‌గా బాబీ డియోల్ ఈ ట్రైలర్‌లో కనిపించారు. తన జాతి కోసం, తనవారి కోసం సాహసోపేతమైన పోరాటాలు చేసే ధీరుడిగా సూర్య పాత్ర ఉంది. భారీ నౌకలపై దాడి చేసే సన్నివేశాలు, హై క్వాలిటీ విజువల్ ఎఫెక్ట్స్ సినిమాకు ప్రధాన ఆకర్షణలు నిలుస్తాయి. ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీ నుంచి వస్తున్న మరో చిత్రం 'కంగువ' కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

బట్టతలలా కనిపించాలి అంటే సరే అన్నా



'విజయవాడ రావడం చాలా హ్యాపీగా ఉంది. డైట్‌ను పక్కన పెట్టి 'బాబాయ్ హోటల్' లో ఇడ్లీలు తినేశా. నా 'అపరిచితుడు' సినిమా విగిలిన ప్రాంతాలకంటే విజయవాడలోనే ఎక్కువ రోజులు ఆడింది. మంచి సినిమాను తెలుగు ప్రేక్షకులు ఎంత సపోర్ట్ చేస్తారో నాకు తెలుసు' అన్నారు హీరో విక్రమ్. ఆయన నటించిన పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్ 'తంగలాన్' ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ మాళవిక మోహనన్, హాలీవుడ్ నటుడు డేనియల్, నిర్మాత ధనుంజయన్‌తో కలసి ప్రమోషన్స్ నిమిత్తం విజయవాడ వెళ్లిన విక్రమ్ మాట్లాడుతూ 'నేను విభిన్న పాత్రలు పోషించిన చిత్రాలన్నీ మీరు ఆదరించారు. ఈ సినిమాలోనూ కొత్తగా కనిపిస్తా. బట్టతలగా కనిపించే గెటప్‌లో కనిపించాలని దర్శకుడు పా.రంజిత్ చెప్పగానే సరేనన్నా. ఈ సినిమాలో రెగ్యులర్ ఫైట్లు, పాటలు ఉండవు. భావోద్వేగాలు బాగా ఉన్న కథ ఇది. 'తంగలాన్' మిమ్మల్ని సరికొత్త లోకంలోకి తీసుకెళుతుంది' అన్నారు.


గురువారం నాడే విడుదల

సినిమాలకూ.. శుక్రవారానికి ప్రత్యేకమైన అనుబంధం ఉంది. ఎన్నో ఆశలతో తెరకెక్కించిన సినిమాలను ఆ రోజున విడుదల చేసి బాక్సాఫీస్ వద్ద తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటుంటారు చిత్ర ప్రముఖులు. పండగ సీజన్లలో లేదా కొన్ని ప్రత్యేక సందర్భాల్లో తప్పించి శనివారం, గురువారం, బుధవారం వంటి ఇతర తేదీల్లో సినిమాలు విడుదలవ్వడం అరుదు. కానీ ఈ ఏడాది అనేక సినిమాలు శుక్రవారం ట్రెండ్‌ను బ్రేక్ చేసి.. గురువారాన్ని విడుదల తేదీగా మార్చుకున్నాయి.. ఆ చిత్రాలివే.





నాని నటించిన లేటెస్ట్ చిత్రం 'సరిపోదా శనివారం'. ప్రియాంక అరుల్ మోహన్ హీరోయిన్. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో విభిన్న కథాంశంతో తెరకెక్కిందీ చిత్రం. అధిక కోపం గల ఓ యువకుడు.. తన కోపాన్ని నియంత్రించుకోవడానికి ప్రతీ శనివారం ఏం చేశాడనేది ఈ సినిమా కథ. ఈ నెల 29న గురువారం విడుదవుతున్న ఈ చిత్రంలో నాని పాత్రలో అనేక రకాల షేడ్స్ ఉంటాయని మేకర్స్ తెలిపారు. ఇంతకు ముందు వీరి కలయికలో వచ్చిన 'అంటే సుందరానికీ' సినిమా..కమర్షియల్‌గా పెద్ద విజయం సాధించకపోయినా.. విమర్శకుల ప్రశంసలను పొందింది.





డ్యూయల్ రోల్‌లో...

తమిళ కథానాయకుడు విజయ్ డ్యూయల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'గోట్' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్). మీనాక్షీ చౌదరి కథానాయిక. వెంకట్ ప్రభు దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం వినాయక చవితి సందర్భంగా సెప్టెంబరు 5న గురువారం విడుదలవుతోంది. భారీ అంచనాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో యాక్షన్ సన్నివేశాలకి అధిక ప్రాధాన్యం ఉండనుంది.

వేటగాడిగా రజనీ..

'జై భీమ్' ఫేమ్ టి.జె.జ్ఞానవేల్ దర్శకత్వంలో రజనీకాంత్ 'వేట్టయాన్' చిత్రంలో నటిస్తున్నారు. ఇందులో అమితాబ్ బచ్చన్, రానా దగ్గుబాటి, ఫహాద్ ఫాజిల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇందులో ఓ రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో రజనీ కనిపించనున్నారు. ఈ సినిమా దసరా సందర్భంగా అక్టోబరు 10న గురువారం ప్రేక్షకులను పలకరించనుంది. 'జైలర్'తో సూపర్ హిట్ కొట్టి మంచి ఫామ్‌లో ఉన్న రజనీకాంత్‌కు ఈ సినిమా అంతకుమించిన సక్సెస్ ఇస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

మాస్ ఎంటర్టైనర్

విశ్వక్ సేన్ కథానాయకుడిగా రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న మాస్ ఎంటర్టైనర్ 'మెకానిక్ రాకీ'. సమాజంలో జరుగుతున్న ఓ కుంభకోణం నేపథ్యంలో ఈ సినిమా కథాంశం సాగనుంది. ఇందులో విశ్వక్ సరసన మీనాక్షీ చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ నటిస్తున్నారు. దీపావళి కానుకగా ఈ సినిమా అక్టోబరు 31న గురువారం విడుదల కానుంది.

బయోపిక్‌లో శివకార్తికేయన్



వైవిధ్యమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరించే తమిళ నటుడు శివ కార్తికేయన్. రాజ్‌కుమార్ పెరియస్వామి దర్శకత్వంలో ఆయన నటిస్తున్న బయోపిక్ 'అమరన్' వహిస్తున్నారు. ఈ సినిమా అమరులైన మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవితం ఆధారంగా తెరకెక్కుతోంది. సాయిపల్లవి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం దీపావళి కానుకగా అక్టోబరు 31 గురువారం విడుదలవుతోంది.

'కల్కి' కూడా..

ప్రభాస్ కథానాయకుడిగా నటించిన 'కల్కి 2898 ఏ.డీ' చిత్రం గురువారం రిలీజై సంచలన విజయం సాధించిన సంగతి తెలిసిందే. అలాగే స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ గురువారం (ఆగస్టు 15)న కూడా డజనుకు పైగా చిత్రాలు సందడి చేయనున్నాయి. గురువారం సెంటిమెంటు ఈ సినిమాలకు కలసి వస్తుందేమో చూడాలి.



ప్రేమ, వినోదం.. ఉత్సవం

దిలీప్ ప్రకాశ్, రెజీనా కసాండ్రా లీడ్ రోల్స్ పోషించిన 'ఉత్సవం' చిత్రం సెప్టెంబర్ 13న విడుదల కానుంది. ప్రేమ, వినోదం, భావోద్వేగం.. అంశాలతో రూపుదిద్దుకొన్న కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇదని దర్శకుడు అర్జున్ సాయి చెప్పారు. ప్రకాశ్‌రాజ్, నాజర్, రాజేంద్రప్రసాద్, బ్రహ్మానందం, అలీ, ప్రేమ, ఎల్బీ శ్రీరామ్ తదితరులు నటించిన ఈ చిత్రాన్ని రెండు తెలుగు రాష్ట్రాల్లో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ విడుదల చేస్తోందని నిర్మాత సురేశ్ పాటిల్ చెప్పారు.

ఇన్ ప్రోగ్రెస్

ముఫాసా కోసం షారుఖ్



ప్రపంచ వ్యాప్తంగ ఎంతో మంది ప్రేక్షకుల అభిమానాన్ని పొందిన 'ముఫాసా ది లయన్ కింగ్' ఫ్రాంచైజ్‌లోని కొత్త సినిమా డిసెంబర్ 20న విడుదల కానుంది. ఈ సినిమా కోసం తొలిసారిగా బాలీవుడ్ హీరో షారుఖ్ ఖాన్ తన ఇద్దరు కుమారులతో కలసి డబ్బింగ్ చెబుతున్నారు. సినిమాలోని ప్రధాన పాత్ర ముఫాసాకు షారుఖ్ గొంతు అరువిస్తుండగా, ఆర్యన్ ఖాన్ సింబా పాత్రకి, చిన్నప్పటి ముఫాసా పాత్రకు షారుఖ్ చిన్న కుమారుడు అబ్రమ్ ఖాన్ డబ్బింగ్ చెబుతున్నారు. ఇంగ్లీష్, హిందీ, తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



తన దగ్గర అసోసియేట్ డైరెక్టర్‌గా పని చేసిన సాయి కిశోర్ దర్శకుడిగా మారి రూపొందించిన 'ధూమ్‌ధాం' చిత్రం టీజర్‌ను హీరో గోపీచంద్‌తో కలసి విడుదల చేశారు దర్శకుడు శ్రీను వైట్ల. గోపీ మోహన్ ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే అందించారు. చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ జంటగా నటించారు. ఈ సందర్భంగా నిర్మాత ఎమ్మెస్ రామ్‌కుమార్ మాట్లాడుతూ 'చిత్ర పరిశ్రమలో నాకు ఉన్న మిత్రుల్లో హీరో గోపీచంద్ ఒకరు. చక్కని ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా సినిమాను తీర్చిదిద్దాం. భారీ బడ్జెట్‌తో లావిష్‌గా నిర్మించాం. విదేశాల్లో కూడా షూటింగ్ చేశాం. సెప్టెంబర్ 13న విడుదల చేస్తున్నాం' అని చెప్పారు.



స్వాతంత్రం.. మా స్వాతంత్ర్యం

తన ఆహార విధానంతో ఆరోగ్య డైట్ ప్రారంభించిన లక్ష్మణ్ పూడి తన మాతృ సంస్థ ప్రజానాట్య మండలి రూపకల్పనలో ఎం. శేషగిరిరాసిన 'స్వాతంత్రం.. మా స్వాతంతీర్యం' పాటను పాడారు. శ్రీనివాస్ నందుల రాసిన ఈ పాటను తమ్మారెడ్డి భరద్వాజ విడుదల చేశారు. దేశం మీద ప్రేమతో నిరక్షరాస్యులను మేల్కొల్పడానికి ఈ పాటను రూపొందించినట్లు లక్ష్మణ్ పూడి చెప్పారు.

సీనియర్ నటుడు నరేశ్ తన యాభై ఏళ్ల నట జీవితాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జాకీ ష్రాఫ్, పూనమ్ థిల్లాన్, జయసుధ, సుహాసిని, కుష్బూ, సాయి దుర్గాతేజ్, మంచు మనోజ్, నారా రోహిత్ , దర్శకుడు మారుతి తదితరులు హాజరయ్యారు. హీరో కృష్ణ, విజయనిర్మలతో ఏర్పాటు చేసిన స్ఫూర్తి వనాన్ని ఈ సందర్భంగా నరేశ్ ప్రారంభించారు.



'అతడు' సినిమా చూసేవాడ్ని



'మహారాజా' చిత్రంతో సూపర్ హిట్ అందుకున్నారు తమిళ నటుడు విజయ్ సేతుపతి. తెలుగులోనూ మంచి ఫాలోయింగ్ ఉన్న ఆయన.. ఇటీవల జరిగిన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ "మహేశ్‌బాబు కథానాయకుడిగా నటించిన 'అతడు' సినిమా నాకెంతో ఇష్టం. జీవితంలో ఒడిదుడుకులకు లోనైన సమయాల్లో ఆ సినిమాను రిపీట్ మోడ్‌లో చూసేవాడ్ని. ఆ సినిమాలో మహేశ్ నటన అద్భుతం. ఆయన పలికిన ప్రతీ డైలాగ్, సన్నివేశం నాకు బాగా గుర్తుండిపోతుంది. త్రివిక్రమ్ దర్శకత్వ పటిమ.. ఆయన రాసిన సన్నివేశాలతో తెరపై భావోద్వేగాలు బాగా పండాయి. ముఖ్యంగా హీరోహీరోయిన్ల కెమిస్ట్రీ, బ్రహ్మానందం కామెడీ, పాటలు నాకు బాగా నచ్చాయి" అని తెలిపారు.



పిల్లల లేత ఎముకలు చిన్నపాటి ఒత్తిడికే పుటుక్కున విరిగిపోతాయి, అంతే తేలికగా అతుక్కుంటాయి కూడా! కాబట్టి ఎముకలు అతుక్కోవడం కోసం వేసే కట్టు మన్నికదై, పిల్లల ఆటపాటలకు అడ్డురానిదై ఉండాలి. అలాంటి అత్యాధునిక వాటర్‌ప్రూఫ్ కాస్ట్‌లు, వాటి ఉపయోగాల గురించి వైద్యులు ఇలా వివరిస్తున్నారు.

వాటర్‌ప్రూఫ్ కాస్ట్

ఈ కట్టు బెస్టు

పిల్లల్లో ఫ్రాక్చర్లకు ఆస్కారం తక్కువ అనుకోవడం పొరపాటు. పోషణ తగ్గినా పిల్లల ఎముకలు పెళుసుగా మారతాయి. ఇలాంటి పిల్లల ఎముకలు చిన్నపాటి దెబ్బలకే విరిగిపోతాయి. పిల్లలను ఎత్తుకునే తప్పుడు పద్ధతుల వల్ల కూడా భుజాలు, మోచేతుల్లోని కీళ్లు పట్టు తప్పుతూ ఉంటాయి. కొన్ని సందర్భాల్లో ముంజేతుల్లోని ఎముకలు విరిగిపోతూ ఉంటాయి. వీటికి తోడు ప్రమాదాల వల్ల కూడా పిల్లల ఎముకలు విరుగుతూ ఉంటాయి. కొందరు చేత్లో పిల్లల కాళ్లు పట్టుకుని తలకిందులుగా పైకెత్తి వెన్ను మీద తట్టడం లాంటివి చేస్తూ ఉంటారు. ఇలాంటప్పుడు తుంటి కీలు జారుతుంది.

అవన్నీ గ్రీన్ స్టిక్ ఫ్రాక్చర్లే!



ఎండుకొమ్మను మధ్యకు విరిస్తే అది చక్కగా, సమంగా రెండు ముక్కలవుతుంది. అదే పచ్చని కొమ్మను విరిస్తే, అది పూర్తిగా విరిగిపోకుండా ఒక వైపు అతుక్కునే ఉంటుంది. పిల్లల్లో ఎముకలు విరిగితే ఇదే పరిస్థితి ఉంటుంది. తేలికగా అతుక్కునే స్వభావం ఉంటుంది కాబట్టి జనరల్ అనస్థీషియాలో భాగంగా సెలైన్ ద్వారా నొప్పి తగ్గించే ఇంజక్షన్ ఇచ్చేసి, విరిగిన ఎముకను సరిచేసి కట్టు వేస్తే సరిపోతుంది. పిల్లల్లో గాయాలు నయమయ్యే స్వభావం ఎక్కువ కాబట్టి 3 నుంచి 4 వారాల్లోనే ఎముక అతుక్కుపోతుంది. ఒకవేళ ఎముక రెండుగా విరిగిపోతే, ఎముకల లోపలి నుంచి మెత్తని వైర్లను చొప్పించి, వాటిని టెన్స్ నెయిల్స్‌తో కదలకుండా బిగించే విధానాన్ని అనుసరించవలసి వస్తుంది. చిన్నపాటి రంధ్రాల ద్వారానే సర్జరీ పూర్తవుతుంది. కాబట్టి కోతలు లాంటివి కనిపించవు. సర్జరీ తర్వాత వేసిన కట్టు మూడు వారాల పాటు ఉంచితే, విరిగిన ఎముకలు చక్కగా అతుక్కుంటాయి. ఎముక పూర్తిగా అతుక్కున్న తర్వాత 8 వారాలకు టెన్స్ నెయిల్స్‌ను తొలగించవలసి ఉంటుంది. తొడ ఎముక విరిగినప్పుడు కూడా ఇదే రకమైన సర్జరీతో ఎముకను అతికించి, నడుముకు పైకాను బిగించాల్సి ఉంటుంది. దీంతో ఎముక కదలికలకు గురి కాకుండా ఉంటుంది. ఒకవేళ ఫ్రాక్చర్ మధ్యలో కండ విరుక్కున్నప్పుడు, తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే ఓపెన్ సర్జరీ అవసరమవుతుంది.

ఎముకలు విరిగిన వెంటనే...

వాపు, నొప్పి ఎముక విరిగిందనడానికి సంకేతాలు. ఇలాంటప్పుడు ఆస్పత్రికి వెళ్లేలోగా విరిగిన ఎముక మరింత దెబ్బ తినకుండా కొన్ని జాగ్రత్తలు పాటించాలి. అవేంటంటే....
- విరిగిన ప్రదేశంలో మర్దన చేయకూడదు, రుద్దకూడదు
- స్వయంగా ఎముకలను సరిచేసే ప్రయత్నం చేయకూడదు
- కార్డ్‌బోర్డులను విరిగిన అవయవానికి ఆసరాగా ఉంచి, టవలు చుట్టి కదల్చకుండా ఆస్పత్రికి చేర్చాలి
- ఎముక చర్మాన్ని చీల్చుకుని బయటకు వస్తే, అదే స్థితిలో ఆస్పత్రికి చేర్చాలి

ఎముకను పెంచే టెన్స్ నెయిల్స్

పెద్ద ప్రమాదాల్లో ఎముక పూర్తిగా ఛిద్రమైపోయి, కొంత ఎముకను కోల్పోయిన సందర్భాల్లో విరిగిన ఎముకను అలాగే కలిపి అతికిస్తే, అవయవం కురచగా మారిపోయే ప్రమాదం ఉంటుంది. పూర్వం ఈ సమస్యకు ప్రత్యామ్నాయాలు ఉండేవి కావు. కానీ ఇప్పుడు కోల్పోయిన ఎముక స్థానంలో కొత్త ఎముక పెరిగే వీలు కల్పించే వెసులుబాటు తాజాగా అందుబాటులోకొచ్చింది. టెన్స్ నెయిల్స్‌తో రెండు ముక్కలైన ఎముకను సరిపడా జాగాతో దగ్గరకు చేర్చడం వల్ల, ఆ జాగాలో ఎముక పెరిగి, మునుపటి స్థితికి తీసుకురావచ్చు. బోన్ లాస్‌ను భర్తీ చేయడం కోసం రూపొందిన ఈ సర్జరీ, ఎత్తును పెంచడానికి కూడా ఉపయోగపడుతోంది.

సౌకర్యవంతమైన 'డెల్టా డ్రై' కాస్ట్

పూర్వం ఎముక విరిగితే పిండికట్టు వేయించుకునేవాళ్లం. రోలర్ బ్యాండేజీల మీద పిఒపి చల్లి నీళ్లతో తడిపి పిండి కట్టు కట్టేవాళ్లు. కానీ ఈ కట్లు నీరు తగిలితే పిగిలిపోతాయి. కాబట్టి ఎముకలకు అవసరమైన ఒత్తిడి దక్కకపోగా, పిల్లల ఆటపాటలకు కూడా ఇవి అడ్డుపడుతూ ఉంటాయి. వీటి తర్వాత సింథటిక్ కాస్ట్ అందుబాటులోకొచ్చాయి. విరిగిన ప్రదేశం పైన కాటన్ రోల్ చుట్టి, దాని పైన సింథటిక్ కాస్ట్‌ను వేయడం వల్ల ఎముకలు కదలికలు లేకుండా చక్కగా అతుక్కుంటాయి. దీన్ని మించిన అత్యాధునికమైన కట్టు.. 'డెల్టా డ్రై'. దీన్లో కాటన్‌కు బదులుగా డెల్టా డ్రై అనే మెటీరియల్‌ను చుట్టి, దాని పైన సింథటిక్ కాస్ట్ వేయడం వల్ల తడికీ, నీళ్లకూ కూడా దూరంగా ఉండవలసిన అవసరం ఉండదు. ఈ కట్టుతో స్నానం చేయవచ్చు. స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొట్టవచ్చు. చర్మానికి అంటుకునేలా చుట్టే మెటీరియల్ మెత్తగా ఉండాలి, త్వరగా ఆరిపోయే స్వభావాన్ని కలిగి ఉండాలి. కాబట్టి డెల్టా డ్రైని ఇందుకోసం ఉపయోగిస్తున్నారు. దీని పైన వేసే సింథటిక్ రాయిలా గట్టిగా ఉండి అతుక్కునే ఎముకకు రక్షణ కల్పిస్తుంది. పిల్లలకు ఇలాంటి కట్లు ఎంతో ప్రయోజనకరం, సౌకర్యవంతం.

పిండి కట్టు ఎప్పుడు?

కొన్ని కట్టు బిగుసుకోడానికి ఆరు నుంచి ఎనిమిది నివిషాల సమయ నిడివి ఉంటుంది. కాబట్టి ఏదైనా పొరపాటు జరిగినా ఆ సమయంలోగా సరిదిద్దుకునే వెలుసుబాటు ఉంటుంది. కాబట్టి కొన్ని రకాల ఫ్రాక్చర్లకు ఈ కట్లు ఉపయోగకరంగా ఉంటాయి. పుట్టుకతోనే వంకర కాళ్లతో పుట్టిన పిల్లలకు, ఆ వంకరను సరిచేయడం కోసం వారానికో కట్టు చొప్పున పిండి కట్టు వేసుకుంటే కాళ్ల వంకర తగ్గిపోతుంది. ఇలా కొన్ని సందర్భాల్లో పిండి కట్ల అవసరం ఇప్పటికీ ఉంది.

పసరు కట్టు ప్రమాదకరం

ఆకు పసరును పిండి, అట్ట ముక్కలతో కట్టు కట్టేసే పసరు కట్లు ప్రమాదకరం. కొన్ని సందర్భాల్లో పూర్తిగా అవయవాలనే కోల్పోయే పరిస్థితి తలెత్తవచ్చు. ఒక ఐదేళ్ల పాపకు చేతి ఎముక విరిగి, బయటకు పొడుచుకు వచ్చిన సందర్భంలో ఆ పాప తల్లితండ్రులు పసరు కట్టును ఆశ్రయించారు. ఆ కట్టు వేసిన వ్యక్తి బయటకు పొడుచుకువచ్చిన ఎముకలను లోపలికి నెట్టి, సరిచేసి ఆకు పసరు పిండి, ఆకులను ఉంచి, కట్టు కట్టేశాడు. కానీ కండర గాయం అలాగే ఉండిపోవడంతో, ఇన్‌ఫెక్షన్ తలెత్తి జ్వరం, భరించలేని నొప్పితో పాప విలవిల లాడిపోయింది. దాంతో తల్లితండ్రులు పసరు కట్టు వేసిన వైద్యుని సూచన మేరకు ఆస్పత్రికి వచ్చినప్పుడు, కట్టు విప్పి చూస్తే అక్కడ మాంసాన్ని తింటున్న పురుగులు కనిపించాయి. పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉన్న ఆ చేతిని తొలగించడం తప్ప వేరే ప్రత్యామ్నాయం లేకుండా పోయింది. చేతిని తొలగించకపోతే ప్రాణాలకు ప్రమాదమనే విషయాన్ని తల్లితండ్రులకు అర్థమయ్యేలా చెప్పి ఒప్పించడానికి చాలా కష్టపడవలసి వచ్చింది. కాబట్టి ఎముకలు విరిగినప్పుడు ఇలాంటి నాటు వైద్యాలను ఆశ్రయించకూడదు.

డాక్టర్ గుడ్లూరు మనోజ్ కుమార్
కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ అండ్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, ఎమ్‌జిఎమ్ మెడికల్ సెంటర్, బంజారాహిల్స్, హైదరాబాద్.



ఫ్యామిలీ ప్లానింగ్

కుటుంబ నియంత్రణ ఇలా...

సురక్షితమైన కుటుంబనియంత్రణ పద్ధతులు ఎన్నో ఉన్నాయి. అయితే వాటిలో దేన్ని ఉంచుకోవాలనే విషయంలో అయోమయాలుంటాయి. కాబట్టి వైద్యుల సూచన మేరకు తగిన కుటుంబనియంత్రణ పద్ధతిని ఎంచుకోవడంతో పాటు, ఈ కింది విషయాల పట్ల కూడా అవగాహన పెంచుకోవాలి.
- ఎంత వ్యవధిలో మీకు తల్లి కావాలనే ఉద్దేశం ఉంది?
- ఒక్కో కుటుంబనియంత్రణ పద్ధతి సామర్థ్యం ఎంత?
- దుష్ప్రభావాలు ఏవైనా ఉంటాయా?
- మీరెంత తరచుగా సెక్స్‌లో పాల్గొంటారు?
- ఏ పద్ధతి మీ ఇద్దరికీ సౌకర్యంగా ఉంటుంది?

ఎంతో సమర్థమైన కుటుంబనియంత్రణ పద్ధతులు కూడా ఒక్కోసారి ఫెయిలవుతూ ఉంటాయి. కాబట్టి గర్భం దాల్చే అవకాశాలను సమర్థంగా అడ్డుకునే పద్ధతిని ఎంచుకోవాలి.

కుటుంబ నియంత్రణ పద్ధతులు:

- **ఫిమేల్ అండ్ మేల్ స్టెరిలైజేషన్:** సర్జరీ ద్వారా శాశ్వతంగా గర్భం రాకుండా చేయవచ్చు.
- **లాంగ్ యాక్టింగ్ రివర్సిబుల్ కాంట్రాసెప్టివ్స్:** ఈ విధానంలో శరీరం లోపల అమర్చే పరికరం ద్వారా 3 నుంచి పదేళ్లపాటు గర్భం రాకుండా నియంత్రించవచ్చు. పిల్లలు కావాలనుకున్నప్పుడు ఆ పరికరాన్ని తీసేయొచ్చు.
- **షార్ట్ యాక్టింగ్ హార్మోనల్ మెథడ్స్:** మాత్రలు, మినీ



పిల్స్, ప్యాచ్, షాట్, వెజైనల్ రింగ్ - వీటి ద్వారా గర్భధారణను అడ్డుకోవచ్చు. షాట్‌ను ప్రతి మూడు నెలలకూ తీసుకోవాలి. మాత్రలు, వెజైనల్ రింగ్ ప్రతి రోజూ వాడాలి.
- **బ్యారియర్ మెథడ్స్:** కండోమ్స్, డయాఫ్రమ్, స్పాంజ్, సర్వికల్ క్యాప్ - వీటిని లైంగికంగా కలిసే ప్రతిసారీ వాడాలి.
- **న్యాచురల్ రిథమ్ మెథడ్స్:** ఎలాంటి కుటుంబనియంత్రణ పద్ధతులూ పాటించకుండా అండాలు విడుదల కాని సమయంలో సెక్స్‌లో పాల్గొనవచ్చు. ఈ రోజులను కచ్చితంగా గుర్తించడం కోసం ఓవ్యులేషన్ హోమ్ టెస్ట్ కిట్ లేదా ఫర్టిలిటీ మానిటర్‌లను ఉపయోగించాలి. అయితే, ఉజ్జాయింపు లెక్కలతో పాటించే ఈ విధానం ఫెయిలయ్యే అవకాశాలూ ఎక్కువే!

హెల్త్ వెల్త్

బరువు తగ్గించే 'ప్రొటీన్ పేసింగ్'

ప్రొటీన్ డైట్‌తో బరువు తగ్గవచ్చనే సూత్రం ఆధారంగా రూపొందిన సరికొత్త డైట్ ట్రెండ్.. 'ప్రొటీన్ పేసింగ్'. దీని గురించి లోతుగా తెలుసుకుందాం!

ఈ డైట్‌లో భాగంగా బరువు, మెటబాలిజం, శక్తి ఖర్చుల ఆధారంగా రోజు మొత్తంలో ప్రొటీన్ ఇన్‌టేక్ తగ్గకుండా చూసుకుంటూ ఉండాలి. సాధారణంగా ప్రొటీన్ పేసింగ్‌ను క్రీడాకారులు అనుసరిస్తూ ఉంటారు. కానీ ప్రొటీన్ మెటబాలిజం డిజార్డర్లు లేని ఎవరైనా ఈ డైట్‌ను అనుసరించవచ్చు. శరీర బరువు, రోజు మొత్తంలో చేసే పనుల ఆధారంగా మొత్తం ప్రొటీన్ అవసరతను లెక్కించి, ఆ



పరిమాణాన్ని బహుళ భోజనాల రూపంలో రోజంతా తీసుకుంటూ ఉండాలి. ఇలా ప్రొటీన్ ఇన్‌టేక్‌ను రోజంతా సమమైన పరిమాణాల్లో తీసుకోవడం వల్ల ఆకలి తగ్గడంతో పాటు, కండరాల నిర్వహణ, మెటబాలిజంలు మెరుగుపడతాయి. ఈ విధానాన్ని అనుసరించడం వల్ల సంతృప్తిని పెరిగి ఆకలి తగ్గుతుంది. కాబట్టి అదనపు క్యాలరీలు శరీరంలో చేరే వీలు లేకుండా పోతుంది. ఆహార ప్రియత్వం, ఆహారం పట్ల విపరీతమైన వ్యామోహాలకు మనలోని ఎమ్‌సి4ఆర్, సిఫైఎఫ్ఐవిపి2 జన్యువులే ప్రధాన కారణాలు. ఈ రెండు చెడు జన్యువులను మచ్చిక చేసుకోవాలంటే ఆకలిని నియంత్రించే ఆహారం తినాలి. అందుకోసం ప్రొటీన్ పేసింగ్‌లో భాగంగా ప్రొటీన్‌ను ఎక్కువగా తినాలి. సాధారణంగా క్యాలరీలు తక్కువగా ఉండే ఆహారంతో బరువు తగ్గే ప్రయత్నం చేస్తూ ఉంటాం. కానీ ఇలాంటి డైట్‌తో కండరాలు క్షీణిస్తాయి. ప్రొటీన్ పేసింగ్‌లో ఆ సమస్య ఉండదు. ప్రొటీన్ వల్ల కండరాలు సంరక్షించబడతాయి. కాబట్టి ఆకలిని తగ్గించడం, క్యాలరీల ఇన్‌టేక్‌ను తగ్గించడం, మజిల్ మాస్‌ను సంరక్షించడం కోసం ప్రొటీన్ పేసింగ్‌ను అనుసరించవచ్చు.

ఫ్యాటీలివర్ డిసీజ్

కాలేయం దెబ్బతింది అనగానే మన ఆలోచన మద్యం మీదకు మళ్లుతుంది. మద్యంతోనే కాలేయానికి కొవ్వు పడుతుందనేది కూడా అపోహే! అస్తవ్యస్థ ఆహార, జీవనశైలులు కూడా కాలేయ కొవ్వుకు కారణాలే! వీటిని నియంత్రించుకోకపోతే పరిస్థితి కాలేయ మార్పిడికి దిగజారే ప్రమాదం ఉంటుంది.



కాలేయానికి కొవ్వు ముప్పు

సాధారణ ఆరోగ్య పరీక్షల్లో గ్రేడ్ వన్ ఫ్యాటీ లివర్ బయటపడుతూ ఉంటుంది. దీన్ని మనలో ఎవరం పెద్దగా పట్టించుకోం. ఇదేమంత ప్రమాదకరమైన పరిస్థితి కాదనీ, అందర్లో ఈ పరిస్థితి ఉంటుందనీ మనకి మనం నచ్చజెప్పుకుని సంతృప్తి పడుతూ ఉంటాం. కానీ దీన్ని, ముంచుకురాబోయే ప్రమాదానికి ముందస్తు హెచ్చరికలా పరిగణించాలి.

ఫ్యాటీ లివర్ ఎందుకు?

కాలేయానికి చక్కెర, కొవ్వు ప్రధాన శత్రువులు. శరీర ఎత్తుకు సరిపడా బరువు ఉండాలి. అంతకు మించితే శరీరంలో కొవ్వు పేరుకుపోతూ ఉంటుంది. ఆరడుగుల వ్యక్తి 75 కిలోల బరువున్నా పర్వాలేదు. అదే వ్యక్తి 5 అడుగుల ఎత్తే ఉంటే, అది అవసరానికి మించిన బరువు అవుతుంది. ఈ పరిస్థితిని బాడీ మాస్ ఇండెక్స్ ద్వారా ఎవరికి వారు తెలుసుకోవచ్చు. బిఎమ్ఐ ఎంత ఎక్కువగా ఉంటే శరీరంలో కొవ్వు అంత ఎక్కువగా ఉందని అర్థం. శరీరంలో ఎంత ఎక్కువ కొవ్వు ఉంటే, కాలేయంలో కొవ్వు కణాలు కూడా అంత ఎక్కువగా ఉన్నాయని అర్థం. ఒకవేళ శరీర బరువు అదుపులో ఉన్నా, మధుమేహం ఉన్నా, కొవ్వు కాలేయంలో పేరుకుంటుంది. ఇందుకు కారణం రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడమే! కాబట్టి ఒబేసిటీ, మధుమేహం... ఈ రెండు సమస్యలూ కాలేయంలో కొవ్వు పేరుకునేలా చేస్తాయని తెలుసుకోవాలి.

ఇలా కనిపెట్టొచ్చు

ఫ్యాటీ లివర్... గ్రేడ్ 1, 2, 3 ... ఈ మూడు దశలు దాటిన తర్వాత ఫైబ్రోసిస్‌లో కూడా 3 గ్రేడ్లను దాటి, అంతిమంగా సిర్రోసిస్‌కు చేరుకుంటుంది. ఇలా దశలు దాటుకుని తిరిగి బాగుచేయలేనంతగా కాలేయం పాడవకుండా ఉండాలంటే ఫ్యాటీ లివర్ పరిస్థితిని ప్రారంభంలోనే తీవ్రంగా పరిగణించి, అక్కడితో అడ్డుకట్ట వేయాలి. ఫ్యాటీ లివర్ మొదటి మూడు దశలు, ఫైబ్రోసిస్‌లో మొదటి రెండు దశల్లో కూడా ఎటువంటి లక్షణాలూ కనిపించకపోవచ్చు. కాబట్టే కాలేయం తిరిగి సరిదిద్దలేనంతగా, తీవ్రంగా డ్యామేజ్ అయిన తర్వాతే తెలుసుకునే పరిస్థితి ఉంటోంది. సిర్రోసిస్ దశ దాటే సమయంలో మాత్రమే కామెర్లు, రక్తపు వాంతులు, పొట్టలో నీరు చేరడం లాంటి తీవ్రమైన లక్షణాలు బయల్పడతాయి. కాబట్టి అల్ట్రాసౌండ్, లివర్ ఫంక్షన్ పరీక్షల ద్వారా ఎవరికి వారు తమ కాలేయ ఆరోగ్యాన్ని తెలుసుకుంటూ ఉండాలి. మధుమేహులైతే 25 ఏళ్ల వయసు నుంచీ, స్థూలకాయులు పాతికేళ్ల వయసు నుంచీ, మధుమేహం సమస్య లేకుండా, ఎత్తుకు సరిపడా బరువు ఉన్నవాళ్లు 50వ ఏట నుంచీ ప్రతి ఆరు నెలలకోసారి ఈ పరీక్షలు చేయించుకోవాలి. ఫ్యాటీ లివర్ ఏ వయసులోనైనా రావచ్చు. కాబట్టి వయసు, మధుమేహం, అధిక బరువు ఆధారంగా ఫ్యాటీ లివర్ వచ్చే అవకాశాలను అంచనా వేసుకుని, పరీక్షలతో నిర్ధారించుకుంటూ ఉండాలి.



నియంత్రణ ఇలా...

మధుమేహం వంశపారంపర్య సమస్య కాబట్టి దాన్ని నియంత్రించే అవకాశం లేదు. అయితే మెరుగైన ఆహారంతో, ముందు జాగ్రత్త చర్యలతో మధుమేహాన్ని వాయిదా వేయవచ్చు. మధుమేహం వచ్చినా, తగిన మోతాదుల్లో మందులు వాడుకుంటూ, ఆహార నియమాలు పాటిస్తూ కూడా నియంత్రణలో ఉంచుకోవచ్చు. ఫ్యాటీ లివర్ తొలి దశలోనే ఉన్నప్పుడు దాన్ని జీవనశైలి మార్పులతో మెరుగు పరుచుకోవచ్చు. బరువు తగ్గించుకుని, సమతులాహారం, క్రమం తప్పని వ్యాయామంతో ఈ స్థితిలో ఉన్న కాలేయాన్ని సరిదిద్దుకోవచ్చు. ఒకవేళ ఫ్యాటీ లివర్ గ్రేడ్ పెరిగి కాలేయ పనితీరును ప్రభావితం చేస్తుంటే, ఎల్ఎఫ్‌టి, అల్ట్రాసౌండ్ స్కాన్, ఎమ్మారైలతో తీవ్రతను అంచనా వేసి జీవనశైలి మార్పులను అనుసరించడంతో పాటు, కొన్ని మందులను కూడా వాడుకోవలసి ఉంటుంది. సమస్య మరింత తీవ్రమైన సందర్భాల్లో కాలేయ మార్పిడి అవసరం అవుతుంది. ఫ్యాటీ లివర్ కేన్సర్‌కు కూడా దారి తీయవచ్చు.



ఫ్యాటీ లివర్ రాకుండా..
- బరువు అదుపులో ఉంచుకోవాలి
- మధుమేహాన్ని మందులతో నియంత్రణలో ఉంచుకోవాలి
- రెడ్ మీట్ తగ్గించాలి (మటన్, పోర్క్, బీఫ్)
- క్రమం తప్పక వ్యాయామం చేయాలి
- జంక్‌ఫుడ్ తగ్గించాలి
- హైపో థైరాయిడ్‌ను మందులతో నియంత్రణలో ఉంచుకోవాలి
- అధిక కొలెస్ట్రాల్‌ను మందులతో అదుపులో పెట్టుకోవాలి
- మద్యం మానేయాలి

డాక్టర్ ఆర్.వి. రాఘవేంద్ర రావు
సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ అండ్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్, రెనోవా హాస్పిటల్, బంజారాహిల్స్, హైదరాబాద్.



మీకు తెలుసా?

నీరసం ఇలా దూరం

అదే పనిగా నీరసం వేధిస్తుంటే మన ఆహార, జీవనశైలులను పరిశీలించుకుని తగిన మార్పులు చేసుకోవాలి. నీరసాన్ని తగ్గించుకోవడం కోసం ఈ కింది అంశాలను గమనించుకోవాలి.

ఆహారం ఇలా: శక్తిని అందించే ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలి. అందుకోసం అరటిపండ్లు, బ్రౌన్ రైస్, చేపలు, చిలగడ దుంపలు, గుడ్లు, ఓట్స్, క్వినోవా, అవకాడోలను ఆహారంలో చేర్చుకోవాలి.

వ్యాయామం: వ్యాయామంతో శరీరం, మనసు చలాకీగా మారతాయి. కాబట్టి ప్రతి రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం అవసరం.

చక్కెర: చక్కెర శారీరక శక్తిని హరిస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలు విపరీతంగా పెరుగుతూ, తరుగుతూ ఉంటే, నిస్సత్తువ ఆవరిస్తుంది. అలాగే ప్రాసెస్డ్ పదార్థాలను తినడం మానేయాలి. పాలిష్ పట్టని బియ్యం, గోధుమలను తీసుకోవాలి.

ప్రొటీన్: ప్రొటీన్ అధికంగా పదార్థాలను స్నాక్స్‌గా తీసుకోవాలి. ఇందుకోసం యాపిల్, పీనట్ బటర్, ఉడకబెట్టిన గుడ్లు, పాప్‌కార్న్, వేయించిన శనగలు తినాలి.

విశ్రాంతి: అలసటగా అనిపించినప్పుడు విశ్రాంతి తీసుకోవడం అవసరం. శరీరానికి సరిపడా విశ్రాంతి దక్కకపోయినా, నీరసం, నిస్సత్తువ ఆవరిస్తాయి.

విటమిన్ డి: విటమిన్ డి లోపం కూడా నిస్సత్తువకు కారణమే! కాబట్టి వైద్యుల సలహా మేరకు డి విటమిన్ లోపాన్ని పరీక్షించుకుని సప్లిమెంట్ రూపంలో తీసుకోవాలి. అలాగే, ఉదయం, సాయంకాలపు నీరెండలో కనీసం 15 నిమిషాల పాటైనా గడుపుతూ ఉండాలి.

సంగీతం: శ్రావ్యమైన సంగీతంతో శరీరంలో ఎండార్ఫిన్లు విడుదలవుతాయి. ఇవి శరీరాన్ని చలాకీగా ఉంచడానికి తోడ్పడతాయి. కాబట్టి రోజులో కొంత సేపు నచ్చిన సంగీతం వినాలి.

చల్ల నీళ్ల స్నానం: చల్లదనం కండరాలను బలపరుస్తుంది. మెటబాలిజంను పెంచుతుంది. కాబట్టి చల్లనీటితో స్నానం చేస్తూ ఉండాలి.

నవ్వడం: నవ్వడం వల్ల ఒత్తిడి తగ్గి, ఇమ్యూనిటీ పెరుగుతుంది. అలాగే నిస్సత్తువ కూడా దూరమవుతుంది. అందుకోసం స్నేహితులతో సరదా సమయం గడపడం, పిల్లలతో ఆడుకోవడం, కామెడీ సినిమాలు, షోలు చూడడం చేయాలి.



నీళ్లు: సరిపడా నీళ్లు తాగకపోయినా నిస్సత్తువ వేధిస్తుంది. కాబట్టి రోజులో రెండు నుంచి మూడు లీటర్లకు సరిపడా నీళ్లు తాగుతూ ఉండాలి.

కాఫీ: పరిమితంగా కాఫీ తాగడం వల్ల ప్రయోజనం ఉంటుంది. కాఫీలోని కెఫీన్ శరీరాన్ని చురుగ్గా ఉంచుతుంది.

వాసనలు: పెప్పర్‌మింట్, దాల్చిన చెక్క, నిమ్మ, రోజ్‌మేరీ ఎసెన్షియల్ నూనెలను డిఫ్యూజర్‌లో వేసి వాసనలు పీల్చడం వల్ల ఫలితం ఉంటుంది.

నిద్ర: 8 గంటలకు తగ్గకుండా నిద్రపోవాలి. నిద్రలేమి బడలికను కలిగిస్తుంది.

స్పోర్ట్స్

హైదరాబాద్ ● మంగళవారం 13 ఆగస్టు 2024

వినేశ్ అప్పీలుపై తీర్పు నేడే

న్యూఢిల్లీ: రెజ్లర్ వినేశ్ ఫొగట్ అనర్హతపై ఎలాంటి తీర్పు రానుందోనని యావత్ క్రీడా ప్రపంచం ఊపిరిబిగబట్టి ఆత్రుతగా ఎదురుచూస్తోంది. పారిస్ ఒలింపిక్స్ మహిళల 50 కిలోల కేటగిరీలో ఫొగట్ కేవలం 100 గ్రాముల అధిక బరువు ఉందనే కారణంతో ఆమెను ఫైనల్లో పాల్గొనకుండా అనర్హత వేటు వేశారు. దీనిపై ఆమె కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (కాస్)ను ఆశ్రయించింది. కనీసం తనకు రజతమైనా ఇచ్చేలా ఆదేశాలు జారీ చేయాలని కాస్‌కు వినేశ్ అప్పీలు చేసుకుంది. దీనిపై వాదనలు జరగగా.. మంగళవారం తుది తీర్పు వెలువడనుంది. కాగా, నిబంధనల ప్రకారం రెండు రజతాలు ఇవ్వడం సాధ్యం కాదని యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ చీఫ్ లలోవిచ్ చెప్పాడు. కానీ, కోర్టు తీర్పు ప్రకారం నడుచుకొంటామని తెలిపాడు.

రెజ్లర్‌దే 'బరువు' బాధ్యత

ఐఓఏ చీఫ్ ఉష



న్యూఢిల్లీ: బరువు విషయంలో అథ్లెట్లదే బాధ్యతని భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు పీటీ ఉష స్పష్టంజేసింది. పారిస్ ఒలింపిక్స్‌లో కేవలం 100 గ్రాముల అధిక బరువు కారణంగా ఫైనల్‌కు దూరమైన రెజ్లర్ వినేశ్ ఫొగట్ బరువును నియంత్రించడంలో విఫలమయ్యారంటూ భారత బృందం వైద్యుడు పార్థీవాలాపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ విమర్శలను పీటీ ఉష కొట్టి పారేసింది. 'రెజ్లింగ్, వెయిట్‌లిఫ్టింగ్, బాక్సింగ్, జూడో విభాగాల్లో.. బరువు, ఫిట్‌నెస్ విషయాల్లో ఆ అథ్లెట్, వారి కోచ్‌దే బాధ్యత. అంతేతప్ప ఆ విషయంలో ఐఓఏ నియమించిన ముఖ్య వైద్యాధికారి దిన్షా పార్థీవాలా, అతడి బృందానికి సంబంధం లేదు. అందువల్ల పార్థీవాలపై ఆరోపణలు అర్థరహితం' అని ఉష పేర్కొంది.

వెయింగ్ రూల్స్‌లో మార్పులు?

న్యూఢిల్లీ: వినేశ్ ఫొగట్‌పై అనర్హత వేటు క్రీడావర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలో రెజ్లర్ల వెయింగ్ (బరువు తూచడం) విషయంలో మార్పులు చేయాలని యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ ఆలోచిస్తున్నట్టు సమాచారం. అథ్లెట్ల ఆరోగ్యం, శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని చేసే నిబంధనల సడలింపులు వీలైనంత త్వరగా అమల్లోకి వస్తాయని భావిస్తున్నారు. తన కేటగిరీలో కేవలం 100 గ్రాముల అధిక బరువు ఉందనే కారణంతో తనను ఫైనల్లో పాల్గొనకుండా అనర్హత వేటు వేయడాన్ని సవాల్ చేస్తూ వినేశ్.. కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్‌ను ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో కొందరు మాజీ రెజ్లర్లు వెయింగ్ నిబంధనలు మార్చాలని సూచిస్తున్నారు. వరల్డ్‌కప్‌తోపాటు కొన్ని ప్రముఖ టోర్నీల్లో రెండు కిలోల బరువు వరకు అనుమతిస్తున్నారు. కానీ విశ్వక్రీడల్లో వెసులుబాటు ఇవ్వడం లేదు. అయితే, రెండోరోజు పోటీల్లో పాల్గొనే రెజ్లర్లకు ఒక కిలో అదనంగా బరువు ఉన్నా అనుమతించాలని అమెరికా రెజ్లింగ్ గ్రేట్ జోర్డాన్ బర్రోగ్స్ సూచించాడు.

మెరుపులు.. మరకలు

వేలాదిమంది అథ్లెట్లు పాల్గొనే ఒలింపిక్స్ ఫ్యాన్స్‌ను ఎంత ఉర్రూతలూగిస్తాయో అంతకుమించి వివాదాలూ సృష్టిస్తాయి. పారిస్ విశ్వక్రీడలు కూడా అందుకు మినహాయింపు కాదు. పక్షం రోజులకుపైగా ప్రపంచ క్రీడాభిమానులకు మజా పంచిన పారిస్ క్రీడల్లో మెరుపులు, మరకలపై ఓ లుక్కేద్దాం.



(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

'సాంస్కృతిక' పొరపాట్లు

ప్రారంభోత్సవంలో ప్రదర్శించిన కొన్ని సాంస్కృతిక కార్యక్రమాలు జీసస్‌ను, క్రైస్తవ మతాన్ని కించపరిచేలా ఉన్నాయని విమర్శలొచ్చాయి. అయితే మానవుల మధ్య హింస ఎంత అసంబద్ధమో చాటిచెబుతూ ప్రదర్శించిన ఆ కార్యక్రమాల వెనుక ఉద్దేశం మంచిదే అయినా..ప్రదర్శించిన తీరులో పొరపాట్లు జరిగాయని నిర్వాహకులు వివరించుకున్నారు. ఇక, పరేడ్‌లో దక్షిణ కొరియా అథ్లెట్లను ఉత్తర కొరియా అథ్లెట్లుగా ఉచ్ఛరించడం పెద్ద దుమారం లేపింది. ఇందుకు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ క్షమాపణలు చెప్పాల్సి వచ్చింది. క్రీడా గ్రామంలో సౌకర్యాలపై అథ్లెట్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తంజేశారు. అమెరికన్ టెన్నిస్ స్టార్ కొకొ గాఫ్ అరకొర సౌకర్యాలపై ఫిర్యాదు కూడా చేసింది. పారిస్‌లో ఎండ అదరగొట్టడంతో..క్రీడా గ్రామంలో ఏసీలు లేక అథ్లెట్లు ఉక్కిరిబిక్కిరయ్యారు. దాంతో కొందరు స్టార్ ఆటగాళ్లు నగరంలోని లగ్జరీ హోటళ్లకు వెళ్లిపోయారు. పారిస్‌లో భారత ఎంబసీ అధికారులు తమ క్రీడాకారులకోసం 40 ఏసీలు ఏర్పాటు చేయాల్సి రావడం గమనార్హం.

మను మరో చరిత్ర



భారత షూటింగ్ సంచలనం మను భాకర్ రెండు కాంస్య పతకాలతో కొత్త చరిత్ర లిఖించింది. మహిళల 10 మీ. ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో, 10 మీ. ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ విభాగంలో సరబ్ జోత్‌తో కలిసి కాంస్య పతకాలు కొల్లగొట్టింది. మూడో పతకాన్ని త్రుటిలో చేజార్చుకుంది.

నీరజ్ వర్సెస్ నదీమ్



భారత్ స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా స్వర్ణానికి పాకిస్థాన్ అథ్లెట్ అర్షద్ నదీమ్ అడ్డు పడ్డాడు. అంచనాలను తలకిందులు చేస్తూ..డిఫెండింగ్ చాంప్ నీరజ్‌ను వెనక్కు నెట్టిన అర్షద్ ఒలింపిక్ రికార్డ్ (92.97 మీటర్లు)తో పసిడి పతకం చేజిక్కించుకున్నాడు.

ఆసీస్ చిన్నది.. అదరగొట్టింది

ఆస్ట్రేలియాకు చెందిన స్కేట్‌బోర్డ్ సంచలనం ఆరిసా ట్రె పారిస్‌లో అదరగొట్టింది. 14 ఏళ్ల ఈ చిన్నది ఫైనల్లో పింక్ హెల్మెట్‌తో బరిలోకి దిగి ఏకంగా స్వర్ణ పతకం దక్కించుకుంది. ఇలా, విశ్వక్రీడల్లో పసిడి నెగ్గిన పిన్న వయసు ఆసీస్ అథ్లెట్‌గా ఆరిసా రికార్డుకెక్కింది.

స్విమ్మర్ల అస్వస్థత

కాలుష్య ప్రమాణాలు తక్కువ స్థాయిలో ఉన్న సెన్ నదిలో పోటీలు నిర్వహించడంపై స్విమ్మర్లు ఆగ్రహం వ్యక్తంజేశారు. నదిలోని ఈ కోలీ బాక్టీరియాతో బెల్జియం స్విమ్మర్ క్లేరీ మిచెల్ అస్వస్థతకు గురైంది. దాంతో బెల్జియం జట్టు మిక్స్‌డ్ రిలే ఈవెంట్ నుంచి వైదొలగింది. ట్రయాథ్లెట్లు బ్రీఫర్డ్ (స్విట్జర్లాండ్), మిస్లావ్‌చుక్ (కెనడా), ఓ స్వర్ణం, రజతం నెగ్గిన ఐర్లాండ్ స్విమ్మర్ డానియల్ వైఫెన్ పోటీల అనంతరం అస్వస్థతకు లోనయ్యారు.


బాక్సర్ల లింగ వివాదం





లింగ నిర్ధారణ పరీక్షల్లో విఫలమై నిరుడు ప్రపంచ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్ నుంచి అనర్హతకు గురైన అల్జీరియాకు చెందిన ఇమేని ఖెలీఫ్, తైవాన్ బాక్సర్ లీ యు టింగ్‌లను ఒలింపిక్స్‌లో పోటీపడడంపై తీవ్ర దుమారం నెలకొంది. పురుష లక్షణాలున్న వీరిద్దరినీ మెగా ఈవెంట్‌లో ఎలా ఆడిస్తారంటూ చాలామంది తప్పుపట్టారు. అయితే, లింగ వివాదం ఏర్పడినా.. ఖెలిఫ్, లీ యు స్వర్ణ పతకాలు సాధించడం విశేషం.

తిరుగులేని బైల్స్



అమెరికా జిమ్నాస్టిక్ సూపర్ స్టార్ సిమోన్ బైల్స్ పారిస్‌లో తనదైన ముద్ర వేసింది. ప్రాక్టీస్‌లో గాయపడ్డా ఏకంగా హ్యాట్రిక్ స్వర్ణాలతోపాటు ఓ కాంస్య పతకాన్ని కైవసం చేసుకొని మహిళా జిమ్నాస్టిక్స్‌లో తనకు ఎదురు లేదని చాటింది.

లైల్స్..ఫొటో ఫినిష్‌లో



నోవా లైల్స్ రూపంలో పురుషుల 100 మీటర్ల స్ప్రింట్‌లో కొత్త స్టార్ వచ్చాడు. అయితే ఈ ఫైనల్ రేసు రేపిన ఉత్కంఠ అంతా ఇంతా కాదు. అమెరికా స్టార్ నోవా లైల్స్, జమైకా అథ్లెట్ కిషానే థామ్సన్ నువ్వా..నేనా అనేలా తలపడి కళ్లుమూసి తెరిచేలోపు రేస్‌ను పూర్తి చేశారు. దాంతో విజేతను తేల్చేందుకు ఫొటోఫినిష్‌ను ఆశ్రయించాల్సి వచ్చింది. సెకనులో ఐదువేల వంతు తేడాతో లైల్స్ విజేతగా నిలిచాడు. అనంతరం లైల్స్ కొవిడ్ బారిన పడినా..200 మీ. పరుగులో కాంస్యం నెగ్గాడు.

అనర్హతపై వివాదం



భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగట్‌పై అనర్హత పారిస్ ఒలింపిక్స్‌లో ప్రకంపనలు సృష్టించింది. 100 గ్రాముల బరువు అదనంగా ఉందనే కారణంతో మహిళల 50 కి. ఫ్రీస్టయిల్ రెజ్లింగ్ ఫైనల్ నుంచి ఆమెను డిస్‌క్వాలిఫై చేశారు. ఈ ఘటనపై యావద్భారత దేశంలో ఆగ్రహం పెల్లుబికింది. తనపై వేటును క్రీడా మధ్యవర్తిత్వ న్యాయస్థానంలో వినేశ్ సవాల్ చేసిన సంగతి తెలిసిందే.

దులీప్ ట్రోఫీలో స్టార్లు

బరిలో పంత్, రాహుల్, గిల్, సూర్య, జడేజా, షమి

రోహిత్, విరాట్, బుమ్రా దూరం

వచ్చేనెల 5న అనంతపురంలో టోర్నీ ప్రారంభం




ముంబై: శ్రీలంకతో పరిమిత ఓవర్ల సిరీస్ ముగిశాక భారత క్రికెట్ జట్టు ఆటగాళ్లు పూర్తి విశ్రాంతిలోనే ఉన్నారు. బంగ్లాదేశ్‌తో సెప్టెంబరు 19న ఆరంభమయ్యే టెస్టు సిరీస్ వరకు జట్టుకు ఎలాంటి షెడ్యూల్ లేదు. అయితే ఈ విరామాన్ని వినియోగించుకుని ఫిట్‌నెస్, ఫామ్‌ను కాపాడుకునేందుకు టీమిండియా ప్లేయర్లు దేశవాళీల్లో ఆడాలనేది కొత్త కోచ్ గంభీర్ ఆలోచన. ఈమేరకు వచ్చే నెల 5 నుంచి 22 వరకు నాలుగు జట్ల మధ్య జరిగే దులీప్ ట్రోఫీలో పాల్గొంటే బంగ్లాతో సిరీస్‌కు సన్నాహకంగానూ ఉపయోగపడుతుందని బీసీసీఐ కూడా భావిస్తోంది. ఈ నేపథ్యంలో గిల్, రాహుల్, సూర్యకుమార్, సర్ఫరాజ్, జైస్వాల్, రజత్ పటీదార్, అక్షర్ పటేల్, కుల్దీప్, జడేజా, పేసర్ షమి, ఇషాన్ కిషన్‌తో పాటు రెండేళ్ల తర్వాత రిషభ్ పంత్ కూడా తెలుపు జెర్సీ వేసేందుకు రెడీ అవుతున్నాడు. అయితే వెటరన్లు రోహిత్, విరాట్ కోహ్లీ, అశ్విన్, బుమ్రాలకు మినహాయింపు ఇచ్చినట్టు సమాచారం. దులీప్ ట్రోఫీలో చూపిన ప్రతిభ ఆధారంగా బంగ్లాతో టెస్టు సిరీస్‌కు అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ ఈనెలాఖరులో ఆటగాళ్లను ఎంపిక చేయనుంది. గతంలో ఇది జోనల్ పద్ధతిన ఆరు జట్లతో నిర్వహించేవారు. కానీ ఈసారి ఇండియా ఎ, బి, సి, డి అనే పేర్లతో నాలుగు జట్లను ఏర్పాటు చేశారు. ఒక్కో టీమ్ మరో మూడు జట్లతో ఆడుతుంది. పట్టికలో టాప్‌లో నిలిచిన జట్టు విజేతగా నిలుస్తుంది.

ఓ మ్యాచ్ వేదిక మార్పు: 17 రోజుల పాటు నిర్వహించే దులీప్ ట్రోఫీ షెడ్యూల్ ప్రకారం.. అనంతపురం క్రికెట్ గ్రౌండ్ కాంప్లెక్స్‌లోని రెండు వేదికల్లో మ్యాచ్‌లన్నీ జరగాల్సి ఉంది. అయితే ఆరంభ రెండు మ్యాచ్‌ల్లో ఒకదాన్ని మాత్రం బెంగళూరుకు తరలించనున్నారు.

ఆత్మహత్య చేసుకున్నాడు

గ్రాహం థోర్ప్‌ది సహజ మరణం కాదన్న భార్య



లండన్: ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ గ్రాహం థోర్ప్‌ది సహజ మరణం కాదని అతడి భార్య అమండా వెల్లడించింది. ఈనెల 5న థోర్ప్ అనారోగ్య కారణాలరీత్యా కన్నుమూసినట్టు వార్తలు వచ్చాయి. అయితే రెండేళ్లుగా మానసిక, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న తన భర్త థోర్ప్ డిప్రెషన్‌కు గురయ్యాడని అమండా పేర్కొంది. తాను లేకపోతేనే కుటుంబం బాగుంటుందనే భావనకు లోనై అతడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని చెప్పింది. 2022, మేలోనూ థోర్ప్ సూసైడ్ కోసం ప్రయత్నించి చాలా రోజులు ఐసీయూలో ఉన్నాడని గుర్తుచేసింది. డిప్రెషన్ నుంచి కోలుకునేందుకు చికిత్స చేయించినప్పటికీ ఫలితం లేకపోయిందని ఆవేదన చెందింది. 1993-2005 వరకు ఇంగ్లండ్ తరఫున థోర్ప్ 100 టెస్టులు, 82 వన్డేలు ఆడాడు.

నీరజ్ రాక మరింత ఆలస్యం

న్యూఢిల్లీ: ఒలింపిక్స్‌లో రజతం సాధించిన జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా స్వదేశం తిరిగి రావడానికి మరికొంత సమయం పట్టనుంది. పోటీలు ముగిసిన వెంటనే డాక్టర్‌ను కలవడానికి అతడు జర్మనీ వెళ్లినట్టు ఐఓఏ వర్గాలు తెలిపాయి. సెప్టెంబరులో జరిగే డైమండ్ లీగ్ ఫైనల్లో నీరజ్ పాల్గొనడం కూడా వైద్యుల సలహాపై ఆధారపడి ఉంటుంది. అతను గజ్జల్లో గాయానికి శస్త్రచికిత్స చేయించుకొనే అవకాశం ఉంది. రెండేళ్లుగా గాయంతో బాధపడుతున్నట్టు నీరజ్ ఇటీవలే చెప్పాడు. దీంతో చోప్రా భారత్‌కు చేరుకోవడానికి సుమారు రెండు నెలల సమయం పట్టవచ్చు.

డైవింగ్‌కు టామ్ వీడ్కోలు



లండన్: ఐదు ఒలింపిక్ పతకాలు నెగ్గిన బ్రిటన్‌కు చెందిన స్టార్ స్విమ్మర్ టామ్ డేలీ డైవింగ్ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. 30 ఏళ్ల టామ్ 2008 బీజింగ్ ఒలింపిక్స్‌తో తొలిసారి విశ్వక్రీడల్లో పాల్గొన్నాడు. 2012లో కాంస్యం, 2016లో కాంస్యం, 2020లో స్వర్ణం, కాంస్యం, ఈ ఏడాది పారిస్‌లో రజతంతో కలిపి మొత్తంగా ఐదు ఒలింపిక్ పతకాలు సాధించాడు. రిటైర్మెంట్ తీసుకోవడానికి ఇదే సరైన సమయంగా భావిస్తున్నానని టామ్ తెలిపాడు.

నాట్కో ఫార్మా లాభంలో 59% వృద్ధి

ఒక్కో షేరుకు 150% మధ్యంతర డివిడెండ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో నాట్కో ఫార్మా నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన 59 శాతం వృద్ధి చెంది రూ.668.50 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో కంపెనీ నికర లాభం రూ.420.30 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం రెవెన్యూ కూడా 21.6 శాతం వృద్ధి చెంది రూ.1,160.20 కోట్ల నుంచి రూ.1,410.70 కోట్లకు చేరింది. ఆర్థిక ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.3 మధ్యంతర డివిడెండ్ (150 శాతం)ను కంపెనీ డైరెక్టర్ల బోర్డు ప్రకటించింది. డివిడెండ్ చెల్లింపునకు రికార్డు తేదీగా ఈ నెల 23ను కంపెనీ ఖరారు చేసింది. కాగా ఈ నెల 30 నుంచి డివిడెండ్ చెల్లింపులను ప్రారంభించనున్నట్లు నాట్కో ఫార్మా తెలిపింది.

కావేరీ సీడ్ లాభం రూ.283 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కావేరీ సీడ్ జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.808.08 కోట్ల రెవెన్యూపై రూ.282.91 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే రెవెన్యూ 5.32 శాతం పెరగగా లాభం 5.63 శాతం వృద్ధి చెందింది. రుతుపవనాలు ఆశించిన స్థాయిలో ఉండటంతో మొక్కజొన్న, వరి, కూరగాయల విత్తనాల అమ్మకాలు గణనీయంగా పెరగటంతో పాటు ఎగుమతులు 452% పెరగటం కలిసివచ్చిందని పేర్కొంది.

34% పెరిగిన ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.24.3 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.18.1 కోట్లు)తో పోల్చితే లాభం 34 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో ఆదాయం కూడా 45 శాతం వృద్ధితో రూ.313.90 కోట్లకు చేరుకుంది. జూన్ త్రైమాసికంలో 156 ఎలక్ట్రిక్ బస్సులను డెలివరీ చేసినట్లు కంపెనీ పేర్కొంది. దీంతో ఇప్పటి వరకు డెలివరీ చేసిన బస్సుల సంఖ్య 1,902కి చేరగా చేతిలో 10,818 యూనిట్ల ఆర్డర్లు ఉన్నట్లు తెలిపింది.

ఎన్ఎండీసీ ఆదాయం రూ.5,779 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రభుత్వ రంగ సంస్థ ఎన్ఎండీసీ లిమిటెడ్.. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.5,779.07 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.1,963.35 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.5,688.87 కోట్లు, లాభం రూ.1,661.04 కోట్లుగా ఉంది. జూన్ త్రైమాసికంలో నిర్వహణపరంగా పనితీరు మెరుగుపరుచుకోవటం,టెక్నోలాజికల్ ఇన్నోవేషన్‌పై దృష్టి కేంద్రీకరించటం కలిసివచ్చిందని ఎన్ఎండీసీ సీఎండీ అమితవ ముఖర్జీ వెల్లడించారు. ఈ ఏడాది 5 కోట్ల టన్నుల ముడి ఇనుప ఖనిజ ఉత్పత్తి లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.

బీటీ గ్రూప్‌లో భారతికి 24.5% వాటా

డీల్ విలువ రూ.33,590 కోట్లు

● రెండో అతిపెద్ద వాటాదారుగా కంపెనీ ● బ్రిటన్‌కు కార్యకలాపాలు విస్తరించిన సునీల్ మిట్టల్

న్యూఢిల్లీ: టెలికాం దిగ్గజం సునీల్ భారతి మిట్టల్ నాయకత్వంలోని భారతి ఎంటర్‌ప్రైజెస్ తన కార్యకలాపాలను బ్రిటన్‌కు విస్తరిస్తోంది. ఇందులో భాగంగా ఆ దేశంలో బ్రాడ్‌బ్యాండ్, మొబైల్ టెలికాం సేవలు అందించే బ్రిటిష్ టెలికాం (బీటీ) గ్రూప్‌లో 24.5 శాతం వాటాను చేజిక్కించుకుంది. ఆల్టిస్ యూకే అనే సంస్థ నుంచి భారతి గ్రూప్ ఈ వాటాను కొనుగోలు చేసింది. అయితే ఇందుకు ఎంత మొత్తం ఖర్చు చేసిందీ కంపెనీ వెల్లడించలేదు. మార్కెట్ వర్గాలు మాత్రం ఈ డీల్ విలువ ఎంత లేదన్నా 400 కోట్ల డాలర్ల (సుమారు రూ.33,590 కోట్లు) వరకు ఉంటుందని అంచనా వేస్తున్నాయి. డీల్‌లో భాగంగా బీటీ గ్రూప్ విలువను 15,000 కోట్ల డాలర్లుగా లెక్కించారు.

డీల్ విజయవంతమైతే ఒక భారతీయ కంపెనీ.. విదేశాల్లో ఇంత పెద్ద మొత్తం పెట్టుబడిగా పెట్టడం ఇదే మొదటిసారి అవుతుంది. భారతి ఎంటర్‌ప్రైజెస్ తన అనుబంధ సంస్థ భారతి గ్లోబల్ ద్వారా ఈ కొనుగోలు జరిగింది. ఈ డీల్‌తో బీటీ గ్రూప్‌లో భారతి గ్రూప్ రెండో అతిపెద్ద వాటాదారుగా అవతరించనుంది. కాగా పెట్టుబడి లాభాల కోసమే బీటీ గ్రూప్‌లో వాటా కొనుగోలు చేసినట్లు భారతి ఎంటర్‌ప్రైజెస్ వెల్లడించింది.



అరుదైన అవకాశం

'బీటీ గ్రూప్‌లో ఇంత పెద్ద వాటా కొనుగోలు చేయడం అరుదైన అవకాశం' అని సునీల్ మిట్టల్ కుమారుడు, భారతి గ్లోబల్ కంపెనీ ఎండీ శ్రవిన్ భారతి మిట్టల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒక ఇన్వెస్టర్‌గా బీటీ గ్రూప్‌లో పెట్టుబడి పెట్టడానికి ఇదే సరైన సమయమని భావిస్తున్నట్టు పేర్కొన్నారు. భారతి గ్రూప్ ఛైర్మన్ సునీల్ మిట్టల్ కూడా ఈ కొనుగోలుపై హర్షం వ్యక్తం చేశారు. 'ఇది ఆకర్షణీయమైన దీర్ఘకాలిక పెట్టుబడి కొనుగోలు' అన్నారు. హోమ్ బ్రాడ్‌బ్యాండ్, ఫైబర్, మొబైల్, ఎంటర్‌ప్రైజెస్ ఆఫరింగ్ రంగాల్లో బీటీ గ్రూప్‌నకు మంచి పట్టు ఉన్న విషయాన్ని సునీల్ మిట్టల్ గుర్తు చేశారు. బీటీ కంపెనీ, యూకే మార్కెట్‌ను లోతుగా అర్థం చేసుకోవడమే ప్రస్తుతం తమ ప్రాధాన్యత అన్నారు. ఐరోపా దేశాల టెలికాం రంగంలో అవకాశం వస్తే, భవిష్యత్‌లో మరిన్ని కొనుగోళ్లకూ తాము సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు.

టాటా, మహీంద్రా సరసన భారతి గ్రూప్

భారత కంపెనీలు బ్రిటిష్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టడం కొత్తేమీ కాదు. టాటా గ్రూప్ ఇప్పటికే ఆ దేశ ఆటోమొబైల్, స్టీల్ రంగాల్లో ఉంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ తన న్యూ ఎనర్జీ సోలార్ లిమిటెడ్ అనే అనుబంధ సంస్థ ద్వారా బ్రిటన్‌కి చెందిన బ్యాటరీ టెక్ కంపెనీ ఫరాడియాన్ లిమిటెడ్‌ను 13.5 కోట్ల డాలర్లకు కొనుగోలు చేసింది. రిలయన్స్ బ్రాండ్స్ కూడా ఆ దేశానికి చెందిన ప్రముఖ టాయ్స్ స్టోర్ చెయిన్ హామ్లేస్‌ను 2019లోనే కొనుగోలు చేసింది. విప్రో, మహీంద్రా అండ్ మహీంద్రా, వెల్‌స్పన్, టీవీఎస్ గ్రూప్‌లు.. బ్రిటన్‌కు చెందిన బీఎస్ఏ, నార్టన్ కంపెనీలను కొనుగోలు చేశాయి. తాజాగా భారతి ఎంటర్‌ప్రైజెస్ ఈ కంపెనీల సరసన చేరింది.

సెబీ చీఫ్‌పై మా ఆరోపణలు పక్కా నిజం

ఆమే తన నిర్దోషిత్వం నిరూపించుకోవాలి: హిండెన్‌బర్గ్

న్యూఢిల్లీ: హిండెన్‌బర్గ్ రీసెర్చ్-సెబీ చీఫ్ మాధవి పురి బుచ్‌ల వివాదం కొనసాగుతోంది. సెబీలో చేరకముందు భారత్, సింగపూర్ దేశాల్లో ఆమె ఏర్పాటు చేసిన అఘోర అడ్వైజరీ లిమిటెడ్ (ఇండియా), అఘోర పార్ట్‌నర్స్ సింగపూర్ అనే రెండు కన్సల్టింగ్ సంస్థల ఖాతాదారుల వివరాలు బయటపెట్టి బుచ్ తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలని హిండెన్‌బర్గ్ సవాల్ చేసింది. ఈ వివరాలు బయటపెడితే ఆమె నిజ స్వరూపం ఏమిటో తెలుస్తుందని పేర్కొంది. ఈ రెండు కన్సల్టింగ్ సంస్థల్లో సెబీ చీఫ్‌కు ఇప్పటికీ 99 నుంచి 100 శాతం వాటాలు ఉన్నట్టు తెలిపింది.

వారే ఒప్పుకున్నారు: బుచ్ దంపతులు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో మారిషస్, బెర్ముడాల్లోని రహస్య ఫండ్స్‌లో తమకు పెట్టుబడులు ఉన్న విషయాన్ని వారే అంగీకరించిన విషయాన్ని హిండెన్‌బర్గ్ గుర్తు చేసింది. ఇవే ఫండ్స్‌లో అదానీ గ్రూప్ చీఫ్ గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీకీ అక్రమ పెట్టుబడులు ఉన్నట్టు హిండెన్‌బర్గ్ మరోసారి తెలిపింది. ఈ ఫండ్స్ ద్వారానే అదానీ గ్రూప్ లిస్టెడ్ కంపెనీల షేర్లలో దందా కొనసాగుతోందని ఆరోపించింది. బుచ్ దంపతులు విడుదల చేసిన ప్రకటన మరిన్ని కీలక ప్రశ్నలను లేవనెత్తుతోందని పేర్కొంది. పూర్తి నిజాలు బయట పడాలంటే సెబీ చీఫ్ పూర్తి పారదర్శకంగా ఉండే దర్యాప్తునకు సిద్ధపడాలని సవాల్ చేసింది.

కొత్తగా చెప్పేది ఏమీ లేదు: హిండెన్‌బర్గ్ సంస్థ.. సెబీ చీఫ్ మాధవిపై చేసిన ఆరోపణలపై కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నోరు మెదపడం లేదు. మాధవి పురి బుచ్, సెబీ దీనిపై ఇప్పటికే తమ వివరణ ఇచ్చినందున, ఈ విషయంలో కొత్తగా తాము చెప్పాల్సిందేమీ లేదని కేంద్ర ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి అజయ్ సేథ్ అన్నారు.

అదానీ షేర్లు ఢమాల్

- హిండెన్‌బర్గ్ తాజా ఆరోపణలతో ప్రారంభ ట్రేడింగ్‌లో భారీగా పతనం
- గ్రూప్‌లోని 10లో 8 కంపెనీలకు నష్టం
- రూ.22,064 కోట్ల గ్రూప్ సంపద ఆవిరి

ముంబై: అమెరికన్ షార్ట్ సెల్లింగ్, మార్కెట్ రీసెర్చ్ కంపెనీ హిండెన్‌బర్గ్ తాజా ఆరోపణలు సోమవారం అదానీ కంపెనీల షేర్లను భారీగా కుదిపేశాయి. ఈ ప్రభావంతో అదానీ గ్రూప్‌లోని అన్ని కంపెనీల షేర్లు ప్రారంభ ట్రేడింగ్‌లో భారీ పతనాన్ని చవిచూసినప్పటికీ మళ్లీ తేరుకున్నాయి. ఒకదశలో 5.5 శాతం క్షీణించిన అదానీ ఎంటర్‌ప్రైజెస్ 1.09 శాతం నష్టంతో సరిపెట్టుకుంది. ఇంట్రాడేలో 17 శాతం వరకు నష్టపోయిన అదానీ ఎనర్జీ సొల్యూషన్స్.. చివర్లో 3.7 శాతం నష్టం వద్ద ముగిసింది. ప్రారంభంలో అదానీ టోటల్ గ్యాస్ 13.39 శాతం, ఎన్‌డీటీవీ 11 శాతం, అదానీ పవర్ 10.94 శాతం, అదానీ గ్రీన్ ఎనర్జీ 6.96 శాతం, అదానీ విల్మర్ 6.49 శాతం, అదానీ పోర్ట్స్ 4.95 శాతం, అంబుజా సిమెంట్స్, ఏసీసీ 2 శాతానికి పైగా నష్టపోయాయి. అయితే, చివరికి గ్రూప్‌లోని 10 కంపెనీల్లో 8 నష్టాల్లో ముగియగా.. అంబుజా సిమెంట్స్, అదానీ గ్రీన్ ఎనర్జీ మాత్రం లాభాల్లోకి మళ్లాయి. ఒకదశలో రూ.1.13 లక్షల కోట్ల మేర తగ్గిన గ్రూప్ మార్కెట్ క్యాపిటలైజేషన్.. చివరికి రూ.22,064 కోట్ల నష్టంతో రూ.17 లక్షల కోట్ల ఎగువన నిలిచింది.

సెన్సెక్స్ 57 పాయింట్లు డౌన్ : తీవ్ర ఊగిసలాటలకు లోనైన దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం స్వల్ప నష్టాలతో సరిపెట్టుకున్నాయి. హిండెన్‌బర్గ్ తాజా ఆరోపణల కారణంగా అదానీ గ్రూప్ కంపెనీల షేర్లతో పాటు రిలయన్స్ ఇండస్ట్రీస్ స్టాక్స్‌లో అమ్మకాల కారణంగా ప్రారంభ ట్రేడింగ్‌లోనే సెన్సెక్స్ 480 పాయింట్ల వరకు నష్టపోయి 79,226 వద్దకు పడిపోయింది. అయినప్పటికీ సూచీ మళ్లీ తేరుకుని లాభాల్లోకి మళ్లింది. ఒకదశలో సూచీ ఇంట్రాడే కనిష్ఠ స్థాయి నుంచి 880 పాయింట్లు ఎగిసి 80,106 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. కానీ, ఆఖరి గంటలో అమ్మకాల కారణంగా సెన్సెక్స్ 56.99 పాయింట్ల నష్టంతో 79,648.92 వద్ద క్లోజైంది. కాగా, 24,212.10 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని, 24,472.80 వద్ద గరిష్ఠాన్ని నమోదు చేసిన నిఫ్టీ చివరికి 20.50 పాయింట్ల నష్టంతో 24,347 వద్ద ట్రేడింగ్‌కు ముగింపు పలికింది.

బిజినెస్

ధరల సెగ తగ్గిందోచ్..

ఐదేళ్ల కనిష్ఠానికి ద్రవ్యోల్బణం.. జూలైలో 3.54 శాతంగా నమోదు


న్యూఢిల్లీ: దేశంలో ధరల మంట తగ్గి సగటు జీవికి ఉపశమనం కలుగుతోంది. జూలై నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం ఐదేళ్ల కనిష్ఠ స్థాయి 3.54 శాతానికి దిగివచ్చింది. ప్రధానంగా ఆహార వస్తువుల ధరలు తగ్గడంతో పాటు బేస్ ఎఫెక్ట్ (గత ఏడాది ఇదే నెలలో ధరలు గరిష్ఠ స్థాయిల్లో కదలాడుతూ ఉండడం) ఇందుకు కారణమని విశ్లేషకులంటున్నారు. ఆర్‌బీఐ వడ్డీ రేట్ల నిర్ణయంలో ఈ ద్రవ్యోల్బణాన్నే పరిగణనలోకి తీసుకుంటుంది. ఈ కారణంగా అక్టోబరు ద్వైమాసిక సమీక్షలో వడ్డీ రేట్ల తగ్గింపు దిశగా చర్యలుండవచ్చని నిపుణులంటున్నారు. వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం జూన్ నెలలో 5.08% ఉండగా గత ఏడాది జూలైలో 7.44 శాతంగా నమోదైంది. కాగా 2019 సెప్టెంబరులో నమోదైన 3.99% తర్వాత ఇది ప్రభుత్వం ఆర్‌బీఐకి నిర్దేశించిన కట్టడి పరిధిలో కనిష్ఠ స్థాయి 4% దిగువకు రావడం ఇదే ప్రథమం.

అంధుల కోసం పీఎన్‌బీ డెబిట్ కార్డు

న్యూఢిల్లీ: దృష్టి లోపం ఉన్న వారి కోసం ప్రభుత్వ రంగంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ).. అంతర్‌దృష్టి బ్రెయిలీ డెబిట్ కార్డును విడుదల చేసింది. ఈ కాంటాక్ట్‌లెస్ నేషనల్ కామన్ మొబిలిటీ కార్డు రూపే నెట్‌వర్క్‌పై అందుబాటులో ఉంటుందని తెలిపింది. దృష్టి లోపం ఉన్న వారికి ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించి తమ ఆర్థిక వ్యవహారాలు తామే నిర్వహించుకునే విధంగా సాధికారత కల్పించాలన్నది తమ లక్ష్యమని పీఎన్‌బీ స్పష్టం చేసింది.

ప్రత్యక్ష పన్నుల వసూళ్లు రూ.6.93 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరాని (2024-25)కి సంబంధించి ఈ నెల 11 వరకు రూ.6.93 లక్షల కోట్ల నికర ప్రత్యక్ష పన్నులు వసూలయ్యాయి. ఇందులో వ్యక్తిగత ఆదాయ పన్నుల వాటా రూ.4.4 లక్షల కోట్లు. కార్పొరేట్ ట్యాక్స్ ద్వారా వసూలైన మొత్తం రూ.2.22 లక్షల కోట్లుగా ఉంది.




బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	70,580 ▲	64,700 ▲	87,500 ▼
ముంబై	69,890 ▲	64,019 ▲	81,124 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

13వ తేదీ



హైదరాబాద్	455	విజయవాడ	480
వరంగల్	457	గోదావరి	476
చిత్తూరు	493	విశాఖపట్నం	485
		డజను గుడ్లు రూ.	66

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	80	విజయవాడ	88
వరంగల్	80	గుంటూరు	88
కరీంనగర్	80	ఒంగోలు	88
మహబూబ్‌నగర్	80	చిత్తూరు	97
కర్నూలు	80	నెల్లూరు	97
విశాఖపట్నం	84	అనంతపురం	88
గోదావరి	88		

ఖరీఫ్ నుంచి ధాన్యం సొమ్ము
48 గంటల్లోనే

(మొదటి పేజీ తరువాయి)

హామీ ఇచ్చారు. ఏలూరు జిల్లా కేంద్రమైన ఏలూరులోని సీఆర్ రెడ్డి కళాశాల ఆడిటోరియంలో సోమవారం.. గత ప్రభుత్వ హయాంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రైతులకు చెల్లించాల్సిన రూ.472 కోట్లు ధాన్యం బకాయిలను విడుదల చేస్తూ చెక్కులను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ.. "సివిల్ సప్లయిస్ పేరిట గత వైసీపీ ప్రభుత్వం రూ.40,500 కోట్ల రుణాలు తీసుకుంది. రైతులను సంక్షోభంలోకి నెట్టివేసింది. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు కూడా చకుండా ఇబ్బంది పెట్టారు. జగన్ ప్రభుత్వం చేసిన ఆర్థిక అరాచకాలకు బ్యాంకులు భయపడిపోయాయి. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక మేము ఫోన్ చేస్తుంటే బ్యాంకర్లు ఫోన్లు కూడా ఎత్తడం మానేశారు. జగన్ సర్కారు బ్యాంకులకు చెల్లించాల్సిన బకాయిల్లో రూ.10వేల కోట్లు 2025 మార్చి 31వ తేదీ నాటికి చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నాం. రైతుల నుంచి ప్రతి ధాన్యం గింజా కొంటాం. రైతులకు అనుకూలంగా, సమీపంలో ఉండే మిల్లులకే ధాన్యం తరలిస్తాం. గతంలో దళారులు స్వార్థంతో రైతులను ఇబ్బందులు పెట్టారు. కంప్యూటర్ చీటీల సాకుతో ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను మిల్లర్ల చుట్టూ తిప్పారు. ఇకపై రైతులు మిల్లర్లకు, దళారులకు, వ్యాపార వేత్తలకు భయపడాల్సిన పనిలేదు. వ్యాపారవేత్తలే కాదు రైతులు కూడా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ చేయాలి. దానికి అనుగుణంగా చర్యలు చేపట్టాం. రైతులకు మా ప్రభుత్వం అండగా ఉంటుంది. వారికి బ్యాంకుల నుంచి రుణాలు అందేలా చర్యలు తీసుకుంటుంది. గత ప్రభుత్వం 84 వేల 724 మంది రైతులకు చెల్లించని రూ.1674.47 కోట్ల బకాయిలను మా కూటమి ప్రభుత్వం చెల్లిస్తోంది. రైతుల బకాయిల గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లగా, రైతులకు సంబంధించిన ఫైళ్లు వెంటనే పెట్టాలంటూ చెప్పారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగానే కష్టకాలంలోనూ వెయ్యికోట్ల బకాయిలు చెల్లించాం. మిగిలిన రూ.674 కోట్లు ఈ రోజు రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేశాం. ఇందులో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోనే రూ.472 కోట్లు ధాన్యం బకాయిలు సొమ్మును రైతులకు చెల్లిస్తున్నాం' అని తెలిపారు. అలాగే రైతులకు 50శాతం సబ్సిడీపై టార్పాలిన్లు అందిస్తామన్నారు.

రాష్ట్రంలో మరో 10 వేల రేషన్ డిపోలు

అమలాపురం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు బియ్యంతో పాటు ఇతర నిత్యావసర సరుకులను సులభతరంగా పంపిణీ చేసేందుకు వీలుగా మరో 10 వేల చౌక డిపోల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించిందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. ఇప్పటికే రాష్ట్రంలో 29వేల రేషన్ దుకాణాలు ఉన్నాయని, వీటికి అదనంగా 10 వేలు పెంచి త్వరలోనే నోటిఫికేషన్ జారీ చేస్తామని చెప్పారు. వీటి ద్వారా బియ్యం, కందిపప్పు, పంచదార, పామాయిల్ వంటి సరుకులను లబ్ధిదారులకు అందిస్తామని చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలోని కలెక్టరేట్‌లో రబీ సీజన్‌లో రైతులకు విడుదల చేయాల్సిన బకాయిలను సోమవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కిలో కందిపప్పు రూ.180 ఉండేదని, మిల్లర్లు, వ్యాపారస్తులతో మాట్లాడి ఆ రేటును రూ.150కు తగ్గించిన ఘనత తమ ప్రభుత్వానిదన్నారు.

ఆస్పత్రులను భ్రష్టు పట్టించారు



ఆరోగ్య శాఖ సమీక్షలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

- ప్రజల్లో నమ్మకం పూర్తిగా సన్నగిల్లింది
- ఆరోగ్యశాఖలో 2014-19 మధ్య అమలు చేసిన ఉత్తమ విధానాలు మళ్లీ ప్రవేశపెట్టండి
- తల్లులకు మళ్లీ ఎన్టీఆర్ బేబీ కిట్లు
- డోలీ మోతలు రిపీటైతే సహించను: సీఎం

అమరావతి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): అస్తవ్యస్త విధానాలతో గత ప్రభుత్వం ప్రభుత్వాస్పత్రులను భ్రష్టు పట్టించిందని సీఎం చంద్రబాబు విమర్శించారు. తద్వారా జనంలో నమ్మకం సన్నగిల్లిందని, మళ్లీ ఆ నమ్మకం కలిగించాలని అధికారులను ఆదేశించారు. సోమవారమిక్కడ వెలగపూడి సచివాలయంలో వైద్య ఆరోగ్యశాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ శాఖలో 2014-19 మధ్య అమలు చేసిన ఉత్తమ విధానాలను మళ్లీ ప్రవేశపెట్టాలన్నారు. ప్రభుత్వం తరఫు యాప్ రూపొందించి హెల్త్ కార్డు ద్వారా ఆస్పత్రిలో చేరిన వ్యక్తికి సంబంధించిన వివరాలు పొందుపరచాలని చెప్పారు. రోగికి అందించే వైద్య సేవలు, ఎక్విప్‌మెంట్, ఇచ్చే ఔషధాల వివరాలు కూడా ఉండాలని, ఇలా చేయడం వల్ల ఆస్పత్రి పనితీరు ఎలా ఉందో తెలుస్తుందన్నారు. రాష్ట్రంలో కిడ్నీ బాధితులు ఎంత మంది ఉన్నారో మండలాల వారీగా వివరాలు సేకరించాలని, కిడ్నీ సమస్యకు కారణాలపై అధ్యయనం చేయాలని ఆదేశించారు. కిడ్నీ వ్యాధులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న నీటి సదుపాయంపైనా లోతైన అధ్యయనం చేయాలని, గతంలో ఉద్దానంలో పూర్తిస్థాయిలో రీసెర్చ్ చేయడం వల్లే సమస్యను గుర్తించగలిగామన్నారు. ఉద్దానంలానే ఇప్పుడు మరికొన్ని ప్రాంతాల్లో కిడ్నీ సమస్యలు తలెత్తుతున్నాయని, పేదలకు అందుబాటులో ఉండేలా సీటీ స్కాన్ సేవలను ముందుగా అన్ని జిల్లా కేంద్ర ఆస్పత్రుల్లో ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రీ-ల్యాబ్ టెస్టుల అనంతరం పేషెంట్లకు సరైన విధానంలో మెడిసిన్ ఇవ్వగలిగితే 50 శాతం కంట్రోల్ చేయొచ్చన్నారు. రోగులకు డైట్‌ప్లాన్, న్యూట్రిషన్‌పై అవగాహన కల్పించగలిగితే వ్యాధుల నుంచి కాపాడవచ్చని చెప్పారు. రాష్ట్రంలో టీబీ రోగులు ఎంత మంది ఉన్నారో సమగ్ర అధ్యయనం చేసి వారికి నిరంతరం ఔషధం అందించాలని ఆదేశించారు. ఆస్పత్రుల్లో ప్రసవం తర్వాత శిశువుల విస్సింగ్ కేసులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, విస్సింగ్ కేసులు వస్తే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్టీఆర్ బేబీ కిట్స్‌ను మళ్లీ తల్లులకు అందించాలని, బేబీలకు అవసరమైన సామగ్రిని వాటి ద్వారా అందించాలని చెప్పారు. ప్రతి స్కూలులో పిల్లలకు కంటి పరీక్షలు చేసిన తర్వాత ఏం చర్యలు తీసుకున్నారో రిపోర్టు చేయాలన్నారు.

గ్రామీణులకు టెలిమెడిసిన్ సేవలు..

టెలిమెడిసిన్‌కు గతంలో వరల్డ్ బ్యాంకు నుంచి రూ.2,300 కోట్లు నిధులు తీసుకొచ్చామని చంద్రబాబు అధికారులకు గుర్తుచేశారు. కార్పొరేట్ లెవల్లో సేవలు అందించాలని నిర్ణయించామని, గ్రామాల్లో ఉండేవారికి టెలిమెడిసిన్ ద్వారా మంచి డాక్టర్లతో వైద్య సేవలు అందించాలని నిశ్చయిస్తే.. గత ప్రభుత్వం సరిగా అమలు చేయలేదన్నారు. టెలిమెడిసిన్‌పై ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలు అధ్యయనం చేసి రాష్ట్రంలోనూ అమలుకు కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. అంగవైకల్యంతో బాధపడేవారికి వివిధ రూపాల్లో పెన్షన్ అందిస్తున్నామని, సదరం ఫేక్ సర్టిఫికెట్లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

డోలీ మోతలు కనిపించకూడదు...

ఫీడర్ అంబులెన్స్‌కు, సాధారణ అంబులెన్స్‌కు కనెక్టివిటీ పెంచాలని సీఎం సూచించారు. 'గిరిజన ప్రాంతాల్లో రోగులను ఇంకా డోలీతో మోసుకొస్తున్న సందర్భాలు కనబడుతున్నాయి. డోలీ మోతలు మళ్లీ రిపీట్ అయితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటాం. ఫీడర్ అంబులెన్స్‌లు వెళ్లగలిగినప్పటికీ.. సాధ్యం కాదని నిర్లక్ష్యం వహిస్తే నేరుగా నేనే ఆ ప్రాంతాన్ని సందర్శిస్తా. 104 అంబులెన్సుల పట్ల ప్రజల్లో సంతృప్తి ఉందా లేదా అన్నది ముఖ్యం. ఏదో వెళ్లి కొన్ని టెస్టులు చేసి వచ్చి మొత్తం పరిష్కరించామని చెప్పడం సరికాదు. ఆస్పత్రుల్లో చనిపోయిన వారి దేహాలను ఇంటికి చేర్చాలన్న ఉద్దేశంతో గతంలో మహాప్రస్థానం అంబులెన్స్‌లను తీసుకొచ్చాం. అవసరాన్ని బట్టి అంబులెన్స్‌ల వినియోగాన్ని పెంచాలి. ఆస్పత్రుల్లో రోగులకు అందించే బెడ్ షీట్లు కూడా నాణ్యత, శుభ్రంతో ఉండాలి. ప్రజల్లో కేన్సర్‌పై అవగాహన కల్పిస్తే మరణాలను తగ్గించవచ్చు. రాష్ట్రంలో జోన్ల వారీగా సర్వీస్ ప్రొవైడర్ మానిటర్ ఏర్పాటు చేసి ఆస్పత్రుల్లో పారిశుధ్యాన్ని పర్యవేక్షించాలి. మెడ్‌టెక్ జోన్ ద్వారా ఏడాదికి రూ.10 వేల కోట్ల టర్నోవర్ జరుగుతోంది. తక్కువ ఖర్చుతో అన్ని రకాల మెడికల్ ఎక్విప్‌మెంట్ అందిస్తోంది. అయినా దీనిని గత ప్రభుత్వం వినియోగించుకోలేదు. నియోజకవర్గం స్థాయిలో పీపీపీ విధానంలో ఆస్పత్రి ఏర్పాటు చేస్తాం. ప్రభుత్వమే స్థలం సమకూరుస్తుంది. ప్రభుత్వ, పీపీపీ ఆస్పత్రులను ఒకే గొడుగు కిందకు తీసుకొస్తాం. దేశంలోనే మన ఆస్పత్రుల పనితీరు బెస్ట్‌గా ఉండాలి' అని సీఎం స్పష్టం చేశారు.

అమరావతికి అండగా ప్రపంచ బ్యాంకు

(మొదటి పేజీ తరువాయి)

ఆర్థిక సహాయ సహకారాలపై ముఖ్యమంత్రి వీరితో చర్చించారు. ప్రపంచ బ్యాంకు ఉన్నతాధికారుల బృందం మరోసారి రాష్ట్రానికి వస్తుందని, ఆ తర్వాత అమరావతికి రాబోయే రుణంపై ఒక స్పష్టత వస్తుందని సీఆర్‌డీఏ అధికారులు చెప్పారు. తాజా చర్చల్లో భాగంగా... 2050 నాటికి అమరావతి జనాభా 35 లక్షలకు చేరుకుంటుందని, వీరందరికీ ప్రపంచస్థాయి ప్రమాణాలతో కూడిన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన నిధులను రుణంగా ఇవ్వాలని రాష్ట్ర అధికారులు ప్రతిపాదించినట్టు సమాచారం. మొత్తం రాజధానిలో 20 శాతాన్ని పార్కులు, పచ్చదనంతో గ్రీన్ ఏరియాగా మారుస్తామని, అమరావతిలోని ప్రతి ఒక్కరూ కాలినడకన పార్కులకు చేరుకునే స్థాయిలో వీటిని అభివృద్ధి చేస్తామని తెలిపారు. అలాగే... డ్రైనేజీ, రోడ్ల కనెక్టివిటీ, మంచినీరు, ట్రంక్ ఇన్‌ఫ్రాల్లో ఉన్నత ప్రమాణాలతో కూడిన సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చే ఆలోచనలో ఉన్నట్లు చెప్పారు. వీటికోసం భారీగా నిధులు అవసరమైనప్పటికీ... మొదటి దశలో రూ.15,000 కోట్లు కావాలని ప్రభుత్వం భావిస్తోంది.

వైసీపీ అడ్డుకుందిలా..

అమరావతి నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు సహకారం కోసం గతంలోనే చంద్రబాబు ప్రభుత్వం ప్రయత్నించింది. ఇదంతా ఒక కొలిక్కి కూడా వచ్చింది. కానీ... వైసీపీ కుట్రల కారణంగా ఆగిపోయింది. అప్పట్లో... రూ.7,200 కోట్ల రుణం ఇవ్వాలని ప్రపంచ బ్యాంకుకు సీఆర్డీయే ప్రతిపాదనలు పంపింది. తొలి దశలో రూ.3,200 కోట్లు, రెండో దశలో మరో రూ.3,200 కోట్లు తీసుకోవాలని అప్పటి ప్రభుత్వం ప్రతిపాదించింది. తొలిదశ రుణం తీసుకునేందుకు అప్పుడు కేంద్రం కూడా అంగీకరించింది. ప్రపంచ బ్యాంకు సూత్రప్రాయ ఆమోదంతో కొన్ని ప్రాధాన్య మౌలిక వసతుల కల్పన పనులను సీఆర్డీయే చేపట్టింది. కానీ... అదే సమయంలో వైసీపీ కుట్రలు మొదలయ్యాయి. ప్రపంచబ్యాంకు నిధులతో చేపడుతున్న ప్రాజెక్టులు తమ ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తున్నాయంటూ 'అమరావతి స్థానికుల' పేరుతో వైసీపీ నేతలు ప్రపంచబ్యాంకుకు లేఖ రాశారు. 2017 మే 25న ఫిర్యాదు చేశారు. దీంతో ప్రపంచ బ్యాంకు బృందం రుణ సౌకర్యాన్ని పెండింగ్‌లో పెట్టి తనిఖీల కోసం అమరావతికి వచ్చింది. అమరావతిలోని అధికారులు, స్థానికులతో మాట్లాడింది. ఆ బృందం తన ప్రాథమిక నివేదికను ప్రపంచబ్యాంకుకు సమర్పించింది. పూర్తిస్థాయి నివేదిక కోసం మరిన్ని తనిఖీలు అవసరమని చెప్పింది. ఈలోగా రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. జగన్ ఏకంగా అమరావతిని అటకెక్కించారు. 'మూడు ముక్కలాట'కు తెరలేపారు. చంద్రబాబు మరోసారి అధికారంలోకి రావడంతో అమరావతి మహర్దశ పడుతోంది. ప్రపంచ బ్యాంకు బృందం మూడు రోజుల పాటు అమరావతిలో పర్యటించి... నిశిత పరిశీలనలు జరిపింది.

టీడీఆర్ కుంభకోణంపై సీఐడీ విచారణ!

అమరావతి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 2019-2024 మధ్య కాలంలో జారీచేసిన టీడీఆర్ బాండ్లపై ప్రభుత్వం అంతర్గత విచారణ చేస్తోంది. ఈ కుంభకోణంపై సీఐడీ విచారణకు ఆదేశించనున్నట్లు సమాచారం. దీనిపై మరింత లోతుగా విచారణ చేపట్టాల్సిన అవసరంపై మంత్రి నారాయణ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. సీఐడీ విచారణకు ఇస్తేనే అసలు సూత్రధారులు ఎవరన్న అంశం వెలుగులోకి వస్తుందని ప్రభుత్వం యోచిస్తోంది. టీడీఆర్ బాండ్ల కుంభకోణంలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుపై ఆరోపణలున్నాయని, తణుకు టీడీఆర్ బాండ్ల కుంభకోణం జరిగిన తీరును సీఎం చంద్రబాబుకు మంత్రి నారాయణ వివరించినట్లు తెలిసింది. ఈ వ్యవహారం కోర్టులో ఉండటంతో న్యాయ నిపుణులతో సంప్రదింపులు చేపట్టారు. తణుకు మున్సిపాలిటీలో రూ.754 కోట్ల మేర బాండ్లు జారీచేసినట్లు ఏసీబీ అధికారులు, మున్సిపల్‌శాఖ గుర్తించింది. ఇందులో రూ.691 కోట్ల మేర అక్రమాలు జరిగినట్లు ఏసీబీ గుర్తించింది. అలాగే, బాండ్ల జారీకి అనుసరించిన విధానం చూస్తే.. స్థల సేకరణ సమయంలో ఎకరా రూ.55 లక్షలకు సేకరించి బాండ్ల జారీకి ఎకరా రూ.10 కోట్ల విలువ చూపడంపై విస్మయం వ్యక్తం చేసింది. ఇప్పటికే ఈ వ్యవహారంలో మున్సిపల్ కమిషనర్ సహా ముగ్గురిని సస్పెండ్ చేశారు.

బ్రాండ్ ఏపీ

(మొదటి పేజీ తరువాయి)

ఆయన సోమవారమిక్కడ వెలగపూడి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. దాని ముసాయిదా గురించి పరిశ్రమల మంత్రి టీజీ భరత్, ఉన్నతాధికారుల వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. 2014-19 మధ్య కాలంలో రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం కల్పించిన వివిధ రాయితీలు, మౌలిక సదుపాయాలు, సులభతర వాణిజ్యం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్-ఈవోడీబీ) వంటి అంశాల్లో దేశంలోనే మొదటి స్థానంలో ఉండేవాళ్లమని, మళ్లీ అలాంటి పరిస్థితులు తీసుకొచ్చి పారిశ్రామికవేత్తలకు నమ్మకం కల్పించే విధంగా నూతన విధానాన్ని తయారుచేయాలని ఆదేశించారు. ప్రస్తుతం 53 శాతం ఉత్పత్తులు రా మెటీరియల్స్ (ముడి సరుకులు) కింద రాష్ట్రం నుంచి వెళ్తున్నాయని, వాటికి ఏవిధంగా వాల్యూ ఎడిషన్ ఇవ్వాలో ఆలోచించి.. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పీపీపీ, పీ-4 విధానాలను నూతన విధానంలో పొందుపరచాలని సూచించారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అన్ని అనుమతులను వేగంగా ఇవ్వగలిగితే అంతే త్వరగా ఏర్పాటవుతాయన్నారు. ఏ రాష్ట్రానికీ లేని విధంగా ఏపీలో అందుబాటులో ఉన్న 10 ఓడరేవులు, 10 విమానాశ్రయాలు, మెరుగైన రోడ్డు రవాణా, లాజిస్టిక్స్ సౌకర్యాలు పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చేవారికి ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయని తెలిపారు. పశ్చిమ తీరం కంటే తూర్పు తీర ప్రాంతం రోడ్డు, రైలు, విమానయాన మార్గాలతో మెరుగైన రీతిలో అనుసంధానమై ఉందని, నదుల అనుసంధానం కూడా పరిశ్రమల ఏర్పాటుకు అనుకూల అంశంగా పేర్కొన్నారు. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, ఆక్వా, ఆహారశుద్ధి వంటి రంగాల్లో ఎక్కువ పరిశ్రమలు నెలకొల్పేలా నూతన విధానం ఉండాలన్నారు. భారత్‌కు కొత్తగా ఏ పరిశ్రమ వచ్చినా.. దానిని మన రాష్ట్రానికి తీసుకొచ్చే విధంగా అందరం పనిచేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. గతంలో కర్ణాటకకు వెళ్లిపోయిన హీరో మోటార్స్, తెలంగాణకు వెళ్లిపోయిన అపోలో టైర్స్ వంటి సంస్థలను ఏపీకి తీసుకొచ్చామని గుర్తుచేశారు. ముఖ్యమైన పాలసీలన్నీ వంద రోజుల్లో తయారు కావాలన్నారు. ఈ నెల 16న పారిశ్రామికవేత్తలతో సమావేశం కానున్నట్లు తెలిపారు. ఈనెల 23న మళ్లీ చర్చిద్దామని చెప్పారు. అంతకు ముందు పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ 2024-29 పారిశ్రామిక విధానం ముసాయిదాలో పొందుపరిచిన అంశాలను పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా తెలియజేశారు. సమీక్షలో సీఎం అదనపు కార్యదర్శి కార్తికేయ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.



సెంట్రల్ జైలు ఆవరణలోని బాక్స్ క్రికెట్ గ్రౌండ్‌లో బ్యాటింగ్ చేస్తున్న అనిత

తప్పుచేసినోళ్లు బయట ఉండకూడదు

- 'స్నేహ' బ్లాక్ చూసి ఉద్వేగానికి లోనయ్యా
- ఖైదీల క్షమాభిక్ష జాబితా పరిశీలనలో ఉంది
- స్వాతంత్ర్య దినోత్సవానికి జీవోకు ప్రయత్నం : హోంమంత్రి అనిత

రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)/కొవ్వూరు, ఆగస్టు 12: 'ఏ తప్పూ చేయకుండానే చంద్రబాబును జైలులో పెట్టారు. ఆయన్ను ఉంచిన 'స్నేహ' బ్లాక్‌ని చూసి ఉద్వేగానికి లోనయ్యా. రాష్ట్రాన్ని సుదీర్ఘకాలం పాలించిన చంద్రబాబును 53 రోజులు జైలులో పెట్టడం దారుణం. అప్పుడు ఎంతో బాధపడ్డాం. ఇప్పుడు సందర్శనకు వచ్చాం. ఇదే ప్రజాస్వామ్యం గొప్పతనం. తప్పు చేయని వారు జైలులో ఉండకూడదు. అలాగే తప్పు చేసిన వాళ్లు బయట ఉండకూడదు. చట్టం తన పని తాను చేసుకుపోతుంది' అని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండ్ వద్ద జైళ్ల శాఖ ఏర్పాటు చేసిన నూతన పెట్రోలు బంకు, సెంట్రల్ జైలు ఎదురుగా నిర్మించిన ప్రిజన్ కేఫ్, బాక్స్ క్రికెట్ గ్రౌండ్‌ను ఆమె సోమవారం ప్రారంభించారు. సిటీ ఎమ్మెల్యే శ్రీనివాసు బౌలింగ్ చేయగా హోంమంత్రి కొద్దిసేపు బ్యాటింగ్ చేశారు. సెంట్రల్ జైలు, మహిళా ప్రత్యేక కారాగారాన్ని సందర్శించిన అనంతరం మీడియాతో ఆమె మాట్లాడారు. ఖైదీల క్షమాభిక్ష జాబితా పరిశీలనలో ఉందన్నారు. స్వాతంత్ర్య దినోత్సవానికి జీవో ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నామని.. కుదరకపోతే గాంధీ జయంతికి ఇస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే 1,700 గంజాయి కేసులు పెట్టగా వీటిలో ఒక్క విశాఖలోనే వెయ్యి వరకూ ఉన్నాయని తెలిపారు. రాజహేంద్రవరం సెంట్రల్ జైలులో గంజాయి కేసుల్లో 376 మంది ఖైదీలు ఉన్నారని చెప్పారు. దిశ స్టేషన్లను ఎప్పటి మాదిరిగానే మహిళా పోలీసుస్టేషన్లుగా వ్యవహరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాసు, జైళ్లశాఖ డీజీ కుమార్ విశ్వజిత్ తదితరులు పాల్గొన్నారు.

20 వేల మంది పోలీసుల నియామకాలు!

రాష్ట్రవ్యాప్తంగా 20వేల మంది పోలీసుల కొరత ఉందని, క్రమపద్ధతిలో నియామకాలు పూర్తిచేస్తామని అనిత కొవ్వూరులో అన్నారు. కూటమి ప్రభుత్వానికి పోలీసుల సంక్షేమమే ప్రధాన ఏజెండా అని స్పష్టంచేశారు. జగన్‌కి భద్రత కుదించామనడంలో వాస్తవం లేదన్నారు. "మాజీ సీఎంగా ఆయనకు ఇవ్వాల్సిన జడ్ ప్లస్ సెక్యూరిటీ, బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు ఇస్తున్నాం. భద్రతకు 980 మందిని పెట్టాలంటే ఎలా? జగన్ దేనికి భయపడుతున్నారు? పదవిలో ఉన్నప్పుడు పోలీసులను అడ్డుపెట్టుకొని పరదాలు కట్టుకొని, చెట్లు నరికేసి ఆ భద్రతా వలయంలో తిరగడం అలవాటు అయిపోయింది. ఈ రోజు బయటకు వస్తే ప్రజలు తంతారని భయపడుతున్నారా" అని ఎద్దేవా చేశారు.

పులివెందులలో అక్రమాలపై విచారణకు సిద్ధమా?

- జగన్‌కు టీడీపీ ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి సవాల్

అమరావతి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో రైతులకు పంటల బీమా ప్రీమియం చెల్లించలేదంటూ మాట్లాడుతున్న జగన్‌రెడ్డి... రైతులకు ఎవరి ప్రభుత్వంలో మేలు జరిగిందో, ఎవరి పాలనలో రైతులు అన్యాయానికి గురైనారో గుండెలపై చేయి వేసుకుని చెప్పాలి' అని టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'జగన్ సీఎంగా ఉండగా పులివెందుల మున్సిపాలిటీలోనే గృహ నిర్మాణ పనుల్లో రూ.175 కోట్ల స్కామ్ జరిగిందంటే.. రాష్ట్రంలో ఎంత స్థాయిలో జరిగిందో అర్థమౌతోంది. పులివెందుల మున్సిపాలిటీలో జగనన్న మెగా లేఅవుట్‌లో మంజూరైన 8,456 గృహాలపై విచారణ చేయిస్తే... 2,489 మంది అనర్హులు, బోగస్ లబ్ధిదారులుగా తేలారు. ఈ అక్రమాలను నిగ్గు తేల్చడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఎక్కడైనా నేను చర్చకు రెడీ. విచారణకు జగన్ సిద్ధమా' అని సవాల్ చేశారు.

జయహో బీసీ

(మొదటి పేజీ తరువాయి)

సబ్సిడీ రుణాలిచ్చి స్వయం ఉపాధి యూనిట్లు పెట్టుకునేలా చూస్తూ వచ్చింది. కానీ... వైసీపీ సర్కారు వచ్చాక స్వయం ఉపాధి పథకాలకు స్వస్తి పలికింది. నవరత్నాల పేరుతో నగదు బదిలీ ద్వారా ఖాతాల్లో డబ్బులు జమ చేసి చేతులు దులుపుకొంది. దీనివల్ల బీసీలు ఆర్థికాభివృద్ధి సాధించిన దాఖలాల్లేవు. ఇక 'చేయూత'లాంటి పథకాలు కూడా తగిన ఫలితాలనివ్వలేదు. సిసలైన స్వయం ఉపాధి స్ఫూర్తి ఎక్కడా కనిపించలేదు.

నైపుణ్య శిక్షణ...

అటు బీసీలకు నైపుణ్య శిక్షణ... ఇటు స్వయం ఉపాధి కల్పించడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. వివిధ పథకాల ద్వారా శిక్షణ ఇప్పించడంతోపాటు... వడ్డీలేని రుణాలు లేదా రాయితీతో కూడిన రుణాలు ఇప్పిస్తే వారికి మరింత ప్రయోజనం కలిగించినట్లవుతుందని భావిస్తోంది. ఉదాహరణకు... 'పీఎం విశ్వకర్మ యోజన' పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం చేతి వృత్తిదారులకు శిక్షణ ఇచ్చి పనిముట్లు కూడా అందిస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఏటా నోటిఫికేషన్ జారీ చేసి ఈ పథకం ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తోంది. వైసీపీ సర్కారు సహకరించకపోవడంతో రాష్ట్రంలో ఇది నామమాత్రంగా అమలవుతోంది. పీఎం విశ్వకర్మ యోజన ద్వారా కమ్మరి, బంగారు పని, కుండల తయారీ, వడ్రంగం, శిల్ప కళ, భవన నిర్మాణం (బేల్దారీ), ఇతర వృత్తులకు సంబంధించి శిక్షణ అందిస్తారు. ఐదు రోజుల పాటు శిక్షణతో పాటు సుమారు రూ.15 వేల విలువైన పనిముట్లను కేంద్రం అందిస్తుంది. అస్సలు అవగాహన లేని వారు, అవగాహన ఉండి అంతగా నైపుణ్యం లేని వారు, ఇప్పటికే వృత్తిలో ఉండి దానిని విస్తరించాలనుకున్న వారు... ఇలా మూడు కేటగిరీలుగా విభజించి, అందుకు తగిన విధంగా శిక్షణ ఇస్తారు. ఇప్పటికే ఆయా వృత్తుల్లో ఉన్న వారికి యూనిట్‌ను విస్తరించేందుకు బ్యాంకుల నుంచి రుణం ఇప్పిస్తారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు లాంటి కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించుకుంది. కేంద్ర పథకాలకు తోడుగా రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక పథకాలు అమలు చేస్తూ... బీసీ కార్పొరేషన్‌కు నిధులు విడుదల చేస్తారు. బ్యాంకుల నుంచి తీసుకునే రుణాలకు ప్రభుత్వమే వడ్డీ చెల్లించాలని భావిస్తున్నారు. అలాగే... కేంద్ర ప్రభుత్వానికి చెందిన జాతీయ సహకార అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్‌సీడీసీఎల్) నుంచి కూడా రుణాలు సేకరించి బీసీల అభివృద్ధికి వినియోగిస్తే సత్ఫలితాలొస్తాయని చెబుతున్నారు.

ఏటా 5 లక్షల మందికి...

ఏటా 5 లక్షల మంది బీసీలను ఎంపిక చేసి వారికి శిక్షణ ఇచ్చి, పరికరాలు అందించి... రుణం ఇప్పించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీని ద్వారా ఏటా రూ.500 కోట్ల వరకు కేంద్ర ప్రభుత్వ నిధులు వినియోగించుకోవచ్చని బీసీ సంక్షేమ శాఖ అధికారులు భావిస్తున్నారు. దీనిపై వివరమైన కాన్సెప్ట్ నోట్ తయారుచేసుకుని రావాలని ముఖ్యమంత్రి ఇప్పటికే బీసీ సంక్షేమశాఖ అధికారులకుసూచించినట్లు సమాచారం. అందుబాటులో ఉన్న కేంద్ర పథకాలతో పాటు అవసరమైన నిధులను సమీకరించి బీసీల అభ్యున్నతికి కృషి చేయాలని, ఆ మేరకు ప్రణాళికలు రూపొందించాలని ఇప్పటికే మంత్రి లోకేశ్, మంత్రి సవిత అధికారులకు దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. ఇవన్నీ పట్టాలెక్కితే బీసీలకు మహర్దశ పట్టినట్లేనని పలువురు పేర్కొంటున్నారు.

దువ్వాడ పెద్దల సభలో
ఉండటానికి అనర్హుడు

- తనే రాజీనామా చేయాలి.. లేదా జగన్ చేయించాలి: మంత్రి ఆనం

అమరావతి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం వివాదంలో చిక్కుకొన్న వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ పెద్దల సభలో ఉండటానికి అనర్హుడని దేవదాయ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి వ్యాఖ్యానించారు. ఆయన తనకు తానుగా మండలి సభ్యత్వానికి రాజీనామా చేయాలని, లేదా ఆయనతో ఆ పదవికి వైసీపీ అధ్యక్షుడు జగన్ అయినా రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం ఆయన ఇక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు ఎ.వి.రమణ, బ్రాహ్మణ సాధికారత విభాగం సమన్వయకర్త బుచ్చిరాం ప్రసాద్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. 'అది పెద్దల సభ. మిగిలినవారు తప్పులు చేస్తే అది సరిదిద్దాలి. కానీ ఆ సభలో ఉన్నవారే అఘాయిత్యాలు చేస్తే ఎలా?' అని ఆయన ప్రశ్నించారు. కాగా, దుష్ప్రవర్తన కారణంగా సస్పెండైన దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి వ్యవహారంపై విజిలెన్స్ విచారణ వేశామని, నివేదిక కోసం ఎదురు చూస్తున్నామనిచెప్పారు. టీటీడీలో గత ఈవో ధర్మారెడ్డి హయాంలో చోటు చేసుకొన్న అక్రమాలపైనా విజిలెన్స్ విచారణ జరుగుతోందని తెలిపారు.

నిషేధిత జాబితాలోకి ఆలయ భూములు

రాష్ట్రంలో ఆలయాల కింద 6.40 లక్షల ఎకరాల భూములున్నాయని, అవి అన్యాక్రాంతం కాకుండా 22ఎ కింద నిషేధిత జాబితాలో చేర్చాలని నోటిఫై చేశామని మంత్రి తెలిపారు. ఇవి కాక లక్షన్నర సర్వీస్ ఇనాం భూములు ఉన్నాయని తెలిపారు. దేవాలయాలకు సేవ చేస్తుంటేనే ఈ భూములపై హక్కు ఉంటుందని, ఆ సేవకు దూరమైతే ఆ భూములు దేవాలయాలకే చెందుతాయని తేల్చి చెప్పారు.

అంబటి, పెద్దిరెడ్డి అనుచరుల దౌర్జన్యాలపై ఫిర్యాదులు

- టీడీపీ కార్యాలయంలో వినతులు స్వీకరించిన ఆనం

అమరావతి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రులు అంబటి రాంబాబు, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరుల కబ్జాలు, దౌర్జన్యాలపై సోమవారం ఇక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయానికి ఫిర్యాదులు అందాయి. మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి, టీడీపీ నేతలు వర్ల రామయ్య, బుచ్చిరాం ప్రసాద్, ఎ.వి. రమణ ఈ ఫిర్యాదులను స్వీకరించారు. అంబటి రాంబాబు బంధువులమంటూ తమ ఇంట్లోకి చొరబడి సామాన్లు బయటపడేశారని, తమ ఇంటిని కబ్జా చేశారని గుంటూరు సంగడిగుంట ప్రాంతానికి చెందిన మల్లం వసంతరావు ఫిర్యాదు చేశారు. టీడీపీలో చురుగ్గా పనిచేస్తున్న తనపై మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులు తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని, అక్రమంగా రౌడీ షీట్‌తోపాటు ఎస్సీ ఎస్టీ కేసులు కూడా పెట్టించారని పుంగనూరుకు చెందిన సయ్యద్ సుహేల్ భాషా ఫిర్యాదు చేశారు. గుంటూరు జిల్లా పొన్నూరు ప్రాంతంలోని కాశీ రామేశ్వర సత్రం కింద ఉన్న 30 ఎకరాల భూమిని వైసీపీ నేతలు అక్రమంగా అమ్ముకొని, రికార్డులు మార్చి తమ పేర్లు ఎక్కించుకొని కోట్లు గడించారని, ఆ భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని ఆ గ్రామానికి చెందిన ముఖ్యులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. మచిలీపట్నం సహకార బిల్డింగ్ సొసైటీలో 750గజాల స్థలాన్ని వైసీపీ నేతలు ఆక్రమించుకొన్నారని, వారి కబ్జా నుంచి దానిని విడిపించాలని అంగడాల విజయలక్ష్మి అనే మహిళ విజ్ఞప్తి చేశారు. ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలంలో తమకు చెందాల్సిన భూమిని ఇంకొల్లు మండలంలోని భీమవరానికి చెందిన వారికి డీకే పట్టాలు ఇప్పించారని, దీనివల్ల ఎస్సీ ఎస్టీ మైనారిటీ వర్గాలకు చెందిన 427 కుటుంబాలు నష్టపోయాయని బాధితులు ఫిర్యాదు చేశారు. 250 వరకూ వినతులు వచ్చాయని, వాటిని ఇచ్చిన వారు తమపై నమ్మకంతో చిరునవ్వుతో వెళ్తున్నారని... పార్టీ కార్యాలయంపై పెట్టుకొన్న నమ్మకానికి ఇది నిదర్శనమని ఆనం పేర్కొన్నారు.

విశాఖ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు టీడీపీ దూరం

అమరావతి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో పోటీచేయరాదని టీడీపీ అధినాయకత్వం నిర్ణయించింది. టీడీపీ కూటమి పక్షాల బలం పరిమితంగా ఉండడంతో ఈ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. జీవీఎంసీ కార్పొరేటర్లు, నర్సీపట్నం, యలమంచిలి మున్సిపల్ కౌన్సిలర్లు, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు ఇందులో ఓటర్లు. వీరిలో 60 శాతానికిపైగా వైసీపీ నుంచి గెలిచిన వారే. పోటీ పెడితే.. గెలిపిస్తామని కొందరు టీడీపీ ఎమ్మెల్యేలు ముందుకు వచ్చినా.. అంత ప్రయాస పడి గెలవాల్సిన అవసరం లేదని నాయకత్వం భావించింది. ఒక ఎమ్మెల్సీ సీటు కోసం అంతమందిని ప్రత్యర్థి పార్టీ నుంచి సమీకరించాల్సిన అవసరం లేదని, దాని వల్ల వచ్చే ప్రయోజనం కూడా లేదని అభిప్రాయపడినట్లు సమాచారం. నామినేషన్ల దాఖలుకు మంగళవారం చివరి రోజు. వైసీపీ అభ్యర్థి, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ నామినేషన్ సక్రమమని తేలితే ఆయన ఎన్నిక ఏకగ్రీవమవుతుంది.



సీఎం చంద్రబాబును కలిసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, పార్టీ ఇన్‌చార్జి మధుకర్

బాబుతో పురందేశ్వరి భేటీ

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, ఆ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మధుకర్ సోమవారం రాత్రి ఉండవల్లి నివాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. వర్తమాన రాజకీయ అంశాలు, పాలనాపరమైన విషయాలు, నామినేటెడ్ పదవుల భర్తీ, ఇతర అంశాలు చర్చకు వచ్చినట్లు సమాచారం.

వైసీపీ అభ్యర్థిగా బొత్స నామినేషన్

విశాఖపట్నం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల కోటాలో ఉమ్మడి విశాఖ జిల్లా ఎమ్మెల్సీ స్థానానికి వైసీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మూడు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. సోమవారం ఆయన రిటర్నింగ్ అధికారి, విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్‌కు సమర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బలం లేదని తెలిసి కూడా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిని నిలబెడితే దుశ్చర్య అవుతుందని వ్యాఖ్యానించారు. మొత్తం 838 ఓట్లలో వైసీపీకి 530 ఓట్లు ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమానికి అరకు ఎంపీ తనూజరాణి, నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, మాజీ మంత్రులు బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్, కురసాల కన్నబాబు, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ తదితరులు హాజరయ్యారు. పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డి కలెక్టరేట్ ప్రధాన ద్వారం వరకు వచ్చి నాయకులను కలిసి వెళ్లిపోయారు. స్వతంత్ర అభ్యర్థిగా షేక్ సఫీ నామినేషన్ వేశారు.

73 లక్షలు పెరిగిన బొత్స ఆస్తులు

మే నెలలో జరిగిన సార్వత్రిక ఎన్నికల తర్వాత బొత్స సత్యనారాయణ ఆస్తులు రూ.73.14 లక్షలు పెరిగాయి. ఎమ్మెల్సీ స్థానానికి వేసిన నామినేషన్ పత్రాల అఫిడవిట్‌లో ఆస్తుల వివరాలు వెల్లడించారు. తన పేరిట రూ.11.42 కోట్ల ఆస్తి ఉన్నట్టు పేర్కొన్నారు. తన సతీమణి పేరిట స్థిరాస్తి రూ.4.46 కోట్లు, చరాస్తి రూ.3.92 కోట్లు ఉన్నట్టు చూపించారు.



రిటర్నింగ్ అధికారి కె.మయూర్ అశోక్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ

నెల రోజుల్లో 'కృష్ణమ్మ హారతి'

విజయవాడ, ఆగస్టు 12: ఎన్టీఆర్ జిల్లాలో ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద గోదావరి - కృష్ణా సంగమ ప్రాంతమైన 'పవిత్ర సంగమం' వద్ద నెల రోజుల్లో 'కృష్ణమ్మ హారతి' కార్యక్రమాన్ని పునఃప్రారంభించనున్నట్లు దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడించారు. సోమవారం సచివాలయంలో దీనికి సంబంధించి ఏర్పాటైన మంత్రుల సమావేశంలో మాట్లాడారు. గడచిన ఐదేళ్ల కాలంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. రానున్న రోజుల్లో పవిత్ర సంగమం ప్రాంతాన్ని పవిత్ర ఆధ్యాత్మిక పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. మంత్రి కె.పార్థసారథి మాట్లాడుతూ పవిత్ర సంగమం వద్ద టీటీడీ లేదా దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఒక దేవాలయాన్ని ఏర్పాటు చేయడంతోపాటు పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు.



శ్రీశైలం భద్రమేనా..?

కర్నూలు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాం గేటు కొట్టుకుపోయిన నేపథ్యంలో శ్రీశైలం జలాశయం ఎంతవరకు భద్రంగా ఉందన్న ప్రశ్న తలెత్తుతోంది. శ్రీశైలం డ్యాం సహా వివిధ ప్రాజెక్టు ప్రాజెక్టుల భద్రత, నిర్వహణపై కేంద్ర జలవనరుల శాఖ 2014 సెప్టెంబరు 23న ఆయా రాష్ట్రాల ఇంజనీరింగ్ నిపుణులతో సమావేశం నిర్వహించింది. ఈ తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియమించిన ఎక్స్‌పర్ట్ కమిటీలు అధ్యయనం చేశాయి. 2020 ఫిబ్రవరి 25న జలసంఘం మాజీ ఛైర్మన్, డ్యాం భద్రత నిపుణుడు ఏబీ పాండ్యా కమిటీ పలు లోపాలు ఎత్తిచూపుతూ నివేదిక ఇచ్చినట్లు సమాచారం. ఈ ఏడాది ఫిబ్రవరి 8న నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఛైర్మన్ వివేక్ త్రిపాఠి బృందం, కేంద్ర జలసంఘం, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు, సెంట్రల్ సాయిల్-మెటీరియల్స్ రీసెర్చ్ స్టేషన్ నిపుణులతోపాటు ఏపీ, తెలంగాణ ఇంజనీర్ల కమిటీ పరిశీలించింది. ప్లంజ్‌పూల్, 2009 వరదకు దెబ్బతిన్న డ్యాం డౌన్ స్ట్రీమ్‌లో ఆప్రాన్‌కు వెళ్లే అప్రోచ్ రోడ్డు, రిటైనింగ్ వాల్ నిర్మాణం, రివర్స్ స్లూయిస్ గేట్ల నిర్వహణ, లీకేజీలు అరికట్టేందుకు గేట్లకు సీల్స్ ఏర్పాటుపై తక్షణమే దృష్టిసారించాలని సూచించింది. డ్రిప్-2 కింద 19పనులకు రూ.203 కోట్లు కావాలని ప్రతిపాదనలు పంపినా నిధులు మాత్రం రాలేదు.

ఏపీని ఆర్థికంగా ఆదుకోండి

- కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు పయ్యావుల, లావు వినతి

న్యూఢిల్లీ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఏపీని ఆర్థికంగా ఆదుకోవాలని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, టీడీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. సోమవారం ఢిల్లీలో నిర్మలా సీతారామన్‌తో వారిద్దరూ భేటీ అయ్యారు. ఏపీలో వెనుకబడిన జిల్లాలకు కేటాయించిన నిధులు, అమరావతి నిర్మాణానికి ప్రకటించిన ప్రత్యేక సాయం రూ.15,000 కోట్లపై చర్చించినట్టు తెలిసింది. కేంద్ర పథకాలకు మ్యాచింగ్ గ్రాంట్లు, గత ప్రభుత్వ హయాంలో వినియోగించుకోని నిధులకు సంబంధించిన విషయాలపైనా చర్చ జరిగినట్టు తెలిసింది.

కిడ్నాపర్లుగా మారిన జవాన్లు

పలాస, ఆగస్టు 12: శ్రీకాకుళం జిల్లా పలాసలో బాలుడి కిడ్నాప్ ఘటన కలకలం రేపింది. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో డబ్బు సంపాదించాలన్న దురాశతో ఇద్దరు ఆర్మీ జవానులు ఈ కిడ్నాప్‌కు పాల్పడడం గమనార్హం. పలాస-కాశీబుగ్గ పట్టణాలకు చెందిన కె.విశ్వజిత్ అనే 13ఏళ్ల బాలుడు ఆదివారం మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదని ఆయన కుటుంబీకులు కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలుడి ఫొటో, వివరాలు సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. బాలుడిని మొత్తం నలుగురు వ్యక్తులు కిడ్నాప్ చేసినట్లు తెలియడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆర్మీలో ఉద్యోగం చేస్తున్న బత్తిన నాగరాజు, ఆయన సోదరుడు బత్తిన లక్ష్మణరావు, మరో ఆర్మీ ఉద్యోగి ఉణుకూరు గుణశేఖర్(చిత్తూరు జిల్లా), రేపల్లె పృథ్వీ ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. పృథ్వీ ఇంటి పొరుగునే ఉన్న విశ్వజిత్‌ను కిడ్నాప్ చేసి ఆయన తండ్రి నుంచి డబ్బులు గుంజాలని పథకం వేసుకున్నారు. బాలుడ్ని నమ్మబలికి వాహనంపై కిడ్నాప్ చేశారు. సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ కావడంతో దొరికిపోతామని భావించి ఆదివారం రాత్రి 11గంటల సమయంలో విడిచిపెట్టి పరారయ్యారు. వారి కదలికలపై అనుమానం వచ్చి పోలీసులను డీఎస్పీ శ్రీనివాసరావు అప్రమత్తం చేయడంతో అందరూ చిక్కిపోయారు. ఇద్దరు ఆర్మీ జవానులతో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

స్టాప్‌లాక్ సిద్ధం!


గేటు మరమ్మతులు చేయాల్సిన ప్రాంతం ఇదే

- కొట్టుకుపోయిన తుంగభద్ర గేటు స్థానంలో తాత్కాలికంగా బిగింపు
- నేటి నుంచి 4 రోజులు పట్టే చాన్సు
- స్టాప్‌లాక్ బిగించాక మళ్లీ వరదొస్తేనే సాగు, తాగునీరు.. లేదంటే కన్నీరే!

కర్నూలు/అమరావతి/బళ్లారి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ రైతుల ప్రాణాధారమైన తుంగభద్ర డ్యాం గేటు మరమ్మతుల్లో ప్రాజెక్టు బోర్డు, కర్ణాటక, ఆంధ్ర ఇంజనీరింగ్ నిపుణులు నిమగ్నమయ్యారు. వరద నీరు వృథాగా సముద్రంపాలుకాకుండా అడ్డుకోవడానికి.. చైన్ లింక్ తెగిపోయి కొట్టుకుపోయిన 19వ గేటు స్థానంలో తాత్కాలికంగా స్టాప్‌లాక్ గేట్ అమర్చి.. దానిని పూర్తిగా మూసివేయాలని నిర్ణయించారు. తుంగభద్ర బోర్డు సోమవారం అత్యవసరంగా సమావేశమైంది. మరమ్మతులపై హైదరాబాద్‌కు చెందిన ప్రాజెక్టు గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు, కర్ణాటక నిపుణుల ఆధ్వర్యంలో సమాలోచనలు జరిపింది. డ్యాంకు ఐదారు కిలోమీటర్ల దూరంలోని ఓ వర్క్‌షాపులో స్టాప్‌లాక్ గేట్ తయారు చేస్తున్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. స్టాప్‌లాక్ గేట్ ఏర్పాటు చేయాలన్నా స్పిల్‌వే లెవల్ 1,613 అడుగుల వరకు జలాశయాన్ని ఖాళీ చేయక తప్పదు. అంటే.. దాదాపు 62-65 టీఎంసీలు సముద్రానికి వదిలేయాల్సిందే. దీనివల్ల రాయలసీమ జిల్లాలు కర్నూలు, అనంతపురం, కడప జిల్లాల్లో ఖరీఫ్ ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారింది. వీలైనంత త్వరగా మరమ్మతులు పూర్తి చేసి కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఆయకట్టు రైతులకు ఖరీఫ్ పంటలకు ఇబ్బంది లేకుండా సాగునీరు ఇవ్వాలనే లక్ష్యంగా ఆ రాష్ట్రాల ముఖ్యమంత్రులు సిద్దరామయ్య, చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. ఎప్పటికప్పుడు మరమ్మతులపై సమీక్షిస్తూ పలు సూచనలు చేస్తున్నారు. బోర్డు కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ఎస్ఈ శ్రీకాంత్‌రెడ్డి సహా హైదరాబాద్‌కు చెందిన ప్రాజెక్టు గేట్స్ ఎక్స్‌పర్ట్ కన్నయ్యనాయుడు, కర్ణాటక గేట్ల నిపుణుడు కులకర్ణి, ఆంధ్ర సీడీవో సీఈ కుమార్, ఎస్ఈ శివకుమార్ బృందం ప్రాజెక్టు వద్దే మకాం వేసి మరమ్మతుల్లో నిమగ్నమయ్యారు. ఏపీ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ దగ్గరుండి మరమ్మతులను పర్యవేక్షిస్తున్నారు. కర్ణాటక మంత్రి శివరాజ్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఆలూరు, మంత్రాలయం టీడీపీ నేతలు బి.వీరభద్రగౌడ్, ఎన్.రాఘవేంద్రరెడ్డి తుంగభద్ర డ్యాంను పరిశీలించి కర్ణాటక మంత్రి శివరాజ్‌తో చర్చించారు. సిద్దరామయ్య మంగళవారం డ్యాంను సందర్శిస్తారు. మరమ్మతులు, స్టాప్‌లాక్‌పై ఏర్పాటుపై నిపుణులతో సమావేశమవుతారు. ఏపీ మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, కళ్యాణదుర్గం టీడీపీ ఎమ్మెల్యే అలిమినేని సురేంద్రబాబు తదితరులు కూడా అక్కడకు వెళ్లనున్నారు. సిద్దరామయ్య బెంగళూరు నుంచి నేరుగా డ్యాం వద్దకు చేరుకుంటారు. ఏపీ మంత్రులు హోస్పేటకు వెళ్లి.. ఏపీ, కర్ణాటక అధికారులతో సమావేశమవుతారు. కన్నయ్యనాయుడు బృందం విజయనగరలో వర్క్‌షాపు వద్దకు వెళ్లి తయారవుతున్న క్రస్ట్ గేటును పరిశీలించింది.

గేట్ల యాజమాన్య నిర్వహణలో లోపం లేదు

డ్యాం 19వ గేటు కొట్టుకుపోవడంలో యాజమాన్య నిర్వహణ లోపమేమీలేదని తుంగభద్ర బోర్డు తేల్చిచెప్పింది. గేటు నిర్మాణం కోసం వినియోగించిన స్టీల్ నాణ్యతతో ఉందని ధ్రువీకరించింది. డ్యాం నిర్మాణం జరిగి 55 ఏళ్లు గడచినందున సహజంగానే కాల పరిమితి దాటిందని పేర్కొంది. ప్రాజెక్టుల గేట్ల రూపకల్పనలో 30 ఏళ్ల అనుభవం కలిగిన సీనియర్ ఇంజనీరు కన్నయ్యనాయుడికి కొత్త గేటును బిగించే బాధ్యతలను అప్పగించామని వెల్లడించింది. ఇందుకోసం డ్రాయింగ్‌లు, డిజైన్లు ఆయన పర్యవేక్షణలో జరుగుతాయని తెలిపింది.

అప్పటిదాకా నీటి వృథాను నివారించేందుకు స్టాప్‌లాక్ అమర్చుతామని స్పష్టం చేసింది. ఈ వ్యవహారాలపై తుంగభద్ర బోర్డు కార్యదర్శి, డ్యాం చీఫ్ ఇంజనీర్, సూపరింటెండింగ్ ఇంజనీర్, హెచ్ఎల్‌సీ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌తో కూడిన ఉన్నత స్థాయి సాంకేతిక కమిటీని నియమించారు. కమిటీ డ్యాం గేటు డిజైన్లను పరిశీలించి, ఆమోదిస్తుంది. థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్‌ను నియమిస్తుంది. గేట్ల డిజైన్లను కేంద్ర జల సంఘానికి పంపి ఆమోదం పొందుతుంది. ఇంకోవైపు.. డ్యాం గేటు 60 అడుగుల ఎత్తు, 20 అడుగుల వెడల్పు ఉంటుంది. అంత పెద్ద స్టాప్‌లాక్ గేట్‌ను అమర్చడం కష్టం కావడంతో ఐదు బ్లాకులుగా తయారు చేసి ఒక్కొక్క బ్లాక్‌ను అమర్చేలా సన్నాహాలు చేస్తున్నారు. బ్రిడ్జి పైనుంచి క్రేన్ సాయంతో ప్రస్తుత గేట్ గాడి (గ్రూవ్)లో ఒక్కో బ్లాక్ కిందకు దించి.. ఆ గేటును పూర్తిగా క్లోజ్ చేస్తామని బోర్డు ఇంజనీర్లు తెలిపారు. నారాయణ ఇంజనీరింగ్, హిందూస్థాన్ ఇంజనీరింగ్ సంస్థలు ఈ బ్లాక్‌లను తయారు చేశాయి. మంగళవారం నుంచి బిగించడం ప్రారంభిస్తారు. ఇది పూర్తి కావడానికి 4 రోజులు పట్టవచ్చని బోర్డు అధికారులు తెలిపారు. అయితే ఈ ప్రక్రియ మొదలు పెట్టాలంటే స్పిల్ లెవల్ 1,613 అడుగుల వరకు డ్యాంలో ఉన్న నీటిని ఖాళీ చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం 1630.97 అడుగుల వరకు నీటినిల్వ ఉంది. నదీ పరివాహక గ్రామాలకు ముంపు సమస్యలు తలెత్తకుండా లక్ష క్యూసెక్కులు మాత్రమే దిగువకు విడుదల చేస్తున్నారు.

70 ఏళ్లలో తొలి ప్రమాదం..

తుంగభద్ర డ్యాంకు 6.50 లక్షల క్యూసెక్కుల వరదను దిగువకు విడుదల (డిశ్చార్జ్) చేసే సామర్థ్యంతో 33 క్రస్ట్ గేట్లు ఏర్పాటు చేశారు. ఊహించని విధంగా శనివారం రాత్రి ఎత్తిన 19వ గేటు చైన్‌లింక్ తెగిపోవడంతో గేటు వరద ఉధృతికి కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. 70 ఏళ్లలో డ్యాంలో జరిగిన తొలి ప్రమాదమిదే. గేటు కొట్టుకుపోయిన సమయంలో డ్యాంలో గరిష్ఠ నీటిమట్టం 1,633 అడుగుల్లో 105.788 టీఎంసీలు నిల్వ చేసి.. ఎగువ నుంచి డ్యాంలోకి వచ్చి చేరుతున్న 30,689 క్యూసెక్కుల వరద (ఇన్‌ఫ్లో)ను వివిధ కాలువలు, నదికి విడుదల చేస్తున్నారు. 19వ గేటుపై ఒత్తిడి తగ్గించేందుకు మిగిలిన 32 గేట్లు కూడా ఎత్తి 99,567 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. సాగునీటి ప్రాజెక్టుల గేట్లు కొట్టుకుపోయినా, రిపేర్ చేయాల్సి వచ్చినా నిల్వ చేసిన నీటిని దిగువకు విడుదల చేయకుండా స్టాప్‌లాక్ ఎలిమెంట్ ఏర్పాటు చేసే సౌలభ్యం ఉంటుంది.

కరువు సీమ ఆందోళన..

తుంగభద్ర గేటు కొట్టుకుపోవడం, వరద నీరు దిగువకు వదిలేస్తుండడంతో రాయలసీమ కరువు రైతుల్లో ఆందోళన నెలకొంది. కర్నూలు జిల్లాలో ఆలూరు, ఆదోని, మంత్రాలయం, కోడుమూరు నియోజకవర్గాల్లో ఎల్లెల్సీ కింద ఖరీఫ్ 43,519 ఎకరాల్లో ఆయకట్టు ఉంది. డ్యాంలో ఆశాజనకంగా వరద చేరడంతో ఈ సీజన్‌లో 35 వేల ఎకరాలకు సాగునీరు ఇస్తామని జూలై 19న జిల్లా కలెక్టరు పి.రంజిత్‌బాషా అధ్యక్షతన జరిగిన సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశంలో తీర్మానించారు. దీంతో రైతులు వరి,పత్తి, మిరప సాగు చేపట్టారు. అనంతపురం జిల్లాలో హెచ్చెల్సీ కింద రాయదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు, శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాల్లో 1.45 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. కణేకల్లు డివిజన్ పరిధిలో 35,600 ఎకరాలు, గంతకల్లు బ్రాంచ్ కెనాల్ పరిధిలో 31 వేలఎకరాలు, ఎంపీఆర్ దక్షిణ కాలువ కింద 36 వేలు, ఉత్తర కాలువ కింద 14 వేలు, తాడిపత్రి బ్రాంచి కాలువ కింద 28 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. తుంగభద్ర డ్యాంకు వరద పోటెత్తడంతో 75-85శాతం ఆయకట్టు కింద భూముల్లో పంటల సాగు చేపట్టారు. కేసీ కెనాల్ పరిధిలో కర్నూలు, కడప జిల్లాల్లో 2.65 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. కేసీ కాలువకు తుంగభద్ర డ్యాం నుంచి 10టీఎంసీల వాటా ఉంది. మిగిలిన నీటిని వరద ప్రవాహం నుంచి తీసుకోవాలి. తాజా పరిస్థితుల దృష్ట్యా ఖరీఫ్ సాగైనా గట్టెక్కుతుందా అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తక్షణమే నిధులు

బళ్లారి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాం నిర్వహణకు గత ప్రభుత్వం నిధుల కేటాయించలేదు. అత్యవసర పరిస్థితుల్లో బోర్డు వాడుకోవడానికి బడ్జెట్‌లో ప్రకటించిన నిధులను మంజూరు చేయలేదని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం కొట్టుకుపోయిన క్రస్ట్ గేటు పునరుద్ధరణకు బోర్డు ఖాతాలో డబ్బులు లేకపోవడంతో ఇంజనీరింగ్ అధికారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ కూటమి ప్రభుత్వం తక్షణమే నిధులు విడుదల చేసినట్లు సమాచారం. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక శ్రద్ధతో నిధులు విడుదల చేయించినట్లు తెలిసింది.

ఎవరీ కన్నయ్యనాయుడు!

- సర్దార్ సరోవర్, పోలవరం, శ్రీశైలం, సాగర్ గేట్ల రూపకల్పనలో కీలక పాత్ర
- ఎస్వీ వర్సిటీలో మెకానికల్ ఇంజనీరింగ్



అమరావతి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాం గేటు తయారీ బాధ్యతలను గేట్ల తయారీ నిపుణుడు ఎస్.కన్నయ్య నాయుడికి అప్పగించడంతో.. ఒక్కసారిగా ఎవరీయన అన్న ఆసక్తి దేశవ్యాప్తంగా నెలకొంది. చిత్తూరు జిల్లా గుడిపాలలో రైతు బిడ్డగా పుట్టిన ఆయన.. తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో మెకానికల్ ఇంజనీరింగ్ చదివారు. తమిళనాడులోని మెసర్స్ సదరన్ స్ట్రక్చరల్ సంస్థలో ఐదేళ్లు, తుంగభద్ర జలాశయం సమీపంలో నిర్మించిన తుంగభద్ర స్టీల్ ప్రొడక్ట్స్‌లో 27 ఏళ్లపాటు పనిచేశారు. దేశంలో పలు సాగునీటి ప్రాజెక్టులకు క్రస్ట్ గేట్లు, ఫిక్స్‌డ్ వీల్ గేట్లు, రేడియల్ గేట్లు, హైడ్రాలిక్ గేట్లు, రోప్‌డ్రమ్ హైడ్రాలిక్ హాయిస్‌ల తయారీలో అనుభవం గడించారు. 1976 నుంచి 2002 వరకూ టీఎస్‌పీఎల్‌లో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా డిజైన్ విభాగంలో పనిచేశారు. అంతర్జాతీయ స్థాయిలో 250 సాగునీరు, ఇతర ప్రాజెక్టుల గేట్ల అమరికలో ప్రధాన పాత్ర పోషించారు. కన్నయ్యనాయుడి పేరు చెబితే.. పోలవరం ప్రాజెక్టు క్రస్ట్ గేట్లు.. గుజరాత్‌లో నర్మదానదిపై నిర్మించిన సర్దార్ సరోవర్ ప్రాజెక్టులకు బిగించిన క్రస్ట్ గేట్లు గుర్తుకొస్తాయి. కర్ణాటకలోని నారాయణపూర్ జలాశయం, ఆలమట్టి డ్యాం పవర్ హౌస్, సూపా జలాశయం (స్టేజ్-1, 2), బొమ్మనహళ్లి ప్రాజెక్టు, భద్ర జలాశయం, తుంగ ఆనకట్ట, హేమావతి ఆనకట్ట, హారంగి, తుంగభద్ర, మలప్రభ, మస్కినాళ తదితర ప్రాజెక్టుల గేట్ల రూపకల్పనలో ప్రధానపాత్ర పోషించారు. శ్రీహరికోట అంతరిక్ష కేంద్రానికీ సాంకేతికతను అందించారు.

టీచర్ల సర్దుబాటు షెడ్యూల్ పొడిగింపు

- 17 నుంచి చేయాలని నిర్ణయం
- ఈలోగా జాబితాల్లో పొరపాట్ల సవరణ
- పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు
- సర్దుబాటును బహిష్కరిస్తున్నాం: ఫ్యాప్టో
- నిష్పత్తిని సవరించాలి: టీఎన్‌యూఎస్
- జాబితాలు సవరించాలి: నోబుల్ టీచర్ల సంఘం


డిమాండ్ల పత్రాన్ని విడుదల చేస్తున్న ఫ్యాప్టో సంఘాల ప్రతినిధులు

అమరావతి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పని సర్దుబాటు షెడ్యూల్ మళ్లీ మారింది. షెడ్యూలు ప్రకారం సోమవారం నుంచి సర్దుబాటు ప్రక్రియ మొదలు కావాల్సి ఉండగా, మిగులు ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలో పొరపాట్లు ఉన్నట్లు గుర్తించిన పాఠశాల విద్యాశాఖ వాటి సవరణకు కొంత సమయం ఇవ్వాలని నిర్ణయించింది. 15 నాటికి సవరణలు పూర్తిచేసి, 16న సవరించిన జాబితాలు విడుదల చేయాలని, 17, 19 తేదీల్లో సర్దుబాటు ప్రక్రియ పూర్తిచేయాలని ఆర్జేడీలు, డీఈవోలకు ఆదేశాలు జారీచేసింది. మిగులు ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాల్లో పెద్దఎత్తున పొరపాట్లు వచ్చాయి. టీచర్లు వ్యక్తిగతంగా ఇచ్చిన డేటాను సరిచూసే సమయం లేక ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు వాటిని యథాతథంగా అప్‌లోడ్ చేసేశారు. టీచర్లు ఉద్యోగంలో చేరిన తేదీ, పుట్టిన తేదీ, హోదా, సబ్జెక్టు.. ఇలా తొమ్మిది అంశాల్లో వివరాలు తీసుకున్నారు. వాటిలో ఉన్న తప్పులను ఉన్నత పాఠశాలల్లో హెచ్ఎంలు, ప్రాథమిక పాఠశాలల టీచర్లవి ఎంఈవోలు సరిదిద్దాలి. సరిదిద్దకుండానే అప్‌లోడ్ చేసేయడంతో సీనియారిటీ జాబితా పెద్ద గందరగోళంగా మారింది. అనేక పాఠశాలల్లో సీనియర్లు జూనియర్లుగా మారిపోయారు. సర్దుబాటు నిబంధనల ప్రకారం అత్యంత జూనియర్ మొదటఉండాలి. అలా అవసరమైన మేరకు జూనియర్లను సర్దుబాటు చేస్తూ వెళ్తారు. కానీ, తాజాజాబితాల్లో సీనియర్లు సర్దుబాటు జాబితాలోకి వస్తే, జూనియర్లు అవే పాఠశాలల్లో కొనసాగే జాబితాల్లో ఉండిపోయారు. దీంతో ఈ పొరపాట్లు సవరించిన తర్వాతే సర్దుబాటు చేయాలని నిర్ణయించారు.

బహిష్కరిస్తున్నాం..

టీచర్ల సర్దుబాటుపై ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకుందని ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) ఆరోపించింది. ఉపాధ్యాయ సంఘాలతో ఒక్క సమావేశం కూడా నిర్వహించకుండా పెద్దఎత్తున సర్దుబాటు చేస్తోందని తెలిపింది. సమస్యలు పరిష్కరించకుండా సర్దుబాటు చేస్తున్నందున ఈ ప్రక్రియను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించింది. ఉపాధ్యాయులు ఎవరూ ఇందులో పాల్గొనవద్దని కోరింది. సోమవారం విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గం అత్యవసర సమావేశంలో ఈ మేరకు తీర్మానించింది. ఆ వివరాలను సమావేశం అనంతరం చైర్మన్ ఎల్.సాయి శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి ఎస్.చిరంజీవి, నేతలు ఎస్.వెంకటేశ్వర్లు, జి.హృదయరాజు విలేకరులకు వివరించారు. జీవో 117 ద్వారా కాకుండా జీవో 53 ప్రకారం పని సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. జీవో 117ను రద్దు చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారని తెలిపారు. సీనియర్లకు విల్లింగ్ అవకాశం ఇవ్వాలన్నారు. ఇది కొనసాగితే మరో 4వేల బడులు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారతాయన్నారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుండా ముందుకెళ్తే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కాగా, పనిసర్దుబాటుకు ముందు ఉపాధ్యాయులు, విద్యార్థుల నిష్పత్తిని సవరించాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, శ్రీరామిశెట్టి వెంకటేశ్వర్లు కోరారు. నిష్పత్తిని సవరించకపోతే 500 నుంచి వెయ్యి మంది వరకు టీచర్లు మిగిలిపోతారని, మొత్తంగా 20వేల మంది టీచర్లు మిగిలిపోయే పరిస్థితి వస్తుందని తెలిపారు. కాగా, పని సర్దుబాటు కోసం తయారుచేసిన టీచర్ల జాబితాల్లో పొరపాట్లు సవరించాలని నోబుల్ టీచర్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నడిపినేని వెంకట్రావు, బొనిగల హైమారావు విజ్ఞప్తి చేశారు. దీర్ఘకాలిక సెలవు, ప్రసూతి సెలవు, స్టడీ లీవుల్లో ఉన్న టీచర్ల పోస్టులను ఖాళీలుగా చూపాలని ఓ ప్రకటనలో కోరారు.

విద్యా వ్యవస్థను నాశనం చేసిన వైసీపీ

- ఎమ్మెల్సీ అశోక్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ ధ్వజం



వైసీపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను అన్ని విధాలుగా నాశనం చేసిందని ఎమ్మెల్సీ పి.అశోక్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ విమర్శించారు. సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో వారు మాట్లాడుతూ జీవో 117ను తీసుకొచ్చి గత ప్రభుత్వం ప్రాథమిక విద్యారంగాన్ని తీవ్రంగా దెబ్బ కొట్టిందన్నారు. ఫలితంగా 11వేల బడులు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారాయని చెప్పారు. నాశనమైన విద్యా వ్యవస్థను తిరిగి మెరుగుపర్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, పని సర్దుబాటు విషయంలో టీచర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. విద్యార్థులు ఎక్కువగా ఉండి టీచర్లు అవసరమైన చోటకు టీచర్లను సర్దుబాటు చేస్తారన్నారు. ఇది సర్దుబాటు మాత్రమేనని, బదిలీలు కావని, టీచర్లు ఆందోళన చెందవద్దని కోరారు. తమ విజ్ఞప్తి మేరకు సర్దుబాటు షెడ్యూల్‌ను పాఠశాల విద్యాశాఖ మార్చిందని తెలిపారు.

పంచాయతీ, గ్రామీణాభివృద్ధిలో ఉద్యోగుల బదిలీలకు కసరత్తు

- వివరాలు సిద్ధం చేయాలని డైరెక్టర్ ఆదేశాలు


అమరావతి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలో బదిలీల ప్రక్రియకు కసరత్తు ప్రారంభమైంది. ఇటీవల కేబినెట్ సమావేశంలో ఈ శాఖలో పాక్షికంగానైనా బదిలీలు చేపట్టాలని సీఎం చంద్రబాబు నిర్ణయించినట్లు సమాచారం. ఈ శాఖకు సంబంధించి డ్వామా పీడీ, జడ్పీ సీఈవో, డీపీవో తదితర ఉద్యోగుల బదిలీలు కోరుతూ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు సిఫారసు లేఖలు అందాయి. అయితే, బదిలీల విషయంలో స్పష్టత లేకపోవడంతో ఉద్యోగుల్లో సందేహాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టర్ కృష్ణతేజ బదిలీలకు సంబంధించి వివరాలు సిద్ధంగా ఉంచాలని అధికారులకు సూచించడంతో ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్టేనని భావిస్తున్నారు. మరోవైపు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది బదిలీలకు కూడా రంగం సిద్ధమైనట్టు తెలుస్తోంది. కాగా, ఐదేళ్లు ఒకే చోట పనిచేసిన సిబ్బందికి తొలుత బదిలీకి అవకాశం ఉండనుందని సమాచారం.

కృష్ణతేజకే కమిషనర్ బాధ్యతలు

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు ఐఏఎస్ అధికారి కృష్ణతేజను డైరెక్టర్‌గా నియమించిన విషయం తెలిసిందే. ఈ శాఖకు కమిషనర్‌గా కూడా ఆయనే బాధ్యతలు నిర్వహిస్తారని ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. కేరళ కేడర్‌కు చెందిన కృష్ణతేజ డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి వచ్చారు. అయితే, ఆయన జూనియర్ అధికారి కావడంతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు డైరెక్టర్‌గా నియమించారు.

నేటినుంచి జూనియర్ వైద్యుల నిరసన

- రాష్ట్రవ్యాప్తంగా ఓపీ, ఎలెక్టివ్ సేవల బహిష్కరణ
- మెడికల్ పీజీ విద్యార్థినిపై హత్యాచారంపై ఆగ్రహం



సోమవారం రాత్రి గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో జూనియర్ డాక్టర్ల నిరసన

గుంటూరు(మెడికల్) ఆగస్టు 12: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ వైద్య కళాశాలలో మెడికల్ పీజీ ట్రైనీ విద్యార్థిని హత్యాచారానికి గురవ్వడంపై జూనియర్ డాక్టర్లు భగ్గుమన్నారు. ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్(ఫోర్డా) ఇచ్చిన పిలుపు మేరకు జాతీయ స్థాయిలో అన్ని వైద్య కళాశాలు, బోధనాసుపత్రులకు చెందిన జూనియర్ వైద్యులు నిరవధిక ఆందోళనకు దిగుతున్నారు. బోధనాసుపత్రుల్లో ఓపీ సేవలు, ఎలెక్టివ్ డ్యూటీలను మంగళవారం నుంచి నిరవధికంగా బహిష్కరిస్తున్నట్లు ఫోర్డా ప్రకటించింది. దీనికి ఏపీ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్(ఆబ్జుడా) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. పీజీ విద్యార్థిని హత్యాచార దోషులను వెంటనే అరెస్ట్ చేయాలని, జూనియర్ వైద్యులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం రాత్రి గుంటూరు ప్రభుత్వ సమగ్రాసుపత్రి ఆవరణలో మెడికల్ పీజీ విద్యార్థులు, హౌస్ సర్జన్లు కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం నుంచి గుంటూరు జీజీహెచ్‌లో ఔట్‌పేషెంట్ సేవలు, ఎలెక్టివ్ సేవలు (అత్యవసరం కాని విధులు) బహిష్కరిస్తున్నట్లు సంఘం నేతలు తెలిపారు.

లావణ్య-రాజ్‌తరుణ్ కేసులో... కదిలిన 'డ్రగ్స్' డొంక

- గుంటూరులో టెకీ సాయిమస్తాన్‌రావు అరెస్టు
- లావణ్య, రాజ్‌తరుణ్‌కు డ్రగ్స్ అందించింది అతనే!
- ఢిల్లీ నుంచి తెచ్చి గుంటూరు, విజయవాడ, హైదరాబాద్‌లో కొన్ని హోటళ్ల ద్వారా దందా
- మస్తాన్‌ను విజయవాడలో విచారిస్తున్న సెబ్ అధికారులు
- డ్రగ్స్ వ్యవహారంలో ఇప్పటికే నలుగురి అరెస్ట్


నిందితుడు సాయిమస్తాన్

విజయవాడ, గుంటూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): లావణ్య, సినీనటుడు రాజ్‌తరుణ్ కేసులో డ్రగ్స్ వ్యవహారం నిజమేనని తేలింది. వారికి మాదకద్రవ్యం సరఫరా చేసిన కీలక నిందితుడిని విజయవాడ సెబ్ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వాస్తవానికి ఒక కేసులో ఈ నిందితుడిని అరెస్టు చేస్తే ఇందులోకి లావణ్య, రాజ్‌తరుణ్ ఎపిసోడ్ వచ్చి చేరింది. రాజ్‌తరుణ్‌తో తనకు పరిచయం ఉన్నదని, ఆ పరిచయంతోనే రాజ్‌తరుణ్, లావణ్యలకు డ్రగ్ సరఫరా చేశానని ఈ కేసులో నిందితుడు రావి సాయిమస్తాన్ రావు(మస్తాన్‌సాయి) అంగీకరించినట్టు సమాచారం. సాయిమస్తాన్‌రావును సెబ్ నిఘా అధికారులు సోమవారం గుంటూరులో అరెస్టుచేసి విజయవాడకు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం, గుంటూరు నగరపాలెం ప్రాంతానికి చెందిన రావి సాయిమస్తాన్‌రావు (35) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. కొన్నాళ్ల క్రితం సాయిమస్తాన్‌రావు హిమాచల్‌ప్రదేశ్ పర్యటనకు వెళ్లాడు. అక్కడ ఓ వ్యక్తి అతడికి పరిచయమయ్యారు. అప్పటికే ఆ స్నేహితుడు డ్రగ్స్ లావాదేవీల్లో ఉన్నారు. ఢిల్లీలోని వికాస్‌పురిలో తనకు డ్రగ్స్ విక్రయించే వ్యక్తిని మస్తాన్‌రావుకు పరిచయం చేశాడు. అప్పటినుంచి సాయి మస్తాన్‌రావు ఢిల్లీ నుంచి డ్రగ్స్‌ను గుంటూరుకు తెప్పించుకుంటున్నాడు. వాటితో స్నేహితులతో పార్టీలు చేసుకుంటున్నాడు. మరికొంత డ్రగ్స్‌ను హైదరాబాద్‌లో పరిచయస్థులకు విక్రయిస్తున్నాడు. గుంటూరులో హోల్డింగ్ డ్రైవర్‌గా పనిచేసే యనమల గోపీచంద్‌ను డ్రగ్స్ కోసం గత జూన్‌లో ఢిల్లీ పంపించాడు. ఈ సరుకును విజయవాడలో తీసుకోవడానికి గుంటూరులోని సుభాని హోటల్ యజమాని కుమారులు నాగూర్ షరీఫ్, ఖాజా మొహిద్దీన్‌కు పురమాయించాడు. ఢిల్లీ నుంచి తీసుకువస్తున్న డ్రగ్‌ను తీసుకోవడానికి ఈ ఇద్దరూ జూన్ 30వ తేదీన విజయవాడ రైల్వేస్టేషన్‌కు వచ్చారు. ఢిల్లీ నుంచి డ్రగ్ వస్తున్న సమాచారం సెబ్ పోలీసులకు అప్పటికే అందింది. వారు రైల్వేస్టేషన్ వద్ద నిఘా పెట్టి గోపీచంద్, షరీఫ్, మొహిద్దీన్‌తోపాటు వారు వేచి ఉన్న కారు డ్రైవర్ ఎడ్ల క్రాంతిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ప్రస్తుతం ఈ నలుగురూ నెల్లూరు జైలులో ఉన్నారు. వీరిని విచారించగా, సాయిమస్తాన్‌రావు పేరు బయటకు వచ్చింది. ఈ కేసులో అతడ్ని ఏ5గా చేర్చారు. తన స్నేహితులు పోలీసులకు దొరికిపోయారని తెలుసుకున్న సాయిమస్తాన్‌రావు తాను ఉపయోగించే అన్ని సెల్‌ఫోన్లను పక్కన పెట్టేశాడు.

రహస్యంగా వచ్చి..

జూన్ నుంచి హైదరాబాద్‌లో ఉన్న సాయిమస్తాన్‌రావు కోసం సెబ్ పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. అతడి కదలికలపై నిఘా పెట్టారు. కొన్ని బృందాలు హైదరాబాద్ కేంద్రంగా నిఘా కొనసాగిస్తున్నారు. ఈ తరుణంలోనే అతడు రెండు రోజుల క్రితం హైదరాబాద్ నుంచి గుంటూరు నగరపాలెంలో ఉన్న దర్గాకు వచ్చాడు. ఈ దర్గాకు ధర్మకర్తగా అతని తండ్రి రావి రామ్మోహన్‌రావు ఉన్నారు. అక్కడే సాయిమస్తాన్‌రావు తలదాచుకుంటున్నాడు. ఈ సమాచారాన్ని సేకరించిన పోలీసులు, సాయిమస్తాన్‌రావును దర్గా పరిసరాల్లో సోమవారం అరెస్టు చేసి విజయవాడకు తరలించారు. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాల్లో హాట్‌టాపిక్‌గా మారిన సినీనటుడు రాజ్‌తరుణ్, లావణ్యల కేసు లింక్‌లు తగిలాయి. రాజ్‌తరుణ్‌పై లావణ్య నార్సింగ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పుడు అతడికి డ్రగ్స్ తీసుకునే అలవాటు ఉందని ఆరోపణలు చేశారు. ఇప్పుడు ఇది నిజమన్న వార్తలు వినిపిస్తున్నాయి. రాజ్‌తరుణ్‌తో తనకు స్నేహం ఉందని సాయి మస్తాన్‌రావు అంగీకరించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. రాజ్‌తరుణ్‌తోపాటు లావణ్యకు డ్రగ్స్‌ను అతడు చేరవేసేవాడని సమాచారం. అంతేగాకుండా హైదరాబాద్‌లో ప్రముఖంగా ఉన్న వరలక్ష్మి టిఫిన్ సెంటర్, పల్లెటూరిదోస హోటళ్లకు కూడా మాదకద్రవ్యాలు చేరవేసినట్టు తెలిసింది.

గతంలోనే అనేక కేసులు...

సినీ నటుడు రాజ్ తరుణ్, లావణ్య కేసులో సాయి మస్తాన్‌రావు పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. గుంటూరులోని ఓ హోటల్లో తనపై అతడు అత్యాచారానికి పాల్పడ్డాడంటూ అప్పట్లో లావణ్య ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదుపై పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో ఐపీసీ 376 (1), 307, 323, 506,509 తదితర సెక్షన్‌ల కింద క్రైమ్ నం.103/23గా కేసు నమోదు చేశారు. అయితే ఆ కేసులో అప్పటి సీఐ రాజశేఖర్ రెడ్డి నిందితుడు మస్తాన్ సాయికి అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. దీంతో ఈ కేసును నగరంపాలెం పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఆ కేసులో అతడు హైకోర్టు నుంచి ముందస్తు బెయిల్ తెచ్చుకున్నాడు. కేసు విచారణలో భాగంగా వైద్య పరీక్షలకు రావాల్సిందిగా అప్పటి నగరంపాలెం సీఐ హైమారావు..... బాధితురాలు లావణ్యకు ఫోన్ చేసి పిలిచినా ఆమె రాలేదు. గుంటూరు పోలీసులు సాయిమస్తాన్‌రావుకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ ఆమె విచారణకు గైర్హాజరయ్యారు. ప్రస్తుతం ఆ కేసు విచారణ పెండింగ్‌లో ఉంది. ఇదిలా ఉంటే గుంటూరులో అతనిపై ఫిర్యాదు చేసిన లావణ్య ఆ తర్వాత కొద్ది నెలలకు హైదరాబాద్‌లో డ్రగ్స్ కేసులో పట్టుబడ్డారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ప్రదర్శన



కోల్‌కతాలోని ఆర్జీకార్ వైద్య కళాశాలలో వైద్యురాలిపై అత్యాచారం, ఆపై హత్య ఘటనపై సిద్ధార్థ కళాశాల జూనియర్ డాక్టర్లు (జూడాలు) తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. జూడాల అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం కళాశాల ఆవరణ నుంచి ప్రభుత్వ ఆస్పత్రిలోని అన్ని బ్లాకుల్లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. - గుణదల

ప్రతిభ



తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థి దేవాన్ష్ కట్టముడి (5) స్థానం సంపాదించాడు. సోమవారం మొగల్రాజపురం సిద్ధార్థనగర్‌లో ఉన్న లిటిల్ బ్రెయిన్స్ పాఠశాలలో దేవాన్ష్ కట్టముడి అభినందన కార్యక్రమం జరిగింది. బాలుడు డైనోసార్స్ ఎన్‌సైక్లోపీడియా మొత్తం చదివేశాడని, శిలాజీకరణ ప్రక్రియ, వాహనాలు, ఆయుధాలు, జాతీయ చిహ్నాలు, ఆకారాలు, పక్షులు, పండ్లు, కూరగాయలు, రవాణా పద్ధతులు, నెలలు, వారంలోని రోజులు, శరీర భాగాలు, పౌరాణిక దేవుళ్ల పేర్లు, వంటికి సంబంధించిన నాలుగు వందల కంటే ఎక్కువ ప్రశ్నలకు జవాబులు చెప్పడంలో అతని ప్రతిభను గుర్తించి, అతని జ్ఞాపకశక్తిని మెచ్చి తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో అతని పేరు నమోదు చేశారని పాఠశాల డైరెక్టర్ ఫణి ప్రసాద్ ముక్తేవి, ప్రిన్సిపాల్ సుధాప్రవీణ చెప్పారు. - మొగల్రాజపురం

పరిశీలన



మారిస్ స్టెల్లా కళాశాల ఆడిటోరియంలో జరుగుతున్న చేనేత ఎగ్జిబిషన్‌ను బీసీ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత సోమవారం పరిశీలించారు. చేనేత కార్మికులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో చేనేత, జౌళిశాఖ కమిషనర్ రేఖారాణి, ఆప్కో ఎండీ పవన్‌మూర్తి, జేడీ కన్నబాబు పాల్గొన్నారు. - పటమట

మూఢనమ్మకాల నిర్మూలనకు చట్టం చేయాలి

● ప్రజా సంఘాల డిమాండ్

గవర్నర్‌పేట, ఆగస్టు 12 : మహారాష్ట్రలో అమలులో ఉన్న మూఢనమ్మకాల నిర్మూలనా చట్టం తెలుగు రాష్ట్రాల్లో కూడా తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందని నాస్తిక, హేతువాద, సైన్స్ ప్రచార సంఘాల ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో సోమవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జనవిజ్ఞాన వేదిక (జెవీవీ) నాయకులు జె.మురళీధర్ అధ్యక్షతన మూఢనమ్మకాల నిర్మూలనపై సమావేశం జరిగింది. జెవీవీ రాష్ట్ర అధ్యక్షుడు గేయానంద్, హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నే వెంకటసుబ్బయ్య, అరసం నేత అరుణకుమార్ మాట్లాడారు. ఈనెల 20న అన్ని జిల్లాల్లో ప్రాంతీయ సమావేశాలు నిర్వహించాలని, ప్రజల్ని చైతన్యం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో ప్రముఖ వైద్యులు జి. సమరం, జెవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, నాయకులు కె. శ్రీనివాస్, వెలగా శ్రీనివాస్, ప్రజానాట్యమండలి నాయకులు సుబ్బారెడ్డి, గుండు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు

గవర్నర్‌పేట, ఆగస్టు 12 : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 15వ తేదీన ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్టు ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ సంస్థ అధ్యక్షుడు ఏ.సునీల్‌కుమార్, ఎంబీవీకే మహిళా విభాగం ప్రతినిధి కె.స్వరూపరాణి తెలిపారు. చిత్రలేఖనానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం ఎంబీవీకేలో జరిగింది. 4 గ్రూపులుగా విభజించి పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. సబ్ జూనియర్స్ (1, 2, 3 తరగతులు) నాకు నచ్చిన ప్రదేశం అంశంపైనా, జూనియర్స్ (4, 5, 6 తరగతులు) నేను మెచ్చిన మన సంస్కృతి అంశంపైనా, సీనియర్స్ (7, 8, 9, 10 తరగతులు) భారత దేశం నా స్వర్గసీమ అనే అంశంపైనా, సూపర్ సీనియర్స్ (ఇంటర్, డిగ్రీ, పీజీ తరగతులు) పురోగమన వైతాళికుల చిత్రాలు గీయాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు తమ పేర్లను వాట్సాప్ నెంబరు 93479 50085కు పంపి నమోదు చేసుకోవాలని కోరారు.

జిల్లా స్కేటర్లకు పతకాల పంట

విజయవాడ స్పోర్ట్సు, ఆగస్టు 12 : పొల్లాచి (కోయంబత్తూరు)లో ఈ నెల 7 నుంచి 11 వరకు జరిగిన రెండో ఇండియా స్కేట్‌గేమ్స్-2024లో ఆర్టిస్టిక్‌లో ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన పలువురు ఆర్టిస్టిక్ స్కేటర్లు పతకాలు పొందారని స్కేటింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. 14-17 ఏళ్ల ఏజ్ గ్రూప్‌లో పెద్దిరెడ్ల చైత్రదీపిక సోలో డ్యాన్స్ (రజతం), ఫ్రీ స్కేటింగ్‌లో (రజతం), క్వార్టెట్ (కాంస్యం) సాధించిందన్నారు. చైత్రదీపిక జాతీయ స్కేటింగ్‌లో వరుస పతకాలతో సత్తా చాటుతోందని గతేడాది కూడా మూడు పతకాలను సాధించినట్లు తెలిపారు. హృతిక్ పెయిర్ స్కేటింగ్‌లో కాంస్యం, క్వార్టెట్‌లో కాంస్యం, తేజు సిరిని క్వార్టెట్‌లో కాంస్యం, 14 ఏళ్లలోపు గ్రూప్ స్కేటింగ్‌లో దియా శ్రీ పెయిర్ స్కేటింగ్‌లో కాంస్యం, సోలో డ్యాన్స్‌లో రజతం సాధించారన్నారు. 9-11 క్యాడెట్‌లో బీవీన్ సోలో డ్యాన్స్‌లో స్వర్ణం, క్వార్టెట్‌లో కాంస్యం, పెయిర్ స్కేటింగ్‌లో రజతం, హారిక క్వార్టెట్‌లో కాంస్యం, పెయిర్ స్కేటింగ్‌లో రజతం సాధించినట్టు శ్రీనివాస్ వివరించారు.



ఆర్టిస్టిక్ స్కేటింగ్‌లో పతకాలు సాధించిన స్కేటర్లు

రాత్రి ఒంటిగంట వరకు రెస్టారెంట్లు, హోటళ్లకు అనుమతివ్వండి

● పర్యాటకశాఖ మంత్రి దుర్గేష్‌కు ఏపీహెచ్‌ఏ వినతి

భవానీపురం, ఆగస్టు 12 : రాష్ట్రంలో రెస్టారెంట్లు, హోటళ్లను రాత్రి ఒంటిగంట వరకు నడుపుకునేలా ఉత్తర్వులు జారీ చేయాలని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ (ఏపీహెచ్‌ఏ) సోమవారం కలిసి వినతిపత్రం ఇచ్చింది. ఈ మేరకు ఏపీహెచ్‌ఏ అధ్యక్షుడు ఆర్‌వీ స్వామి మంత్రితో మాట్లాడుతూ 2018 అక్టోబర్ 15న ప్రభుత్వం లేబర్ డిపార్టుమెంట్ మెమో ద్వారా రాత్రి 12 గంటల వరకు హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వహణకు అనుమతి ఇచ్చారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో తాజాగా రెస్టారెంట్లకు నిర్వహణా అనుమతిని రాత్రి ఒంటి గంటవరకు పెంచారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఈ విధంగా ఒంటి గంట వరకు అనుమతి ఇవ్వాలని కోరారు.

ముగిసిన నాన్ ఇంటర్ లాకింగ్ పనులు

వన్‌టౌన్, ఆగస్టు 12 : విజయవాడలో ఈనెల 3 నుంచి 11వ తేదీ వరకు చేపట్టిన నాన్ ఇంటర్ లాకింగ్ పనులు విజయవంతంగా ముగిశాయని విజయవాడ డీఆర్ఎం కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. నాన్ ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా కొన్ని రైళ్లను విజయవాడ స్టేషన్‌లోకి తీసుకురాకుండా రాయనపాడు, రామవరప్పాడు హాల్ట్ సదుపాయం కల్పించారు. ఈ సమయంలో మొత్తం 22 వేల మంది ప్రయాణికులు ఈ స్టేషన్లలో దిగి తమ గమ్యస్థానాలు చేరుకున్నారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. రామవరప్పాడులో 14,438 మంది, రాయనపాడులో 7,126 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా 30 మంది వాణిజ్య సిబ్బంది, 65 మంది టిక్కెట్ చెకింగ్ సిబ్బంది, 20 మందికిపైగా ఆర్‌పీఎఫ్ సిబ్బంది, 11 మంది సఫాయి వాలాలు, 12 మంది విక్రేతలు స్టేషన్లలో సేవలు అందించారని, అదనపు కేటరింగ్ ఏర్పాటు కూడా చేశారని తెలిపారు. రాయనపాడులో 37, రామవరప్పాడులో 17 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రామవరప్పాడులో దాదాపు 1000 మంది అన్ రిజర్వ్‌డ్ బోగీలలో సాధారణ ప్రయాణికులు ఎక్కారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీఆర్ఎం నరేంద్ర ఎ.పాటిల్ నాన్ ఇంటర్ లాకింగ్ పనులు, రైళ్ల దారిమళ్లింపు, స్టేషన్లలో వసతుల కల్పన అంశాలలో అధికారులు, సిబ్బంది సహకరించినందుకు అభినందించారు.



రాయనపాడు స్టేషన్‌లో డీఆర్ఎం పర్యటన

రాయనపాడు నుంచి రికార్డు స్థాయిలో ప్రయాణాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రాయనపాడు రైల్వేస్టేషన్ వారం రోజులుగా ప్రయాణీకులతో కిక్కిరిసిపోతోంది. గత వారం రోజులుగా నాన్ ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా విజయవాడ స్టేషన్ మీదుగా రైళ్లను భారీగా మళ్లించి రాయనపాడు రైల్వేస్టేషన్ మీదుగా మళ్లించారు. దీంతో ప్రయాణీకులంతా రాయనపాడు స్టేషన్‌కు ఎక్కువగా రాకపోకలు సాగించారు. ఈ వారం రోజుల పాటు రాయనపాడు స్టేషన్ నుంచి 22,000 మంది ఇక్కడి నుంచి రాకపోకలు సాగించారు.

దుర్గగుడిలో పనుల పరిశీలన



దుర్గగుడిలో ప్రసాదాన్ని పరిశీలిస్తున్న దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, ఈవో రామారావు

వన్‌టౌన్, ఆగస్టు 12 : దుర్గగుడిలో జరుగుతున్న అన్నదానం భవనం, ప్రసాదం పోటు నిర్మాణాలు, అభివృద్ధి పనులను దేవదాయ శాఖ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణ సోమవారం పరిశీలించారు. ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌లు, కోటేశ్వరరావు, రమాదేవి, ఈవో రామారావు, తదితరులతో క్షేత్రస్థాయిలో పరిశీలించి సూచనలు చేశారు. నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

● దుర్గగుడిలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఈవో

దుర్గగుడిలో భద్రతా ఏర్పాట్లపై ఆలయ ఈఈ లింగం రమాదేవితో పాటు ఎస్‌పీఎఫ్, ఎగిల్ సంస్థ ప్రతినిధులతో కలిసి ఆలయంలో సీసీ కెమెరాలు, చెక్కింగ్ ఏర్పాట్లపై క్షేత్రస్థాయిలో సమీక్షించి సూచనలు అందజేశారు. ఈనెల 7వ తేదీన ఓ గుర్తు తెలియని వ్యక్తి తన సెల్‌ఫోన్‌తో అంతరాలయ దృశ్యాలను చిత్రీకరించి సోషల్ మీడియాలో పెట్టడం చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో తీసుకోవాల్సిన చర్యలపై ఈవో రామారావు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఆలయంలో కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య భక్తులు ప్రశాంతంగా అమ్మవారి దర్శించుకునేలా ఏర్పాట్లు ఉండాలని సెల్‌ఫోన్లతో చిత్రీకరించే వారిని గుర్తించి చర్యలు తీసుకునే విధంగా అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేశారు.

ప్రియుడితో గొడవపడి యువతి ఆత్మహత్య

పాయకాపురం, ఆగస్టు 12 : ప్రియుడితో గొడవపడిన యువతి అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నున్న పోలీసుస్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. గన్నవరం ప్రాంతానికి చెందిన ఎం.హైమావతి (22) అలియాస్ సోనికి రమణమూర్తితో 2020లో వివాహమైంది. నున్నకు చెందిన మహేష్ అనే యువకుడు రమణమూర్తికి స్నేహితుడు. రమణమూర్తితో ఉంటూ హైమావతితో చనువు పెంచుకున్నాడు. ఇరువురి ప్రవర్తనపై అనుమానం వచ్చిన భర్త హైమావతి నుంచి విడిపోయాడు. దీంతో మహేష్, హైమావతి అంబాపురం గ్రామంలోని ఓ ఇల్లు అద్దెకు తీసుకుని సహజీవనం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మహేష్ మరో యువతితో చనువుగా ఉండటం, ఫోన్లో మాట్లాడుతుండటంపై హైమావతి అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ విషయమై ఆదివారం స్నేహితుల సమక్షంలో పంచాయితీ జరిగింది. పంచాయితీలో కూర్చున్న స్నేహితులందరూ మద్యం సేవించారు. గొడవ పెద్దది కావడంతో అక్కడి నుంచి మహేష్ వెళ్లిపోగా హైమావతి నున్న ఎన్టీపీసీ సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న మహేష్ తల్లి వద్దకు వెళతానని వెళ్లిపోయింది. స్నేహితులు కూడా ఆమెను అనుసరించి వెళ్లారు. అయితే అపార్ట్‌మెంట్ ఐదవ అంతస్తు ఎక్కిన హైమావతి మహేష్‌కు ఫోన్ చేసి తాను అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకేస్తానని చెప్పింది. కిందనున్న స్నేహితులు వద్దని వారిస్తుండగానే పైనుంచి హైమావతి కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది.



సోని(ఫైల్)

● పట్టుకోబోయిన వ్యక్తికి గాయాలు

హైమావతి అపార్ట్‌మెంట్ ఐదవ అంతస్తు పైనుంచి దూకేస్తానని చెబుతూ ఒక్కసారిగా కిందకు దూకేసింది. కిందనున్న ఆమె స్నేహితుడు సంపత్.. పై నుంచి పడుతున్న యువతిని పట్టుకునేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. పైనుంచి పడిన యువతి తాకిడికి సంపత్ కాలు విరిగిపోయింది. స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. తన కుమార్తె మృతికి మహేషే కారణమని మృతురాలి తల్లి సీతమ్మ నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రాజకీయాల్లో నైతికతకు కట్టుబడి ఉండాలి

● మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఉంగుటూరు, ఆగస్టు 12 : రాజకీయ నాయకులు నైతిక విలువలకు కట్టుబడి ఉండాలని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సూచించారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా సోమవారం సాయంత్రం ఉంగుటూరు మండలం ఆత్కూరు గ్రామంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో వెంకయ్యనాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. రాజకీయాల్లో ఎలా వుండాలో, ఎలా ఉండకూడదో తెలియజేస్తూ వెంకయ్యనాయుడు ఎమ్మెల్యే యార్లగడ్డకు పలు సూచనలు చేశారు. గత కొంతకాలంగా రాజకీయాల్లో బూతులు మాట్లాడటం ఫ్యాషన్‌గా మారిందని, దీన్ని ప్రజలు కూడా చీత్కరించుకున్న విషయం మొన్నటి ఎన్నికల్లో స్పష్టమైందని చెప్పారు. గన్నవరం నియోజకవర్గ అభివృద్ధికి తమ సహకారాన్నందించడంతోపాటు తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని వెంకయ్యనాయుడిని యార్లగడ్డ కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు సాయం చేస్తానని హామీ ఇచ్చారు.



ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో వెంకయ్యనాయుడికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

● వెంకయ్యనాయుడికి సత్కారం

రైస్‌మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు కృషిచేశారని అఖిలభారత రైస్‌మిల్లర్ల సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తంచేశారు. రైస్‌మిల్లర్ల సంఘం అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రతినిధులు సోమవారం ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్ (విజయవాడ చాప్టర్)లో వెంకయ్యనాయుడిని కలుసుకుని సమస్యల పరిష్కారంలో చొరవచూపినందుకు ఆయనకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. వెంకయ్యనాయుడిని ఘనంగా సత్కరించారు.

బోసినవ్వులను బతికించారు

- నవజాత శిశువుకు 56 రోజులు చికిత్స అందించిన కేజీహెచ్ వైద్యులు
- 50 లక్షల విలువైన మందుల వినియోగం
- బతికే అవకాశం లేని చిన్నారికి ప్రాణం పోశారు
- తమ జీవితాల్లో వెలుగులు నింపారన్న తల్లిదండ్రులు

విశాఖపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నవజాత శిశువుకు కేజీహెచ్ వైద్యులు సుమారు 56 రోజులపాటు వైద్యం అందించి ప్రాణాలు నిలబెట్టారు. అందుకు రూ.50 లక్షలు విలువైన ఇంజక్షన్లు, మందులు వినియోగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ ప్రాంతానికి చెందిన సునీత ఈ ఏడాది జూన్ 18న అత్యవసర పరిస్థితుల్లో కేజీహెచ్‌లోని గైనిక్ విభాగంలో చేరారు. నెలలు నిండక ముందే ప్రసవం అయ్యింది. శిశువు 1.6 కిలోలు బరువు మాత్రమే ఉంది. అదే సమయంలో చిన్నారికి గుండె, ఊపిరితిత్తులు, లివర్ సంబంధిత సమస్యలు ఉన్నట్టు వైద్యులు గుర్తించారు. దీంతో చిన్నారిని అత్యవసరంగా పీడియాట్రిక్ విభాగంలోని నియోనేటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌కు తరలించారు. పీడియాట్రిక్ విభాగం వైద్యులు చిన్నారిని ఎన్ఐసీయూలో చేర్చి సేవలు అందించారు. వారం రోజులపాటు వెంటిలేటర్‌పై ఉంచాల్సి వచ్చింది. ఈ క్రమంలో చిన్నారికి మూడుసార్లు రక్తమార్పిడి చేశారు. లంగ్స్‌లో ఉన్న ఇబ్బందులను తొలగించేందుకు ఖరీదైన లంగ్ సర్ఫాక్టంట్‌తోపాటు ఇమ్యునోగ్లోబులిన్ పలుమార్లు అందించారు. 56 రోజుల చికిత్స అనంతరం చిన్నారి 1.8 కిలోలకు చేరుకుంది. ఆయాసం తగ్గింది. గుండె, కిడ్నీ, లివర్ పనితీరు మెరుగయింది. అనారోగ్య లక్షణాలు ఏ మాత్రం లేవని వైద్యులు నిర్ధారించుకున్నారు. చిన్నారి తల్లి పాలను స్వయంగా తీసుకునే స్థితికి చేరుకుంది. దీంతో కేజీహెచ్ వైద్యులు సోమవారం సాయంత్రం డిశ్చార్జ్ చేశారు. ఈ తరహా కేసుల్లో చిన్నారి బతికే అవకాశం దాదాపు ఉండదని, కానీ, తమ వైద్య బృందం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని సేవలు అందించి ప్రాణాలను నిలబెట్టిందని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద తెలిపారు. నిరంతరం చిన్నారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించిన పీడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి, పిల్లల వైద్యులు డాక్టర్ సత్యకుమార్, డాక్టర్ సత్యవేణితో పాటు నర్సింగ్ సిబ్బందిని సూపరింటెండెంట్ అభినందించారు.



బిడ్డను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద, వైద్యులు

తల్లిదండ్రులు విష్ణుమూర్తి, సునీత మాట్లాడుతూ... 'వివాహం అయిన పదేళ్ల తరువాత బిడ్డ జన్మించింది. ఆ బిడ్డ కూడా బతికే అవకాశం లేదని తెలిసి కుంగిపోయాం. ఆస్పత్రి వైద్యులు బిడ్డ ప్రాణాలను కాపాడి మా జీవితాల్లో వెలుగులు నింపారు. జీవితాంతం వైద్యులకు రుణపడి ఉంటాం' అని అన్నారు.

ఇంద్రకీలాద్రిపై భక్తుడు హల్‌చల్

● ఉద్యోగిపై దూషణ

వన్‌టౌన్, ఆగస్టు 12 : దుర్గామల్లేశ్వర దేవస్థానం కొండపై ఓ భక్తుడు హల్‌చల్ చేశాడు. సెల్‌ఫోన్‌ను కౌంటర్‌లో భద్రపరచుకోమన్న ఉద్యోగితో గొడవపడ్డాడు. ఆవేశంగా ఆ ఉద్యోగిని అసభ్యకరంగా దూషించి, కొట్టి మళ్లీ ఫోన్ చేసి తన అనుచరులను కొండపైకి పిలిపించి గొడవకు దిగాడు. సోమవారం ప్రసాదంపాడుకు చెందిన నాగరాజు తన స్నేహితుడితో కలిసి అమ్మవారి దర్శనం నిమిత్తం కొండపైకి వచ్చాడు. సమాచార కేంద్ర సమీపంలో అతను ఫోన్ మాట్లాడుకుంటూ దేవస్థానం లోపలికి వెళుతుండగా గేటు వద్ద ఉన్న ఉద్యోగి.. నాగరాజును ఆపి సెల్‌ఫోన్ లోపలికి తీసుకువెళ్లకూడదని, ఇక్కడ భద్రపరచుకోవాలని సూచించాడు. నాగరాజు ఆ ఉద్యోగితో గొడవపడ్డాడు. దూషించి, చేయిచేసుకున్నాడు. అడ్డుకున్న ప్రైవేటు సెక్యూరిటీ ఉద్యోగిపైనా దూషణకు దిగాడు. తన అనుచరులకు ఫోన్‌చేసి కొండపైకి పిలిపించాడు. ఏడుగురు నాగరాజు అనుచరులు కొండపైకి వచ్చి సెల్‌ఫోన్ భద్రతా కాంట్రాక్టర్ ఉద్యోగి, దేవస్థాన ప్రైవేటు సెక్యూరిటీ ఉద్యోగితో గొడవపడ్డారు. నాగరాజు, అతని అనుచరులను అవుట్ పోస్టు పోలీస్ సిబ్బంది అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు

● పోలీసులకు ఫిర్యాదులు చేసిన ఇరు వర్గాలు

నాగరాజుపై సెల్‌ఫోన్‌లు భద్రతా కాంట్రాక్టర్ ఉద్యోగి అద్దంకి రవితేజ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనతో గొడవపడి తన వెంట ఉన్న కుమార్తెను, తనను వీడియో తీయబోయాడని పోలీసులకు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇరువురి ఫిర్యాదుల మేరకు పోలీసులు విచారిస్తున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన నాగరాజు వెంట ఒక వ్యక్తి మాత్రమే ఉన్నాడని సీసీ ఫుటేజ్‌ను పరిశీలించిన ఆలయ అధికారులు తెలిపారు.

ఆయుష్మాన్ భారత్‌లో ఆయుష్ చికిత్సలు చేర్చాలి

ధర్నాచౌక్ : ఆయుష్మాన్ భారత్ పథకంలో ఆయుష్ చికిత్సలు చేర్పించాలని, దానికి సంబంధించిన ప్రపోజల్స్ కేంద్ర ప్రభుత్వానికి పంచేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ది మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వేముల భానుప్రకాష్ కోరారు. సెక్రటేరియట్‌లోని మంత్రి చాంబర్‌లో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు.

ఆయిల్, గ్యాస్‌లో సగం వాటా రాష్ట్రానిదే

● రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ధర్నాచౌక్ : కృష్ణా, గోదావరి బేసిన్‌లోని సహజవాయువు, చమురు ప్రజల సొత్తని ఆయిల్, గ్యాస్‌ల్లో 50 శాతం వాటా రాష్ట్ర ప్రజలకు దక్కాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ 50 శాతం వాటా కోసం రాష్ట్రవ్యాప్తంగా కేజీ బేసిన్ సాధన సమితి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టనున్నట్టు తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ గ్యాస్ బేసిన్‌లో 50 శాతం వాటా రాష్ట్ర ప్రజలకు దక్కాలన్నారు. సీపీఎం రాష్ట్ర నేత వి .ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గ్యాస్ సాధనకు సమైక్య ఉద్యమం నిర్మించేందుకు ముందుంటామన్నారు. లీటర్ పెట్రోల్ రూ.10కి అందించాలని, కేంద్ర ప్రభుత్వానికి రాయల్టీగా వచ్చే ఆదాయంలో కనీసం 50 శాతం రాష్ట్ర ప్రజలకు కేటాయించాలని, కోనసీమ ప్రాంతంలో శుద్ధి కర్మాగారాన్ని ఏర్పాటు చేయాలని ఈ సమావేశంలో తీర్మానించారు. డాక్టర్ కొల్లా రాజమోహన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు రైతు, కార్మిక, ప్రజా సంఘాలు, పార్టీల నేతలు, మేధావులు పాల్గొన్నారు.

రైల్వే మజ్దూర్ యూనియన్ ఆందోళన

రైల్వేస్టేషన్ : పాత పెన్షన్ విధానం రద్దు చేయాలని, కరోనా సమయంలో నిలిపివేసిన 18 నెలల డీఏను తిరిగి చెల్లించాలని 8వ వేతన సంఘం ఏర్పాట్లను కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం డీఆర్ఎం కార్యాలయం వద్ద గేట్ మీటింగ్ నిర్వహించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా యూనియన్ డివిజనల్ సెక్రటరీ లీలా మాట్లాడుతూ యూనియన్ జనరల్ సెక్రటరీ శంకరరావు ఇచ్చిన పిలుపు మేరకు గూడూరు నుంచి అనకాపల్లి వరకు అన్ని రైల్వే కార్యాలయాల వద్ద ఆందోళన నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ డివిజనల్ నాయకులు రామగుప్తా, శేఖర్ బాబు, పాములు, లోకల్ బ్రాంచ్ కార్యదర్శిలు వెంకటేశ్వరరావు, అహ్మద్ షరీఫ్, శ్రీనివాసరావు, భానుబాబు పాల్గొన్నారు. అనంతరం డీఆర్ఎం నరేంద్ర పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు.

ఫార్మసీ అసోసియేషన్ అధ్యక్షుడిగా నరేష్ లుక్కా

భవానీపురం : ఫార్మసీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా నరేష్ లుక్కాను ఏపీ ఫార్మా కోర్ కమిటీ సమావేశంలో నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నరేష్ మాట్లాడుతూ ఫార్మారంగం అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక ద్వారా రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని తెలిపారు. ఈ రంగం అభివృద్ధికి నూతన ప్రభుత్వంతో కలిసి రానున్న రోజుల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. దీంతో పాటు నూతన ఒరవడిని తీసుకువచ్చే విధంగా ఫార్మాలో అన్ని రంగాలు భవిష్యత్ తరాలకు ఒక తలమానికంగా తయారు చేస్తామని ఆయన తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 20 మందికి జైలు

విజయవాడ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 20 మందికి న్యాయస్థానం జైలు, జరిమానా విధించింది. వన్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రైవ్‌లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 20 మందిపై కేసు నమోదు చేశారు. వారిని రైల్వేకోర్టులో సోమవారం హాజరుపర్చగా ఒక్కొక్కరికి రూ.10వేల జరిమానా, జైలు విధిస్తూ న్యాయస్థానం తీర్పు చెప్పింది.

'వేదిక'కు 77 ఫిర్యాదులు

విజయవాడ (ఆంధ్రజ్యోతి) : పోలీసు కమిషనరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 77 ఫిర్యాదు అందాయి. నగదు లావాదేవీలు 13, కుటుంబ కలహాలు 15, భూవివాదాలు ఐదు, వేధింపులు ఆరు, వివిధ మోసాలు 27, చిన్నచిన్న వివాదాలు, ఘటనలకు సంబంధించి 11 ఫిర్యాదులు అందాయి.

ఎస్పీఎఫ్ యూనిఫాం ప్యాటర్న్‌లో మార్పులు

విజయవాడ (ఆంధ్రజ్యోతి) : ఎస్పీఎఫ్ సిబ్బందికి యూనిఫాం ప్యాటర్న్‌లో మార్పులు చేశారు. ఈ యూనిఫారంను ఎస్పీఎఫ్ విభాగాధిపతి త్రివిక్రమ్‌వర్మ మంగళగిరిలోని బెటాలియన్‌లో సోమవారం అందజేశారు. క్యాప్, బెల్టు, మార్పులు చేసిన లోగోను త్రివిక్రమవర్మ, ఐజీ బీవీ రామిరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమాండెంట్ శంకరరావు, అసిస్టెంట్ కమాండెంట్ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో శాంతిని పునరుద్ధరించాలి

- అక్కడి హిందువులకు భద్రత, స్థిరత్వం అవసరం
- ఆ వీడియోలు హృదయ విదారకం: పవన్ కల్యాణ్



అమరావతి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హింసకు సంబంధించి ఇటీవల విడుదలైన వీడియోలు, చిత్రాలు హృదయ విదారకంగా ఉన్నాయని, తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్‌లో సంఘటనపై ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. బంగ్లాదేశ్ కమ్యూనిస్ట్ పార్టీ నాయకుడు ప్రదీప్ భౌమిక్‌ను పట్టపగలు నరికి చంపడం దారుణమన్నారు. హిందూ దేవాలయాలను ధ్వంసం చేయడం, మైనార్టీలను చంపడం పట్ల తీవ్రంగా కలత చెందానని పేర్కొన్నారు. బంగ్లాదేశ్ మానవ హక్కుల కమిషన్, బంగ్లాదేశ్ హైకమిషనర్ తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టి ఆ దేశంలో శాంతిని పునరుద్ధరించాలని కోరారు. బంగ్లాదేశ్‌లోని మైనార్టీలు, హిందువులందరికీ భద్రత, స్థిరత్వం కోసం తాను ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

గ్రామ స్వరాజ్యం దిశగా తొలి అడుగు: పవన్

'34 ఏళ్ల తర్వాత మైనర్, మేజర్ పంచాయతీలకు స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర వేడుకల బడ్జెట్‌ను రూ.100, రూ.250 నుంచి రూ.10 వేలు, రూ.25 వేలకు పెంచారు. రాష్ట్రంలో ఏళ్ల తరబడి నిర్లక్ష్యానికి గురైన పంచాయతీలకు సాధికారత కల్పించేందుకు ఇది కీలక అడుగు. నేను పంచాయతీ రాజ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత మహాత్మాగాంధీ గ్రామ స్వరాజ్యాన్ని నెరవేర్చే దిశగా తొలి అడుగు' అని పవన్ కల్యాణ్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఏపీలో ఎన్డీయే ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో పంచాయతీలకు అధికారాన్ని అందించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. సీఎం చంద్రబాబు, ప్రధాని మోదీలను పవన్ ట్యాగ్ చేశారు.

అమరుల త్యాగం గర్వకారణం: మనోహర్

- ప్రభుత్వం తరపున తెనాలిలో అమరవీరుల సంస్మరణ కార్యక్రమం



అమరవీరులకు నివాళులర్పిస్తున్న మంత్రి మనోహర్, అధికారులు

తెనాలి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్రోద్యమ కాలంలో బ్రిటిష్ నిరంకుశ పాలనకు ఎదురొడ్డి పోరాడి అశువులు బాసిన ఎందరో అమరవీరుల త్యాగాలు మన యావత్ భారతావనికే గర్వకారణమని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. క్విట్ ఇండియా ఉద్యమంలో గాంధీజీ పిలుపు మేరకు ఉద్యమ బాటపట్టి, తెనాలిలో బ్రిటిష్ పాలకుల తుపాకులకు బలయిపోయిన ఏడుగురు అమర వీరులకు సోమవారం ప్రభుత్వం తరపున ఘనంగా నివాళులర్పించారు. భాస్కరుని లక్ష్మీనారాయణ, మాజేటి సుబ్బారావు, శ్రీపతి పండితారాధ్యుల శ్రీగిరిలింగం, ప్రయాగ వీరరాఘవయ్య, జాస్తి అప్పయ్య, తమ్మినేని సుబ్బారెడ్డి, గాలి రామకోటయ్య ప్రాణత్యాగానికి గుర్తుగా తెనాలిలో ఏడు స్థూపాలను అప్పట్లోనే నిర్మించారు. సంస్మరణ దినోత్సవం సందర్భంగా మనోహర్.. సోమవారం గాంధీ చౌక్ నుంచి రణరంగ చౌక్ వరకు భారీ ర్యాలీతో, ఎన్‌సీసీ క్యాడెట్ల కవాతు మధ్య చేరుకున్నారు. భరతమాత విగ్రహానికి పూలమాలలువేశారు. జాతీయ పతాకాన్ని ఎగురవేసి, అమరవీరుల స్థూపాల దగ్గర పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు. కార్యక్రమంలో జేసీ భార్గవ్‌తేజ, సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్, డీఎస్పీ రమేష్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఐఈడీ పేలి ఆదివాసీ మహిళ మృతి



ఐఈడీ పేలి మరణించిన కొవ్వాసి సుక్కి

చింతూరు, ఆగస్టు 12: మావోయిస్టులు అమర్చిన ఐఈడీ పేలి ఆదివాసీ మహిళ మృతి చెందారు. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా కిష్టారం పోలీసుస్టేషన్ పరిధిలో ఆదివారం సాయంత్రం జరిగిందీ ఘటన. దబ్బమార్క గ్రామానికి చెందిన కొవ్వాసి సుక్కి(27) తన పశువులను మేపేందుకు అటవీ ప్రాంతానికి తోలుకెళ్లారు. సాయంత్రం తిరిగి గ్రామానికి వస్తుండగా మావోయిస్టులు అమర్చిన ఐఈడీపై ఆమె అడుగు పడటంతో పేలిపోయింది. సుక్కి రెండు కాళ్లు తెగిపోయి అక్కడికక్కడే మరణించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రిటైర్మెంట్ తర్వాత పుట్టినతేదీ మార్పు కుదరదు

- కర్ణాటక హైకోర్టు

బెంగళూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రిటైర్మెంట్ తర్వాత పుట్టిన తేదీ మార్పు సాధ్యం కాదని కర్ణాటక హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ మేరకు జస్టిస్ ఎంజీఎస్ కమల్ ఏకసభ్య ధర్మాసనం సోమవారం తీర్పునిచ్చింది. 1983 అక్టోబరులో పల్స్ డ్రాయింగ్ ప్రాసెసర్‌గా ఉద్యోగంలో చేరిన వ్యక్తి 2006 మార్చి 9న రిటైరయ్యారు. సదరు వ్యక్తి తన పుట్టిన తేదీని మౌఖికంగా నమోదు చేశారని, అందుకు సంబంధించి ఎటువంటి రికార్డులు లేవని కోర్టును ఆశ్రయించారు. చివరకు ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్), స్కూల్ రికార్డుల ప్రకారం 2006కు ఆయనకు 58 ఏళ్లు కావడంతో రిటైరయ్యారు. ఆ తరువాత 1952లో తాను జన్మించినట్టు డిప్యూటీ తహసీల్దార్‌తో ప్రమాణపత్రాన్ని పొంది, 2010వరకు ఉద్యోగం చేయాల్సి ఉందని హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన ధర్మాసనం, ఉద్యోగంలో చేరిన సమయంలోనే పుట్టిన తేదీని నమోదు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. విధి నిర్వహణలో ఎలాంటి అభ్యంతరాలు లేవనెత్తలేదని, రిటైర్మెంట్ సమయంలోనూ ప్రస్తావించలేదని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ పొందిన రెండేళ్ల తర్వాత అభ్యంతరం వ్యక్తం చేయడం సరికాదని ధర్మాసనం స్పష్టం చేసింది.

బీఎఫ్ఎస్సీలో ప్రవేశానికి రిజిస్ట్రేషన్ల గడువు 20

అమరావతి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఏపీ మత్స్య విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలల్లో 2024-25 బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్(బీఎఫ్ఎస్సీ)లో ప్రవేశానికి ఈనెల 20లోగా వర్సిటీ వెబ్‌సైట్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రిజిస్ట్రార్ కోరారు. ఏపీ ఈఏపీసెట్-2024ర్యాంక్ వెబ్ కౌన్సిలింగ్ ఆధారంగా సీట్ల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. ముత్తుకూరులో 40, నరసాపురంలో 60 సీట్లు ఉండగా, అదనంగా 10 సీట్లు ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు కేటాయిస్తారని, మొత్తం సీట్లలో 85% స్థానికులకు, 15% ఇతర రాష్ట్రాల అభ్యర్థులకు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

'రంగా' అనుబంధ కళాశాలల్లో సీట్ల పెంపు

ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం(అంగ్రూ) గుర్తింపు పొందిన ఆరు వ్యవసాయ కళాశాలల్లో సీట్లను 60 నుంచి 120కు పెంచడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. సీట్ల సామర్థ్యం పెంపుదలపై ఆసక్తి వ్యక్తీకరణ కోసం ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

'నమో డ్రోన్ దీదీ' అమలుకు రాష్ట్ర స్థాయి కమిటీ

కేంద్ర ప్రయోజిత పథకం 'నమో డ్రోన్ దీదీ' అమలు కోసం, ఈ పథకంలో స్వయం సహాయక సంఘాలకు డ్రోన్లు అందించేందుకు రాష్ట్రస్థాయిలో ఉన్నతాధికారులతో ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. వ్యవసాయ శాఖ డైరెక్టర్, గ్రామీణాభివృద్ధిశాఖ, సహకారశాఖ కమిషనర్, సెర్ప్ సీఈవో, నాబార్డు సీజీఎం, పొగాకు పరిశోధన స్థానం డైరెక్టర్ తదితరులతో కమిటీని నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

బ్రాడ్‌కాస్టింగ్ సర్వీస్ ముసాయిదా బిల్లు వెనక్కి

న్యూఢిల్లీ, ఆగస్టు 12: వివాదాస్పద బ్రాడ్‌కాస్టింగ్ సర్వీస్ (రెగ్యులేషన్) ముసాయిదా బిల్లును ఉపసంహరించుకుంటున్నట్లు కేంద్ర సమాచార, ప్రసార శాఖ సోమవారం ప్రకటించింది. ముసాయిదా బిల్లు రివైజ్డ్ వెర్షన్‌ను కొందరికే రహస్యంగా ఇచ్చారంటూ విపక్షాలు ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. అన్ని వర్గాల నుంచి వచ్చిన ప్రతిస్పందనల మేరకు ముసాయిదా బిల్లుపై అక్టోబరు 15వ తేదీ వరకు మరిన్ని సూచనలు, సలహాలు తీసుకుంటామని సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ పేర్కొంది. ఈ ఏడాది నవంబరు 11న మళ్లీ ప్రజల ముందు ఉంచుతామని తెలిపింది.

విశాఖ ఉక్కులో 'కోతలు'

- ఇతర ప్లాంట్లకు 300 మంది ఉద్యోగులు
- సీఐఎస్ఎఫ్ సిబ్బందిలోనూ 25% తగ్గింపు
- లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌కు బ్రేక్
- క్వార్టర్లలో ఉంటున్న సిబ్బంది నుంచి విద్యుత్ చార్జీలు వసూలు
- ఉన్నతాధికారులకు అదనపు సౌకర్యాలు రద్దు
- ఉత్పత్తి పెంపుపై దృష్టి సారించని వైనం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



విశాఖపట్నం స్టీల్‌ప్లాంటులో అవసరమైన వాటిపై కాకుండా ఇతర అంశాలపై ఉక్కు మంత్రిత్వ శాఖ, యాజమాన్యం దృష్టిపెట్టడంపై తీవ్ర విమర్శలు చెలరేగుతున్నాయి. ముడి పదార్థాల కొరత వల్ల ఉత్పత్తి దారుణంగా పడిపోయింది. సిబ్బందికి 11వ తేదీ వచ్చినా జీతాలు ఇవ్వలేని దుస్థితి. ఆర్థిక వనరులు సమకూర్చాలని, ఐరన్ ఓర్, కోకింగ్ కోల్ తగినంత అందిస్తే 100 శాతం సామర్థ్యంతో ప్లాంటును నడుపుతామని ఉద్యోగ, కార్మిక సంఘాలు ముక్తకంఠంతో చెబుతున్నాయి. ఆ దిశగా చర్యలు చేపట్టాల్సిన మంత్రిత్వ శాఖ ఆ సమస్యలను పక్కన పెట్టేసింది. రెండు రోజుల క్రితం ఢిల్లీలో జరిగిన అత్యున్నత సమావేశంలో ఉక్కు మంత్రిత్వ శాఖ సెక్రటరీ ఉక్కు కర్మాగారం యాజమాన్య ప్రతినిధులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. పొదుపు చర్యలు పాటించాలని, వ్యయాలు తగ్గించాలని హితబోధ చేశారు. ఆయన ఆదేశాలతో విశాఖపట్నం వచ్చిన సీఎండీ అతుల్‌భట్ ఆదివారం సెలవు అయినా సరే అడ్మిన్ బోర్డు మీటింగ్ హాలులో కాకుండా ప్లాంటులో రహస్య సమావేశం ఏర్పాటుచేసి సిబ్బందికి సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్లాంటు భద్రతకు పనిచేస్తున్న సీఐఎస్ఎఫ్ సిబ్బందిలో 25 శాతం మందిని తీసేయాలని నిర్ణయించారు. అలాగే ఇక్కడ పనిచేస్తున్న 300 మంది ఉద్యోగులను నగర్‌నార్ స్టీల్‌ప్లాంటుకు డిప్యుటేషన్‌పై పంపాలని తీర్మానించారు. ప్లాంటు నుంచి ఇకపై ఎవరూ విదేశీ పర్యటనకు వెళ్లకూడదని నిషేధం విధించారు. ఇంతకుముందు ప్లాంటు క్వార్టర్స్‌లో ఉండే సిబ్బంది నుంచి విద్యుత్ చార్జీలు యూనిట్‌కు 50 పైసలు వసూలు చేశారు. ఆర్థిక సమస్యలు వచ్చాక ఎగ్జిక్యూటివ్‌లు అంతా బయట ఎంత ధర ఉంటే అంతే చెల్లించేలా ఉత్తర్వులు ఇచ్చారు. ఇప్పుడు ఈ విధానం నాన్ ఎగ్జిక్యూటివ్‌లకు కూడా అమలు చేయాలని నిర్ణయించారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు బోనస్, ఇతర ప్రోత్సాహకాలు ఉండవని ప్రకటించారు. బోర్డు స్థాయి కంటే దిగువ ఉండే ఎగ్జిక్యూటివ్‌లకు పెర్క్స్ 40 శాతం, బోర్డు లెవెల్ ఎగ్జిక్యూటివ్‌లకు 34 శాతం మాత్రమే ఇవ్వాలని నిర్ణయించారు. 175 సెలవులు దాటిన తరువాత మిగిలే సెలవుకు లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ విధానం అమలులో ఉంది. తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు దీనిని కూడా నిలిపివేస్తున్నట్టు ప్రకటించారు. ఆయా విభాగాల్లో వ్యయం తగ్గించిన వారికి 'కాస్ట్ చాంపియన్' అవార్డులు ఇవ్వాలని నిర్ణయించారు. సీఎండీకి, డైరెక్టర్లకు, హెచ్ఓడీలకు అన్నిరకాల అదనపు సదుపాయాలు రద్దు చేశారు.

సిబ్బంది తగ్గింపు

ఖర్చుల పేరుతో సిబ్బందిని తగ్గించుకుంటూ పోతున్నారు. ప్లాంటులో 5,000 మంది అధికారులు ఉండేవారు. ఆ సంఖ్యను 4,100కు తీసుకువచ్చారు. నాన్ ఎగ్జిక్యూటివ్‌లు 12 వేల మంది ఉండేవారు. వారిని 8,500కు కుదించారు. సీఐఎస్ఎఫ్ సిబ్బంది 1,100 మంది ఉంటే వారిని 900 మందికి తీసుకువచ్చారు. ఇప్పుడు వీరిలో మరో 25 శాతం మందిని తగ్గించాలని నిర్ణయించారు. ప్లాంటును పూర్తిస్థాయిలో నడిపితేనే నష్టాల నుంచి బయటపడతామని ఉద్యోగ వర్గాలు చెబుతున్నాయి. అంటే అందుకు తగిన సిబ్బంది అవసరం. వారి సంఖ్య తగ్గించుకుంటే ముడి పదార్థాలు వచ్చినా ఉత్పత్తి సాధ్యం కాదు. అప్పటికప్పుడు నియమించుకోవడమూ కుదరదు. అదే జరిగితే ఇంకా నష్టాలు పెరుగుతాయి. ఉక్కు మంత్రిత్వ శాఖ అదే కోరుకుంటున్నాదా? అనే అనుమానాలు కలుగుతున్నాయి.

జీతభత్యాలు తగ్గించడం కాదు...
ఓర్ సరఫరా చేయాలి

'ఎన్ఎండీసీ రూ.1,500 కోట్లు ఇవ్వడానికి ఒప్పుకుంది. ఆ మొత్తం ఇప్పించడానికి ఉక్కు మంత్రిత్వ శాఖ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? అలాగే 10 లక్షల టన్నుల ఐరన్ ఓర్ సరఫరాకు ఒప్పందం ఉంది. కానీ ఇవ్వడం లేదు. దీనిని మంత్రిత్వ శాఖ ఎందుకు ప్రశ్నించడం లేదు? కోల్ సరఫరాకు తగినన్ని రైలు రేక్‌లు ఇవ్వడం లేదు. వాటిని ఎందుకు ఇప్పించరు? ముడి పదార్థాల సరఫరాపై దృష్టి పెట్టని మంత్రిత్వ శాఖ... కాస్ట్ కటింగ్ పేరుతో ఉద్యోగుల జీతభత్యాలు తగ్గిస్తే వచ్చే ప్రయోజనం ఏమిటో వెల్లడించాలి. ఏ దురుద్దేశంతో ఇవన్నీ చేస్తున్నారో చెప్పాలి. తక్షణమే పూర్తిస్థాయి ఉత్పత్తికి అవసరమైన చర్యలు చేపట్టాలి.'

- అయోధ్యరామ్, కన్వీనర్, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ



ఎస్ఎస్ఎల్వీ-డీ 3 ప్రయోగం
ఒకరోజు వాయిదా

- 16న ప్రయోగించేందుకు సన్నాహాలు

సూళ్లూరుపేట, ఆగస్టు 12: తిరుపతి జిల్లా శ్రీహరి కోటలోని అంతరిక్ష ప్రయోగ కేంద్రం షార్ నుంచి ఈవోఎస్-08 ఉపగ్రహ ప్రయోగం ఒక రోజు వాయిదా పడింది. ఈనెల 16న ఎస్ఎస్ఎల్వీ-డీ 3 రాకెట్ ద్వారా ఈవోఎస్-08.. భూ పరిశీలన ఉపగ్రహాన్ని రోదసీలోకి పంపనున్నారు. ఇస్రో అధికారులు తొలుత ఈ ప్రయోగాన్ని ఆగస్టు 15న ప్రయోగించేందుకు ఏర్పాట్లు చేశారు. షార్‌లో ఆగస్టు 13న అంతరిక్ష దినోత్సవాలు, 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఉండడంతో ప్రయోగాన్ని ఒకరోజు వాయిదా వేసినట్లు ఇస్రో వర్గాల సమాచారం. ఆగస్టు 16న ఉదయం 9.17 గంటలకు షార్ నుంచి ఇస్రో రూపొందించిన మూడో స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ ఎస్ఎస్ఎల్వీ-డీ 3 ప్రయోగం చేపట్టనున్నారు. రాకెట్ అనుసంధాన పనులను శాస్త్రవేత్తలు పూర్తి చేసి ప్రయోగానికి సిద్ధం చేశారు. తుది పరీక్షలనూ పూర్తిచేశారు. ఇస్రో ఛైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ మంగళవారం షార్‌లో ప్రయోగంపై శాస్త్రవేత్తలతో సమావేశం కానున్నట్లు తెలిసింది.

కేంద్ర ప్రభుత్వ వైఖరితో ఒలింపిక్స్‌లో నిరాశ ఫలితాలు: సీపీఐ రామకృష్ణ

గుంటూరు(తూర్పు), ఆగస్టు 12: ప్యారిస్ ఒలింపిక్స్‌లో అమెరికా, చైనా, జపాన్ లాంటి దేశాలు అద్భుత ప్రతిభ చూపితే, భారత్ మాత్రం 71వ స్థానానికి పరిమితమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ అన్నారు. సోమవారం గుంటూరులో జరిగిన ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న అయన అనంతరం మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ వైఖరి వల్లే ఒలింపిక్స్‌లో భారత్‌కు నిరాశాజనక ఫలితాలు వచ్చాయని అభిప్రాయపడ్డారు. మోదీ పాలనలో నిరుద్యోగం, పేదరికం, రైతు ల ఆత్మహత్యల్లో మాత్రం ముందున్నామని, క్రీడల్లో వెనుకబడిపోయామని ఎద్దేవా చేశారు.

కలకలం రేపిన దువ్వాడ ఆడియో!

టెక్కలి, ఆగస్టు 12: ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఐవోసీ అధికారులతో మాట్లాడే ఆడియో సామాజిక మాధ్యమాల్లో తిరుగుతూ చర్చనీయాంశమైంది. నాలుగు రోజులుగా దువ్వాడ కుటుంబంలో రచ్చ సాగుతున్న విషయం తెలిసిందే. మాధురి అనే మహిళతో సన్నిహితంగా ఉంటూ దువ్వాడ తమకు అన్యాయం చేస్తున్నారని అయన భార్య టెక్కలి జడ్పీటీసీ సభ్యురాలు దువ్వాడ వాణి నాలుగు రోజులుగా నిరసన దీక్ష చేస్తున్నారు. సోమవారం కూడా టెక్కలిలో దువ్వాడ ఇంటి ముందు దీక్ష కొనసాగించారు. కాగా.. సోమవారం దువ్వాడ మాట్లాడినట్టు ఆడియో ఒకటి లీకైంది. అందులో.. మాధురికి తలగాం వద్ద ఓ పెట్రోల్ బంకు ఉందని, వాటి అడ్డంకులు తొలగించి వెంటనే బంకు ప్రారంభించి పోర్టు వాహనాలకు ఆయిల్ అక్కడ నుంచే సరఫరా చేయాలని దువ్వాడ శ్రీనివాస్ ఐవోసీ అధికారులతో చెబుతున్నట్టు ఉంది. ఈ ఆడియో కలకలం రేపింది.

కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్ లిస్టింగ్‌ను పరిశీలిస్తాం

న్యూఢిల్లీ, ఆగస్టు 12: మద్యం విధానం కుంభకోణంపై సీబీఐ నమోదు చేసిన కేసులో ముఖ్యమంత్రి కేజ్రీవాల్ పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌ను లిస్టింగ్ చేయడాన్ని పరిశీలిస్తామని సోమవారం సుప్రీంకోర్టు తెలిపింది. ఈ కేసులో బెయిల్ ఇవ్వడానికి ఢిల్లీ హైకోర్టు నిరాకరించడంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇదే ఆరోపణపై ఈడీ నమోదు చేసిన కేసుల్లో నిందితుల బెయిల్ పిటిషన్లను లిస్టింగ్ చేసినందున, కేజ్రీవాల్ వినతిని కూడా లిస్ట్ చేయాలని ఆయన తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వి కోరారు. స్పందించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ "ఈ-మెయిల్ పంపండి. చూస్తాను" అని అన్నారు.

ఎల్జీకి కేజ్రీవాల్ లేఖ అధికార దుర్వినియోగమే

న్యూఢిల్లీ, ఆగస్టు 12: జైలు నుంచి ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్జీ) వీకే సక్సేనాకు లేఖ రాయడం అధికార దుర్వినియోగానికి పాల్పడటమేనని తిహాడ్ జైలు అధికారులు సీఎం కేజ్రీవాల్ చర్యల్ని తప్పుబట్టారు. అది నిబంధనలను అతిక్రమించడమే అవుతుందని పేర్కొన్నారు. తాను జైల్లో ఉన్నందున... ఈ నెల 15న జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో తన స్థానంలో మంత్రి అతిశీకి జెండా ఎగురవేసేందుకు అనుమతినివ్వాలని ఎల్జీకి ఇటీవలే సీఎం కేజ్రీవాల్ లేఖ రాశారు. అయితే జైలు నిబంధనల ప్రకారం... జైల్లో ఉన్న వ్యక్తి వ్యక్తిగత విషయాలను మాత్రమే లేఖలో పేర్కొనాల్సి ఉంటుందని, కానీ ఎల్జీకి లేఖ రాయడం ఢిల్లీ జైలు నిబంధనలకు విరుద్ధమని అందుకే దానిని పంపలేదని అధికారులు కేజ్రీవాల్‌కు రాసిన లేఖలో వెల్లడించారు.

పాక్ ఐఎస్ఐ మాజీ చీఫ్ అరెస్టు

ఇస్లామాబాద్, ఆగస్టు 12: ఐఎస్ఐ మాజీ చీఫ్ జనరల్ ఫయాజ్ హమీద్‌ను పాకిస్థాన్ ఆర్మీ అరెస్టు చేసింది. హౌసింగ్ స్కీమ్ కుంభకోణంలో జరిగిన అవకతవకలకు సంబంధించి ఆయనపై వచ్చిన ఆరోపణల దృష్ట్యా సుప్రీం కోర్టు ఆదేశాలతో అదుపులోకి తీసుకుంది. ఈ మేరకు సోమవారం ఐఎస్ఐ పబ్లిక్ రిలేషన్స్ విభాగం ఓ ప్రకటన విడుదల చేసింది. "టాప్ సిటీ కేసు(హౌసింగ్ స్కీమ్)లో ఫయాజ్‌పై వచ్చిన ఆరోపణలు నిరూపితం అయ్యాయి. పాక్ ఆర్మీ, సుప్రీం కోర్టు ఆదేశాలతో అదుపులోకి తీసుకున్నాం" అని తెలిపింది. 2023 నవంబర్‌లో ఫయాజ్‌పై పిటిషన్ దాఖలైంది.

మాయమాటలతో బాలికల అపహరణ

- కేటుగాడిని కటకటాల్లోకి పంపిన పోలీసులు
- ధవళేశ్వరంలో అక్కాచెల్లెళ్ల కిడ్నాప్ కేసు ఛేదన
- మంత్రి లోకేశ్, టీడీపీ ఇన్‌చార్జి వర్మ చొరవతో దర్యాప్తు వేగం

రాజమహేంద్రవరం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఇద్దరు బాలికలను మాయమాటలతో అపహరించిన కేటుగాడిని పోలీసులు కటకటాల్లోకి నెట్టారు. బాలికలను రక్షించి తల్లి చెంతకు చేర్చారు. తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ సోమవారం ఈ వివరాలను విలేకరులకు వెల్లడించారు. ఒడిశాకు మహిళ భర్త నుంచి విడిపోయి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడితో తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలో నివసిస్తున్నారు. కుమార్తెలు కాకినాడలోని హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. విజయనగరం జిల్లా బత్తిరాజేరు మండలం పెదమన్నాపురానికి చెందిన మారోజు వెంకటేశ్ అనే యువకుడు వీరు నివసిస్తున్న ఇంటి పైగదిలో అద్దెకు ఉంటున్నాడు. అప్పటికే అతడితో 17ఏళ్ల బాలిక ఉండగా, ఆమెను తన చెల్లిగా అందరికీ చెప్పేవాడు. ఒడిసా మహిళను అక్కా అని పిలుస్తూ.. ఆమెను, ఆమె పిల్లలను అరకు, తిరుపతి, విజయవాడ తదితర ప్రాంతాలకు రాజమండ్రిలోని షాపింగ్‌మాల్స్, గోదావరి ఘాట్‌లు, సినిమాలకు తీసుకెళ్లేవాడు. గతనెల 10న ఆమెకు రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి చిన్న కుమార్తెతోపాటు విజయవాడకు తీసుకెళ్లి లాడ్జిలో ఉంచాడు. ఆమె వద్ద డబ్బులు తీసుకుని, రైల్వేస్టేషన్‌లో సీసీ కెమెరాల ముందు నిలబెట్టి అటెండెన్స్‌గా నమ్మించాడు. తర్వాత ధవళేశ్వరం నుంచి ఆమె కుమారుడిని కూడా ఆమె ఉంటున్న లాడ్జీ వద్దకు తీసుకొచ్చి అప్పగించాడు. 21న అక్కడున్న చిన్న కుమార్తెను ధవళేశ్వరం తీసుకొచ్చి ఇద్దరు బాలికలనూ హాస్టల్‌కి తీసుకెళుతున్నానని ఫోన్‌లో వారి తల్లితో మాట్లాడించాడు. 28వతేదీ నుంచి వెంకటేశ్ ఫోన్ స్విచ్ఛాఫ్ అయ్యింది. వాకబు చేయగా పిల్లలు హాస్టల్‌కు చేరలేదని తెలిసింది. దీంతో తల్లి 29న ధవళేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదు చేసి నాలుగు పోలీసు బృందాలను విజయవాడ, గుంటూరు, కర్నూలు, నెల్లూరు, హైదరాబాద్, విజయనగరం జిల్లాలకు పంపించామని ఎస్పీ వివరించారు. నెల్లూరులో ఉన్నట్టు గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు.



నిందితుడు మారోజు వెంకటేశ్

అమ్మ జైలుకెళ్లిందని బాలికలకు చెప్పి..

కాగా, తండ్రిని చంపిన కేసులో తల్లిని పోలీసులు జైలుకు పంపించారని బాలికలకు నిందితుడు నవిస్మంచాడని, తాళి కట్టి వారిని లోబరుచుకున్నాడని ఎస్పీ వివరించారు. బాలికల తల్లి నుంచి ఫోన్ కూడా తీసుకొని, ఆమె ఖాతాలోని రూ.2లక్షలను కాజేశాడని చెప్పారు. రైల్వే ఉద్యోగిగా ఇన్‌స్టాగ్రాం రీల్స్ వారిని మోసం చేశాడన్నారు. నిందితుడిపై ఫోక్సోతోపాటు ఏడు సెక్షన్లతో కేసు నమోదు చేశామని, అతని నుంచి రైల్వే టీసీల బ్యాగు, చలానా పుస్తకాలు, నకిలీ ఐడీ కార్డు, మూడు సెల్‌ఫోన్లు, రూ.69వేల నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. బాలికలను ఉంచిన లాడ్జీల యాజమాన్యాలపైనా కేసులు నమోదు చేసే యోచనలో ఉన్నట్టు తెలిపారు. నిందితుడి గదిలో ఉన్న బాలికను కూడా పది రోజుల్లో వచ్చి పెళ్లి చేసుకుంటానని నమ్మించి విజయనగరం నుంచి తీసుకొచ్చినట్టు సమాచారం. అక్కడి పెదమన్నాపురం పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. ఆ బాలికను గత నెల 28న రాజమండ్రిలో బస్సు ఎక్కించి విజయనగరం పంపించేశాడని పోలీసులు గుర్తించారు.



నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ ట్రస్ట్ సమావేశంలో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, జితేంద్రసింగ్, సతీశ్‌చంద్ర దుబే, మంత్రి కొల్లు తదితరులు

ఖనిజాన్వేషణలో ప్రైవేటుకు పెద్దపీట

- 6వ ఎన్ఎంఈటీ గవర్నింగ్ బాడీ సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఖనిజాల అన్వేషణ (ఎక్స్‌ప్లోరేషన్)లో ప్రైవేటు రంగానికి పెద్దపీట వేస్తామని కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. సోమవారం ఢిల్లీలోని అంబేడ్కర్ అంతర్జాతీయ కేంద్రంలో 6వ ఎన్ఎంఈటీ(నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ ట్రస్ట్) గవర్నింగ్ బాడీ సమావేశం జరిగింది. ఎక్స్ అఫిషియో ఛైర్మన్ హోదాలో ఈ సమావేశానికి హాజరైన కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో ఖనిజ సంపదకు లోటు లేదని, కానీ అనుకున్న స్థాయిలో ఫలితాలు సాధించలేక పోతున్నామని తెలిపారు. అందుకే 2015లో ప్రధాని మోదీ ఎన్ఎంఈటీని స్థాపించారని తెలిపారు. ఈ సంస్థ ద్వారా ఖనిజాల ఎక్స్‌ప్లోరేషన్‌లో పురోగతి సాధిస్తున్నామని చెప్పారు. రాష్ట్రాల్లో ఎక్స్‌ప్లోరేషన్ ట్రస్టులను ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. దీనికి కేంద్రం అన్ని విధాలా సహకారం అందిస్తుందన్నారు. గనుల విభాగంలో ఏఐ, ఆటోమేషన్, డ్రోన్ సాంకేతికతలను వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు.

గనులపై ప్రత్యేక కార్యాచరణ: మంత్రి కొల్లు

ఏపీ ప్రభుత్వం గనుల రంగంలో ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళుతోందని ఏపీ గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఎన్ఎంఈటీ తరహాలో ఏపీ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ ట్రస్ట్(మెరిట్)ను ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. ఆఫ్ షోర్ మైనింగ్, క్రిటికల్ మినరల్స్ ఎక్స్‌ప్లోరేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించినట్టు వెల్లడించారు.

16న ఉత్తరాంధ్ర రెవెన్యూ సదస్సులకు సిసోడియా

అమరావతి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా ఈనెల 16న విజయనగరం జిల్లాలో రెవెన్యూ సదస్సులను ఆకస్మికంగా పరిశీలించనున్నారు. సదస్సుల నిర్వహణ తీరును ఆయన పరిశీలిస్తారు. మరుసటి రోజు విశాఖ జిల్లాలో అధికారులతో సమావేశం కానున్నారు. రెవెన్యూ రికార్డుల భద్రత, ఆన్‌లైన్ ఫైలింగ్, బ్యాకప్‌లపై ఆయన సమీక్షించనున్నారు. కాగా, ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో విశాఖలో జరిగే రెవెన్యూ సదస్సులకు హాజరుకాకూడదని ఆయన నిర్ణయించుకున్నారు.

ఎస్సీ వర్గీకరణను తిప్పికొడతాం: హర్షకుమార్

ఉక్కుటౌన్‌షిప్ (విశాఖపట్నం), ఆగస్టు 12: మనువాదుల కుట్రతోనే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అంశం తిరిగి వెలుగులోకి వచ్చిందని, దీనిపై పెద్దఎత్తున ఐక్య ఉద్యమాన్ని నిర్మించి తిప్పికొడతామని వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్, మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. స్టీల్‌ప్లాంటు మాల ఉద్యోగులు సోమవారం ఏర్పాటు చేసిన వర్గీకరణ వ్యతిరేక పోరాట సభకు అయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం కాకుండా మోదీ ఆదేశాలతో వర్గీకరణకు అంగీకారం తెలిపినట్టు ఉందన్నారు. రాజ్యాంగంలో ఎక్కడా క్రీమీలేయర్ అనే అంశం లేదని మోదీ ప్రభుత్వం చెబుతున్నప్పుడు.. ఇక ఆ తీర్పు ఎలా చెల్లుబాటు అవుతుందని ప్రశ్నించారు. ఉపకులాల వర్గీకరణ చేయాలంటే 341 ఆర్టికల్‌కు పార్లమెంటులో సవరణ చేయాల్సి ఉందన్నారు.

ఎండ, వాన

విశాఖపట్నం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సోమవారం ఎండ, వాన కలబోసిన వాతావరణం నెలకొంది. రుతుపవనాలు బలహీనంగా ఉండడంతో అనేక చోట్ల ఎండ తీవ్రత, ఉక్కపోత కొనసాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రత కొనసాగడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. దేశంలో అత్యధికంగా నెల్లూరులో 38.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సాయంత్రం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షం కురిసింది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. రాయలసీమలో అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది.

ఆ పగడపు ద్వీపం ఇవ్వనందుకే!

- హసీనా పదవీచ్యుతికి సెయింట్ మార్టిన్సే కారణం?
- ఇక్కడ సైనిక స్థావరానికి అమెరికా ప్రయత్నాలు..
- బంగ్లా మాజీ ప్రధాని ససేమిరా.. దీంతోనే కుట్రలు



ఢాకా, ఆగస్టు 12: బంగాళాఖాతంలో అదొక అందాల పగడపు దీవి.. మొత్తం విస్తీర్ణం మూడు చదరపు కిలోమీటర్లే.. కానీ, ఎంతో వైవిధ్యం.. అంతకుమించిన ప్రకృతి సౌందర్యం.. ప్రత్యేకించి సైనికపరంగా అత్యంత వ్యూహాత్మక ప్రాంతం..! దీంతో అమెరికా కన్నుపడింది.. అక్కడ స్థావరం ఏర్పాటు చేస్తామంటూ బంగ్లాదేశ్‌ను కోరింది. అయితే, దేశాధినేత ససేమిరా అన్నారు. తన ప్రతిపాదనను కాదన్నందుకు ఆమెపై అగ్రరాజ్యం పగబట్టింది. పదవి నుంచి దించేసేవరకు నిద్రపోలేదు. ఇదంతా బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా పదవీచ్యుతి వెనుక ఉన్న నేపథ్యం అంటూ తాజాగా కథనాలు వస్తున్నాయి. హసీనా కూడా సెయింట్ మార్టిన్స్‌లో వైమానిక స్థావరానికి అనుమతి ఇస్తే మీరు తిరిగి తేలిగ్గా పదవిలోకి వచ్చేలా చూస్తామని ఓ తెల్ల వ్యక్తి తనకు ప్రతిపాదించినట్లు జనవరిలో జరిగిన ఎన్నికలకు ముందు చెప్పినట్లు, అమెరికా కోరినట్లు చేసి ఉంటే తాను దిగిపోయే పరిస్థితి వచ్చేది కాదంటూ ఇటీవల వ్యాఖ్యానించినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. సెయింట్ మార్టిన్స్ ద్వీపం బంగ్లాదేశ్‌లో అత్యంత కీలక వాణిజ్య ఓడరేవు అయిన కాక్స్ బజార్‌కు కేవలం తొమ్మిది కిలోమీటర్ల దూరంలోనే ఉంది. బంగ్లాదేశ్‌కు ఉన్న ఏకైక పగడపు దీవి అయిన సెయింట్ మార్టిన్.. అరుదైన జీవజాతులతో పర్యావరణపరంగా అత్యంత సున్నితమైన ప్రాంతం.

3 వేలకు మించని జనాభా

సెయింట్ మార్టిన్స్ జనాభా 3,800 మాత్రమే. చేపల వేట, వరి, కొబ్బరి తోటలు, సీవీడ్ సాగు వీరి జీవనాధారం. ఎండబెట్టిన సీవీడ్‌ను మయన్మార్‌కు ఎగుమతి చేస్తుంటారు. సహజ సౌందర్యం కారణంగా ఇటీవలి కాలంలో ఈ ద్వీపం పర్యాటక ప్రాంతంగానూ మారింది. కాగా, 1947లో భారత్ విభజన సమయంలో పాకిస్థాన్‌కు, 1971లో బంగ్లాదేశ్ పరిధిలోకి వెళ్లింది. అయితే, మయన్మార్‌కు కేవలం 8 కిలోమీటర్ల దూరంలో ఉండడంతో సముద్ర సరిహద్దులు, చేపల వేట విషయంలో బంగ్లా-మయన్మార్ మధ్యన తరచూ ఘర్షణలు జరుగుతున్నాయి.

అమెరికా కన్ను అందుకే..

మయన్మార్‌కే కాక, ప్రపంచంలోనే సముద్ర వాణిజ్యానికి అత్యంత కీలకమైన మలక్కా జలసంధికి అతి సమీపంలో ఉండడంతో సెయింట్ మార్టిన్స్ ప్రాధాన్యంగా మారింది. ఇక కాక్స్‌బజార్‌లో బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ (బీఆర్ఐ) కింద చైనా నౌకాశ్రయాన్ని అభివృద్ధి చేస్తోంది. అందుకే సెయింట్ మార్టిన్స్‌లో సైనిక స్థావరం ఏర్పాటు చేసి చైనా, మయన్మార్, భారత్‌పైనా ఉంచాలని అమెరికా భావించింది. హిందూ మహా సముద్రంలో చైనా ఆధిపత్యాన్ని మరింత పెంచేలా బీఆర్ఐలో బంగ్లా చేరడం కూడా ఆ దేశానికి ఆందోళన కలిగించింది.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● మంగళవారం 13 ఆగస్టు 2024

ఏఐసీటీఈ సాక్షమ్ స్కాలర్‌షిప్ స్కీమ్

ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ)- 'సాక్షమ్ స్కాలర్‌షిప్ స్కీమ్'ను ప్రకటించింది. టెక్నికల్ ఎడ్యుకేషన్‌పై దివ్యాంగులకు ఆసక్తిని కలిగించి, వారిని ఉన్నత విద్యలో ప్రోత్సహించేందుకు ఈ స్కీమ్‌ను ఉద్దేశించారు. దీని ద్వారా కనీసం 40 శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులకు డిప్లొమా, డిగ్రీ కేటగిరీల్లో స్కాలర్‌షిప్‌లు ఇస్తారు. అభ్యర్థులు పదోతరగతి/ఇంటర్ పూర్తిచేసిన రెండేళ్లలోపు ఏఐసీటీఈ గుర్తింపు పొందిన సంస్థలో డిప్లొమా/డిగ్రీ ప్రవేశం పొంది ఉండాలి. కుటుంబ వార్షిక ఆదాయం రూ.8 లక్షలకు మించకూడదు. అకడమిక్ మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.



అర్హత

- డిప్లొమా కేటగిరీకి అప్లయ్ చేసుకోవాలంటే గుర్తింపు పొందిన పాఠశాల నుంచి పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఈ విద్యా సంవత్సరానికి మూడేళ్ల వ్యవధి గల టెక్నికల్ డిప్లొమా లెవెల్ కోర్సుల్లో ప్రవేశం పొంది ఉండాలి. ఐటీఐ కోర్సు పూర్తిచేసి లేటరల్ ఎంట్రీ ద్వారా డిప్లొమా ద్వితీయ సంవత్సరంలో చేరినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- డిగ్రీ కేటగిరీకి దరఖాస్తు చేసుకోవాలంటే గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. నాలుగేళ్ల వ్యవధి గల టెక్నికల్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశం పొంది ఉండాలి. డిప్లొమా పూర్తిచేసి లేటరల్ ఎంట్రీ ద్వారా డిగ్రీ రెండో సంవత్సరంలో ప్రవేశం పొందిన వారు కూడా అర్హులే.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఇతర మెరిట్ స్కాలర్‌షిప్స్ పొందుతున్నవారు, పీఎంఎస్ఎస్ఎస్ స్కీం కింద చదువుకుంటున్నవారు, నాన్ టెక్నికల్ కోర్సుల్లో చేరినవారు, డ్యూయెల్ డిగ్రీ/ పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందినవారు, ఇతరత్రా స్టయిపెండ్/ఆదాయం పొందుతున్నవారు దరఖాస్తుకు అనర్హులు.

స్కాలర్‌షిప్: ఎంపికైన అభ్యర్థులకు ఏడాదికి రూ.50,000 చెల్లిస్తారు. డిప్లొమా అభ్యర్థులకు మూడేళ్లు, డిగ్రీ అభ్యర్థులకు నాలుగేళ్లు స్కాలర్‌షిప్ ఇస్తారు. లేటరల్ ఎంట్రీకైతే డిప్లొమా అభ్యర్థులకు రెండేళ్లు, డిగ్రీ అభ్యర్థులకు మూడేళ్లు స్కాలర్‌షిప్ అందిస్తారు. స్కాలర్‌షిప్ మొత్తాన్ని ఏటా అభ్యర్థుల బ్యాంక్ ఖాతాలో జమచేస్తారు. ఇందుకోసం బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డ్ తప్పనిసరి. ఫీజు, వసతి, పుస్తకాలు, కంప్యూటర్ తదితర ఖర్చుల కోసం ఈ స్కాలర్‌షిప్ మొత్తాన్ని వినియోగించుకోవచ్చు. ఏటా చదువులో చూపిన ప్రతిభ ఆధారంగా తరవాతి సంవత్సరాలకు వీటిని కొనసాగిస్తారు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 31
- **అప్లికేషన్ వెరిఫికేషన్:** నవంబరు 15న
- **డీఎన్ఓ/ఎస్ఎన్ఓ/ఎంఎన్ఓ వెరిఫికేషన్:** నవంబరు 30న
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** ఐటీఐ/పదోతరగతి/ఇంటర్/డిప్లొమా సర్టిఫికెట్‌లు, మార్కుల పత్రాలు; స్టడీ/బోనఫైడ్ సర్టిఫికెట్; ఆదాయ ధ్రువీకరణ పత్రం; రెన్యువల్ సందర్భంలో ప్రమోషన్ సర్టిఫికెట్
- **వెబ్‌సైట్:** scholarships.gov.in

జేఎన్‌టీయూహెచ్‌లో ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూహెచ్)కి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ ఇన్నోవేటివ్ లెర్నింగ్ అండ్ టీచింగ్(డీఐఎల్‌టీ)- ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. ఒక్కో కోర్సు వ్యవధి ఆర్నెల్లు. ప్రతి కోర్సులో మూడు థియరీ సబ్జెక్టులు ఉంటాయి. ఒక్కో సబ్జెక్ట్‌కు రెండు నెలల సమయం, 24 తరగతులు, మూడు క్రెడిట్‌లు నిర్దేశించారు. సాయంత్ర ఆరున్నర నుంచి ఎనిమిదిన్నర వరకు ఆన్‌లైన్ సెషన్స్ ఉంటాయి. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. అదనంగా ఒక నెల ప్రాజెక్ట్ వర్క్ చేయాల్సి ఉంటుంది. దీనికి ఆరు క్రెడిట్‌లు ఉంటాయి. కోర్సులో భాగంగా అసైన్‌మెంట్‌లు, ఎండ్ ఎగ్జామినేషన్ ఉంటాయి. అసైన్‌మెంట్‌లకు 40 శాతం, ఎండ్ ఎగ్జామినేషన్‌కు 60 శాతం వెయిటేజీ ఇస్తారు. ఫ్యాకల్టీ మెంబర్లు, ఉద్యోగస్తులు, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో అడ్మిషన్స్ ఇస్తారు. యూనివర్సిటీకి చెందిన టీచింగ్&నాన్ టీచింగ్ సిబ్బంది, అకడమిక్ స్టూడెంట్స్‌కు కోర్సు ఫీజులో 40 శాతం రాయితీ లభిస్తుంది.



క్లౌడ్ అండ్ డెవోప్స్ కోర్సు: ఇందులో క్లౌడ్ టెక్నాలజీ ఏడబ్ల్యూఎస్ & మైక్రోసాఫ్ట్ అజ్యూర్, కంటిన్యూయస్ ఇంటిగ్రేషన్/కంటిన్యూయస్ డిప్లాయ్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొవిజనింగ్ సబ్జెక్టులు ఉంటాయి.

డేటా సైన్స్ అండ్ జనరేటివ్ ఏఐఎల్ఎల్ఎమ్ కోర్సు: ఇందులో పైథాన్ ప్రోగ్రామింగ్, మెషిన్ లెర్నింగ్-డీప్ లెర్నింగ్, జనరేటివ్ ఏఐ అండ్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ సబ్జెక్టులు ఉంటాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి డిప్లొమా/యూజీ/పీజీ పూర్తిచేసిన/చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. కంప్యూటర్స్‌కు సంబంధించి ప్రాథమిక పరిజ్ఞానం, ఏదేని ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌పై అవగాహన తప్పనిసరి.

ముఖ్య సమాచారం

- **కోర్సు ఫీజు:** రూ.25,000
- **అడ్మిషన్ ఫీజు:** రూ.1000
- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** www.jntuh.ac.in

సీసీఎంబీలో పీహెచ్‌డీ

హైదరాబాద్-హబ్సిగూడలోని సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ(సీసీఎంబీ)- పీహెచ్‌డీ 2025 జనవరి సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్‌లో భాగంగా మోడరన్ బయాలజీకి సంబంధించిన అంశాల్లో పరిశోధనలు చేయాల్సి ఉంటుంది. కంప్యూటర్ బేస్డ్ రిటెన్ టెస్ట్ లేదా రిమోట్ ప్రొక్టోర్డ్ ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.



పరిశోధనాంశాలు: సెల్ బయాలజీ, మాలిక్యులర్ బయాలజీ, జెనెటిక్స్, జీనోమిక్స్, డెవలప్‌మెంటల్ బయాలజీ, ప్లాంట్ మాలిక్యులర్ బయాలజీ, కన్జర్వేషన్ బయాలజీ, ఎకాలజీ, ప్రొటీన్ స్ట్రక్చర్ అండ్ ఫంక్షన్, బయాలజీ ఆఫ్ మాక్రో మాలిక్యూల్స్, బయాలజీ ఆఫ్ ఇన్ఫెక్షన్, ఇమ్యూనాలజీ, ఎపిజెనెటిక్స్, క్రొమాటిన్ బయాలజీ, బయోఇన్ఫర్మాటిక్స్

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని సైన్స్ విభాగంలో కనీసం 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థులకు సీఎస్ఐఆర్/యూజీసీ/డీబీటీ/డీఎస్‌టీ నుంచి వ్యాలిడ్ జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్ లేదా డీబీటీ-బీఈటీ/ఇన్‌స్పయిర్/ఆర్‌జీఎన్ఎఫ్ నుంచి ఫెలోషిప్ అర్హత పొంది ఉండాలి.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 16
- **రిటెన్/ఆన్‌లైన్ టెస్ట్ తేదీ:** సెప్టెంబరు 29
- **ఇంటర్వ్యూలు:** హైదరాబాద్‌లో
- **వెబ్‌సైట్:** www.ccmb.res.in

ఏపీ గిరిజన వర్సిటీలో డిగ్రీ

విజయనగరంలోని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం (ఏపీ సీటీయూ)- డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. బీఎస్సీ, బీబీఏ, బీకాం ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహించిన సీయూఈటీ(యూజీ) 2024లో సాధించిన ర్యాంక్, కౌన్సెలింగ్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఇవి ఆనర్స్/ఆనర్స్ విత్ రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు.

ప్రోగ్రామ్‌లు: బీఎస్సీ(కెమిస్ట్రీ), బీఎస్సీ(బోటనీ), బీఎస్సీ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), బీఎస్సీ(జియాలజీ), బీబీఏ(టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్), బీకామ్(ఒకేషనల్).

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. సీయూఈటీ(యూజీ) 2024 అర్హత తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.100
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 16
- **మొదటి మెరిట్ జాబితా విడుదల:** ఆగస్టు 19
- **అడ్మిషన్స్ కౌన్సెలింగ్:** ఆగస్టు 26
- **తరతులు ప్రారంభం:** సెప్టెంబరు 9
- **వెబ్‌సైట్:** www.ctuap.ac.in



తెలంగాణ బీసీ మహిళా గురుకులాల్లో బీఎస్సీ(ఆనర్స్)అగ్రికల్చర్

మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని మహిళా వ్యవసాయ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడింది. వనపర్తి అగ్రికల్చరల్ కాలేజ్, కరీంనగర్ అగ్రికల్చరల్ కాలేజ్‌లలో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. ఒక్కో కాలేజ్‌లో 120 సీట్లు ఉన్నాయి. రాష్ట్రానికి చెందిన మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. బీసీ అభ్యర్థులకు 75 శాతం, ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 5 శాతం, ఓసీ/ ఈబీసీ అభ్యర్థులకు 2 శాతం, అనాథలకు 3 శాతం సీట్లు కేటాయించారు. ఈ నోటిఫికేషన్ ద్వారా తెలంగాణ ఈఏపీసెట్ 2024 స్కోర్ ప్రకారం 85 శాతం సీట్లను భర్తీ చేస్తారు. మిగిలిన 15 శాతం సీట్లను అగ్రిసెట్ 2024 స్కోర్ ద్వారా భర్తీ చేస్తారు. ఇందుకు విడిగా మరో నోటిఫికేషన్ విడుదల చేస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజికల్ సైన్సెస్, బయలాజికల్ సైన్సెస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. తెలంగాణ ఈఏపీసెట్ 2024 అర్హత పొంది ఉండాలి. అభ్యర్థి వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. కుటుంబ వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,50,000; పట్టణాల్లో రూ.2,00,000 మించకూడదు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **ఆన్‌లైన్ దరఖాస్తులో కరెక్షన్స్ విండో ఓపెన్:** సెప్టెంబరు 1 నుంచి 2 వరకు
- **వెబ్‌సైట్:** mjptbcwreis.telangana.gov.in

జాబ్ కార్నర్

ఐసర్‌లో ఫ్యాకల్టీ

బరంపురంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐసర్)...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీల సంఖ్య: 5

1. ప్రొఫెసర్(కెమికల్ సైన్సెస్): 1 పోస్టు
2. అసిస్టెంట్ ప్రొఫెసర్ జీ-1(ఎర్త్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్/కంప్యూటర్ సైన్సెస్/బయోలాజికల్ సైన్సెస్): 4 పోస్టులు

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

విభాగాలు: సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, బయో ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ కెమిస్ట్రీ, స్ట్రక్చరల్ బయాలజీ, న్యూరో బయాలజీ తదితరాలు

జీతం: నెలకు ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,59,100; అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,01,500.

దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 11

వెబ్‌సైట్: https://iiserbpr.ac.in/

గెయిల్‌లో నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

ఖాళీలు 391

న్యూఢిల్లీలోని గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్.. కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

- నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు: 391(యూఆర్-174, ఈడబ్ల్యూఎస్-29, ఓబీసీ-89, ఎస్సీ-60, ఎస్టీ-39)

1. జూనియర్ ఇంజనీర్(కెమికల్): 2 పోస్టులు
2. జూనియర్ ఇంజనీర్(మెకానికల్): 1
3. ఫోర్‌మన్(ఎలక్ట్రికల్): 1
4. ఫోర్‌మన్(ఇన్‌స్ట్రుమెంటేషన్): 14
5. ఫోర్‌మన్(సివిల్): 6
6. జూనియర్ సూపరింటెండెంట్(అఫీషియల్ లాంగ్వేజ్): 5
7. జూనియర్ కెమిస్ట్: 8
8. జూనియర్ అకౌంటెంట్: 14
9. టెక్నికల్ అసిస్టెంట్(ల్యాబొరేటరీ): 3
10. ఆపరేటర్(కెమికల్): 74
11. టెక్నీషియన్(ఎలక్ట్రికల్): 44
12. టెక్నీషియన్(ఇన్‌స్ట్రుమెంటేషన్): 45
13. టెక్నీషియన్(మెకానికల్): 39
14. టెక్నీషియన్(టెలికాం అండ్ టెలిమెట్రీ): 11
15. ఆపరేటర్(ఫైర్): 39
16. ఆపరేటర్(బాయిలర్): 8
17. అకౌంట్స్ అసిస్టెంట్: 13
18. బిజినెస్ అసిస్టెంట్: 65

అర్హతలు: పోస్టును అనుసరించి పదోతరగతి, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, సీఏ/ఐసీడబ్ల్యూఏఐ, బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీబీఎస్, బీబీఎం, బీఈ, బీటెక్, ఎమ్మెస్సీ, ఎంకాం, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

జీతభత్యాలు: జూనియర్ ఇంజనీర్ పోస్టులకు రూ.35,000 - రూ.1,38,000. జూనియర్ సూపరింటెండెంట్, జూనియర్ కెమిస్ట్, జూనియర్ అకౌంటెంట్ పోస్టులకు రూ.29,000 - రూ.1,20,000. మిగిలిన పోస్టులకు రూ.24,500 - రూ.90,000.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్, ట్రేడ్/స్కిల్ టెస్ట్, ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్ ఆధారంగా

దరఖాస్తు రుసుము: రూ.50. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 7

వెబ్‌సైట్: https://gailonline.com/

ఐఎంయూలో అసిస్టెంట్ ఉద్యోగాలు

ఖాళీలు 27

చెన్నైలోని ఇండియన్ మారిటైం యూనివర్సిటీ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కిందన పేర్కొన్న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **అసిస్టెంట్:** 15 పోస్టులు
- **అసిస్టెంట్(ఫైనాన్సింగ్):** 12 పోస్టులు

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీలో పరిజ్ఞానం ఉండాలి.

జీతం: నెలకు రూ.5,200 నుంచి రూ.20,200 వరకు

వయోపరిమితి: 35 ఏళ్లు మించకూడదు

ఎంపిక విధానం: ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ తదితరాల ఆధారంగా

దరఖాస్తు ఫీజు: ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు రూ.700, ఇతరులకు రూ.1000.

పని ప్రదేశం: చెన్నై, ముంబయి, కోల్‌కతా, విశాఖపట్నం, కొచ్చి

పరీక్ష కేంద్రాలు: న్యూఢిల్లీ, లఖ్‌నవూ, పట్నా, కోల్‌కతా, గువాహటి, హైదరాబాద్, చెన్నై, కొచ్చిన్, బెంగళూరు, ముంబయి, భోపాల్, జైపూర్.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 30

వెబ్‌సైట్: www.imu.edu.in/imunew/

లిటిల్స్




సరైన చోటు

పాంచాల పురాన్ని పాలించే విక్రముడు అనే రాజు ఆనందుడు అనే ముని పుంగవుని వద్ద విద్యాభ్యాసం చేశాడు. ఆ గురువు శిక్షణలో అన్ని విద్యల్లో ఆరితేరి, మంచి పరిపాలనాదక్షుడిగా పేరు తెచ్చుకున్నాడు. ఒక గురుపూర్ణిమ రోజు విక్రముడికి తన గురువును దర్శించుకొని తనను అంత వాడిని చేసినందుకు ధన్యవాదాలు చెప్పాలి అనిపించింది. గురువు దగ్గరకు వెళుతూ తనతోపాటు విలువైన పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు వజ్రాలు కూడా తీసుకువెళ్లి, కానుకగా స్వీకరించమని అర్థించాడు. ఆనందుడు తన శిష్యుడిని నిరాశ పరచడం ఇష్టం లేక వాటిని స్వీకరించాడు. ఆ మర్నాడు విక్రముడికి దారి పక్కన చెట్ల కింద నివాసం ఉండే కొందరు పేదవారి దగ్గర విలువైన బంగారు నగలు పట్టు బట్టలు కనిపించాయని భటులు చెప్పారు. అవి వారికి ఎలా వచ్చాయో కనుక్కొని రమ్మని భటులను పంపాడు రాజు.


ఆ బట్టలు నగలను అంతకు ముందు రోజు ఆనందుడు అనే ముని తమకు దానంగా ఇచ్చినట్లు చెప్పారు ఆ పేదవారు. అది విన్న విక్రముడికి కొంచెం కోపం వచ్చింది. తాను ఎంతో గౌరవంతో గురువుగారికి ఇచ్చిన కానుకలను అలా కడు పేద వారికి ఎలా దానం చేశాడని గురువు పట్ల చిరాకు పడి తరువాతిరోజు మరలా గురువు గారి ఆశ్రమానికి వెళ్లి, ఎందుకిలా చేశారని గురువు గారిని అడిగాడు. దానికి ఆనందుడు 'విక్రమా.. సర్వ సంగ పరిత్యాగినైన నేను ఈ విలువైన దుస్తులు నగలను ఏం చేసుకుంటాను? అదే మంచి తిండికి కూడా నోచుకోని ఆ పేదవారు ఒక్క నగలేదా విలువైన వస్త్రం అమ్ముకున్నా వారి కుటుంబాలు కడుపు నిండా భోజనం చేయగలుగుతాయి, కాబట్టి నాకన్నా వాటి అవసరమున్న వారి దగ్గర ఉండటమే ఆ కానుకలకు సరైనచోటు' అన్నాడు ఆనందుడు.

ఆ మాటలలో నిజాన్ని గమనించిన విక్రముడు తన రాజ్యంలో పేద వారందరికీ పని కల్పిస్తాననీ అందరికీ కనీస సౌకర్యాలు ఉండేటట్టు చూస్తాననీ గురువుకు మాట ఇచ్చి, ఆ ప్రకారమే చేసి ధర్మప్రభువు అనే పేరు తెచ్చుకున్నాడు.


దారి కనుక్కోండి




సరైన నీడను కనుక్కోండి




10 తేడాలు కనుక్కోండి





ఎన్ని కోళ్లు ఉన్నాయి



డైలీ సుడోకు - 382

	6	4			5
3				4	
	5				1
2			4	1	

సుడోకు - 381 సమాధానం

2	5	4	3	1	6
1	3	6	5	4	2
5	1	3	2	6	4
4	6	2	1	3	5
3	4	5	6	2	1
6	2	1	4	5	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.